క్లుప్తంగా...

ఐఐపీహెచ్‌కు 'డీమ్డ్ యూనివర్సిటీ' హోదా

కేంద్ర ప్రభుత్వ గెజిట్ ద్వారా అధికారిక ప్రకటన

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ప్రజారోగ్య విద్య, పరిశోధన, విధాన నిర్మాణ రంగాల్లో కీలకంగా నిలుస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఐఐపీహెచ్) హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'డీమ్డ్ టు బీ యూనివర్సిటీ' హోదాను మంజూరు చేసింది. హైదరాబాద్‌తో పాటు భువనేశ్వర్, బెంగళూరు నగరాల్లోని ఐఐపీహెచ్‌లకు కూడా ఈ హోదా లభించింది. ఈ మేరకు జూలై 5, 2025న భారత ప్రభుత్వ గెజిట్‌లో అధికారికంగా ప్రకటన వెలువడింది. ప్రజారోగ్య విద్య, విభిన్న అంశాల్లో అన్వేషణాత్మక పరిశోధన, ఆరోగ్య విధానాల్లో ప్రభావవంతమైన దృష్టి కోణం కలిగిన నూతన మార్గదర్శకాలను రూపొందించడంలో ఐఐపీహెచ్ నిరంతరం తన కృషిని కొనసాగిస్తోంది. ఈ గుర్తింపు ఐఐపీహెచ్ సాగిస్తున్న ప్రయాణానికి మరింత బలాన్ని ఇస్తుందని సంస్థ అసిస్టెంట్ మేనేజర్ టి.వి.శివనాగేశ్వర్ రావు అన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

సాక్షి, హైదరాబాద్: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న బీసీ అభ్యర్థులకు ఐదు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్స్‌తో పాటు ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకింగ్ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు మంచి అవకాశమన్నారు. ఆగస్టు 25 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 11వ తేదీకల్లా తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డిగ్రీ పరీక్షల్లో మెరిట్ ఆధారంగా శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1,000 స్టైపెండ్ ఇస్తామన్నారు.

స్వయం ఉపాధి సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ



భూదాన్ పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలోగల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో తెలంగాణలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎన్.కిశోర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 నెలల కాలవ్యవధి కలిగిన బేసిక్ కంప్యూటర్ కోర్సుకు ఇంటర్మీడియట్ పాసై ఉండాలని పేర్కొన్నారు. మూడున్నర నెలల కాలవ్యవధి కలిగిన ఆటోమొబైల్ టూ వీలర్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి, సోలార్‌సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి లేదా ఐటీఐ విద్యార్హత ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సంస్థలో నేరుగా హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

పల్లె బడిలో ఏఐ పాఠాలు

కార్పొరేట్‌కు దీటుగా గ్రామీణ విద్యార్థులకు ఆధునిక బోధన

- పర్‌ప్లెక్సిటీ ఏఐ టూల్ ద్వారా బోధన
- టీఫైబర్ నెట్‌తో హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం
- ఆదర్శంగా నిలిచిన అడవిశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్
- పైలెట్ ప్రాజెక్టులోని మూడు పాఠశాలల్లో ఇదొకటి



ఏఐ ద్వారా పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

పట్టణాలు, నగరాలకు దీటుగా కృత్రిమ మేధస్సు (ఏఐ –ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో సాంకేతిక బోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మారుమూల గ్రామంలోని ఓ ప్రభుత్వ పాఠశాల కార్పొరేట్ స్కూళ్లకు సమానస్థాయిలో ఆధునిక బోధన అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. సర్కార్ టీ ఫైబర్ హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందుబాటులోకి తేవడంతో ఉపాధ్యాయులు ఏఐ ఆధారంగా చదువు చెబుతున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు అదనపు సమాచారం అందించి వారి మేధకు పదును పెడుతున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్ ఇందుకు వేదికైంది.

– ముత్తారం (మంథని)

స్థానిక ఉపాధ్యాయులకు గూగుల్‌తో ఏఐ బోధనలో శిక్షణకు ఇప్పించేందుకు టీ–ఫైబర్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే

మద్రాస్-ఐఐటీ నుంచి కోర్సు!

మద్రాస్ ఐఐటీ కళాశాల నుంచి కోర్సు అందించేందుకు ప్రయత్నాలు చేస్తుండటం విశేషం. టీ ఫైబర్ బృందం సోషల్ మీడియా వేదికగా దీనిపై ప్రచారం చేయడంతో అమెరికాలో శాన్‌ఫ్రాన్సిస్కో కేంద్రంగా ఉన్న పర్‌ప్లెక్సిటీ ఏఐ కో–ఫౌండర్, సీఈవో అరవింద్ శ్రీనివాస్ ఎక్స్ వేదికగా స్పందించారు. తమ ఉచిత ఏఐ టూల్‌ను వినియోగించుకుని విద్యార్థులు విజ్ఞానం మెరుగుపర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. మారుమూల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఈ మార్పురావడం గొప్పవిషయమని చెప్పారు.

పైలెట్ ప్రాజెక్టుగా మూడు గ్రామాలు..

టీ–ఫైబర్, పయనీర్ ఈల్యాబ్స్ కంపెనీ భాగస్వామ్యంతో పల్లెల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగా రాష్ట్రంలోని మూడు గ్రామాల్లోని పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్, సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం సంగుపేట, నారాయణపేట జిల్లా మద్దూరు జెడ్పీ హైస్కూళ్లను దీని కింద ఎంపిక చేసింది. అడవిశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్‌లో టీ–ఫైబర్ నెట్ నిర్వాహకులు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చి రెండు మానిటర్లు ఇవ్వగా.. ప్రభుత్వం ఇటీవల మరో మూడు కేటాయించింది. గత జూన్‌లో ఏఐ ఆధారిత పర్‌ప్లెక్సిటీ టూల్స్ ద్వారా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఆధునిక బోధన ప్రారంభించారు.



కార్పొరేట్‌కు దీటుగా



ఏఐ, పర్‌ప్లెక్సిటీ టూల్ సాయంతో బోధన ప్రారంభించాం. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా పల్లె పాఠశాలలో ఆధునిక విద్య ఇస్తుండటంతో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరుగుతోంది. ఏఐ క్లాసులతో విద్యార్థుల్లో నైపుణ్యత, సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందుతోంది. మరో 20 కంప్యూటర్లు, మైక్రోఫోన్స్ అందిస్తే ఏఐ బోధన మరింత సులువవుతుంది.

– ఇరుగురాల ఓదెలు, హెచ్ఎం, అడవిశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్

రక్తం ఎందుకు గడ్డ కట్టదు



పర్‌ప్లెక్సిటీ ఏఐ టూల్ ద్వారా రక్తనాళాల్లో రక్తం ప్రవహించేటప్పుడు ఎందుకు గడ్డ కట్టదనే ప్రశ్నకు సమాధానాన్ని సొంతంగా తెలుసుకున్నా. బయాలజీలో ఎర్ర, తెల్లరక్త కణాలు, కణ ఫలదీకరణ, నిర్మాణం, వాటి విధుల గురించి వివరంగా తెలుసుకున్నా. టీచర్ల బోధన తర్వాత అర్థం కాని విషయాలు, సందేహాలను పర్‌ప్లెక్సిటీ టూల్ నివృత్తి చేస్తోంది.

– ఉప్పు మన్విత, తొమ్మిదో తరగతి

గణితంలో అన్ని పద్ధతులు



ఏఐ టూల్‌తో విద్యార్థి శక్తిని అంచనావేసుకుని సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. పర్‌ప్లెక్సిటీ యాప్‌లో గణితంలోని అన్ని పద్ధతులు పొందుపర్చడాన్ని సులువుగా నేర్చుకోవచ్చు. చిత్రపటాలతో అర్థమయ్యే రీతిలో ఏఐ వివరిస్తోంది.

– మార్త కోమలత, పదోతరగతి

ఉపయోగం తెలుసుకున్నా



ఏఐ పర్‌ప్లెక్సిటీలో నిక్ (ఆస్ట్రేలియాకు చెందిన ఈయన అరుదైన వ్యాధితో జన్మించారు) గురించి సార్‌ను అడిగా. అంగవైకల్యం ఉన్నా.. విధిరాతను కూడా ఎలా మార్చుకోవచ్చో ఏఐ టూల్‌తో తెలుసుకున్నా. నిక్ చికెన్ లెగ్‌ను ఉపయోగించి నీటి గ్రావిటీ బ్యాలెన్స్ చేసుకునే విధానం గురించి కూడా నేర్చుకున్నా.

– చిగురు మధులాస్య, పదోతరగతి

ఇంజనీరింగ్ ఆప్షన్లు అటు.. ఇటు

- వేలల్లో ఆప్షన్ల తొలగింపు.. జోడింపు.. విద్యార్థుల్లో కంగారు... అప్రమత్తమైన ర్యాంకర్లు ... మెరుగైన సీటుకు ప్రయత్నం
- రెండో ప్రాధాన్యంపై కొంత కసరత్తు అవసరమంటున్న నిపుణులు
- ఆప్షన్లకు నేడు చివరి రోజు



సాక్షి, హైదరాబాద్: మాక్ సీట్ల కేటాయింపు తర్వాత ఇంజనీరింగ్ ఆప్షన్లు వేగంగా కదులుతున్నాయి. ఆప్షన్ల జోడింపు.. తొలగింపుతో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మాక్ కేటాయింపునకు ముందు విద్యార్థుల నుంచి 56,63,308 వెబ్ ఆప్షన్లు రాగా.. సోమవారం మరో లక్ష పెరిగాయి. మళ్లీ మధ్యాహ్నానికి 30 వేలు తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ఆప్షన్లు ఇవ్వడంలో విద్యార్థులు కొంత గందరగోళానికి గురవుతున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆప్షన్ల గడువు మంగళవారంతో ముగియనుంది. దీంతో ఉన్న ఆప్షన్లు తీసేయడం, కొత్తవి పెట్టడం చేస్తున్నారు. మరోవైపు మంచి ర్యాంకు ఉండీ సీటు రాని విద్యార్థులు కూడా అప్రమత్తమయ్యారు. ఆప్షన్లు ఇచ్చినా సీటు రాని వారు 16,905 మంది ఉన్నారు. వీళ్లంతా మాక్ కేటాయింపునకు ముందు ఐదుకు మించి బ్రాంచీలను సెలెక్ట్ చేయలేదు. పది కాలేజీలకు మించి ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతో మాక్‌లో సీటు రాలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సోమవారం వీళ్లంతా పెద్దఎత్తున ఆప్షన్లు ఇచ్చారు. 2 వేలలోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులు మాక్‌లో 5 వేల ర్యాంకు కటాఫ్ ఉన్న కాలేజీల్లో రెండు, మూడు బ్రాంచీలకు ఆప్షన్లు ఇస్తున్నారు.

రెండో ప్రాధాన్యత కీలకం

మంచి కాలేజీ, మంచి బ్రాంచీ వచ్చిన విద్యార్థులు కొంత అప్రమత్తంగానే ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల 18న వెల్లడించే సీట్ల కేటాయింపునకు ర్యాంకర్లు రంగంలోకి వచ్చే వీలుంది. సీట్లు రాని 16,905 మంది 10 వేల లోపు వచ్చిన అన్ని కాలేజీలపైనా ప్రభావం చూపిస్తారు. దీంతో 25 వేల ర్యాంకుతో సీటు వచ్చిన విద్యార్థి సీటు మారే అవకాశం ఉంది. కాబట్టి 20 వేలపైన ర్యాంకులు వచ్చిన విద్యార్థులు రెండో ఆప్షన్‌ను జాగ్రత్తగా చూసిపెట్టాలి. తమ ర్యాంకుకు ఎక్కడ సీటు వస్తుందనేది గుర్తించాలి. దీనికోసం గత ఏడాది సీట్ల కేటాయింపును కొలమానంగా తీసుకోవాలి. పోటీ లేకుంటే మాక్‌లో వచ్చిన సీటే రావచ్చు. ఒకవేళ మంచి ర్యాంకర్లు పోటీకి వస్తే రెండో ప్రాధాన్యత ఇచ్చిన కాలేజీ, బ్రాంచీలో సీటు పొందే వీలుందని, దీన్ని దృష్టిలో పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మంచి ర్యాంకు ఉండే విద్యార్థులు ఇప్పుడున్న బ్రాంచీ, కాలేజీ కన్నా బెస్ట్ ఆప్షన్ ఎంపిక చేసుకుంటారు. కాబట్టి టాప్ 20 కాలేజీల్లో మార్పులు అనివార్యం. ఈ కారణంగా రెండో ప్రాధాన్యతకు సీటు వచ్చే అవకాశం ఉంటుంది.

ఆ బ్రాంచీలైతే మార్పు అక్కర్లేదు

సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో పెద్దగా ఆప్షన్లు మార్చాల్సిన అవసరం లేదని నిపుణులు అంటున్నారు. సివిల్‌లో 3,129 సీట్లున్నాయి. మాక్ తర్వాత ఈ బ్రాంచీ విద్యార్థుల్లో కొంతమంది కాలేజీ, బ్రాంచీ మార్చుకుంటారు. కాబట్టి ఇదే బ్రాంచీలో ఆసక్తి ఉంటే, మంచికాలేజీ వచ్చినప్పుడు మార్పు చేసుకోవాల్సిన అవసరం లేదు. అదేవిధంగా ఐటీ బ్రాంచీలోనూ 3,681 సీట్లు ఉన్నాయి. మాక్ కేటాయింపులో వచ్చిన సీటు పక్కాగా వచ్చే వీలుందని అధికారులు అంటున్నారు. ఈఈఈ, మెకానికల్‌లోనూ పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. అయితే, సీఎస్‌సీ, ఇతర ఎమర్జింగ్ కోర్సుల్లో పోటీ ఎక్కువగా ఉంది. మంచి ర్యాంకు లేకున్నా, ఈ కోర్సుల్లో సీటు వచ్చిన విద్యార్థులు కాలేజీ, బ్రాంచీల ప్రాధాన్యతకు మరిన్ని ఆప్షన్లు ఇవ్వడం మంచిదని సూచిస్తున్నారు.

ఆప్షన్లు పెంచుకున్నాను

నాకు ఎప్‌సెట్‌లో 2 వేల ర్యాంకు వచ్చింది. పక్కా గా సీటు వస్తుందని తక్కువ ఆప్షన్లు ఇచ్చాను. కానీ మాక్ కేటాయింపులో సీటు రాలేదు. దీంతో ఇప్పుడు 35 కాలేజీలకు ఆప్షన్లు ఇచ్చాను. మాక్ వల్ల మేలే జరిగింది. నేను ఇచ్చిన ఆప్షన్లన్నీ సీఎస్‌ఈ, ఎమర్జింగ్ కోర్సులకే. టాప్ కాలేజీలో కోరుకున్న సీటు వస్తుందనే నమ్మకం ఉంది.

– సి.సంజన సుప్రియ (హైదరాబాద్ విద్యార్థిని)

అయినా... అప్రమత్తమయ్యా

మాక్ కేటాయింపులో టాప్ 20 కాలేజీల్లో సీఎస్‌ఈ బ్రాంచీలో సీటు వచ్చింది. గత ఏడాది కేటాయింపును పరిశీలిస్తే టాప్ 22లో ఉన్న కాలేజీలో నాకొచ్చిన ర్యాంకుకు సీటు వచ్చింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రెండు, మూడో ప్రాధాన్యతలు మార్చుకున్నా. ఇప్పుడొచ్చిన కాలేజీలో రాకున్నా, వేరే కాలేజీలో సీటు వస్తుందని భావిస్తున్నాను.

– వి.శివ నాగేశ్వర్ (ఖమ్మం విద్యార్థి)

సీజే ముందుకు 'ఫీజుల' లొల్లి

ఇంజనీరింగ్ కాలేజీ ఫీజుల పెంపుపై రిజిస్ట్రీకి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ఆదేశం... విరుద్ధ మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపు అంశంపై దాఖలైన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందుంచాలని రిజిస్ట్రీని హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశించారు. గతంలో దాఖలైన పిటిషన్లలో ఇద్దరు సింగిల్ జడ్జిలు విరుద్ధ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఫీజు తక్షణ పెంపునకు ఒకరు అనుమతి ఇవ్వగా.. మరొకరు సత్వర ఉపశమనానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ కాలేజీల ఫీజు పెంపు పిటిషన్లపై తాను విచారణ చేపట్టడం సమంజసం కాదన్న జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి.. పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గత బ్లాక్ పీరియడ్ ఫీజులే వర్తిస్తాయంటూ ప్రభుత్వం జీవో 26 జారీ చేసింది. దీనిపై అవంతి ఇంజనీరింగ్ కాలేజీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది తరుణ్ జి.రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కాలేజీ ప్రతిపాదించిన ఫీజును తగ్గిస్తూ టీఏఎఫ్ఆర్‌సీ రిజిస్టర్‌లో నమోదు చేసిందని, దానికి కాలేజీ అంగీకరించిందన్నారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఫీజుల పెంపునకు సంబంధించి టీఏఎఫ్ఆర్‌సీ నుంచి సర్కార్‌కు ఎలాంటి ప్రతిపాదన అందలేదన్నారు. ఫీజు పెంపునకు అనుమతిస్తూ సీబీఐటీకి ఇదే కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, దీనిపై కమిటీ పిటిషన్ వేయనుందని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ దశలో ఫీజుల పెంపుపై ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. ప్రధాన న్యాయమూర్తే నిర్ణయం తీసుకోవాలంటూ రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఇదే అంశంపై మరో రెండు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టారు. వాదనలు విని వాయిదా వేశారు.

త్వరలో తెలంగాణ న్యూట్రిషన్ ప్లాన్: సీతక్క



సీడ్స్ కిట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: పోషకాహార లోపం లేని తెలంగాణను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రత్యేకంగా తెలంగాణ న్యూట్రిషన్ ప్లాన్‌ను తీసుకువస్తోందన్నారు. ఈ దిశగా కసరత్తు ముమ్మరం చేసినట్లు చెప్పారు. సోమవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో తెలంగాణ న్యూట్రిషన్ ప్లాన్‌పై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్, సీఎఫ్‌టీఆర్ఐ (మైసూర్), ఎయిమ్స్, ఇక్రిశాట్, యూనిసెఫ్ సంస్థలతో పాటు ప్రథమ్, ఆంధ్ర మహిళా సభ, హర్మన్, బాల రక్ష భారతి సంస్థలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అంగన్‌వాడీలపై తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచేలా సేవల నాణ్యత పెంచుతున్నామని, అమ్మ ఒడి నుంచి చిన్నారులు అంగన్‌వాడీ బడిలో చేరేలా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. పోషణ్ వాటిక కార్యక్రమం కింద నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా ఆరు రకాల కూరగాయల విత్తనాలతో కూడిన సీడ్స్ కిట్‌ను మంత్రి సీతక్క ఈ సందర్భంగా ఆవిష్కరించారు. మొదటి విడతలో 4,500 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ విత్తనాల కిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ జి.సృజన, తెలంగాణ ఫుడ్స్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ డేటా రికవరీ

నేడో రేపో సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక కారణాలతో తుడిచిపెట్టుకుపోయిన పాలిసెట్ కౌన్సెలింగ్ డేటాను మొత్తం మీద అధికారులు రికవరీ చేశారు. ఐటీ రంగ నిపుణులు వారం రోజులుగా దీనిపై కసరత్తు చేశారు. నిజానికి ఐదు రోజుల క్రితమే డేటా రికవరీ అయినట్టు తెలిసింది. కానీ తరచూ ఎర్రర్స్ రావడంతో సిబ్బంది కంగారుపడ్డారు. గుడ్ గవర్నెన్స్‌లో నిక్షిప్తమైన డేటాను డంప్ చేసుకుని, పరిస్థితిని సరిదిద్దినట్లు అధికార వర్గాలు తెలిపాయి. డేటా రికవరీ కావడంతో పాలిసెట్ సీట్ల కేటాయింపును చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మంగళ, బుధవారాల్లో కేటాయింపు చేపట్టే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. పాలిటెక్నిక్ ఫీజుల విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత కోసం ఎదురు చూస్తున్నామని అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో రూ.3,800 వార్షిక ఫీజు ఉండగా, ప్రైవేటు కాలేజీల్లో గత ఏడాది కౌన్సెలింగ్ తర్వాత రూ.15 వేల నుంచి రూ.38,000 వరకూ పెంచారు. ఇందులో ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.15 వేలు వస్తుంది. మిగతా మొత్తాన్ని విద్యార్థి భరించాలా? ప్రభుత్వం ఇస్తుందా? అనే దానిపై స్పష్టత ఇవ్వాలని సాంకేతిక విద్యా విభాగం ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై ప్రభుత్వం నుంచి మంగళవారం స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. ఇది వచ్చిన వెంటనే సీట్ల కేటాయింపు చేపడతామని అధికారులు తెలిపారు.

ప్రిన్సిపాళ్లుగా 81 మంది అధ్యాపకులు

పదోన్నతి పత్రాలు అందజేసిన ఇంటర్ బోర్డ్ కార్యదర్శి



నియామక పత్రాలను అందజేస్తున్న ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న 81 మంది అధ్యాపకులకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు పదోన్నతి పొందిన వారికి.. ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం ఉత్తర్వులను అందజేసి అభినందించారు. కొత్త బాధ్యతలతో మెరుగైన ఇంటర్ విద్యకు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి జయప్రదాబాయి సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీలపై ఉన్నతస్థాయి కమిటీ తొలి సమావేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీలు, స్థానిక సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య, ఖాళీలు, ప్రస్తుతం ఉన్న పలు ఉద్యోగాలు అవసరమా? లేదా? అన్న అంశాలపై సమీక్షించడానికి మాజీ సీఎస్ ఎ.శాంతి కుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ మొదటి సమావేశం సోమవారం ఆన్‌లైన్‌లో జరిగింది. ఇందులో భాగంగా పశుసంవర్ధక శాఖ, అటవీ, పర్యావరణ శాఖలోని పోస్టుల గురించి చర్చించారు. రెండు విభాగాల్లో మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న వారి సంఖ్య, ఖాళీలు, ఉద్యోగాల వివరాలతో కూడిన సమాచారాన్ని రెండు రోజుల్లోగా పూర్తిస్థాయిలో ఆర్థిక శాఖ, ఆయా విభాగాలు కమిటీకి సమర్పించాలని ఆదేశించారు. వచ్చేవారంలో ఈ రెండు ప్రభుత్వ శాఖలపై సమీక్ష తర్వాత ఆ పోస్టులు అవసరమా? లేదా? అన్న అంశాలపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. ఈ విధంగా అన్ని శాఖలపై సమీక్షించాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ కమిటీలో మాజీ సీఎస్ శాంతికుమారి, వేతన సవరణ కమిషన్ చైర్మన్ ఎన్.శివశంకర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు సభ్యులుగా ఉన్నారు.

2050 నాటికి 640 కి.మీ. మెట్రో

- దశలవారీగా మెట్రో విస్తరణ అభివృద్ధి ప్రణాళికలు
- ట్రిపుల్ ఆర్ వరకు ప్రజారవాణాపై లీ అసోసియేట్స్ అధ్యయనం
- మొదటి, రెండు దశల్లో 231.5 కి.మీ.
- 2040 నాటికి 340 కి.మీ.కు పెంచాలని ప్రతిపాదన... సెప్టెంబర్ నాటికి నివేదిక



సాక్షి, హైదరాబాద్: వచ్చే 25 ఏళ్లలో అంటే 2050 నాటికి 640 కి.మీ. వరకు మెట్రోరైల్ విస్తరణ చేపట్టాలని లీ అసోసియేట్స్ అధ్యయన సంస్థ ప్రతిపాదించింది. అప్పటివరకు హైదరాబాద్ మహానగర జనాభా 3.5 కోట్లకు చేరనున్నట్లు అంచనా. దీంతో సుమారు 65 లక్షల మందికి పైగా మెట్రో సేవలను వినియోగించుకుంటారని పేర్కొంది. భవిష్యత్ ప్రజారవాణా అవసరాల దృష్ట్యా మెట్రో విస్తరణ ఎంతో కీలకమని ఈ సంస్థ స్పష్టం చేసింది. 2050 నాటికి నాలుగు దశలుగా విస్తరణ చేపట్టాల్సి ఉందని పేర్కొంది. రీజనల్ రింగ్‌రోడ్డు వరకు హైదరాబాద్ మహానగరాన్ని విస్తరించిన నేపథ్యంలో ఇందుకనుగుణంగా అన్నివైపులా కనెక్టివిటీని పెంచాల్సి ఉంది. సమగ్ర మాస్టర్‌ప్లాన్–2050లో భాగంగా ప్రభుత్వం సమగ్ర రవాణా ప్రణాళికపై లీ అసోసియేట్స్‌ను కన్సల్టెన్సీగా నియమించింది. రోడ్లు, రవాణా సదుపాయాలు, ఎంఎంటీఎస్‌తోపాటు మెట్రో సేవల విస్తరణపై ఈ సంస్థ ప్రధానంగా అధ్యయనం చేస్తోంది. ఇప్పుడు రెండో దశలో 8 మార్గాల్లో మెట్రో విస్తరణకు ప్రణాళికలను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. ఇది 2030 నాటికి వినియోగంలోకి వస్తే మెట్రో ప్రయాణికుల సంఖ్య 15 లక్షలకు చేరనుంది. మూడో దశలో 2040 నాటికి పెరగనున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని 340 కి.మీ. వరకు విస్తరించాల్సి ఉందని అంచనా వేసింది. మూడో దశ అందుబాటులోకి వస్తే మెట్రో ప్రయాణికులు 35 లక్షలు దాటొచ్చునని అంచనా. ఇలా 2050 నాటికి 640కి.మీ వరకు మెట్రో మార్గాలను పూర్తి చేయాల్సిన అవసరం ఉంటుంది. ఈ సంస్థ సెప్టెంబర్‌లో తుది నివేదికను సమర్పించనుంది.

రెండో దశ పూర్తయితే 231.5 కి.మీ.

ప్రస్తుతం ప్రతిపాదించిన మెట్రో రెండో దశ వల్ల కొత్తగా 162.5 కి.మీ. వరకు మెట్రో మార్గం అందుబాటులోకి వస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రజారవాణాలో మెట్రోరైల్ మాత్రమే కీలకమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

ఆర్థికాభివృద్ధి ప్రణాళికపై అధ్యయనం

హెచ్ఎండీఏ పరిధి విస్తరణతో ప్రస్తుతం 11 జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లోని 104 మండలాలు, 1355 గ్రామాలతో హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్ఎంఏ) ఏర్పడింది. ఆర్థికాభివృద్ధి ప్రణాళికపై అధ్యయనం చేసి సమగ్ర ప్రాజెక్టు నివేదికను అందజేసేందుకు ప్రభుత్వం క్రిసిల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కన్సల్టెన్సీ సంస్థకు బాధ్యతలను అప్పగించింది. ఈ సంస్థ త్వరలో దీనిపై నివేదికను అందజేయనుంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 35ఆర్థిక మండలాలు, లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ప్రపంచంలోని టాప్–10 నగరాల సరసన హైదరాబాద్‌ను నిలబెట్టేందుకు అమలు చేయాల్సిన భవిష్యత్తు ఆర్థిక ప్రణాళికలపై క్రిసిల్ నివేదికను ఇవ్వనుంది.



పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న కాంట్రాక్టర్లు

అప్పులు చేసి అవస్థలు పడుతున్నాం

పాఠశాల విద్య డైరెక్టరేట్ వద్ద మన ఊరు–మన బడి కాంట్రాక్టర్ల ధర్నా

సాక్షి, హైదరాబాద్: మన ఊరు–మన బడి పథకం కింద కాంట్రాక్టు పనులు చేసినా బిల్లులు ఇవ్వలేదని, దీని వల్ల అనేక అవస్థలు పడుతున్నామని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తంచేశారు. పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయం ఎదుట సోమవారం వారంతా పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి, తమ ఆవేదన పట్టించుకోవాలని నినదించారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,000 స్కూళ్లకు పైగా మన ఊరు–మన బడి పథకం కింద పలు రకాల అభివృద్ధి పనులు చేశామని, రెండేళ్లుగా బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పదిమంది కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్లకు రూ.1,000 కోట్లకు పైగా ప్రభుత్వం బిల్లులు బకాయి పడిందని వెల్లడించారు. అనంతరం విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ను కలిసి కాంట్రాక్టర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అభిలాష్ యాదవ్, వేదవ్యాస్, సుశీల్ నాయక్, చంద్రారెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యోమగాముల కోసం.. మూన్ రైస్



కేవలం 4 అంగుళాలే పెరిగే 'మరుగుజ్జు వరి'

ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన ఇటలీ శాస్త్రవేత్తలు

వ్యోమగాములు స్వయంగా పండించుకోవచ్చు

రోదసీలోనూ, చంద్రుడిపైనా ఎక్కడైనా పండుతుంది

భూమ్మీద ఎడారుల్లో, ఇళ్లలోనూ సాగు చేసుకోవచ్చు

ఏ గ్రహంపైనైనా అత్యంత ప్రతికూల పరిస్థితులను తట్టుకొని పెరిగే అద్భుతమైన 'అతి మరుగుజ్జు (సూపర్ డ్వార్ఫ్)' వంగడం సిద్ధమైంది. రోదసీలో గానీ.. చంద్రుడు, అంగారకుడి మీదగానీ.. భూమిపైన ప్రత్యేక వాతావరణంలోనూ.. ఎడారుల్లో, ఇంట్లో కూడా ఇక వరి ధాన్యం పండించుకోవచ్చు. ఇటలీ అంతరిక్ష సంస్థ (ఐఎస్ఎ), మరో మూడు ఇటాలియన్ విశ్వ విద్యాలయాలతో కలిసి ఈ అద్భుత వరి వంగడాన్ని రూపొందించింది. చంద్రుడిపై మనుషుల దీర్ఘకాల మనుగడకు అవసరమైన విలక్షణ వరి వంగడాన్ని రూపొందించాలన్న లక్ష్యంతో 'మూన్ రైస్' పేరిట చేపట్టిన పరిశోధనా ప్రాజెక్టు విజయవంతమైంది.

- సాక్షి, సాగుబడి

2–3 అడుగులు ఎత్తు పెరిగే పొట్టి (డ్వార్ఫ్) వరి వంగడాలు మాత్రమే మనకు తెలుసు. అయితే, ఈ సరికొత్త రకం కేవలం 4 అంగుళాల (10 సెంటీమీటర్లు) ఎత్తు మాత్రమే పెరుగుతుంది. అదీకాకుండా, అధిక మాంసకృత్తులు గల ధాన్యాన్ని దిగుబడినిస్తుందట. అంతరిక్ష యాత్రల్లో పాల్గొనే వ్యోమగాములు ముందుగా వండి ప్యాక్ చేసిన ఆహారంపైనే ప్రస్తుతం ఆధారపడుతున్నారు. తాజా పదార్థాలు వారి ఆహారంలో ఉండే అవకాశం లేదు. సుదీర్ఘ కాలం అంతరిక్ష యాత్రలో గడిపే వ్యోమగాముల శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలు అందటం లేదు. భూగోళానికి మరింత ఎక్కువ దూరంలో రోదసీలో పరిశోధనలు చేపట్టాలంటే విటమిన్లు, పీచుపదార్థం అధికంగా ఉండే ఆహారాన్ని అక్కడే పండించాలి. మూన్ రైస్ పరిశోధనా ప్రాజెక్టు ఈ లక్ష్యంతోనే ప్రారంభమైంది. ఐఎస్ఏ మొక్కల జీవశాస్త్రవేత్త మార్తా డెల్ బియాంకో ఈ పరిశోధన వివరాలను ప్రకటించారు. బెల్జియంలో సుప్రసిద్ధ 'సొసైటీ ఫర్ ఎక్స్‌పరిమెంటల్ బయాలజీ' వార్షిక సమావేశంలో ఇటీవల ఆమె ప్రసంగించారు.

వరి జన్యుశాస్త్రంలో పట్టున్న మిలన్ విశ్వవిద్యాలయం, పంట శరీర ధర్మశాస్త్రంలో ప్రత్యేక కృషిచేస్తున్న రోమ్ విశ్వవిద్యాలయం, అంతరిక్ష పంటలపై పరిశోధనలో ఆరితేరిన నేపుల్స్ విశ్వవిద్యాలయం పరిశోధకులతో కలసి ఇటలీ అంతరిక్ష సంస్థ పరిశోధనలు చేస్తోంది. 'నాలుగేళ్ల 9 నెలల క్రితం ప్రారంభించిన పరిశోధనల్లో చాలా పురోగతి ఉంది. మిలన్ విశ్వవిద్యాలయంలో కేవలం 10 సెంటీమీటర్ల ఎత్తు పెరిగే ఉత్పరివర్తన చెందిన వరి రకాలపై పరిశోధనలు కొలిక్కివచ్చాయి. ఇది గొప్ప ప్రారంభ విజయం. పంట ఎదుగుదల, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి మొక్కల నిర్మాణాన్ని మార్చగల జన్యువులను రోమ్ విశ్వవిద్యాలయం గుర్తించి మార్పులు చేసింది. ప్రాథమిక ఫలితాలు చాలా ఆశాజనకంగా ఉన్నాయి. అంతరిక్షంలో మాంసాన్ని పెంచలేం. అందుకని ప్రొటీన్ అధికంగా ఉండేలా ఈ వంగడాన్ని అభివృద్ధి చేస్తున్నాం' అన్నారు డెల్ బియాంకో.

4 ఏళ్ల 9 నెలల పరిశోధన

భూమ్మీద రైతులకూ ఉపయోగమే

మూన్ రైస్ ప్రాజెక్టు పరిశోధనలు అంతరిక్ష సేద్యానికి పనికొచ్చే విషయాలకు మించిన ప్రయోజనాలను అందిస్తోంది. ఇది భూమిపై ఉండే రైతులకు కూడా ఉపయోగపడుతుంది. 'అత్యంత సమస్యాత్మక అంతరిక్షంలో పెరగటానికి రూపొందుతున్న ఈ అతి మరుగుజ్జు వంగడం ఆర్కిటిక్, అంటార్కిటిక్ ధ్రువాలకు దగ్గరి ప్రాంతాల్లో లేదా ఎడారుల్లో లేదా తక్కువ స్థలం ఉండే ఇళ్లలో కూడా నియంత్రిత వాతావరణంలో సాగుకు కూడా ఉపయోగపడుతుంది' అని డెల్ బియాంకో తెలిపారు. వరి మొక్కలు అంతరిక్షంలో సూక్ష్మ గురుత్వాకర్షణకు ఎలా స్పందిస్తాయనే అంశంపై కూడా శాస్త్రవేత్తల బృందం పరిశోధిస్తోంది.

హార్మోన్ మార్పుతో..



'మన దగ్గర ఇప్పటికి ఉన్న పొట్టి వంగడాలు అంతరిక్ష వ్యవసాయానికి ఉపయోగపడటం లేదు. ఇంకా తక్కువ ఎత్తు పెరిగే రకం కావాలి. వరి మొక్కలో ఎత్తును ప్రభావితం చేసే గిబ్బరెల్లిన్ అనే హార్మోన్‌లో మార్పు చేశాం. కానీ, అంతరిక్షంలో విత్తనాలు మొలకెత్తటం కూడా ఒక సవాలు. అక్కడ పెరిగే పంట మరీ తక్కువ ఎత్తు ఉండటం ఒక్కటే చాలదు.. మంచి ఉత్పాదకతను కూడా ఇవ్వగలగాలి. ఇలాంటి వంగడాన్ని తయారుచేయటం అనేక సవాళ్లతో కూడినది'

- మార్తా డెల్ బియాంకో, ఐఎస్ఏ మొక్కల జీవశాస్త్రవేత్త

తాజా ఆహారం.. మానసిక ఆరోగ్యం!

తాజా ఆహారం శరీర పోషణకు మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. అంతరిక్షానికి తీసుకెళ్లిన ముందే వండిన ఆహారం కొంత కాలం బాగానే ఉంటుంది. దీర్ఘకాలం దానిపై ఆధారపడటం సాధ్యం కాదు. అందువల్ల అక్కడే వ్యోమగాముల కళ్ల ముందు పెరిగే పంట వంగడాలను రూపొందించటం ద్వారా వారికి తాజా ఆహారంతో పాటు ఒత్తిడిని తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని కూడా అందించాల్సి ఉంటుంది. వారు ఒత్తిడిలో ఉన్నప్పుడు జరిగే తప్పుల వల్ల ఆర్థిక నష్టంతో పాటు ప్రాణనష్టానికి కూడా దారితీయొచ్చు.

క్లుప్తంగా...

వచ్చే శాసనమండలి సమావేశాలు పాత భవనంలోనే...

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రానున్న శాసనమండలి సమావేశాలను అసెంబ్లీ హాలు పక్కనున్న పాత భవనంలోనే నిర్వహించనున్నట్లు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఆగస్టులో శాసనసభ, శాసనమండలి సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ శాసనమండలి భవ నం పునర్నిర్మాణ పనులు జరుగుతున్న తీరు ను సోమవారం ఆయన ఆర్అండ్‌బీ అధికారు లు, అగాఖాన్ సంస్థకు చెందిన ప్రతినిధులు, ఇతర అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ రానున్న సమావేశాలు అసెంబ్లీ పక్కనే ఉన్న ఈ భవనంలో నిర్వహించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. తాజాగా ఇప్పటి వరకు పూర్తయిన పనుల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారని, కచ్చితంగా ఆగస్టులో శాసనమండలి సమావేశాలు పాత భవనంలోనే నిర్వహించాలని సీఎం ఆదేశించారని గుత్తా తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా వేగం పెంచాలని, ఆగస్టు 15 లోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, తెలంగాణ లేజిస్లేచర్ సెక్రటరీ నరసింహాచార్యులు, ఈఎన్సీ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మతపరమైన రిజర్వేషన్లను బీజేపీ ఒప్పుకోదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



నల్లగొండ టూటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బీజేపీ కట్టుబడి ఉందని, కానీ మతపరమైన రిజర్వేషన్లను బీజేపీ ఒప్పుకోదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత తొలిసారి నల్లగొండకు వచ్చిన ఆయన కార్యకర్తల సమ్మేళనంలో, ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న విధానం వలన బీసీలకు నష్టం జరుగుతుందని, బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు రుణ మాఫీ చేయకుండా, రైతుబంధు ఇవ్వకుండా మోసం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిది అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అడిగితే కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చిందని రాంచందర్‌రావు తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని, ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని నల్లగొండ గడ్డపై నుంచి ప్రజలకు రాంచందర్‌రావు పిలుపునిచ్చారు.

నేటి నుంచి ఏఐసీసీ బీసీ సలహా మండలి భేటీ

బెంగళూరు సమావేశాలకు రాష్ట్రం నుంచి ఏడుగురికి ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక రాజధాని బెంగళూరు వేదికగా మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఏఐసీసీ బీసీ సలహా మండలి సమావేశాలు జరగనున్నాయి. సమావేశాల్లో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి ఏడుగురు కాంగ్రెస్ నేతలకు ఆహ్వానం లభించింది. సలహా మండలి సభ్యుల హోదాలో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ప్రత్యేక ఆహ్వానితులుగా మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్‌లు హాజరవుతారని టీపీసీసీ వర్గాలువెల్లడించాయి. సమావేశాల్లో భాగంగా బీసీల కులగణన, 42 శాతం బీసీ రిజర్వేషన్లపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మాట్లాడతారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి.

చర్చకు సిద్ధమా?

▶ మొదటి పేజీ తరువాయి

రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేశాం. 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతు భరోసా ఇచ్చాం. పండించిన ప్రతి గింజను కొని బోనస్ ఇచ్చాం. దాంతో ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచాం. రైతును రాజును చేసింది ఇందిరమ్మ రాజ్యమే. సోనియాగాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులు పండుగ చేసుకుంటున్నారు. గత పదేళ్లలో కొత్త కోడలు వస్తే కార్డులో పేరు నమోదు చేయని పరిస్థితి. ఇప్పుడు 26 లక్షల మంది పేర్లను చేర్చాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.



తిరుమలగిరిలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు

మహిళలు అంబానీతో పోటీపడేలా చేస్తున్నాం...

'మహిళల స్వయం సమృద్ధికి కృషి చేస్తున్నాం. రూ.21 వేల కోట్లు వడ్డీలేని రుణాలు అందించాం. మహిళా సంఘాలు వ్యాపారంలో అంబానీతో పోటీపడేలా చేస్తున్నాం. వెయ్యి బస్సులు కొని మహిళా సంఘాలు ఆర్టీసీకే అద్దెకు ఇచ్చేలా రుణాలు అందిస్తున్నాం. నాడు పెట్రోలు బంకులు రిలయన్స్ అంబానీలే పెట్టేవారు. వారితో పోటీ పడేలా మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చి పెట్రోలు బంకులు ఏర్పాటు చేయిస్తున్నాం. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకుంటున్నాం. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయ్యేలోపు లక్ష ఉద్యోగాలను కల్పిస్తాం. ఇప్పటికే 60 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాం. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ అమలు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచాం. జనగణనలో కులగణన చేసేలా కాంగ్రెస్ మోదీ మెడలు వంచాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం. బీసీలు రాజ్యాధికారం పొందేలా చేస్తాం ..' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

ప్రభుత్వం ఏం చేసిందో మహిళలు ఆలోచించాలి

'త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు రాబోతున్నాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి. ఆ ఎన్నికల్లో జిల్లాలో ఒక్క గంజాయి మొక్క మొలవకుండా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలదే. మహిళలు ఇంటికి పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో ఆలోచించండి. మీకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్, సబ్సిడీ గ్యాస్ ఇచ్చాం. ఇవన్నీ ఇంట్లో మీ ఇంటాయనతో చర్చించి కాంగ్రెస్‌కు సహకరించండి. 2034 వరకు మేమే అధికారంలో ఉంటాం. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం..' అని సీఎం అన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం: మహేశ్‌కుమార్‌గౌడ్

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలను ప్రజా పాలనలో అమలు చేస్తున్నామని, 5 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్న ఈరోజు శుభ దినమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇది నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమం అని అన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని మహేశ్‌గౌడ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, యశస్విని‌రెడ్డి, రామచందర్‌నాయక్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు: మంత్రి ఉత్తమ్

దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించామని, ఇప్పుడు కొత్త రేషన్‌కార్డుల పంపిణీని చేపట్టామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో రేషన్ కార్డుల ద్వారా దొడ్డు బియ్యం వస్తే అందులో 90 శాతం వృథా అయ్యేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చి సన్న బియ్యం అందజేస్తోందని చెప్పారు. ప్రస్తుతం 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పాత రేషన్ కార్డులలో కూడా కొత్తగా కుటుంబ సభ్యులను చేర్చుకునే అవకాశం ఉందన్నారు. దేవాదుల ప్రాజెక్టు-6 ప్యాకేజీ ద్వారా పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్‌తో పాటు తుంగతుర్తి నియోజకవర్గానికి కూడా గోదావరి జలాలు అందుతాయని చెప్పారు.20 వేల ఎకరాలు అదనంగా సాగవుతాయన్నారు. బునాదిగాని కాల్వను రీడిజైన్ చేయడానికి రూ.200 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. .



'శ్రీమద్ భాగవతం పార్ట్-1' ఫిల్మ్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ప్రసాద్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి

రామాయణం స్థాయిలో 'భాగవతం' విజయం సాధించాలి

శ్రీమద్ భాగవతం పార్ట్-1 చిత్రం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: రామానంద్ సాగర్ తీసిన రామాయణం ధారావాహిక ఎంతటి ఘన విజయం సాధించిందో శ్రీమద్ భాగవతం చిత్రం అంతటి విజయం సాధించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం హైదరాబాద్‌లో 'శ్రీమద్ భాగవతం పార్ట్-1' ఫిల్మ్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీమద్ భాగవతం సినిమా తీయాలనే ఆలోచన వచ్చినందుకు చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. నలభై ఏళ్ల కిందట రామాయణం సీరియల్ రామాయణాన్ని అందరికీ చేరువ చేసిందన్నారు. కోవిడ్ సమయంలో రామాయణం సీరియల్ తిరిగి టెలికాస్ట్ చేయడంతో ప్రపంచస్థాయి రికార్డు సృష్టించిందని సీఎం తెలిపారు. 2035 నాటికల్లా తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చి దిద్దాలని ప్రజాప్రభుత్వం సంకల్పించిందన్నారు. 2047 నాటికల్లా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. 2047 విజన్ డాక్యుమెంట్‌లో సినిమా రంగానికి ఒక ప్రత్యేక చాప్టర్ ఉంటుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి, భగవత్ ఫిల్మ్ ప్రొడక్షన్స్ మోతీసాగర్, అమృత్‌సాగర్ చోప్రా, ఆకాశ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

17న పామ్‌ఆయిల్ రైతుల కోసం ప్రత్యేక సదస్సు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పామ్ ఆయిల్ రంగ అభివృద్ధి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను చేపట్టడం లక్ష్యంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎన్ఐ-ఎంఎస్ఎంఈ), సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ (సీఆర్‌బీ), రౌండ్ టేబుల్ ఆన్ సస్టైయినబుల్ పామ్ ఆయిల్ (ఆర్ఎస్‌పీవో) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లో ప్రత్యేక సదస్సును నిర్వహించనున్నారు. హైదరాబాద్ యూసఫ్‌గూడలోని ఎన్ఐ-ఎంఎస్ఎంఈ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆ సంస్థ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రఖ్యాతి గాంచిన పామ్‌ఆయిల్‌రంగ పరిశోధకులు, ప్రాసెసింగ్ సంస్థలు, వ్యవసాయ నిపుణులు హాజరుకానున్నారు. రైతులకు చైనా, మలేసియాల్లో అమలవుతోన్న పద్ధతుల గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పామ్ ఆయిల్ రైతులకు యూరప్ యూనియన్ మార్కెట్‌లో ప్రవేశం కల్పించేందుకు అవసరమైన ఈయూడీఆర్ ప్రమాణాలపై ఈ కార్యక్రమంలో చర్చించనున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (పామ్ ఆయిల్) నిబంధనలకు అనుగుణంగా రైతులు ముందుకు సాగేందుకు ఈ సమావేశం ఉపయోగపడనుందని వివరించారు.

ఆచితూచి 42% ఉత్తర్వులు!

▶ మొదటి పేజీ తరువాయి

చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

ఆర్డినెన్స్‌ను, కమిషన్ నివేదికను ప్రస్తావిస్తూ..

పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 285 (ఏ)కు చేసిన సవరణ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు ప్రత్యేక పరిస్థితుల్లో 50 శాతానికి మించవచ్చు అని మాత్రమే ఆర్డినెన్సులో ఉంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఆర్డినెన్సుతో పాటు డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టుగా అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొంటారని చెబుతున్నాయి. ఈ జీవో మేరకే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దఖలు పడతాయని వివరిస్తున్నాయి.

చట్టానికి చేసిన సవరణే ప్రాతిపదికగా జీవో

ప్రభుత్వం జీవో విడుదల చేసే జీవో న్యాయ సమీక్షలోనూ నిలబడే విధంగా అవసరమైన అన్ని అంశాలను ప్రస్తావిస్తూ వివరణాత్మకంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల పరిమితిని ప్రత్యేక పరిస్థితుల్లో పెంచేందుకు పంచాయతీ రాజ్ చట్టానికి చేసిన సవరణనే ఈ జీవోకు ప్రాతిపదికగా ఉంటుందని అంటున్నారు. బీసీల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ వెనుకబాటు స్థాయి, జనాభాకు తగిన ప్రాతినిధ్యం అనే అంశాల ప్రాతిపదికన చట్టాన్ని సవరించామని, ఈ అంశాలన్నింటినీ కూలంకషంగా పేర్కొంటూ రిజర్వేషన్ల పెంపును సమర్థించే కోణంలో జీవోకు రూపకల్పన చేస్తున్నామని వెల్లడిస్తున్నారు.

సుప్రీం తీర్పునుగౌరవించే విధంగానే..

బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు గాను జారీ చేసే ఉత్తర్వులు సుప్రీంకోర్టు తీర్పును గౌరవించే విధంగానే ఉంటాయని తెలుస్తోంది. రిజర్వేషన్ల గరిష్ట పరిమితి 50 శాతానికి మించుతున్నట్టుగా ప్రతిపాదన ఉండదని, ప్రత్యేక పరిస్థితుల్లో శాస్త్రీయ సమాచారం ఆధారంగా ఈ పరిమితిని పెంచుతున్నట్టుగా ఈ జీవోలో పొందుపరుస్తారని సమాచారం. దీనిపై ప్రభుత్వం జీవోలో స్పష్టంగా వివరణ ఇస్తుందని సమాచారం. బీసీల జనాభా మేరకు దశాబ్దాలుగా తగిన ప్రాతినిధ్యం స్థానిక సంస్థల్లో లేదని వెల్లడించే గణాంకాలు, కులగణనలో వెల్లడైన అంశాలు, బీసీల రాజకీయ వెనుకబాటుతనాన్ని నిర్ధారించే అంశాలు జీవోలో పేర్కొననున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి.

ప్రస్తుత చట్టం ఇది..

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల ప్రకారం స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రిజర్వేషన్ల గరిష్ట పరిమితి 50 శాతం మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రాతిపదికన ఇవ్వాల్సిన రిజర్వేషన్లను దృష్టిలో ఉంచుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు.

సవరణ ఇలా..

ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రాతిపదికన ఇవ్వాల్సిన రిజర్వేషన్లను దృష్టిలో ఉంచుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. అయితే శాస్త్రీయ సమాచారం (కులగణన) ఆధారంగా ప్రత్యేక పరిస్థితులను (భౌగోళిక, సామాజిక ఆర్థిక పరిస్థితులు, రాజకీయ వెనుకబాటుతనం స్థాయి, తగిన ప్రాతినిధ్యం లేకపోవడం) దృష్టిలో ఉంచుకుని స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించవచ్చు.

అసెంబ్లీ బిల్లుకు, ఆర్డినెన్స్‌కు సంబంధం లేదు

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ, బీఆర్ఎస్‌లకు చిత్తశుద్ధిలేదు: పొన్నం



సాక్షి, హైదరాబాద్: బీసీలకు రిజర్వేషన్ల పెంపు విషయంలో రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు, మంత్రివర్గ ఆమోదం పొందిన ఆర్డినెన్సుకు సంబంధం లేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ అంశాల్లో 42 శాతం రిజర్వేషన్లను కలిపిస్తూ అసెంబ్లీలో బిల్లులు ఆమోదం పొందితే, పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 50 శాతం కంటే ఎక్కువ ఇచ్చేందుకు మంత్రివర్గం ఆర్డినెన్స్ చేసిందని చెప్పారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన విధంగా ముందుకెళుతున్నామని అన్నారు. ఈ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్‌లకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఆ రెండు పార్టీల నేతలు కడుపులో కత్తులు పెట్టుకుని మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీజేపీలో ఉన్న బీసీ బిడ్డలు బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, ఆర్.కృష్ణయ్య, కె.లక్ష్మణ్‌లు చొరవ తీసుకుని బీసీలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. అసెంబ్లీ ఆమోదం పొందిన బీసీ బిల్లులను రాష్ట్రపతి కూడా ఆమోదించేలా బీజేపీ నేతలు ప్రయత్నం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్లు చేజారిపోకుండా కాపాడుకునే బాధ్యత బీసీల్లోని అన్ని వర్గాలపై ఉందని, ఎవరూ దీనికి వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లవద్దని పొన్నం విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ కొత్త సీజేగా జస్టిస్ ఏకే సింగ్

▶ మొదటి పేజీ తరువాయి

న్యాయవాదిగా పనిచేసి.. 2001లో జార్ఖండ్ హైకోర్టుకు మారారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2014, జనవరి 16న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2022, డిసెంబర్ నుంచి 2023, ఫిబ్రవరి వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించారు. 2023, ఏప్రిల్ 17న ప్రధాన న్యాయమూర్తి పదోన్నతితో త్రిపుర హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈ వారంలో తెలంగాణ హైకోర్టు 7వ సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు.

కోల్‌కతాకు జస్టిస్ సుజోయ్‌పాల్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న జస్టిస్ సుజోయ్‌పాల్‌ను కోల్‌కతాకు, జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్‌కు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సుకు కూడా కేంద్రం ఆమోదముద్ర వేస్తూ గెజిట్ జారీ చేసింది. ప్రస్తుతం హైకోర్టులో 26 మంది న్యాయమూర్తులున్నారు. ఇద్దరి బదిలీ, ఒకరి రాకతో ఈ సంఖ్య 25కు చేరనుంది. మొత్తం 42 మందికి గాను ఇంకా 17 ఖాళీలుంటాయి. సుప్రీంకోర్టు సిఫార్సు చేసిన మరో ముగ్గురు న్యాయమూర్తులు జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ సుమలత బదిలీపై ఇక్కడికి రావాల్సి ఉంది. అలాగే న్యాయవాదుల కోటా నుంచి న్యాయమూర్తులుగా సిఫార్సు చేసిన గౌస్ మీరా మొహియుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ నియామకాలకు కూడా కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది.

తెలంగాణ సీజేలు వీరే..

జస్టిస్ తొట్టతిల్ బీఆర్ రాధాకృష్ణన్	(2018–19)
జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్	(2019–21)
జస్టిస్ హిమాకోహ్లీ	(2021)
జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ	(2021–22)
జస్టిస్ ఉజ్జల్ భూయాన్	(2022–23)
జస్టిస్ అలోక్ అరాధే	(2023–25)
జస్టిస్ ఏకే సింగ్	(2025...)

బదిలీ అయిన సీజేలు

● మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, రాజస్తాన్ నుంచి మద్రాస్ హైకోర్టుకు. ● అపరేష్ కుమార్ సింగ్, త్రిపుర నుంచి తెలంగాణ హైకోర్టుకు. ● ఎం.ఎస్. రామచంద్ర రావు, జార్ఖండ్ నుంచి త్రిపుర హైకోర్టుకు. ● కె.ఆర్.శ్రీరాం, మద్రాస్ నుంచి రాజస్తాన్ హైకోర్టుకు

దేశంలో కొత్తగా నియమితులైన సీజేలు

ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
సంజీవ్ సచ్‌దేవా, ప్రస్తుతం మధ్యప్రదేశ్ హైకోర్టు (ఏసీజే)	మధ్యప్రదేశ్ హైకోర్టుకు పూర్తిస్థాయి చీఫ్ జస్టిస్
విభూ బఖ్రూ, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి	కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్
అశుతోష్ కుమార్, పట్నా హైకోర్టు (తాత్కాలిక చీఫ్ జస్టిస్)	గౌహతి హైకోర్టు చీఫ్ జస్టిస్
విపుల్ మనుభాయ్ పంచోలి, పట్నా హైకోర్టు న్యాయమూర్తి	పట్నా హైకోర్టు చీఫ్ జస్టిస్
తార్లోక్ సింగ్ చౌహాన్, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి	జార్ఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్



నీ మరణం తర్వాత నువ్వు...
పుట్టకముందు నువ్వు ఏమిటో అది!
– ఆర్థర్ షోపెన్‌హార్

సాక్షి
మంగళవారం, 15 జూలై 2025

ఈ అరకొర నివేదిక దేనికి?!

ఒక పెను విషాదంపై జరిగే దర్యాప్తు ఎంతో బాధ్యతాయుతంగా వుండాలి. ఆ ఉదంతంలో అసలు జరిగిందేమిటో చెప్పే ప్రయత్నం చేసినప్పుడు అస్పష్టతకు తావీయకూడదు. ప్రాథమిక దర్యాప్తుకైనా, పూర్తిస్థాయి దర్యాప్తుకైనా ఇదే వర్తిస్తుంది. కానీ గత నెల 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం విషయమై శుక్రవారం అర్ధరాత్రి వెలువరించిన ప్రాథమిక దర్యాప్తు ఆ నియమాలను ఉల్లంఘించింది. బాధిత కుటుంబాల్లో అయోమయాన్ని మరింత పెంచింది. ఆ ప్రమాదం వైమానిక ప్రమాదాల చరిత్రలో పెద్దది. ఆ విషాద ఘటన సమయంలో విమానంలో 242 మంది ప్రయాణికులుండగా, ఒకరు క్షేమంగా బయటపడ్డారు. భవంతిపై కూలినందువల్ల అక్కడున్న 19 మంది ప్రాణాలు కోల్పోయారు. విమానంలో ఇంధనాన్ని నియంత్రించే స్విచ్‌లు రెండూ ఆపివేసి వుండటం వల్లనే ప్రమాదం జరిగివుండొచ్చని దర్యాప్తు చేస్తున్న విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక భావించింది. ఇది కేవలం ప్రాథమిక నివేదికే గనుక వెంటనే నిర్ణయానికి రావటం తగదని కేంద్ర వైమానిక మంత్రిత్వ శాఖ అంటున్నది. మంచిదే. అటువంటప్పుడు ఏఏఐబీ నివేదిక స్విచ్‌ల విషయంలో మరింత సమాచారం అందాకే వాటిని ప్రస్తావించి వుండాల్సింది. పైలెట్ల సంఘం కూడా నివేదికను తప్పుబడుతోంది. పైలెట్ల తప్పిదమే కారణమని అర్థం వచ్చేలా నివేదిక వుండటం సరికాదని విమర్శిస్తున్నారు. దర్యాప్తులో తమ ప్రతినిధికి ఇప్పటికైనా చోటీయాలని వారు అంటున్నారు. ఈ అయోమయం ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో వున్న బాధిత కుటుంబాలను మరింత నొప్పించదా?

అంతర్జాతీయ వైమానిక నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగిన ఏడాదిలోగా తుది నివేదిక రావాలి. ఈలోగా విడుదల చేసే ప్రాథమిక నివేదిక పైలెట్లను తప్పుబట్టే విధంగా వుండటం, ఆ తర్వాత దాన్ని ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం లేదనటం న్యాయమేనా? ఘటనా స్థలంలో దొరికిన స్విచ్‌లున్న పరికరంలో అవి రెండూ 'ఆన్' చేసివున్నాయి. కానీ కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఒక పైలెట్ మరొకరితో 'ఇంధనం ఎందుకు నిలిపివేశావ్' అని అడగటం, అందుకు రెండో పైలెట్ 'నేనలా చేయలేదే...' అంటూ జవాబివ్వటం వినబడటాన్నిబట్టి స్విచ్‌లు ఆపివేసి వున్నట్టు దర్యాప్తు బృందం నిర్ధారణకొచ్చింది. కానీ రెండో పైలెట్ ఆ వెంటనే వాటిని సరిచేసి వుండొచ్చని, అందుకే అవి సక్రమంగా వున్న స్థితిలో లభించాయని నివేదిక అంటున్నది. ఈ సంభాషణల్లో అడిగిన వారెవరో, జవాబిచ్చిన వారెవరో దర్యాప్తు చేసినవారు గుర్తించారా? గుర్తించి వుంటే ఆ సంగతి వెల్లడించటానికి వారికున్న అభ్యంతరమేమిటి? ఒకవేళ అలాంటి అభ్యంతరం వున్నప్పుడు అసలు ఆ సంభాషణను బయటపెట్టడం దేనికి?

విమానంలోని యాంత్రిక వ్యవస్థలు సంక్లిష్టమైనవి. విమాన గమనంలో మనుషుల జోక్యం దాదాపు అవసరం లేని 'ఫ్లై బై వైర్' వ్యవస్థ అందుబాటులోకొచ్చి దశాబ్దాలవుతోంది. ముఖ్యంగా విమానం టేకాఫ్ సమయంలోనూ, దిగే సమయంలోనూ ఆ వ్యవస్థ పూర్తిగా తనకు తానే అన్నిటినీ సరిచేసుకుంటుంది. పైకెగిరినప్పుడూ, కిందకు దిగినప్పుడూ అవసరమైన ఇంధనం సరఫరా అయ్యేలా చూసుకుంటుంది. ఇవి విఫలమైన పక్షంలో పైలెట్ అవసరమైన మార్పులు చేసుకోవడానికే స్విచ్‌లుంటాయి. రెండు స్విచ్‌లకూ రెండువైపులా రింగ్‌లుంటాయి. వాటికి ప్రత్యేక లాకింగ్ వ్యవస్థ వుంటుంది. మనిషి ప్రత్యేకించి వాటిని స్విచాన్ చేయటానికైనా, స్విచాఫ్ చేయటానికైనా ముందు ఆ లాకింగ్‌ను తెరవక తప్పదు. రెండు స్విచ్‌లూ ఆగిపోవటానికి మధ్య సెకను వ్యవధి వుందని తేల్చారు. పైగా పైకెగురుతున్న సమయంలో ఎక్కువ ఇంధనం సరఫరా కావాల్సి వుండగా దాన్ని కావాలని ఏ పైలెట్ కూడా స్విచాఫ్ చేయడు. దానిపై దర్యాప్తు బృందం ఏ నిర్ధారణకూ రాలేదు. పైలెట్లుగా వ్యవహరించినవారి చరిత్ర చూసినా ఉద్దేశపూర్వకంగా ఆపివుంటారని ఊహించటం అసాధ్యం. ప్రధాన పైలెట్ సుమీత్ సభర్వాల్‌కు బోయింగ్ 787ను 8,600 గంటలు నడిపిన సర్వీస్ (మొత్తంగా 15,638 గంటల సర్వీస్) వుండగా, కో పైలెట్ క్లైవ్ కుందేర్‌కు బోయింగ్‌పై 1,100 గంటల అనుభవం, మొత్తంగా 3,403 గంటల అనుభవం వుంది. ఇద్దరూ ఈ విమానం నడపటానికి ముందు తగినంత విశ్రాంతి తీసుకున్నవారే. ప్రధాన పైలెట్ పర్యవేక్షణలో కో పైలెట్ ఇష్టానుసారం చేయటం సాధ్యపడదు. ఒకవేళ ఆ ప్రయత్నం జరిగివుంటే వాగ్వాదం చోటుచేసుకునేది. అది రికార్డయ్యేది.

పూర్తి స్థాయి పారదర్శకతకు దర్యాప్తు సంస్థ ఎందుకు వెనకాడుతోంది? ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను కేవలం ఒక ప్రశ్న, జవాబు స్థాయికి కుదించటంలోని మర్మమేమిటి? అటు తర్వాత లేదా అంతకుముందు వారేం మాట్లాడుకున్నారు? ఇది చెప్పకపోతే పైలెట్లలో ఒకరు ఆత్మాహుతికి పాల్పడ్డారా అనే సంశయం బయల్దేరుతుంది. ఎయిర్‌లైన్స్ రేటింగ్స్ వెబ్‌సైట్ ప్రధాన సంపాదకుడు జెఫ్రీ థామస్ అడుగుతున్నది ఇదే. దర్యాప్తు ఫలితాల గురించి అంతర్జాతీయంగా అనేకులు ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే ఈ రకం విమానాలను బ్రిటిష్ ఎయిర్‌వేస్ సంస్థ, వర్జిన్ అట్లాంటిక్ సంస్థ ప్రధానంగా వినియోగిస్తున్నాయి. ప్రాథమిక నివేదిక విడుదల చేయటం స్వాగతించదగిందే. కానీ ఇప్పటికే వున్న సంశయాలను మరింత పెంచేలా, అస్పష్టత అలుముకునేలా అది వుండటం సరికాదు. పైలెట్ల మధ్య జరిగిన సంభాషణ పూర్తి పాఠం విడుదల చేస్తే అటు పైలెట్‌ల సంఘం అభ్యంతరాలతోపాటు, ఇటు బాధిత కుటుంబాల సంశయాలు కూడా సమసిపోతాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి: బ.పంచమి రా.10.22 వరకు, తదుపరి షష్ఠి,
నక్షత్రం: శతభిషం ఉ.7.07 వరకు, తదుపరి పూర్వాభాద్ర.
వర్జ్యం: ప.1.16 నుండి 2.48 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు,
అమృతఘడియలు: రా.10.30 నుండి 12.01 వరకు

సూర్యోదయం : 5.36
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

తెలంగాణ నీటి హక్కులకు విఘాతం

విశ్లేషణ



శ్రీధర్ రావు దేశ్‌పాండే

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పోలవరం–బనకచర్ల(పి–బి) లింకు ప్రాజెక్ట్ వల్ల తెలంగాణకు ఏమి నష్టం? వృథాగా సముద్రంలోకి పోతున్న గోదావరి జలాలను ఏపీ వాడుకుంటామంటే తెలంగాణ ఎందుకు వ్యతిరేకించాలి? ఆ నీటిని వెనక్కి తీసుకురాలేము కదా! ఈ రకమైన ప్రశ్నలు, అనుమానాలు తెలంగాణ బుద్ధిజీవుల్లో ఉన్నాయని తెలుస్తున్నది.

ఇది వృథాగా సముద్రంలోకి పోతున్న నీటి వాడకం సమస్య కాదనీ, ఇది తెలంగాణ నీటి హక్కులకు సంబంధించిన అంశమనీ తెలంగాణ సమాజం మొదట గుర్తించాలి. అన్నదమ్ముల మధ్య ఆస్తి పంపకాలు జరిగిన తర్వాత మీకు వచ్చిన భూమిపై హక్కు రావాలంటే అది రెవెన్యూ రికార్డుల్లో మీ పేరు మీదకు మారాలి. అప్పుడే ఆ భూమి మీద మీకు హక్కు ఏర్పడుతుంది. తర్వాత వ్యవసాయం చేస్తారో, కౌలుకు ఇస్తారో, పడావు పెడతారో, అమ్ముకుంటారో మీ ఇష్టం. కానీ ఆ భూమి మీద మీకు హక్కులు స్థిరపడకుండా ఇవేమీ చేయలేరు. సరిగ్గా పోలవరం–బనకచర్ల కూడా గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు సంబంధించిన సమస్య.

గోదావరి జలాల్లో తెలంగాణ వాటా ఎంత?

ఇది అర్థం కావాలంటే గోదావరి, కృష్ణా ట్రిబ్యునల్ అవార్డుల సంగతి కొంతైనా తెలుసుకోవాలి. 1969లో అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కార చట్టం–1956 కింద ఏర్పాటైన రెండు ట్రిబ్యునళ్ళకు బచావత్ గారే ఛైర్మన్‌గా వ్యవహరించారు. కృష్ణా ట్రిబ్యునల్ విచారణలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ పాల్గొంటే... గోదావరి ట్రిబ్యునల్ విచారణలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్, ఒడిషా పాల్గొన్నాయి. అప్పుడు తెలంగాణ ఒక రాష్ట్రంగా లేదు కాబట్టి ఈ విచారణల్లో లేదు. (ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ కూడా గోదావరి బేసిన్లో చేరినాయి.)

అన్ని రాష్ట్రాల అంగీకారం మేరకు బచావత్ ట్రిబ్యునల్ మొదట కృష్ణా నీటి పంపిణీ సమస్యను చేపట్టింది. 1976లో తుది నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. 75 శాతం విశ్వసనీయత కలిగిన 2,060 టీఎంసీల కృష్ణా జలాల్లో మహారాష్ట్రకు 560, కర్ణాటకకు 700, ఆంధ్రప్రదేశ్‌కు 800 టీఎంసీలు కేటాయించారు. అదనంగా 70 టీఎంసీల రిటర్న్ ఫ్లోస్‌ను మహారాష్ట్రకు 25, కర్ణాటకకు 34, ఆంధ్రప్రదేశ్‌కు 11 టీఎంసీలు కేటాయించారు. దీనితో కృష్ణా నికర జలాల్లో ఏపీకి దక్కిన వాటా 811 టీఎంసీలు.

కృష్ణా ట్రిబ్యునల్ విచారణ కొనసాగుతుండగానే, 1975–80 మధ్య కాలంలో గోదావరి పరీవాహక రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిషా ఆ జలాల వినియోగానికి సంబంధించి తమలో తాము 10 ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతో కృష్ణా జలాల పంపిణీ విషయంలో జరిపినటువంటి సమగ్ర విచారణను బచావత్ జరపకుండానే, రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలనే క్రోడీకరించి, వాటికి చట్టబద్ధత కల్పిస్తూ 1980లో గోదావరి ట్రిబ్యునల్ అవార్డుగా తమ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు.

కచ్చితమైన పరిమాణంలో గోదావరి జలాలను రాష్ట్రాల మధ్య పంపిణీ చేయలేదు. ఒక నిర్దేశిత స్థలానికి పైన ఉన్న జలాలన్నీ (ఆల్ వాటర్స్)పై రాష్ట్రానికీ, ఆ తర్వాత లభ్యమయ్యే జలాలన్నీ దిగువ రాష్ట్రానికీ చెందాలన్న భావనతోనే రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాల్లో రాసుకున్నారు. ఉదాహరణకు, ఎగువ గోదావరి (జి–1) సబ్ బేసిన్లో పైఠాన్ డ్యామ్ వరకు లభ్యమయ్యే జలాలన్నీ మహారాష్ట్ర వినియోగించుకోవచ్చు. పైఠాన్ డ్యామ్ నుంచి శ్రీరాం సాగర్ డ్యామ్ వరకు లభ్యమయ్యే నీటిలో 60 టీఎంసీలు మహారాష్ట్ర వాడుకోగా మిగిలిన జలాలన్నీ ఏపీ వినియోగించుకోవచ్చు. పెన్‌గంగ సబ్ బేసిన్లో (జి–7) లోయర్ పెన్‌గంగ డ్యామ్ వరకు లభ్యమయ్యే జలాలన్నీ మహారాష్ట్రకు చెందుతాయి. మిగిలిన జలాలన్నీ ఏపీకి చెందుతాయి. ఈ రకమైన పరిభాషలో ఒప్పందాలు కుదిరినాయి.



◆ ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును గ్రౌండ్ చేసి, వేల కోట్లు ఖర్చు చేసి, ప్రాజెక్టు ద్వారా తరలించే 200 టీఎంసీలను కేటాయించమని కోరితే తెలంగాణ వాటాకు కోత పడుతుంది. ఈ లోపు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల నీటిపై హక్కులు స్థిరపడాలి.

1,486 టీఎంసీల నీటిలో తెలంగాణ వాటా ఎంత?

మరి గోదావరి జలాల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 1,486 టీఎంసీలని లెక్క గట్టిందెవరు? ఈ 10 ఒప్పందాల ఆధారంగా ఉమ్మడి ఏపీ ఇంజనీర్లే గోదావరిలో 75 శాతం విశ్వసనీయత కలిగిన జలాలు 1,486 టీఎంసీలని లెక్కగట్టినారు. దీనికి గోదావరి ట్రిబ్యూనల్ గానీ, ఇతర రాష్ట్రాలు గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ ఆమోదం తెలుపలేదు. అయితే ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఉమ్మడి ఏపీ 1,486 టీఎంసీలనే ప్రాతిపదికగా తీసుకున్నది. గోదావరి జలాల్లో ఉమ్మడి ఏపీ రాష్ట్రం వివిధ సందర్భాల్లో జీఓల ద్వారా తెలంగాణ ప్రాంతంలో ఉన్న చిన్ననీటి పథకాలు, మధ్యతరహా ప్రాజెక్టులు, భారీ ప్రాజెక్టులకు 968 టీఎంసీల నీటిని కేటాయించింది. ఏపీ విభజన బిల్లు 2014 ఫిబ్రవరిలో అసెంబ్లీలో చర్చకు వచ్చినప్పుడు, శాసన సభ్యులకు కృష్ణా, గోదావరి జలాల్లో ప్రాజెక్టుల వారీ కేటాయింపులు చేసిన వివరాలను అధికారికంగా అందించినారు.

అందుకే ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించిన 968 టీఎంసీల నీటిపై మొదట తెలంగాణకు హక్కులు స్థిరపడాలి. ఎందుకంటే.. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 968 టీఎంసీల కేటాయింపులను తొలినాళ్ళ నుంచే తిరస్కరిస్తూ కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర జల సంఘానికి అనేక లేఖలు రాసింది. ఈ నీటిపై ఆధారపడి తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్, చనాక–కొరాట తదితర ప్రాజెక్టులను చేపట్టి, డీపీఆర్‌లను కేంద్ర జల సంఘానికి పంపినప్పుడు వీటికి అనుమతులు ఇవ్వొద్దని లేఖలు రాసింది. 968 టీఎంసీల కేటాయింపులు తెలంగాణ ప్రభుత్వం తమకు తాము ఆపాదించుకున్న కేటాయింపులని పేర్కొన్నది. పైగా తమ ప్రాజెక్టులకున్న కేటాయింపులు 912 టీఎంసీలని పేర్కొన్నది.

2023లో ఏపీ ప్రభుత్వం కొత్త గోదావరి ట్రిబ్యునల్‌ను వేయమని కేంద్ర ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నది. ఎప్పుడో ఒకప్పుడు కొత్త గోదావరి ట్రిబ్యునల్ ఏర్పాటయ్యే అవకాశం ఉన్నది. ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును గ్రౌండ్ చేసి, వేల కోట్లు ఖర్చు చేసి, ప్రాజెక్టు ద్వారా తరలించే 200 టీఎంసీలను కేటాయించమని కోరితే తెలంగాణ వాటాకు కోత పడుతుంది. ఈ లోపు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల నీటిపై హక్కులు స్థిరపడాలి.

గోదావరి మిగులు జలాలపై హక్కుల స్థిరీకరణ

ఇక రెండవ అంశం: నికర జలాలు పోనూ గోదావరిలో మిగులు జలాలు కూడా ఉంటాయి. కేంద్ర జల సంఘం గత 50 ఏళ్లుగా పోలవరం వద్ద నమోదు చేసిన గేజ్ రీడింగ్స్ ప్రకారం, సగటున ఏటా సుమారు 3 వేల టీఎంసీలు నిరుపయోగంగా సముద్రంలోకి పోతున్నాయి. ఈ మిగులు నీటిపై హక్కు అన్ని రాష్ట్రాలకు ఉంటుంది తప్ప చివరి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు హక్కుభుక్తం కాదు. కృష్ణాలో చివరి రాష్ట్రంగా ఈ మిగులు జలాలను మొత్తంగా వాడుకునే స్వేచ్ఛ ఉండేది. (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఈ స్వేచ్ఛను రద్దు చేసి మిగులు జలాలను కూడా మూడు రాష్ట్రాలకు పంచేసింది). కానీ గోదావరిలో అటువంటి స్వేచ్ఛ లేదు. కేంద్ర జల సంఘం కూడా పి–బి లింకు ప్రాజెక్ట్ ప్రాథమిక నివేదికపై వ్యాఖ్యానిస్తూ, అసలు గోదావరి అవార్డు ప్రకారం గోదావరిలో మిగులు జలాలెన్ని? వాటిలో పరీవాహక రాష్ట్రాల వాటా ఎంత? ఈ సమగ్ర సమాచారం పంపమని ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ హక్కుల లెక్కలు తేలేదాకా పి–బి లింకు నివేదికను ఆమోదించలేమని చెప్పింది. తెలంగాణకు ఇదొక తాత్కాలిక ఊరట. ఈ మిగులు నీటిలో కూడా నికర జలాల నిష్పత్తిలోనే... 1950 టీఎంసీల వాటాను తెలంగాణ డిమాండ్ చేస్తున్నది.

పోలవరం–బనకచర్ల ప్రాజెక్టును అంగీకరించాలంటే గోదావరిలో 968 టీఎంసీల నికర జలాలు, 1,950 టీఎంసీల మిగులు జలాలతోపాటు, పోలవరం నుంచి గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలింపు వల్ల అవార్డుల ప్రకారం కృష్ణాలో సంక్రమించే 157.5 టీఎంసీలు తెలంగాణకు చెందేలా ఏపీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సంతకాలు చేయాలి. అంతదాకా పి–బి ప్రాజెక్టును తెలంగాణ వ్యతిరేకించవలసిందే!

వ్యాసకర్త విశ్రాంత సూపరింటెండింగ్ ఇంజనీర్
మొబైల్: 94910 60585

సోషల్ మీడియా

గట్టి పాఠం



నా కెరీర్ ఇప్పుడు 44 ఏళ్లకు విస్తరించింది. ఇన్నేళ్లలో గట్టిది ఏదైనా ఒకటి నేను నేర్చుకున్నానంటే, అది, ఏదీ ఎప్పటికీ అలాగే ఉండదు. కఠిన క్షణాలు, ఒత్తిళ్లు, ఎదురుదెబ్బలు, ఏవీ ఉండిపోవు. పెద్ద గందరగోళంలో ఉన్నప్పుడు, అది ఎప్పటికీ ముగిసిపోదని అనిపిస్తుంది. కానీ ముగిసి తీరుతుంది. ఒత్తిడి కేవలం మనల్ని చిత్తు చేస్తుందంతే. కానీ ఆ పని నుంచి వైదొలగకుండా, మీరు చేయగలిగినంత అత్యుత్తమంగా చేస్తూ, ఈ పరిస్థితి మారిపోతుందని నమ్మితే చాలు... అలాగే జరుగుతుంది.

– ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త

పెద్ద లోపం



భారతీయ విద్యార్థుల్లో చాలా మందికి గొప్ప టెక్నికల్ స్కిల్స్ ఉంటున్నాయి. కానీ సాఫ్ట్ స్కిల్స్ అసలు ఉండట్లేదు.

– సేవియో రోడ్రిగ్స్, మీడియా పర్సనాలిటీ

అర్థమవుతోందా?



ఒక చైనీస్ వ్యాఖ్యాత: "పాకిస్తాన్‌కు చైనా మద్దతు తాత్కాలిక ఉద్వేగాలపై ఆధారపడి లేదు. దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రణాళిక, జాతీయ ప్రయోజనాలతో ముడిపడి ఉంది. వ్యూహాత్మకంగా చైనా తన వెనక ఉన్నప్పుడు, ప్రాంతీయ ఒత్తిళ్లు (ఇండియా) ఎదుర్కొన్నప్పుడు పాకిస్తాన్ సహజంగానే మరింత ధీమాగా నిలవగలదు."

– సనా హాశ్మీ, ఫెలో

అప్పుడేం జరుగుతుంది?



ఎంత పరిహాసం! మన అత్యంత శక్తిమంతమైన మంత్రులు, అధికారులు భారతీయ యువత జాతి నిర్మాణం పట్ల పట్టుదలగా ఉండాలని చెబుతుంటారు. చూస్తుంటే వాళ్ల పిల్లలకు దేశం మీద తక్కువ విశ్వాసం ఉన్నట్టుంది– అందుకే విదేశీ పౌరసత్వాన్ని తీసుకుంటున్నారు. ఇబ్బందికరమైన అంశం ఏమిటంటే, తల్లిదండ్రులు ఇక్కడ పాలిస్తున్నప్పుడు వాళ్లు ఈ దేశ ప్రయోజనాల కోసం నిలవాలి, వాళ్ల పిల్లలు ఇంకో దేశం తరఫున నిలవాల్సి ఉంటుంది. ఇరు దేశాల మధ్య యుద్ధం తలెత్తినప్పుడు ఈ సంబంధాల డైనమిక్స్ ఎలా పనిచేస్తాయి?

– ఆర్తి టిక్కూ సింగ్, జర్నలిస్ట్

విషాదం



కారు స్టంట్స్ చేస్తుండగా (తమిళ చిత్రం 'వెట్టువమ్' కోసం) మన గొప్ప కార్ జంపింగ్ స్టంట్ ఆర్టిస్ట్ ఎస్.ఎం.రాజు చనిపోయారు. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక! మా స్టంట్ యూనియన్, భారతీయ చిత్ర పరిశ్రమ ఆయన్ని కోల్పోయాయి.

– సిల్వ, స్టంట్ యాక్టర్

తగ్గించు తగ్గించు!



మన పూర్వీకులు కేవలం పండుగలప్పుడు మాత్రమే మిఠాయిలు తిన్నారు. ఏడాదికి ఒకసారి, మహా అయితే మూడుసార్లు! అదే వాళ్లు తిన్న మొత్తం చక్కెర. కానీ మనం పొద్దుట టీ, మరోసారి బిస్కెట్స్‌తో కాఫీ, ప్యాకేజ్డ్ జూస్, చాకొలేట్ ఐస్‌క్రీమ్– అంతా చక్కెరే! ఏం చేస్తున్నాం? రాఖీ పండుగకో, దీపావళికో మాత్రమే పంచదారను పరిమితం చేసుకోవాలి.

– చిరాగ్ బడ్‌జాత్యా, ఆంత్రప్రెన్యూర్

దళితోద్యమ విజయాలు ఎన్నెన్నో!

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

భారత దేశంలో నడిచిన ఉద్యమాల్లో దళితోద్యమానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఉద్యమానికి అంబేడ్కర్ భావజాలమే ప్రధాన ఊపిరి. ఇందులో మేధావులు, కళాకారులు, కవులు, స్త్రీలు, ప్రజలు అంచెలంచెలుగా ఉద్యమంతో కలసి నడిచారు. ఉద్యమం ఒక విశ్వాసాన్ని ప్రజలకు కల్గించింది. స్వాతంత్ర్యోద్యమంలో అంబేడ్కర్, పెరియార్ రామస్వామి నాయకర్ సామాజిక స్పృహను మేల్కొల్పారు. వీటన్నిటి అవగాహనతోనే కారంచేడు, చుండూరు ఉద్యమాలను సాగించడం సాధ్యమయ్యింది.

అంబేడ్కర్ 'మహద్ చెరువు' పోరాట దృక్పథాన్ని అర్థం చేసుకుని సామాజిక, ప్రజాస్వామిక, లౌకిక వాద పోరాటాన్ని న్యాయ సమ్మతమైన పోరాట ధర్మాన్ని స్వీకరించాం. దానిని దళిత ఉద్యమానికి అన్వయించడంతో కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట ఉద్యమాల నిర్మాణం జరిగింది. సిద్ధాంత పరమైన, తాత్త్వికపరమైన అనేక చర్చలు జరిగాయి. అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగ హక్కులు, అనేక సందర్భాల్లో ఆయన ఎదుర్కొని నిలబడిన పోరాట ఘట్టాలు, ప్రభుత్వాన్ని నిలదీయటానికి ఆయన వేసిన ప్రశ్నలు దళిత ఉద్యమానికి ఆయువుగా నిలిచాయి.

ప్రధానంగా హేతువాద ఉద్యమాల నుండి దళిత ఉద్యమంలోకి వచ్చినవారం ఇందులో ఎక్కువగా ఉన్నాం. ఈ ఉద్యమాన్ని అందుకే కుల నిర్మూలనా ఉద్యమంగా నడపగలిగాం. కారంచేడు, చుండూరు, ఇంకా అనేక చోట్ల మాల, మాదిగల మీద దాడులు జరిగినా అన్ని కులాలలో లౌకికవాదులు కలిసి రావటానికి కారణం ఈ ఉద్యమానికి ఉన్న కుల నిర్మూలన సైద్ధాంతిక భావనే. అంబేడ్కర్ ఆలోచనలను కమ్యూనిస్ట్ ఉద్యమాలు కూడా అర్థం చేసుకోవటం ప్రారంభించాయి. అస్పృశ్యులను ఎందుకు ఊరి బయట ఉంచారో అంబేడ్కర్ చెప్పారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోకుండా అస్పృశ్యత కేవలం పేదరిక నిర్మూలన వల్ల పోతుందని కమ్యూనిస్టులు వాదించినందువల్ల అస్పృశ్యతా నివారణ జరక్కపోగా, అది స్వాతంత్ర్యం అనంతరం మరింత జటిలమైంది. అంబేడ్కర్ తీసుకొచ్చిన రిజర్వేషన్ల వల్ల దళితుల్లో చదువు కున్నవాళ్ళు పెరిగారు. రిజర్వేషన్ల వల్ల లాభం పొందినవారు కింది తరగతులను చైతన్యపరిచారు.

కొన్ని గ్రామాల్లో జరిగిన సంఘటనల నుండి ప్రారంభం అయిన దళిత ఉద్యమం రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ



స్థాయికి వెళ్ళింది. దళితులపై దాడులు జరగకుండా ఉండటం కోసం సామాజిక న్యాయ పోరాటాన్ని అన్ని దిశలకు తీసుకెళ్లే పెద్ద ప్రయత్నం జరిగింది. ఇందులో ప్రధానమైన అంశం కుల నిర్మూలనా భావాన్ని విస్తృతం చేయడమే. ఎందుకంటే కులం అనేది కొన్ని వందల సంవత్సరాలుగా సమాజంలో ఘనీభవించింది. అది మెదడులోకి ఇంకిపోయింది. దాని రూపాన్ని మార్చాలి. ఆ మెదడులో ఏర్పడిన నమ్మకం శాస్త్రీయంగా నిజం కాదు. కొందరు ప్రత్యేకంగా ఆ భావాన్ని మెదడులోకి ఇంకించారు. దానికి మత ప్రయోజనాలు ఉన్నాయి.

దళిత ఉద్యమ ప్రభావం వల్ల అంబేడ్కరిజాన్ని చాలా లోతైన విషయంగా కమ్యూనిస్ట్ ఉద్యమాలు గమనించాయి. కేవలం ఆర్థిక పోరాటాలు కుల సమస్యనూ, కుల ఆర్థిక దోపిడీనీ నివారించలేవు అని తెలుసుకున్నారు. నక్సలైట్ ఉద్యమంలో ప్రసిద్ధులైన కేజీ సత్య మూర్తి, బీఎస్ రాములు, వైకే, కంచె ఐలయ్య, ఊసా, ఎంఎస్ గోపి నాథ్, గద్దర్ లాంటి ఎందరో కళాకారులు, మేధావులు, దళిత ఉద్యమంలోకి వచ్చారు. ఇది పెద్ద కీలకమైన పరిణామం. ఈ పరిణామంతో భారతదేశంలో భావజాల చర్చ బలంగా జరిగింది. దానివల్ల కుల నిర్మూలన మీద గొప్ప పరిణామాత్మకమైన చర్చ జరిగింది.

ఈ ఉద్యమాలలో దళిత ఉద్యకారులు ఆ యా సంఘటనల్లో, ప్రధాన ఘట్టాల్లో, బొజ్జ తారకం లాంటి సామాజిక న్యాయవాదులు, ఉద్యమకారులతో కలిసి నడిచారు. అది చాలా విస్తృతమైన తాత్త్విక సామాజిక పరిణామానికి దారి తీసింది. 111 మంది ఎంపీలను ఏకతాటి మీదకు తీసుకు వచ్చిన ఉద్యమం... దళిత ఉద్యమం. అదే సమయంలో ''ద ఎస్సీస్ అండ్ ద ఎస్టీస్ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) ఆక్ట్, 1989''ని అంబేడ్కర్‌కి కొనసాగింపుగా చట్ట రూపంలోకి తెచ్చిన ఉద్యమం... దళిత ఉద్యమం. అలాగే 'రాష్ట్రపతి దళితుడు కావాలి' అనే నినాదాన్ని ప్రయోగాత్మకంగా చేసిన మహోద్యమం కూడా ఇదే. ముగ్గురు ప్రధాన మంత్రులు దళిత బాధితులను స్వయంగా కలసి చర్చలను జరిపిన ఉద్యమం కూడా దళిత ఉద్యమమే. మాజీ ప్రధాన మంత్రి వీపీ సింగ్, రామ్ విలాస్ పాశ్వాన్, శరద్ యాదవ్, వెంకటస్వామి వంటి ఉద్దండులు ఢిల్లీ బోటు క్లబ్‌లో ఉద్యమంలో పాల్గొన్నారు. పార్లమెంటు భవనం ముందు మహా మానవహారం నిర్మించిన మహోద్యమం దళిత ఉద్యమం.

బీసీ ఉద్యమాలు, స్త్రీవాద ఉద్యమాలు, గిరిజన ఉద్యమాలు, ఉపకుల ఉద్యమాలు ఎన్నో దళిత ఉద్యమ ప్రేరణతో వచ్చాయి. భావ జాల చర్చతో పాటు ఆచరణాత్మకమైన కార్యక్రమం నిర్మాణం జరిగింది. ప్రత్యామ్నాయ భావజాల ఉద్యమాన్ని సాహిత్యాన్ని దళిత ఉద్యమం ముందుకు తీసుకువచ్చింది. నీతి, నిజాయతీ, ఆచరణ, కార్యాచరణ, నిరంతర ఆధునీకరణలు దళిత ఉద్యమ గమనంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దళిత ఉద్యమం పేదరిక నిర్మూలనను, కుల నిర్మూలనను పరస్పర సంబంధితాలుగా భావించింది. కుల నిర్మూలనతో పాటు ఆర్థిక స్వావలంబన కోసం కూడా కృషి చేసింది.

ప్రభుత్వం కూడా ఉద్యమస్ఫూర్తితో దళితుల చైతన్యాన్ని అవగాహన చేసుకునే పరిస్థితులు వచ్చాయి. దళితుల్లో కళాకారులు, కవులు, ఉపన్యాసకులు, నిర్మాణ కర్తలు, ఆర్గనైజర్లు రూపొందారు. వీరికి అంబేడ్కర్, మహాత్మా పూలే, బుద్ధుడు వంటివారి భావధారలే బలం.

అంబేడ్కరిజం సత్యం అనే పునాది మీద నిలబడి మాట్లాడగల్గే ధైర్యంతో నాలుగు దశాబ్దాల్లో కొన్ని లక్షల మందిని తీర్చిదిద్దింది. దళిత మహిళలు భూ పోరాట ఉద్యమాలను నడిపారు. యువకులు క్రమశిక్షణ కల్గిన సైనికులుగా రూపొందారు. మేధావులు ఎన్నో పరిశోధనల ద్వారా భారత దేశ పునఃనిర్మాణానికి పూనుకున్నారు. నాలుగు దశాబ్దాల దళిత ఉద్యమ ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకొని సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, తాత్త్విక ప్రత్యామ్నాయ నిర్మాణానికి అందరం పూనుకోవాల్సిన సందర్భంలో ఉన్నాం. ఈ జూలై 17 నాటికి కారంచేడు ఉద్యమం ప్రారంభమై 40 ఏళ్ళు! చుండూరు ఉద్యమం 1991లో జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నాటికి ఈ సందర్భంగా ఒక పెద్ద మహాసభ జరిపి భవిష్యత్తు కార్యాచరణ మీద విస్తృతమైన చర్చ చేయాలనేది ఆలోచన. ఈ చర్చలు ఒక శతాబ్ది కాలానికి దిక్సూచి అవ్వాలి. అంబేడ్కర్ ఇచ్చిన స్ఫూర్తి కొన్ని తరాలు, యుగాలకు ఊపిరిగా నిలుస్తుంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో వేలు, లక్షల మంది ఉద్యమంతో కలిసి నడిచారు. ఇది ఏ ఒక్కరో నడిపిన ఉద్యమం కాదు. ఇది సమూహ ఉద్యమం.


ఉద్యమం ఒక అనంత ప్రయాణం. అది ఆగదు. భవిష్యత్తు కార్యాచరణలు కాలానుగుణంగా రూపొందించి ముందుకు నడవాలి. ఇది అంబేడ్కర్ బాట. దీనికి నిరంతర కార్యాచరణే ఊపిరి. ఆ దిశగా నడుద్దాం. అందరం ఏకమై మహా సంఘటిత శక్తిగా నడుద్దాం. ప్రతి ఒక్క దళిత బహుజనుడు ఉద్యమకారుడే. అంబేడ్కర్ ఆలోచన విధానమే దళిత ఉద్యమానికి స్ఫూర్తి.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695
(జూలై 17 నాటికి కారంచేడు ఉదంతానికి 40 ఏళ్లు.)

వైరభావ కారణం

సాధారణంగా లోకంలో... రామాయణంలోని మంథర కపట స్వభావం గలది అనీ, భరతుని కంటే కూడా రామునిపై ఎక్కువ పుత్ర ప్రేమను చూపించే కైకేయి మనసును విరిచి, రాముడిని వనవాసానికి పంపేటట్లు చేసిందనీ ఆమె పాత్ర స్వభావం గురించి ఒక విశ్లేషణ ఉంది. కానీ, అధ్యాత్మ రామాయణంలో, రామావతార పరమార్థం నెరవేరటానికి సరస్వతీ దేవి ప్రేరణతో ఆమె అలా వైరభావం ప్రదర్శించినట్లు తెలుస్తున్నది.

రామ పట్టాభిషేక వార్త విని, కౌసల్యా దేవి ఈ శుభకార్యం నిర్విఘ్నంగా జరగాలని లక్ష్మీదేవిని పూజించింది, దుర్గాదేవిని పూజించింది. అయినా ఆమె మనసులో కించిత్ వ్యాకులత ఉందిట. జరగబోయేది ముందుగానే సూచనగా తెలుస్తున్నది ఆమెకు. అప్పుడు దేవలోకంలో దేవతలంతా కలిసి, వాగ్దేవి సరస్వతిని ప్రేరేపించారు: 'నీవు భూలోకంలో అయోధ్యా నగరానికి వెళ్లు. రామ రాజ్యాభిషేకానికి విఘ్నం కలగజేయటానికి యత్నించు. ముందు మంథర మనసులో ప్రవేశించి, ఆమెలో వ్యతిరేక భావం కలిగించు. తర్వాత కైకేయిలో ప్రవేశించి ఆ విధంగానే చెయ్యి. రామ రాజ్యాభిషేకం ఆగిపోతే గానీ, రామావతార పరమార్థం నెరవేరదు,' అని చెప్పారు. సరస్వతి దేవి సరేనని బయలుదేరింది. అయోధ్యా నగరం చేరి మంథర మనసులో ప్రవేశించింది.



జ్యోతిర్మయం

కైకేయితో మంథర 'నీకు గొప్ప ఉపద్రవం రాబోతోంది. రేపు రామునికి పట్టాభిషేకం జరగబోతోంది' అంది. కైకేయి సంతోషంతో దివ్యమైన మణి నూపురాన్ని మంథరకు బహుమతిగా ఇచ్చింది. సరస్వతీ దేవి ప్రేరణతో మంథర... కైకేయి మనసు బాధ పడేట్లు, రామ పట్టాభిషేకం జరిగితే కౌసల్యకు దాసిలా ఉంటావని చెపుతుంది. ఆ మాటల ప్రభావంతో కైకేయి మనసులో మార్పు వచ్చి, కోప గృహంలో చేరింది. తర్వాత రాముడు అరణ్యవాసానికి వెళ్లడం, సీతాపహరణం, రావణ సంహారం... ఇలా ఎన్నో ఘట్టాల్లో రాముడు తాను నిర్వర్తించాల్సిన సకల కార్యాలను నిర్వర్తించాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

కల్లు కాంపౌండ్లపై ఆకస్మిక దాడులు

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కల్లు కాంపౌండ్లపై ఆకస్మిక దాడులకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కార్యాచరణ ప్రారంభించింది. స్టేట్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్), జిల్లా టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్), ఎక్సైజ్ శాఖ సిబ్బంది సమన్వయంతో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు వారం రోజుల పాటు ఈ దాడులు నిర్వహిస్తోంది. ఇటీవలి కల్తీ ఘటనల నేపథ్యంలో.. కల్లు కాంపౌండ్ల నుంచి నమూనాలను సేకరిస్తున్న ఎక్సైజ్ శాఖ మరోమారు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. డ్రైవ్‌లో భాగంగా కల్లు దుకాణాల్లో అమ్ముతున్న కల్లును ఎక్కడి నుంచి సేకరిస్తున్నారు?, కల్తీ కల్లు వస్తోందా? కల్తీ దందాలో సిండికేట్‌లు పనిచేస్తున్నాయా? అసలు కల్లు కాంపౌండ్లన్నిటికీ లైసెన్సులున్నాయా? తదితర అంశాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టి సారించనుంది. దీంతో పాటు అన్ని కాంపౌండ్ల నుంచి నమూనాలను సేకరించి పరీక్షించాలని, కల్తీ కల్లు అని తేలితే.. కేసులు నమోదు చేయడంతో పాటు దుకాణాలను సీజ్ చేసేలా ఈ డ్రైవ్‌లో చర్యలుంటాయని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

ఎవరినీ ఉపేక్షించం

కల్లు కాంపౌండ్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి. అమ్మే కల్లులో నిషేధిత పదార్థాలు కలిపినా, కల్తీ చేసినా కఠినంగా వ్యవహరిస్తాం. లైసెన్సు లేకుండా కల్లు అమ్మడం నేరం. ఎక్సైజ్ బృందాల పరిశీలనలో ఇది తేలితే కేసులు నమోదు చేస్తాం. – షానవాజ్ ఖాసిం, డైరెక్టర్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్

కల్తీకల్లు ఘటనలో మరొకరి మృతి


- 'గాంధీ'లో చికిత్స పొందుతూ గంగమ్మ మృతి


గంగమ్మ

లక్డీకాపూల్/కేపీహెచ్‌బీకాలనీ (హైదరాబాద్): కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మరొకరు మృతి చెందారు. దీంతో మరణాల సంఖ్య తొమ్మిదికి చేరింది. హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవనం సాగించే హైదర్‌నగర్‌కు చెందిన పుట్టి గంగమ్మ (40) కల్లు తాగి అనారోగ్యానికి గురైంది. వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న ఆమె ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందినప్పటికీ.. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో ఈ నెల 11న గాంధీ ఆస్పత్రిలో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి కన్నుమూసింది. కాగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న 36 మంది బాధితుల్లో ఏడుగురి ఆరోగ్యం కుదుటపడటంతో.. సోమవారం వారందరినీ డిశ్చార్జి చేశారు. దీంతో డిశ్చార్జి అయిన వారి సంఖ్య 20కి చేరింది. మిగిలిన 23 మంది బాధితులకు నిరంతర వైద్య పర్యవేక్షణలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్టు నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ సోమవారం ఒక హెల్త్ బులెటిన్‌లో పేర్కొన్నారు.

శ్రీశైలం ఆనకట్ట వద్ద జవాన్ అదృశ్యం

విధుల్లో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు కుటుంబసభ్యులకు ఫోన్


నవీన్

దోమలపెంట: శ్రీశైలం ఆనకట్ట వద్ద భారత ఆర్మీ జవాన్ ఒకరు అదృశ్యమైనట్లు ఈగలపెంట ఎస్‌ఐ కాటం జయన్న తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఆనకట్ట ఘాట్ రోడ్డు మలుపు వద్ద ఆగిఉన్న ఒక కారును పోలీసులు గుర్తించారన్నారు. కారు వదిలేసి వెళ్లిన వ్యక్తి బంధువులు తమకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. అదృశ్యమైన వ్యక్తి పేరు ఎం.నవీన్ (28) అని.. ఉమ్మడి వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిరిపురం గ్రామస్తుడని గుర్తించామని తెలిపారు. ఆయన ఆర్మీలో ఆరేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలతో వెళ్లిపోతున్నట్లు నవీన్ ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారన్నారు. కాగా, పోలీస్ సిబ్బంది కృష్ణా నది తీరం వెంట గాలిస్తూ.. జవాన్ కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఆయా ప్రాంతాల్లోని మత్స్యకారులకు సూచించారు.

తేజేశ్వర్ హత్య కేసులో మరో ట్విస్టు

- బాధితుడి పడక గదిలో స్పై కెమెరా

గద్వాల క్రైం: జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రానికి చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో మరో ట్విస్టు బహిర్గతమైంది. హత్య కేసులో ప్రధాన నిందితులైన తిరుమలరావు ఏ–1, కుమ్మరి నాగేష్ ఏ–3, చాకలి పరశురాముడు ఏ–4, చాకలి రాజు ఏ–5లను ఈ నెల 10న విచారణాధికారి శ్రీను.. కోర్టు అనుమతితో 3 రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని వివరాలు సేకరించారు. వాయిస్ మెసెంజర్‌తో గొంతు మార్చి మాట్లాడినట్లు ఇది వరకే బయటపడగా.. తాజాగా మరో ట్విస్టు బయటపడింది. తేజేశ్వర్ – సహస్రల మధ్య ఎలాంటి కలయిక ఉండరాదనే ఉద్దేశంతో స్పై కెమెరాను కొనుగోలు చేసి తేజేశ్వర్ బెడ్‌రూంలో ఏర్పాటు చేశారు. తిరుమలరావు నిత్యం వారి కదలికలను కెమెరా ద్వారా గమనించాడు. కొత్త ట్విస్టు వెలుగులోకి రావడంతో.. సహస్రను కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు పీటీ వారెంట్‌ను కోర్టుకు సమర్పించారు. ఏ–2 సహస్రను కస్టడీలోకి తీసుకుంటే పూర్తి వివరాలు తెలుస్తాయని గద్వాల సీఐ శ్రీను వెల్లడించారు.



తడారిన నారుమడి

బూర్గంపాడు: వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు లేకపోవడమే కాక.. ఐదు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. దీంతో నాట్లకు సిద్ధంగా ఉన్న వరి నారు ఎండిపోతోంది. ఈ నేపథ్యాన నారును కాపాడుకునేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం గొమ్మూరుకు చెందిన రైతు మద్దిబోయిన నర్సయ్య సోమవారం ట్యాంకర్‌తో నీరు అందించాడు.



ఒక్కసారన్నా వచ్చిపోయే..

మేఘాల చాటున దాగి దోబూచులాడుతున్న వానమ్మను రమ్మని వేడుకుంటున్నాడు రైతన్న. వరి కోతల సమయంలో వద్దన్నా కురిసి కడుపుకోత మిగిల్చిన వాన.. ఇప్పుడు రమ్మన్నా రావట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండే ఎండల్లో వానాకాలం తలపించేలా కురిసిన వానలతో ఈసారి ముందస్తుగా వరుణుడు కరుణించాడంటూ సంబురంగా విత్తనాలు నాటుకొని ఖరీఫ్ నాట్లకు సన్నద్ధమయ్యారు రైతులు. అప్పుడు కురిసిందే తప్ప ఇప్పటికీ చినుకు రాలక మొలకెత్తిన విత్తనాలు ఎండిపోతూ రైతన్న దిగాలు చెందుతున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



101 బండ్లు.. 1,001 బిందెలు

వరుణదేవా.. కరుణించవా.. అంటూ సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని పల్లెపాడు గ్రామానికి చెందిన ప్రజలు 101 బండ్లు కట్టి.. కృష్ణానది వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నది ఒడ్డున దేవతామూర్తులను కొలుస్తూ.. బొడ్డెమ్మలు వేశారు. భక్తి గీతాలతో నృత్యాలు చేశారు. ఆ తర్వాత ఊరేగింపుగా 1,001 బిందెలతో నీటిని తీసుకొచ్చి.. గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకం చేశారు. ఐదేళ్లుగా కృష్ణానది నీటిని తెచ్చి శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం అధ్యక్షుడు సత్యారెడ్డి తెలిపారు. – మానవపాడు (జోగుళాంబ గద్వాల జిల్లా)

కాంగ్రెస్ అంటేనే ప్రాజెక్టులు

- శ్రీశైలంపై లిఫ్టులు నిర్మిస్తుంటే బీఆర్‌ఎస్ పట్టించుకోలేదు
- ఆ ప్రభుత్వం చేసిన తప్పులు మేం సరి చేస్తున్నాం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి
- ఎన్నెస్పీ రెండో జోన్‌కు నీరు విడుదల


చేపలు పరిశీలిస్తున్న భట్టి, పొంగులేటి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం, విద్యుత్, బహుళార్థ సాధక ప్రాజెక్టులని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే నిర్మితమయ్యాయని చెప్పారు. శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 11 టీఎంసీలు తరలించుకునేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలు (లిఫ్టులు) నిర్మిస్తుంటే అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డుకోలేదని విమర్శించారు. ఈ నిర్మాణాలతో ఖమ్మం, నల్లగొండ జిల్లా రైతులకు ఇబ్బంది ఎదురవుతుందని తాము గతంలోనే చెప్పామన్నారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తే ఆ తప్పిదాలను తాము సరిచేస్తున్నామని, కానీ ఆ పార్టీ నేతలు తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ నుంచి సోమవారం ఎన్నెస్పీ రెండో జోన్‌కు సాగునీరు విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడారు.

వేగంగా ప్రాజెక్టుల నిర్మాణం

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా నది నుంచి వీలైనంత మేర నీటిని తరలించేందుకు వేగంగా ప్రాజెక్టులను చేపడుతోందని భట్టి తెలిపారు. జూరాల, నెట్టెంపాడు, కొడంగల్ లిఫ్టుల ద్వారా ఎక్కువ నీటిని ఉపయోగించుకునేలా తమ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, పాలమూరు–రంగారెడ్డి, ఎస్‌ఎల్‌బీసీ వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు కొత్తగా నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టును నిర్మిస్తున్నామని చెప్పారు.

చేపల బేరం ఎలా ఉంది?

పాలేరు రిజర్వాయర్ సమీపంలో చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులతో మంత్రులు మాట్లాడారు. ఏయే రకాల చేపలు లభిస్తున్నాయి? బేరాలు ఎలా ఉన్నాయి? జీవనోపాధి ఎలా ఉందంటూ ఆరా తీశారు. ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయా? ఇంకా ఏమైనా కావాలా? అని ప్రశ్నించగా చేపల విక్రయానికి షెడ్లు నిర్మించాలని మత్స్యకారులు కోరడంతో, పొంగులేటి సానుకూలంగా స్పందించారు.

5 రోజుల్లో పూర్తి సామర్థ్యంతో విడుదల

నాగార్జునసాగర్ రెండో జోన్ ఎడమ కాల్వకు ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. క్రమంగా పెంచుతూ ఐదు రోజుల్లో పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో 'బిందె' సేద్యమా?

- ఎక్స్ వేదికగా సీఎంను ప్రశ్నించిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కాలం కాటేయడం లేదని, కాళేశ్వరం నీళ్లను ఎత్తిపోయకుండా కాంగ్రెస్ సర్కార్ కాటేస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మంచినీళ్ల కోసం ఆడబిడ్డలు బిందెలు పట్టుకుని అడుగు బయటపెట్టొద్దని కేసీఆర్ సంకల్పిస్తే.. చివరికి బిందెలతో నీరు తెచ్చుకుని.. వరినారు కాపాడుకునే పరిస్థితి కల్పిస్తావా సీఎం రేవంత్‌రెడ్డీ అని ఎక్స్ వేదికగా సోమవారం ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో 'బిందె'సేద్యం తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదిన్నరగా మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు మరమ్మతు చేయడం మీకు చేతకావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం దేవుడెరుగు.. తాగునీటితోపాటు సాగునీటికి కూడా బిందెలు మోస్తున్న ఈ ఆడబిడ్డల బాధలు తీర్చే సోయి ఈ సీఎంకు ఎప్పుడొస్తుందో అని అన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోసి సాగునీరు ఇచ్చే అవకాశమున్నా, కాంగ్రెస్ సర్కార్ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. గురుకుల హాస్టల్లో విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

53 మంది విద్యార్థినులకు అస్వస్థత

- గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 35 మంది..
- మర్రిగూడలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో 18 మంది..
- చికిత్స పొందుతున్న బాలికలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

దేవరకొండ/మర్రిగూడ: నల్లగొండ జిల్లాలో సోమవారం వేర్వేరు ప్రభుత్వ విద్యాసంస్థల్లో 53 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలోని దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థినులు రాత్రి భోజనానంతరం కడుపునొప్పితో విలవిల్లాడారు. అలాగే, మర్రిగూడలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో 18 మంది విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులతో ఇబ్బందిపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 310 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం స్నాక్స్‌లో భాగంగా విద్యార్థినులకు వేయించిన బొబ్బెర్లు పెట్టారు. రాత్రి భోజనంలో చికెన్ వడ్డించారు. రాత్రి భోజనం అనంతరం కొంతమంది విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సోమవారం ఉదయం అల్పాహారంలో భాగంగా పులిహోర అందించారు. ఇది తిన్న అనంతరం కొద్దిసేపటికే 35 మంది విద్యార్థినులు కడుపునొప్పి, విరోచనాలతో బాధపడ్డారు. పాఠశాల సిబ్బంది వీరిని సమీపంలోని రెండు ఆరోగ్య కేంద్రాలకు తరలించి వైద్యం అందించారు. దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి ఆస్పత్రికి చేరుకొని ఆరా తీశారు. పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా వసతి గృహం వద్దకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వసతిగృహంలో ముగ్గురు మెడికల్ ఆఫీసర్లను అందుబాటులో ఉంచి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు.

'ఆదర్శ'హాస్టల్‌లో 18 మంది..

మర్రిగూడలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో 18 మంది విద్యార్థినులు సోమవారం కడుపునొప్పి, వాంతులతో బాధపడ్డారు. ఫుడ్ పాయిజన్ అయి ఉండవచ్చని భావించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని పిల్లల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో ఇంటి నుంచి పేరెంట్స్ తెచ్చిన భోజనాన్ని పిల్లలు తిన్నారని, అందువల్లనా లేదా మరేదైనా కారణమా అనేది తెలియాల్సి ఉందని వార్డెన్ చెప్పారు.

పాఠశాల భవనంపైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

- తూప్రాన్‌పేట బాలికల గురుకుల పాఠశాలలో ఘటన


సంధ్య

చౌటుప్పల్ రూరల్/మల్దకల్: తల్లిదండ్రులను వదిలి ఉండడం ఇష్టం లేకనో.. మరే కారణమో.. ఉజ్వల భవిష్యత్ ఉన్న ఓ విద్యార్థిని తనువు చాలించింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఊరబావి సంధ్య (11) సోమవారం తెల్లవారుజామున పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం విఠలాపురం గ్రామానికి చెందిన ఊరబావి పరుశరాములు–జయమ్మ దంపతుల చిన్న కుమార్తె సంధ్య (11) తూప్రాన్‌పేటలోని బాలికల బీసీ గురుకుల పాఠశాలలో ఈ ఏడాది 5వ తరగతిలో సీటు పొందింది. ఈనెల 5న తల్లిదండ్రులు ఆమెను పాఠశాలలో చేర్చారు. కొద్దిరోజులకే బెంగపెట్టుకోవడంతో వారం క్రితం ఇంటికి తీసుకెళ్లి 13న తిరిగి పాఠశాలలో చేర్చి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం హాస్టల్‌లో సంధ్య కనిపించకపోవడంతో భవనం చుట్టుపక్కల వెతుకుతుండగా.. హాస్టల్ వెనుక భాగంలో రాళ్లపై పడి ఉంది. అప్పటికే మరణించడంతో ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేకనే భవనం నాలుగో అంతస్తు నుంచి దూకి పారిపోవడానికి ప్రయత్నించిందని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. సంధ్య మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యార్థిని ఆత్మహత్య నేపథ్యంలో బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల జాయింట్ సెక్రటరీ శ్యాంప్రసాద్ తూప్రాన్‌పేట గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులతో చర్చించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

మూడేళ్ల బాలికపై పిచ్చి కుక్క దాడి


సిరి తన్విక

పాలకుర్తి టౌన్: మూడేళ్ల చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మిడిలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన మైదం సురేష్, పావని దంపతులకు మూడేళ్ల కూతురు సిరి తన్విక ఉంది. బాలిక సోమవారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా.. ఒక్కసారిగా పిచ్చికుక్క దాడి చేసి పారిపోయింది. చిన్నారి చెంపపై తీవ్రగాయం కావడంతో.. తండ్రి పాలకుర్తిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో జనగామలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు.

ఏ కుక్క అయితేనేం.. కాట్లు కామనే!

- పెరుగుతున్న కుక్క కాట్లు
- లోకల్ సర్కిల్స్ సర్వే నివేదికలో వెల్లడి

వివరాలు సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

వైద్యుల కాపురంలో 'బుట్టబొమ్మ' చిచ్చు

- రీల్స్‌చేసే అమ్మాయితో డాక్టర్ ప్రేమాయణం
- ఇంట్లో తెలియడంతో భార్యాభర్తల మధ్య గొడవ
- వైద్యురాలు అనుమానాస్పద మృతి
- పోలీసుల అదుపులో భర్త


ప్రత్యూష


సృజన్

హసన్‌పర్తి: భార్యాభర్తలిద్దరూ డాక్టర్లు. ఆమె డెంటిస్ట్, అతను ప్రముఖ కార్డియాలజిస్టు. సంతోషంగా సాగుతున్న వీరి కుటుంబంలో ఇన్‌స్టా, ఫేస్‌బుక్ 'రీల్స్'గర్ల్ చిచ్చుపెట్టింది. బుట్టబొమ్మ అనే ఐడీతో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రీల్స్, వివిధ వ్యాపారాల ప్రమోషన్లు చేసే అమ్మాయితో డాక్టర్ ప్రేమలో పడ్డాడు. విషయం భార్యకు తెలియడంతో ఆ కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. చివరికి వైద్యురాలు అనుమానాస్పదంగా మృతిచెందింది. ఈ సంఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోని కాకతీయ వెంటేజ్‌లో సోమవారం వెలుగులోకి వచ్చింది. మృతురాలి తల్లి పద్మావతి సోమవారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కూతురు మృతిపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ నగరంలోని మట్టెవాడకు చెందిన తంజావూరి పద్మావతి కూతురు ప్రత్యూష (35) నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డెంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2017లో ప్రత్యూషను ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన వైద్యుడు అల్లాడి సృజన్‌కు ఇచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం సృజన్ నగరంలోని పలు ఆస్పత్రుల్లో గుండె వైద్యనిపుణుడిగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు. దంపతులు హసన్‌పర్తిలోని కాకతీయ వెంటేజ్‌లో ఓ విల్లా ఖరీదు చేసి నివాసం ఉంటున్నారు.

వీరి కాపురంలో 'బుట్టబొమ్మ'ప్రవేశం..

సృజన్ పనిచేసే ఓ ఆస్పత్రికి సంబంధించిన ప్రమోషన్ సమయంలో 'బుట్ట బొమ్మ'అనే ఐడీతో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో రీల్స్ చేసే శ్రుతిరాజ్ అనే యువతి అతనికి పరిచయమైంది. ఆ ఆస్పత్రికి ఆ యువతి ప్రమోషన్ రీల్స్ చేసింది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె చేసే రీల్స్ డాక్టర్ సృజన్‌ను ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో రోజూ ఇరువురూ మాట్లాడుకోవడం.. తరచూ కలవడంతో దగ్గరయ్యారు. పీకల్లోతు ప్రేమలో కూరుకుపోయారు. ఇటీవల ప్రత్యూష రెండవ కాన్పు సమయంలో తల్లిగారింటికి వెళ్లినప్పుడు శ్రుతి రాజ్ విల్లాకు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం భార్య ప్రత్యూష, ఆమె కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో తరచూ సృజన్, ప్రత్యూష మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రత్యూష ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, తన కూతుర్ని హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తల్లి పద్మావతి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రత్యూష మృతిపై అనుమానాలు ఉన్నాయని, భర్త డాక్టర్ సృజన్, అత్తామామలు పుణ్యవతి– మధుసూదన్‌తోపాటు బానోతు శ్రుతిరాజ్‌లపై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. వైద్యుడు సృజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ప్రత్యూష మృతదేహానికి ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం

- లూప్‌లైన్‌లో ఉన్న హిసార్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో చెలరేగిన మంటలు
- ఒక బోగీ పూర్తిగా దగ్ధం
- పక్క లైనులో ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ పవర్ కార్‌కు వ్యాప్తి
- వెంటనే అప్రమత్తమై మంటలను అదుపుచేసిన భద్రత, అగ్నిమాపక సిబ్బంది
- తప్పిన పెను ముప్పు


మంటల్లో కాలిపోతున్న రైలు బోగీ

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుపతి రైల్వేస్టేషన్‌లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. ఒక బోగీ పూర్తిగా దగ్ధమైంది. హరియాణ నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు తిరుపతికి చేరుకున్న హిసార్–తిరుపతి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు (04717) ప్రయాణికులను దించిన అనంతరం లూప్‌లైన్‌లోకి వెళ్లింది. తిరిగి ఈ రైలు రాత్రి 11.40గంటలకు బయలుదేరాల్సి ఉంది. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఒక్కసారిగా ముందు భాగంలోని జనరల్ బోగీలో అగ్నిప్రమాదం సంభవించింది. క్షణాల్లో మంటలు భారీగా చెలరేగి పక్కనే మరో లూప్‌లైన్‌లో ఆగిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌కు అనుబంధంగా ఉన్న పవర్ కార్ (జనరేటర్)కు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ పవర్ కార్‌కు తాకిన మంటలను సకాలంలో అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. మొత్తం 23 బోగీలతో ఉన్న హిసార్–తిరుపతి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్ వెనుక ఉన్న ఒక జనరల్ బోగీలో తొలుత పొగ, మంటలు వచ్చినట్లు గుర్తించారు. ఆ బోగి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదం కారణంగా తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 15 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది. అగ్నిప్రమాదంపై విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తిరుపతి రైల్వేస్టేషన్ మేనేజర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని చెప్పారు. కాగా, అధిక ఉష్ణోగ్రత వల్లే రైలు బోగీలో మంటలు చెలరేగినట్లు తిరుపతి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రమణయ్య తెలిపారు. సోమవారం తిరుపతిలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉందని పేర్కొన్నారు.


ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములకు వీడ్కోలు పలుకుతున్న శుభాంశు శుక్లా తదితరులు


డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్‌లో సహచరులతో భూమికి తిరిగొస్తున్న శుభాంశు శుక్లా

ఐఎస్ఎస్ నుంచి ఘనంగా వీడ్కోలు

ఐఎస్ఎస్‌లోని ఏడుగురు సహచర వ్యోమగాములు శుభాంశు బృందానికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆ సందర్భంగా పరస్పర కౌగిలింతలు, కరచాలనాలు ముగిసిన అనంతరం వాతావరణం ఉద్వేగపూరితంగా మారింది. 18 రోజుల పాటు కలిసి గడిపిన క్షణాలను అందరూ ఆనందంగా నెమరేసుకున్నారు. ముఖ్యంగా శుభాంశు రుచి చూపిన క్యారెట్, పెసర పప్పు హల్వాను ఎన్నటికీ మర్చిపోలేమని సహచరులు చెప్పుకొచ్చారు.

శుభాంశు బృందం ఐఎస్ఎస్‌లో 18 రోజులు గడిపింది. ఆ క్రమంలో 60 కీలక ప్రయోగాలు చేపట్టింది. అంతరిక్షంలో జీరో గ్రావిటీ పరిస్థితుల్లో మానవ కండరాలకు కలిగే నష్టంపై శుక్లా అధ్యయనం చేశారు. మానవ జీర్ణవ్యవస్థ ఖగోళంలో ఎలా పని చేస్తుందనే అంశంపై భారత విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక వీడియోను ఆయన రూపొందించారు. దాంతోపాటు నలుగురు వ్యోమగాముల బృందం తమ మానసిక స్థితిగతులపైనా ప్రయోగాలు చేసి చూసింది. ఆ క్రమంలో ఫ్లోటింగ్ వాటర్ బబుల్ తయారు చేసి అందులో గడిపింది. అది అద్భుతమైన అనుభవమని శుభాంశు గుర్తు చేసుకున్నారు. ''ఐఎస్ఎస్‌లో ప్రతి క్షణాన్నీ పూర్తిగా ఆస్వాదించా. ముఖ్యంగా కిటికీ పక్కన కూచుని కిందకు చూడటాన్ని. బహుశా నా జీవితంలోకెల్లా అత్యంత అద్భుతమైన అనుభూతి అది'' అని చెప్పారు. అంతరిక్షంలో వ్యవసాయం దిశగా కూడా వ్యోమగాములు పలు కీలక పరీక్షలు జరిపారు.

ఫ్లోటింగ్ వాటర్ బబుల్
ఐఎస్ఎస్‌లో 60కి పైగా ప్రయోగాలు

76 లక్షల మైళ్లు.. 288 భూ ప్రదక్షిణలు

శుభాంశు బృందం ఐఎస్ఎస్‌లో గడిపిన 18 రోజుల్లో భూమి చుట్టూ ఏకంగా 76 లక్షల మైళ్లకు పైగా ప్రయాణించింది. ఆ క్రమంలో 288 సార్లు భూప్రదక్షిణలు చేసింది.

నీ రాక కోసం...

శుభాంశు ఆగమనం నేడే • అంతరిక్ష యాత్ర దిగ్విజయం

- 18 రోజుల పాటు ఐఎస్ఎస్‌లో
- భూమికి బయల్దేరిన డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్
- 22 గంటల సుదీర్ఘ ప్రయాణం
- మధ్యాహ్నం 3.01కు పసిఫిక్ జలాల్లో ల్యాండింగ్
- వైద్యపరీక్షలు, అనంతరం వారం రోజుల క్వారంటైన్

వాషింగ్టన్: అంతరిక్షంలో భారత కీర్తిపతాకను సమున్నతంగా ఎగరేసిన మన ముద్దుబిడ్డ శుభాంశు శుక్లా నింగి నుంచి సగర్వంగా నేలకు తిరిగొస్తున్నాడు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అడుగుపెట్టిన తొలి భారతీయునిగా చెరిగిపోని రికార్డును తన పేరిట లిఖించుకున్న శుభాంశు.. మరో ముగ్గురు సహచర వ్యోమగాములతో కలిసి అక్కడ రెండున్నర వారాలకు పైగా గడిపిన విషయం తెలిసిందే. స్పేస్ఎక్స్ డ్రాగన్ 'గ్రేస్' వ్యోమనౌక భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4.45 గంటలకు శుభాంశు బృందాన్ని తీసుకుని భూమికి తిరుగు ప్రయాణమైంది. 22 గంటల 15 నిమిషాలకు పైగా ప్రయాణించిన అనంతరం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీర సమీపంలో పసిఫిక్ మహాసముద్ర జలాల్లో దిగనుంది. ఆ వెంటనే వారికి వైద్యపరీక్షలు నిర్వహించి క్వారంటైన్‌కు తరలిస్తారు. అంతరిక్షంలోని సూక్ష్మ గురుత్వాకర్షణ పరిస్థితుల నుంచి నుంచి భూ వాతావరణానికి అలవాటు పడేదాకా శుభాంశు బృందాన్ని వారం రోజుల పాటు ఏకాంతంలో ఉంచుతారు. వైద్య పరీక్షలు తదితరాలు నిర్వహించిన అనంతరం వారు బయటి ప్రపంచంలోకి అడుగు పెడతారు. ఈ నేపథ్యంలో శుభాంశు రాక కోసం దేశమంతా నిలువెల్లా కనులు చేసుకుని ఆనందోత్సాహాలతో ఉత్కంఠగా వేచిచూస్తోంది.

తిరిగొచ్చేది ఇలా...

నాసా, ఇస్రో సంయుక్తంగా చేపట్టిన యాగ్జియం-4 మిషన్‌లో భాగంగా భారత వ్యోమగామి, వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశుతో పాటు పెగ్గీ వాట్సన్ (అమెరికా), స్లావోజ్ ఉజ్నాన్స్కీ విస్నియెవ్స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) జూన్ 25న ఐఎస్ఎస్‌కు బయల్దేరడం తెలిసిందే. దాదాపు 28 గంటల ప్రయాణం అనంతరం వారు 26న విజయవంతంగా ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. అక్కడ 18 రోజులు (443 గంటలు) గడిపారు. ఆ క్రమంలో 60 కీలక ప్రయోగాలు చేశారు.

- సోమవారం సాయంత్రం షెడ్యూల్ కంటే 10 నిమిషాలు ఆలస్యంగా సాయంత్రం 4.45 గంటలకు శుభాంశు బృందం తిరుగు ప్రయాణం మొదలైంది.
- అంతకు రెండు గంటల ముందు వారు ఐఎస్ఎస్ నుంచి ఒకరి తర్వాత ఒకరుగా డ్రాగన్ వ్యోమనౌకలోకి ప్రవేశించారు. నలుగురూ స్పేస్ సూట్లు ధరించాక వ్యోమనౌకను ఐఎస్ఎస్‌తో అనుసంధానించే హాచ్‌ను మధ్యాహ్నం 2.37కు విజయవంతంగా మూసేశారు.
- తర్వాత ప్రయాణానికి తుది సన్నాహాలు దాదాపు రెండు గంటల పాటు సాగాయి. అంతరిక్షం నుంచి భూ వాతావరణంలోకి ప్రవేశించే క్షణాల్లో విపరీతమైన రాపిడికి పుట్టుకొచ్చే 1,600 డిగ్రీ సెల్సియస్ వేడిని తట్టుకునేందుకు స్పేస్‌క్రాఫ్ట్‌కు బిగించిన హీట్ షీల్డ్‌ను సరిచూడటం వంటివి పూర్తయ్యాక డ్రాగన్ ముందు భాగాన్ని ఐఎస్ఎస్ నుంచి విడదీశారు.
- అనంతరం సాయంత్రం 4.45కు వ్యోమనౌక భూమికి పయనమైంది.
- భూమికి దాదాపు 350 కి.మీ. ఎత్తులో ఉండగా సర్వీస్ మాడ్యూల్ నుంచి డ్రాగన్ విడిపోయింది.
- భూమి చుట్టూ పలుమార్లు చక్కర్లు కొడుతూ ప్రయాణ దిశ తదితరాలను సరిచేసుకున్న అనంతరం నిర్ధారిత ప్రాంతంలో అది భూ వాతావరణంలోకి ప్రవేశించనుంది. ఆ క్రమంలో ముందుగా దాని ముందు భాగాన్ని మూసేస్తారు. హీట్‌షీల్డ్ కిందకు ఉండేలా క్యాప్సూల్‌ను సరిచేస్తారు.
- విపరీతమైన వేగంతో దూసుకొచ్చే డ్రాగన్‌ను నెమ్మదింపజేసేందుకు భూమికి సుమారు 5.7 కి.మీ. ఎత్తున రెండు రెండు ప్యారాచూట్లు తెరుచుకుంటాయి. అనంతరం 1.8 కి.మీ. ఎత్తున మరో నాలుగు ప్యారాచూట్లు విచ్చుకుంటాయి.
- క్యాప్సూల్ వాతావరణంలోకి పునఃప్రవేశించే క్రమంలో పుట్టుకొచ్చే అత్యంత ప్రతికూల పరిస్థితులను తట్టుకునేలా ప్యారాచూట్లను అత్యంత దృఢంగా ఉండే నైలాన్, కెవ్లర్‌లతో తయారు చేస్తారు.
- మధ్యాహ్నం 3.01 గంటలకు క్యాప్సూల్ పసిఫిక్ జలాల్లో దిగుతుంది.
- అప్పటికే అక్కడ సిద్ధంగా ఉండే స్పెషల్ రికవరీ షిప్ వెంటనే డ్రాగన్ క్యాప్సూల్‌ను చేరుకుంటుంది.
- దాన్ని షిప్‌లోకి చేర్చిన అనంతరం శుభాంశుతో పాటు మిగతా ముగ్గురు వ్యోమగాములు ఒక్కొక్కరిగా అందులోంచి బయటికి వస్తారు.
- అనంతరం షిప్ మీదే వారందరికీ తొలి దఫా పలురకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తారు.
- అనంతరం వారిని హెలికాప్టర్‌లో ముందుగా తీరానికి, అనంతరం నాసా కార్యాలయంలోని క్వారంటైన్ కేంద్రానికి తరలిస్తారు.

కలుద్దాం!

అతి త్వరలో భూమిపై కలుద్దాం

- ఐఎస్ఎస్ నుంచి బయల్దేరే ముందు శుభాంశు

శుభాంశూ... సుస్వాగతం

"యాగ్జియం-4 స్పేస్ మిషన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగొస్తున్న శుభాంశుకు హార్దిక స్వాగతం. ఆయన రాక కోసం దేశమంతా ఎనలేని ఆనందోత్సాహాలతో, అత్యంత ఉత్సుకతతో ఎదురుచూస్తోంది.

- కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్రసింగ్

నవభారత శకమిది
శుభాంశు భావోద్వేగం

భూమికి తిరుగు ప్రయాణమయ్యే ముందు శుభాంశు ఐఎస్ఎస్‌లో వీడ్కోలు ప్రసంగం చేశారు. 41 ఏళ్ల ముందు రాకేశ్ శర్మ రూపంలో తొలి భారతీయుడు అంతరిక్షంలో కాలు పెట్టిన క్షణాలను, అక్కడినుంచి భారత్ కన్పించిన తీరును వర్ణించిన వైనాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. ''మా తిరుగు ప్రయాణం సందర్భంగా ఈ రోజు ఆకాశం నుంచి భారత్ ఎలా కన్పిస్తుందో చూడాలని మా బృందమంతా ఉత్సాహపడుతోంది. నేటి భారత్ ఘనమైన ఆకాంక్షల భారత్. నిర్భయ భారత్. సగర్వంగా తలెత్తుకుని సాగుతున్న భారత్. అందుకే నేడు కూడా నా దేశం మిగతా ప్రపంచమంతటి కంటే మిన్నగా (సారే జహాసే అచ్ఛా) కనిపిస్తోందని చెప్పగలను'' అంటూ నాడు రాకేశ్ శర్మ చేసిన వ్యాఖ్యలను శుభాంశు పునరుద్ఘాటించారు. అక్కడి సహచరులపై శుభాంశు ఈ సందర్భంగా ప్రశంసల జల్లు కురిపించారు. ''ఈ యాత్ర ఇంత అద్భుతంగా సాగుతుందని జూన్ 25న ఫాల్కన్-9 రాకెట్ ద్వారా అంతరిక్షానికి పయనమయ్యే క్షణాల్లో నేనస్సలు ఊహించలేదు! ఇదంతా ఇదుగో, ఇక్కడ నా వెనక నుంచున్న ఈ అద్భుతమైన వ్యక్తుల వల్లే సాధ్యమైంది. ఈ యాత్రను మా నలుగురికీ అత్యంత ప్రత్యేకమైనదిగా మార్చింది వీళ్లే. అంకితభావంతో కూడిన ఇలాంటి అద్భుతమైన వృత్తి నిపుణులతో కలిసి పని చేయడం నిజంగా మరచిపోలేని అనుభూతి'' అంటూ హర్షం వెలిబుచ్చారు.



వ్యోమగాములను భూమిపైకి తీసుకు వచ్చేందుకు సిద్ధమైన డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్

కుర్చీల వద్దే హాజరు పంచ్

వచ్చే సెషన్‌లో ఎంపీలకు కొత్త హాజరు విధానం

న్యూఢిల్లీ: రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నుంచి లోక్‌సభ ఎంపీలకు కొత్త హాజరు విధానం అమల్లోకి రానుంది. ఇకపై లాబీలోని ట్యాబ్‌లో బదులుగా పార్లమెంట్‌లో వారు కూర్చునే కుర్చీల వద్దే హాజరు పంచ్ చేయాల్సి ఉంటుంది. లాబీలో హాజరు కోసం ఒకేసారి ఎక్కువ మంది ఎంపీలు గుమికూడుతుండటంతో వారి సమయం వృథా అవుతోందని అధికార వర్గాలు పేర్కొన్నారు. అంతేకాదు, లాబీలో హాజరైనట్లుగా మార్కు చేసి, సభా కార్యకలాపాల్లో పాల్గొనకుండా అట్నుంచటే కొందరు ఎంపీలు వెళ్లి పోతుండటాన్ని నివారించేందుకు సైతం నూతనఎలక్ట్రానిక్ విధానం దోహదపడుతుందన్నారు. ఈ విధానాన్ని అమల్లోకి తేవాలని స్పీకర్ ఓం బిర్లా ప్రతిపాదించారన్నారు. కొత్త పద్ధతికి ఎంపీలు అలవాట య్యేదాకా కొంతకాలం పాటు లాబీలోనూ ట్యాబ్ అటెండెన్స్ రిజిస్టర్ ఉంచుతామని వివరించారు. పార్లమెంట్‌ను కాగిత రహితంగా మార్చే చర్యల్లో భాగంగా గతేడాది స్పీకర్ ఓం బిర్లా లాబీలో ఉంచిన ట్యాబ్‌లోని హాజరు పట్టికలో డిజిటల్ పెన్‌తో ఎంపీలు సంతకం చేసే విధానాన్ని తీసుకొచ్చారు. పార్లమెంట్ సెషన్‌లో రోజువారీ అలవెన్స్‌లు క్లెయిమ్ చేసుకోవాలంటే సభ్యులకు మాత్రం హాజరు తప్పనిసరి.

జిలేబీ, సమోసాలపై ఆరోగ్య హెచ్చరికలు!

- పకోడీ, చాయ్ బిస్కట్ వంటి అన్ని చిరుతిళ్లపైనా
- సిగరెట్ ప్యాకెట్లపై తరహాలో ముద్రణ: కేంద్రం
- ప్రయోగాత్మకంగా నాగపూర్ ఎయిమ్స్‌లో శ్రీకారం
- నూనెలు, కొవ్వు, చక్కెర శాతం తెలిసేలా పోస్టర్లు

న్యూఢిల్లీ: సిగరెట్ ప్యాకెట్‌పై 'ఆరోగ్యానికి హానికరం' అంటూ విధిగా కనిపించే హెచ్చరిక ఇకపై అన్నిరకాల చిరుతిళ్లపైనా దర్శనమివ్వనుంది. జిలేబీ, సమోసా, పకోడీ, వడా పావ్ మొదలుకుని చాయ్ బిస్కట్ దాకా దాదాపుగా అన్నిరకాల చిరుతిళ్ల ప్యాకెట్లపైనా వాటిలోని నూనెలు, చక్కెర, కొవ్వు తదితరాల శాతాన్ని ప్రముఖంగా ముద్రించనున్నారు. జీవనశైలికి సంబంధించిన పలు రకాల వ్యాధులకు హెచ్చు మోతాదులో నూనెలు, చక్కెర తదితరాలే కారణంగా మారుతున్న నేపథ్యంలో అనారోగ్యకర ఆహారపు అలవాట్లపై ప్రజల్లో అవగాహనను పెంచడమే ఈ చర్య ఉద్దేశమని కేంద్రం వెల్లడించింది. దేశంలోనే తొలిసారిగా దీన్ని నాగపూర్ ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో ప్రయోగాత్మకంగా మొదలు పెట్టనున్నారు. ఇందులో భాగంగా క్యాంపస్‌లోని కేఫ్టేరియాలు, ఫుడ్ కౌంటర్లు తదితర పక్కనే అందురూ తేలిగ్గా చదవడానికి వీలయ్యేలా పెద్ద అక్షరాలతో కూడిన భారీ పోస్టర్లు, హెచ్చరిక బోర్డులు పెడతారు. వాటిని తరచూ తింటే తలెత్తే ఆరోగ్య సమస్యలను వివరంగా ఏకరువు పెడతారు. అనంతరం దీన్ని కొద్ది నెలల్లో దేశమంతటికీ విస్తరిస్తారు.

నిషేధం కాదన్న కేంద్ర ప్రభుత్వం

చిరుతిళ్లలో ఇమిడి ఉండే ఆరోగ్యసమస్యల గురించి అధికారిక లెటర్‌హెడ్లు, కవర్లు, నోట్‌ప్యాడ్లు, ఇతర ప్రచురణల్లో ఆరోగ్య సందేశాలను విధిగా ప్రచురించాల్సిందిగా అన్ని ప్రభుత్వ శాఖలు, విభాగాలకు కేంద్ర ఆరోగ్య శాఖ సూచించింది. ఆ శాఖ కార్యదర్శి పుణ్యసలిల శ్రీవాత్సవ జూన్ 21న ఈ మేరకు వాటికి లేఖలు రాశారు. సమోసా, వడా పావ్ తదిత సంప్రదాయ చిరుతిళ్లతో పాటు పిజ్జాలు, బర్గర్లు, డోనట్లను వంటి విదేశీ స్నాక్స్‌ను ఈ జాబితాలో చేర్చాలని సబార్డినేట్ లెజిస్లేషన్‌పై పార్లమెంటరీ కమిటీ చైర్మన్, శివసేన ఎంపీ మిలింద్ దేవ్‌రా సూచించారు. అయితే ఈ చర్య సమోసా, జిలేబీ, పకోడీ వంటి పాపులర్ చిరుతిళ్లపై నిషేధం కాదని కేంద్రం స్పష్టం చేసింది. ''కేవలం వాటని తినడం వల్ల ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం, తద్వారా జీవన శైలి వ్యాధుల ముప్పును కనీస స్థాయికి తగ్గించడమే మా లక్ష్యం'' అని వివరించింది.



పెను సమస్యగా...

భారత్‌లో ఆరోగ్య సంక్షోభం నానాటికీ పెరుగుతూ వస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. స్థూలకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, హృద్రోగాల బారిన పడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణాల్లో అతిగా వేయించిన, చక్కెర తదితరాల శాతం ఎక్కువగా ఉండే స్నాక్స్ వాడకం ఒకటని గుర్తించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2025 కల్లా భారత్‌లో ఏకంగా 44 కోట్ల మంది స్థూలకాయులుగా మారడం ఖాయమని ప్రఖ్యాత లాన్సెట్ జర్నల్ ఇటీవల ప్రచురించిన అంతర్జాతీయ అధ్యయనం హెచ్చరించింది. ''దేశవ్యాప్తంగా పిల్లలతో పాటు పెద్దల్లో కూడా స్థూలకాయ సమస్య నానాటికీ పెరిగిపోతోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఐదుగురిలో ఒకరి కంటే ఎక్కువగా అధిక బరువుతో బాధ పడుతున్నట్టు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) ఎత్తిచూపింది.

హెచ్చరికలు వేటిపై?

సమోసా, జిలేబీ, పకోడీ, వడా పావ్, కచోరీ, పిజ్జా, బర్గర్, ఫ్రెంచ్ ఫ్రైస్, గులాబ్ జామూన్, చాక్లెట్ పేస్ట్రీలు, అన్నిరకాల శీతల పానీయాలు తదితరాలు

విద్వేష ప్రసంగాలపై సుప్రీం అసహనం

- విద్వేష ప్రసంగాల కట్టడికి తగిన చర్యలు తీసుకోండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా విద్వేష ప్రసంగాల విస్తృతిపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. విద్వేష ప్రసంగాల కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అయితే భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కల్గకుండా, విద్వేష ప్రసంగాలను అడ్డుకునేలా ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందో సలహాలు, సూచనలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోర్టు కోరింది. పౌరులు తమకు రాజ్యాంగం ద్వారా దఖలుపడిన భావ ప్రకటనా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ హక్కులను దుర్వినియోగం చేయకూడదని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం పౌరులకు హితవు పలికింది. హిందూ దేవతను కించపరుస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టులు పెట్టిన ఉదంతంలో అరెస్టయిన వజాహత్ ఖాన్‌పై పశ్చిమబెంగాల్‌సహా పలు రాష్ట్రాల్లో దాఖలైన కేసులకు సంబంధించి దాఖలైన పిటిషన్ సోమవారం విచారణకు వచ్చిన సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

రహస్య రికార్డింగులు సాక్ష్యాలే

విడాకులకు అవి ప్రాతిపదికలే • వైవాహిక వివాదాలపై సుప్రీం స్పష్టీకరణ



న్యూఢిల్లీ: జీవిత భాగస్వాములతో సంభాషణను రహస్యంగా రికార్డు చేయడం విడాకులతో పాటు అన్ని రకాల వైవాహిక వివాదాల్లోనూ సాక్ష్యాలుగా చెల్లుబాటు అవుతాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ ధర్మాసనం సోమవారం ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. సదరు సంభాషణలకు సాక్ష్యాల చట్టంలోని 122వ సెక్షన్ కింద రక్షణ ఉంటుందని, కనుక వాటిని న్యాయ వివాదాల్లో ఉపయోగించడాన్ని అనుమతించలేమని పంజాబ్, హరియాణా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. వాటిని సాక్ష్యాలుగా అనుమతిస్తే వైవాహిక బంధాన్ని, కుటుంబంలో సామరస్యాన్ని దెబ్బ తీస్తాయని, భాగస్వామిపై గూఢచర్యానికి దారి తీస్తాయని హైకోర్టు వెలువరించిన అభిప్రాయాలతో ధర్మాసనం విభేదించింది. ''ఇలాంటివి చెల్లుబాటయ్యే వాదనలు కావన్నది మా అభిప్రాయం. భార్యాభర్తలు పరస్పరం తరచూ ఇలా సంభాషణను గుట్టుగా రికార్డు చేయడం వంటి పనులకు పాల్పడుతున్నారంటేనే ఆ బంధం బీటలు వారిందని, వారి మధ్య విశ్వాసం సన్నగిల్లిందని అర్థం. కనుక అలాంటి పరిస్థితుల్లో గోప్యంగా రికార్డు చేసిన భాగస్వామి తాలూకు సంభాషణను సాక్ష్యంగా అంగీకరించడం అసమంజసమేమీ కాదు. ఎందుకంటే అది వైవాహిక సమస్యల తాలూకు ఫలితమే తప్ప వాటికి కారణం కాదు'' అని జస్టిస్ నాగరత్న స్పష్టం చేశారు. ''122వ సెక్షన్ పేర్కొంటున్న గోప్యత హక్కు భార్యాభర్తల సంభాషణలకు కూడా వర్తిస్తుందన్నది నిజమే. కానీ అది సంపూర్ణమైనది కాదు. ఈ అంశాన్ని ఆ సెక్షన్‌కు ఇచ్చిన మినహాయింపులతో కలిపి చూడాల్సి ఉంటుంది'' అని ధర్మాసనం పేర్కొంది. ''ఇలాంటి విషయాల్లో గోప్యత హక్కు కంటే కూడా సక్రమ విచారణ హక్కుదే పై చేయి అవుతుంది. వైవాహిక బంధం విచ్ఛిన్నమయ్యే స్థితికి చేరినప్పుడు భాగస్వాములకు తమ వాదనను రుజువు చేసే సాక్ష్యాలు సమర్పించే హక్కును గోప్యత తదితరాలను ప్రాతిపదికగా చూపి కాలరాయలేం'' అని స్పష్టం చేసింది. 2017 నాటి ఓ విడాకుల కేసులో భార్యకు తెలియకుండా భర్త జరిపిన ఆమె సంభాషణల రికార్డులను సాక్ష్యంగా అనుమతిస్తూ పంజాబ్‌లోని భటిండా ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును పునరుద్ధరించింది.

50 రోజుల్లోగా యుద్ధం ఆపకుంటే..

రష్యాను టారిఫ్‌లతో శిక్షిస్తాం: ట్రంప్

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో సాగిస్తున్న యుద్ధానికి 50 రోజుల్లోగా ముగింపు పలకకుంటే రష్యాను టారిఫ్‌లతో దండిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో ఆయన వైఖరిని మార్చుకున్నట్లు భావిస్తున్నారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టెతో సోమవారం వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో ట్రంప్ ఈ విషయం ప్రకటించారు. 50 రోజుల్లో ఉక్రెయిన్‌తో ఒప్పందం కుదుర్చుకోలేని పక్షంలో రష్యాపై అత్యంత తీవ్రంగా టారిఫ్‌లు విధిస్తామన్నారు. టారిఫ్‌లను ఎలా అమలు చేస్తారనే విషయాన్ని ఆయన వివరించలేదు. 'వాణిజ్యాన్ని చాలా అవసరాలకు వాడుకోవచ్చు. యుద్ధాల్ని ఆపేందుకు ఇంకా బాగా అక్కరకొస్తుంది'అని వ్యాఖ్యానించారు. రష్యా దాడులను ఎదుర్కొనేందుకు ఉక్రెయిన్‌కు పేట్రియాట్ క్షిపణులను అందించనున్నామని కూడా ఆయన ఇప్పటికే ప్రకటించారు.

విభేదాలు.. వివాదాలుగా మారొద్దు!

చైనా విదేశాంగ మంత్రితో జై శంకర్ వ్యాఖ్యలు


జైశంకర్‌తో చైనా మంత్రి వాంగ్

బీజింగ్: సరిహద్దు సమ స్యలను పరిష్కరించుకోవడానికి, ఉద్రిక్తతలను తగ్గించడానికి ద్వైపాక్షిక సంబంధాలను సాధారణ స్థాయికి తెచ్చేందుకు భారత్, చైనా కలిసి ప్రయత్నాలు సాగించాలని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జై శంకర్ పేర్కొన్నారు. ఇందుకు నిర్బంధ వాణిజ్య విధానాలు, అవరోధాలను నివారించడం చాలా అవసరమని పేర్కొన్నారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సోమవారం ఆయన బీజింగ్‌లో భేటీ అయ్యారు. విభేదాలు ఎప్పుడూ వివాదాలుగా మారకూడదని, అలాగే పోటీ సంఘర్షణగా మార్పు చెందకూడదన్నారు. పరస్పర గౌరవాసక్తులు, సున్నితత్వం ఆధారంగా మాత్రమే ద్వైపాక్షిక సంబంధాలు నిర్మితమవుతాయని స్పష్టం చేశారు. మంగళవారం నుంచి జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సదస్సు ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించలేదన్న భారత వైఖరిని సమర్థిస్తుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. దూరదృష్టితో ఆలోచించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ''అక్టోబర్ 2024లో ఇరుదేశాల నేతల సమావేశం జరిగిన తర్వాత నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు సానుకూల దిశలో ముందుకు సాగుతున్నాయి. బాధ్యతాయుతంగా మనం దానిని కొనసాగించాలి. ఇటీవల కాలంలో పలు అంతర్జాతీయ వేదికల్లో కలిసేందుకు, వ్యూహాత్మక చర్చలు జరిపేందుకు అవకాశం లభించింది. ఇలా క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకొని పరస్పరం చర్చించుకుంటే రెండు దేశాలకూ మేలు జరుగుతుందని భారత్ ఆశిస్తోంది. భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తవుతుంది. ఐదేళ్ల విరామం తర్వాత ప్రఖ్యాత మానసరోవర్ యాత్ర పునఃప్రారంభమైనందుకు సంతోషంగా ఉంది. ఈ విషయంలో చైనాకు కృతజ్ఞతలు చెబుతున్నా. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో గత 9 నెలల్లో కీలక పురోగతి సాధించాం. సరిహద్దు వెంబడి ఘర్షణ వాతావరణం లేకుండా చర్యలు తీసుకున్నాం. ద్వైపాక్షిక సంబంధాలు సజావుగా సాగుతున్నాయనడానికి ఇదే నిదర్శనం. ఉద్రిక్తతలను తగ్గించడంతో సహా సరిహద్దుకు సంబంధించిన ఇతర అంశాలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఆర్థికంగా రెండు బలమైన దేశాలు కలిసి ముందుకు వెళ్తే.. త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుంది. భారత్, చైనా మధ్య స్థిరమైన సంబంధాలు ప్రపంచానికే మేలు చేస్తాయి'అని జై శంకర్ అన్నారు.

ఇన్ఫెక్షన్‌తో ఆస్పత్రిలో చేరిన సీజేఐ గవాయ్

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ సోమవారం ఢిల్లీలోని ఆస్పత్రిలో చేరారు. ఇటీవల హైదరాబాద్ పర్యటన సమయంలో ఆయన తీవ్ర ఇన్ఫెక్షన్‌కు గురయ్యారని అధికార వర్గాలు తెలిపాయి. ఆస్పత్రిలో వైద్య చికిత్సకు సానుకూలంగా స్పందిస్తున్నారని వెల్లడించాయి. ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జి అయ్యి విధులకు హాజరవుతారని పేర్కొన్నాయి. ఈ నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవం, తదితర కార్యక్రమాల్లో ఆయన పాల్గొనడం తెల్సిందే.

వాద్రాను ఐదు గంటలు ప్రశ్నించిన ఈడీ

న్యూఢిల్లీ: వ్యాపారవేత్త, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులు సోమవారం ఐదు గంటలపాటు ప్రశ్నించారు. యూకేకు చెందిన ఆయుధ దళారీ సంజయ్ భండారీ తదితరులకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన్ను విచారించినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. సెంట్రల్ ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి ఉదయం 11 గంటలకు భార్య ప్రియాంకా గాంధీతో కలిసి వాద్రా వచ్చారు. ఆయన్ను మరోసారి పిలిపించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



విద్య, వైద్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్‌కు సమాంతరంగా విస్తరిస్తున్న మేడ్చల్ జిల్లాలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తామని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. -8లో



అంతటా అదే సీన్..

చిన్నారులు మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారుతున్నారు. పిల్లలు అన్నం తినాలన్నా.. అల్లరి తగ్గించాలన్నా అదే ఆయుధంగా వినియోగిస్తున్నారు. - సిటీప్లస్‌లో..

గరిష్టం/కనిష్టం
34.0/24.0

వాతావరణం

నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 34, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



ఆలయం వద్ద తలసాని





అంబారీపై అమ్మవారి ఊరేగింపు

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల వేడుకల్లో రెండో రోజు సోమవారం రంగం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించగా..మహంకాళి అమ్మవారిని ఏనుగు అంబారీపై ఘనంగా ఊరేగించారు. దాదాపు 30కి పైగా పలహార బండ్లు ఉత్సవంలో పాలుపంచుకోగా..పలువురు వీఐపీలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. - రాంగోపాల్‌పేట



జోగిని శ్యామల



భవిష్యవాణి చెబుతున్న స్వర్ణలత



ప్రత్యేక అలంకరణలో మహంకాళి అమ్మవారు

రైళ్లపై రాళ్లు!

- బ్లాక్ స్పాట్‌లుగా పలు ప్రాంతాల గుర్తింపు
- ఆకతాయిలు, అసాంఘిక శక్తుల దుందుడుకు చర్యలు
- అణిచివేసేందుకు ఆర్పీఎఫ్ కఠిన చర్యలు
- ప్రయాణికులకు కరువైన భద్రత
- పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు

గ్రేటర్‌లో లోకల్, సబర్బన్ రైళ్లపై దాడులు

సాక్షి, సిటీబ్యూరో: రైళ్లకు రాళ్ల దెబ్బలు తాకుతున్నాయి. విండోలు, అద్దాలు పగిలిపోతున్నాయి. ప్రయాణికులు సైతం గాయాలకు గురవుతున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రైళ్లపై రాళ్ల దెబ్బల దాడి ఆందోళన కలిగిస్తోంది. ప్రయాణికులను బెంబేలెత్తిస్తోంది. ఎంఎంటీఎస్, సబర్బన్ రైళ్లు రాళ్ల దాడులకు గురవుతున్నాయి. పాత బస్తీలోని మలక్‌పేట్, డబీర్‌పురా, యాకుత్‌పురా, ఫలక్‌నుమా తదితర స్టేషన్‌ల పరిధిలో దాడులతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. లింగంపల్లి నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే రూట్‌లోనూ ఈ తరహా దాడులు జరుగుతున్నాయి.



పట్టాలకు ఇరువైపులా మోహరించి..

- నగరంలో లోకల్ రైళ్లు రాకపోకలు సాగించే మార్గాల్లో దక్షిణమధ్య రైల్వే ఆర్పీఎఫ్ అధికారులు పలు చోట్ల బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. ఎంఎంటీఎస్, సబర్బన్ రైళ్లపైనే కాకుండా వందేభారత్ వంటి ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆకతాయిలు దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. నగరంలో తరచుగా ఎక్కడో ఒక చోట ఆకతాయిలు, అసాంఘిక శక్తులు రైళ్లపైన రాళ్లతో దాడులకు పాల్పడడం నిత్యకృత్యంగా మారింది.
- ఫలక్‌నుమా- బుద్వేల్, సీతాఫల్‌మండి-లాలాగూడ-మల్కాజిగిరి, లింగంపల్లి-బేగంపేట్, బొల్లారం-అల్వాల్, హఫీజ్‌పేట్- లింగంపల్లి, డబీర్‌పురా, యాకుత్‌పురా, ఉప్పుగూడ, తదితర ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఈ మార్గాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో రాళ్ల దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. పట్టాలకు ఇరు వైపులా వందల కొద్దీ బస్తీలు ఉన్నాయి. చాలామంది ఆకతాయి కుర్రాళ్లు సాయంత్రం 7 గంటల సమయంలో సరదాగా పట్టాలపైకి చేరుకొని ఈ తరహా దాడులతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రక్షణ చర్యలు లేకపోవడంతో..

నగరంలో పట్టాలకు రెండు వైపులా ప్రహరీలు, ఫెన్సింగ్‌లు వంటి రక్షణ చర్యలు లేకపోవడంతో కాలనీలు, బస్తీలకు చెందిన జనం యథేచ్ఛగా ఇటు నుంచి అటు రాకపోకలు సాగిస్తున్నారు. చీకటి పడితే అసాంఘిక శక్తులు సైతం ఈ పట్టాలనే అడ్డాలుగా చేసుకుంటాయి. గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించే ముఠాలు, తాగుబోతులు పట్టాల పక్కన మోహరిస్తున్నారు. ఇదే సమయంలో ఆ మార్గంలో వెళ్లే రైళ్లను లక్ష్యంగా చేసుకొని రాళ్లు విసురుతున్నారు. ప్రతి నెలా కనీసం పదికి పైగా ఇలాంటి ఘటనలు నమోదవుతున్నట్లు అంచనా.

ఏడాది జైలు శిక్ష...

రైళ్లపై రాళ్ల దెబ్బలకు పాల్పడే వారు పట్టుబడితే కఠినంగా శిక్షించనున్నట్లు అధికారులు తెలిపారు. రైల్వే చట్టంలోని సెక్షన్ 153/154 ప్రకారం ఏడాది జైలు శిక్ష పడే అవకాశం ఉంది. భారీ ఎత్తున జరిమానా కూడా విధించవచ్చు. సరదా కోసం రైళ్లపై దాడులకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆర్పీఎఫ్ అధికారులు హెచ్చరించారు.

ప్రశాంతంగా బోనాల ఉత్సవాలు: పొన్నం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. భవిష్యవాణి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్షలాది మంది భక్తులు పాల్గొన్న ఈ జాతరలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. 'లక్షల మంది భక్తులు పాల్గొనే ఇలాంటి జాతరకు ప్రభుత్వం అద్భుతంగా ఏర్పాట్లు చేసింది. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని మొక్కుకున్నాం. అమ్మవారికి శాస్త్రీయంగా జరగాల్సిన అన్ని పూజలు అమ్మవారికి నిర్వహిస్తాం. అమ్మవారి ఆశీర్వాదంతో అన్ని కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి' అని పేర్కొన్నారు.

నిర్బంధాల మధ్య ఉత్సవాలు జరపొద్దు: తలసాని

ఉత్సవాలను నిర్బంధాల మధ్య జరపడం సరికాదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వానికి సూచించారు. ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల్లో భాగం నిర్వహించిన రంగం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు భక్తులు అమ్మ వారి దర్శనం కోసం పడిన ఇబ్బందుల గురించి ఆయనకు వివరించారు. అమ్మవారి తొలి పూజను కూడా సకాలంలో నిర్వహించలేకపోవడం చాలా బాధాకరమని తలసాని తప్పుపట్టారు.

జలమండలికి 'కరెంట్ షాక్'!

గుదిబండగా విద్యుత్ బిల్లులు

- నెలవారీ చార్జీలు సుమారు రూ.105 కోట్లపైనే..
- బకాయిలపై నెలకు అపరాధ రుసుం రూ.79 కోట్లు అదనం
- డిమాండ్‌కు తగిన రాబడి లేక ఏడేళ్లుగా చెల్లించని వైనం
- మొత్తం విద్యుత్ చార్జీల బకాయిలు రూ.6,785.27 కోట్లు పైనే..

జలమండలికి నెలవారీగా ఆదాయం- వ్యయం ఇలా..

ఆదాయం (రూ.కోట్లలో)	ఖర్చులు (రూ.కోట్లలో)
నీటి చార్జీలు, సీవరేజ్ సెస్ :100.03	రెగ్యులర్ ఉద్యోగుల వేతనాలు :59.98
కొత్త కనెక్షన్ చార్జీలు :31.99	అవుట్ సోర్సింగ్ వేతనాలు :18.20
వాటర్ ట్యాంకర్లు : 6.34	ఆపరేషన్, మెయింటెనెన్స్ : 21.50
	విద్యుత్ చార్జీలు : 184.6
	పరిపాలన ఖర్చులు : 9.43
	స్టోర్స్ ఇతర ఖర్చులు : 3.76
మొత్తం 138.57	297.47

రాయితీకి మంగళం

జల మండలికి విద్యుత్ చార్జీల్లో రాయితీ కల్పించే టారిఫ్‌కు గత రెండేళ్ల క్రితమే తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (టీజీఈఆర్సీ) మంగళం పాడింది. 2018-19 నుంచి 2023-24 వరకు హైదరాబాద్ మెట్రో రైలు కేటగిరిలో సబ్సిడీ టారిఫ్ వర్తింపజేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి కంఫర్ట్ లెటర్ అందక పోవడంతో టీజీఈఆర్సీ కన్సెషనల్ టారిఫ్‌ను పొడగించలేదు.

సాక్షి, సిటీబ్యూరో

జలమండలికి విద్యుత్ చార్జీల భారం గుదిబండగా తయారైంది. సంస్థకు వివిధ రూపాల్లో వస్తున్న ఆదాయం వేతనాలు, నిర్వహణకు సరిపోతుండటంతో విద్యుత్ చార్జీలు చెల్లించే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ప్రధాన బ్యాలెన్సింగ్, సర్వీస్ రిజర్వాయర్లు, నీటి శుద్ధి ప్లాంట్లు, పంపు సెట్లు, ఎస్టీపీలు తదితరాల నిర్వహణ కోసం విద్యుత్ వినియోగం అధికంగా ఉండగా..ఈ చార్జీల భారం భరించక తప్పడం లేదు. సగటున ప్రతి నెల రూ.105 కోట్లకు పైగా విద్యుత్ చార్జీలు అవుతుండగా, పాత బకాయిలపై నెలకు అదనంగా అపరాధ రుసుం రూ.79 కోట్ల భారం పడుతోంది. మొత్తం మీద నెలకు రూ.184 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అయితే గత ఆరేడేళ్లుగా ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేక కరెంట్ చార్జీల చెల్లింపు లేకపోవడంతో బకాయిలు పెరిగిపోతున్నాయి. ఈ ఏడాది మే చివరి నాటికి విద్యుత్ చార్జీల ప్రిన్సిపల్ అమౌంట్ రూ.4,570.84 కోట్లు కాగా, వాటిపై అపరాధ రుసుం రూ.2119.05 కోట్లు అయింది. మొత్తం మీద జలమండలి విద్యుత్ శాఖకు సుమారు రూ.6,785.27 కోట్ల బకాయి పడినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ బకాయిలతో చెల్లించలేక జలమండలి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి..ప్రభుత్వం సహాయంపై ఆశలు పెట్టుకుంది.



ఆదాయం కంటే ... రెట్టింపు వ్యయం

జలమండలికి వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయం కంటే వ్యయం రెట్టింపుగా తయారైంది. ఒక నెల ఆదాయ, వ్యయాలను పరిశీలిస్తే ..నీటి, సీవరేజీ బిల్లులు, కొత్త నల్లా కనెక్షన్లు, వాటర్ ట్యాంకర్ల రూపంలో రూ.138.57 కోట్ల ఆదాయం లభిస్తుండగా, ఖర్చులు మాత్రం రెట్టింపు స్థాయిలో రూ.297.47 కోట్లకు చేరాయి. అందులో కేవలం విద్యుత్ చార్జీల భారమే రూ.184.6 కోట్లు. కేవలం ఒక్క నెలలోనే మొత్తం మీద జలమండలిపై రూ.158.90 కోట్ల లోటు భారం పడుతోంది. ఈ లెక్కన ఏడాదికి రూ.1906.8 కోట్ల ఆర్థిక భారం భరించక తప్పని పరిస్థితి నెలకొంది.

ఎత్తిపోతలతోనే విద్యుత్ చార్జీల భారం

మహానగర వాసుల తాగు నీటి అవసరాల కోసం కృష్ణా, గోదావరి నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తుండటంతో విద్యుత్ చార్జీలు ఆర్థిక భారంగా మారాయి. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణా మూడు దశలు, గోదావరి ఒక ఫేజ్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, సింగూరు, మంజీరా జలాశయాల ద్వారా నగరానికి తాగునీటిని తరలించి మూడు దశల్లో శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. ఇందులో 92 శాతం భారీ మోటర్ల ద్వారా, 8 శాతం గ్రావిటీ ద్వారా నీటి తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం మీద భారీ మోటార్ల వినియోగం, రిజర్వాయర్ల ద్వారా వినియోగదారులకు నీటిని సరఫరా చేయడం కోసం నెలకు దాదాపుగా 230 మెగావాట్ల డిమాండ్ ఉండగా, 139 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. జలమండలి విద్యుత్ వినియోగంపై హెచ్‌టీ-ఐ(ఈ) కేటగిరి సవరించిన టారిఫ్ ప్రకారం 11 కేవీ ఒక యూనిట్ విద్యుత్‌కి రూ.7.65, 33 కేవీ ఒక యూనిట్ విద్యుత్‌కి రూ.7.15, 132 కేవీ, ఆపైన విద్యుత్‌కి రూ.6.65 చెల్లించాల్సి వస్తోంది.

తెలుపు చిట్టీ.. | ఆదాయానికి చెల్లుచీటి!

కూరగాయల మార్కెట్లలో కమీషన్ ఏజెంట్లు, సిబ్బంది మాయాజాలం

- తక్ పట్టీలు ఇవ్వకుండా.. తెలుపు చిట్టీలపై వివరాల నమోదు
- రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి
- నిస్సహాయ స్థితిలో ఉన్నతాధికారులు

సాక్షి, సిటీబ్యూరో: వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో కమీషన్ ఏజెంట్లు, కింది స్థాయి సిబ్బంది ఏకమై ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. రోజువారీగా కూరగాయలు, పండ్లు, పూలు మార్కెట్‌కు తెచ్చినపుడు రైతులకు ఇవ్వాల్సిన తక్ పట్టీలకు బదులుగా తెల్ల చిట్టీలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పెద్ద మొత్తంలో మార్కెట్లు ఆదాయాన్ని కోల్పోతున్నాయని సంబంధిత ఉన్నతాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చిన సరుకులో కొన్నింటికి మాత్రమే తక్‌పట్టీలు జారీ చేసి, మరికొన్నింటికి తెల్ల చీటీలు రాసిస్తున్నారు. ఫలితంగా మిగిలిన దాంట్లో చెరో సగం సర్దుకుంటున్నారని వినికిడి.

నగరంలోని గుడిమల్కాపూర్, గడ్డిఅన్నారం, బోయిన్‌పల్లి, మలక్‌పేట్ మార్కెట్లు నగర ప్రజల కూరగాయలు, ఉల్లి, అల్లం, మిర్చి, పండ్లు, పూల అవసరాలను తీరుస్తున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్, కరీంనగర్ తదితర జిల్లాలతో పాటు పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుంచి రోజూ పెద్ద సంఖ్యలో వాహనాలు తరలి వస్తాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బాటసింగారానికి పండ్లు దిగుమతి చేసుకుంటున్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌కు విదేశాల నుంచి పూలను తెస్తున్నారు. ఫలితంగా భాగ్యనగరంలో ఏటా సుమారు రూ.వెయ్యి కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి మార్కెట్ కమిటీకి 1 శాతం రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇందులోనే కమీషన్ ఏజెంట్లు, మార్కెట్లలోని కింది స్థాయి సిబ్బంది కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు తెచ్చిన సరుకుకు తక్‌పట్టీ ఇస్తే అందులో తెచ్చిన సరుకు, చెల్లించిన డబ్బు వివరాలు ఉంటాయి. ఈ సమయంలో రైతులకు తెల్లచీటీలు ఇచ్చి అనంతరం తక్‌పట్టీలో సరుకును తక్కువ చేసి చూపిస్తున్నారని, ఫలితంగా సిబ్బందికి కొంత మొత్తాన్ని ముట్టజెబుతున్నారని తెలుస్తోంది. దీని వల్ల రైతులకు ఎలాంటి నష్టం లేకపోయినా మార్కెట్ కమిటీకి వచ్చే కమీషన్ మాత్రం తగ్గుతోంది. మరికొన్ని సందర్భాల్లో మార్కెట్ కమిటీ లోపలికి రాకుండా గేటు బయటే రైతులతో మాట్లాడుకుంటున్నారు. ఇంటిదొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడన్నట్లు తెల్ల చిట్టీల వ్యవహారం సాగిపోతోంది. మార్కెట్లలో సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో రైతులు వచ్చినపుడు కమీషన్ ఏజెంట్లు చెప్పిందే రాసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

ఆదాయం భేష్..

మార్కెట్ కమిటీల్లో వ్యాపార లావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. ఆదాయం సైతం రూ.కోట్లలో సమకూరుతోంది. గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, మలక్‌పేట మార్కెట్లలో ఏటా లక్ష్యాలకు మించి ఆదాయం సమకూరుతుండగా..రూ.కోట్లలోనే కమీషన్ వస్తోంది. దీన్ని కొద్దిగా స్ట్రీమ్‌లైన్ చేస్తే ఈ ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గతేడాది గుడిమల్కాపూర్ మార్కెట్‌కు రూ.7 కోట్లు లక్ష్యం ఇవ్వగా రూ.8.58 కోట్లు కమీషన్ వచ్చింది. బోయిన్‌పల్లి, గడ్డిఅన్నారం మార్కెట్లకు ఏటా రూ.15 కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. సుమరు 80 శాతం నుంచి వంద శాతం లక్ష్యాలను చేరుకుంటున్నారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తే ఆదాయం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

	టార్గెట్	ఆదాయం
	గుడిమల్కాపూర్	
2022-23	రూ.5 కోట్లు	రూ.5.46 కోట్లు
2023-24	రూ.5.50 కోట్లు	రూ.7.31 కోట్లు
2024-25	రూ.7 కోట్లు	రూ.8.58 కోట్లు
	గడ్డిఅన్నారం	
2023-24	రూ.21 కోట్లు	రూ.15.45 కోట్లు
2024-25	రూ.21 కోట్లు	రూ.17.66 కోట్లు
2025-26	రూ.21.14 కోట్లు	రూ.3.68 కోట్లు (ఏప్రిల్-జూన్)
	బోయిన్‌పల్లి	
2023-24	రూ.13 కోట్లకు	రూ.11కోట్లు
2024-25	రూ.16 కోట్లు	రూ.16 కోట్లు
2025-26	రూ.18 కోట్లు	----
	మలక్‌పేట్	
2025-26	రూ.18 కోట్లు	రూ.2.68 కోట్లు (ఏప్రిల్- జూన్)



తగ్గేనా.. పెరిగేనా?

అధికారాల వికేంద్రీకరణ..'అవినీతి'పై భిన్నాభిప్రాయాలు

- ఎన్ని సంస్కరణలు చేపట్టినా మారని టౌన్‌ప్లానింగ్ తీరు
- జోన్లు, సర్కిళ్లలో ఇప్పటికే పెచ్చరిల్లిన అవినీతి..



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో భవన నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించే వారి ఇన్‌స్టంట్ అనుమతుల రద్దు అధికారం సంబంధిత సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు అప్పగించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత వారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయానికి ఆమోదం తెల్పడం తెలిసిందే. ఇన్‌స్టంట్ అనుమతుల ఉల్లంఘనలుంటే రద్దు చేసే అధికారం డిప్యూటీ కమిషనర్లకు ఉందని చెబుతున్నప్పటికీ, సదరు దరఖాస్తులు కమిషనర్ దాకా వెళ్తున్నందున జాప్యం జరుగుతోందని నిబంధనలు మార్చారు. అలాగే అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను సెక్షన్ 455-ఎ ప్రకారం క్రమబద్ధీకరించుకునేందుకు ఇప్పటి వరకు కమిషనర్‌కు మాత్రమే అధికారం ఉన్నందున వాటిల్లోనూ జాప్యంజరుగుతోందని, తద్వారా కోర్టుకేసులు కూడా పెరుగుతున్నాయని హైకోర్టు కూడా భావించిన నేపథ్యంలో అనుమతుల్లేకుండా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణ అధికారం జోనల్ కమిషనర్లకు, టీజీ బీపాస్ ద్వారా పొందిన 'ఇన్‌స్టంట్' అనుమతులను రద్దుచేసే అధికారం డిప్యూటీ, జోనల్ కమిషనర్లకు దఖలు పడనుంది. తద్వారా ఇబ్బందులు తగ్గగలవని భావిస్తున్న వారికంటే అవినీతి మరింతగా పెరగనుందని భావిస్తున్నవారే ఎక్కువగా ఉన్నారు. జీహెచ్‌ఎంసీకి అందే ఫిర్యాదుల్లో ఎక్కువ భాగం అక్రమ నిర్మాణాలకు సంబంధించినవే కావడం తెలిసిందే. అవి సైతం సర్కిల్, జోన్లస్థాయిల్లోవే అధికంగా ఉంటున్నాయి. ఐదంతస్తుల వరకు భవన నిర్మాణ అనుమతుల అధికారం జోన్లకే కట్టబెట్టినప్పటి నుంచీ టౌన్‌ప్లానింగ్‌లో అవినీతి విచ్చలవిడిగా పెరిగిందనే ఫిర్యాదులున్నాయి.

అజమాయిషీ లేకనే..

ప్రధాన కార్యాలయం నుంచి కనీసం సాంకేతికంగానూ ఎలాంటి అజమాయిషీ, పర్యవేక్షణ లేకపోవడంతో సర్కిల్, జోన్ల స్థాయిలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, అక్రమాలకు పాల్పడే నిర్మాణదారులు ఆడింది ఆటగా సాగుతోంది. ఆ మాటకొస్తే, జోన్లకే సర్వాధికారాలు కట్టబెట్టినప్పటి నుంచి అన్ని విభాగాల్లో అవినీతికి కట్టడి లేకుండా పోయింది. జోన్లకు సర్వాధికారాలు దఖలు పడకముందు ప్రధాన కార్యాలయం నుంచి అడపాదడపా నైనా తనిఖీలుండేవి. సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు వారం వారం నిర్వహించే సమీక్షలతో ఎక్కడ ఏం జరుగుతుందో తెలిసేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎవరేం చేసినా పట్టించుకునే పరిస్థితి లేదు. ఇటీవలి కాలంలోనూ పలు సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో లంచాలు తీసుకుంటూ కొందరు అధికారులు ఏసీబీకి పట్టుబడటం ఈ సందర్భంగా గమనార్హం. ఏ విభాగాన్ని తీసుకున్నా, తమ విభాగం పరిధిలో ఏం పనులు జరుగుతున్నాయో, జోన్లు.. సర్కిళ్లలో ఎలాంటి పనులు జరుగుతున్నాయో ప్రధాన కార్యాలయంలోని సంబంధిత శాఖల ఉన్నతాధికారులకే తెలియని దుస్థితి నెలకొంది. అంతేకాదు.. తమ విభాగానికి సంబంధించి ఏదైనా సమాచారం కావాలని అడిగినా సర్కిల్, జోన్ల నుంచి తగిన స్పందన ఉండటం లేదు. ప్రధాన కార్యాలయానికి తమపై ఎలాంటి అధికారం, పెత్తనం లేదనే విధంగా అక్కడి అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక టౌన్‌ప్లానింగ్ అంటేనే అవినీతికి ఆలవాలంగా ముద్ర పడింది. ఈ నేపథ్యంలో సర్కిళ్లు, జోన్ల పరిధిలోనే అనుమతుల రద్దు, క్రమబద్ధీకరణల అధికారం కూడా అంటే అవినీతి మరింతగా పెరుగుతుందనే అభిప్రాయాల్నే ఎక్కువమంది వ్యక్తపరుస్తున్నారు. జోన్లస్థాయిల్లోనే ఉన్న టౌన్‌ప్లానింగ్ 'టాస్క్‌ఫోర్స్' అక్రమాలను అడ్డుకోవడానికి బదులు ప్రోత్సహించడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు.

నిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స

- ఊపిరితిత్తుల్లో గడ్డకట్టిన రక్తాన్ని తొలగించిన వైద్యులు
- ఉచితంగానే ఖరీదైన వైద్యం : డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్ : నిజామ్స్ వైద్య విజ్ఞానర సంస్థ(నిమ్స్) వైద్యులు మరో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఊపిరితిత్తుల్లో గడ్డ కట్టిన రక్తాన్ని చాకచక్యంగా తొలగించి రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. దీర్ఘకాలిక థ్రోంబోఎంబాలిక్ పల్మనరీ హైపర్‌టెన్షన్ (సీటీఈపీహెచ్) తీవ్రమైన ట్రైకస్పిడ్ రెగర్జిటేషన్‌తో బాధపడుతున్న 30 ఏళ్ల ఆర్.శివ ప్రసాద్‌కు సంక్లిష్ట పల్మనరీ ఎండార్టెరెక్టమీ, ట్రైకస్పిడ్ వాల్వ్ మరమ్మతును విజయవంతంగా నిర్వహించారు. సోమవారం నిమ్స్ వైద్యులు చికిత్స వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా, కాచాపూర్ గ్రామానికి చెందిన శివ ప్రసాద్ రావ్ దీర్ఘకాలిక పల్మనరీ థ్రోంబోఎంబోలిజం అనే వ్యాధితో బాధపడుతున్నాడు. ఫలితంగా ఊపిరితిత్తుల ధమనులలో నిరంతర రక్తం గడ్డకట్టడంతో అధిక రక్తపోటు (పల్మనరీ హైపర్‌టెన్షన్)కు దారి తీస్తుంది. ఇది తీవ్రమైన ట్రైకస్పిడ్ రెగర్జిటేషన్ (లీకీ హార్ట్ వాల్వ్) తో కలిసి, అతి క్లిష్టమైన శస్త్రచికిత్సకు దారి తీస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నెల 2న అతడిని ఆపరేషన్ చేసి పల్మనరీ ధమనులలో దీర్ఘకాలిక రక్తం గడ్డకట్టడాన్ని సున్నితంగా తొలగించామన్నారు. ప్రత్యేకమైన హార్ట్ ఫెల్ట్‌ను ఉపయోగించి ట్రైకస్పిడ్ వాల్వ్‌ను మరమ్మతు చేసినట్లు వివరించారు. నిమ్స్ కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాధిపతి ప్రో.అమరేష్, ప్రొఫెసర్ డాక్టర్ సూర్య సత్య గోపాల్ విజయవంతంగా పూర్తి చేశారు. మంగళవారం అతడిని డిశ్చార్జి చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. రూ.6 లక్షలకు పైగా ఖర్చయ్యే చికిత్సను తెలంగాణ ప్రభుత్వ సహకారంతో పూర్తిగా ఉచితంగా నిర్వహించామని నిమ్స్ డైరెక్టర్ ప్రో. నగరి బీరప్ప తెలిపారు. శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందాన్ని ఆయన అభినందించారు.

టీవీలో అవకాశాలు ఇప్పిస్తానని మోసం : కెమెరామెన్ అరెస్టు

బంజారాహిల్స్: టీవీ సీరియళ్లలో అవకాశాలు ఇప్పిస్తానని ఓ జూనియర్ ఆర్టిస్టును నమ్మించి మోసం చేసిన టీవీ సీరియల్ కెమెరామెన్‌ను బంజారాహిల్స్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్‌లో నివసించే జూనియర్ ఆర్టిస్ట్ షూటింగ్‌లకు వెళ్తున్న క్రమంలో ఓ టీవీ సీరియల్ కెమెరామెన్‌గా పనిచేస్తున్న వినుకొండకు చెందిన విజయ్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. టీవీ సీరియల్స్‌లో అవకాశాలు ఇప్పిస్తానని నమ్మబలికి, ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. గత ఆరు నెలలుగా ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. ఆమెకు టీవీ సీరియల్స్‌లో అవకాశం ఇప్పించకపోగా ఇటీవల మరో యువతితో తిరుగుతుండటంతో బాధితురాలు అతడిని నిలదీసింది. దీంతో అతను ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

విద్య, వైద్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

పుర ప్రజలకు వసతుల కల్పన, అభివృద్ధే ధ్యేయం

- ప్రభుత్వ ,అసైన్డ్ భూముల పరిరక్షణ, అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం
- పరిశ్రమలు ,ఐటీ అభివృద్ధి, వాటి విస్తరణ దిశగా చర్యలు
- ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలకు పెద్ద పీట
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు,రేషన్‌కార్డులు,ప్రభుత్వ పథకాలు
- పారదర్శక పాలన .. శాఖల మధ్య సమన్వయంతో ముందడుగు
- 'సాక్షి'తో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరానికి సమాంతరంగా విస్తరిస్తున్న మేడ్చల్ జిల్లాలోని 4 నగరపాలక సంస్థలు,12 మున్సిపాలిటీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ,అభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములు పరిరక్షణ, అక్రమ భవన నిర్మాణాలు, లే అవుట్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పరిశ్రమలు , ఐటీ రంగాల అభివృద్ధి, విస్తరణకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి నెలరోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన' సాక్షి,'తో ప్రత్యేకంగా మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

విద్యా, వైద్య, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో విద్యా, వైద్య, సంక్షేమ రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య బాగా ఉంది. వారికి అవసరమైన వసతులు కల్పిస్తాం. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలో రూ.12.50 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టాం. సీఎస్ఆర్ నిధులతో బడులను బలోపేతం చేస్తాం. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో కనీస వసతులు కల్పిస్తాం. ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ఠం చేస్తాం. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులను ఆరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

- జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, పల్లె, బస్తీ దవాఖానాల్లో పేదలకు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటాము. మందులు అందుబాటులో ఉంచడంతోపాటు డాక్టర్లు, వైద్యులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటాం. కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీతో మల్కాజిగిరి ఆసుపత్రి బలోపేతమైంది. టీమ్స్ అందుబాటులోకి వస్తే జిల్లా ప్రజలకు వైద్య సేవలు సులభతరం కాగలవు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజులకు అడ్డుకట్ట వేస్తాం. అనుమతి లేని ఆసుపత్రులు,నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటాం.
- సంక్షేమ హాస్టళ్లు, అంగన్వాడీలు, మహిళా సంఘాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. కాలేజీ, హైస్కూల్ హాస్టళ్లలో కొత్త మెస్‌చార్జీల మెనూ పకడ్బందీగా అమలు చేస్తాం. అంగన్వాడీ సెంటర్లలో పిల్లలు ,గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంటాం. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తాం. క్యాంటీన్లతో సహా వారికి చిన్నతరహా పరిశ్రమలు మహిళా గ్రూపులు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపడతాం.

భూ పరిరక్షణ..అక్రమార్కులపై ఉక్కుపాదం

జిల్లాలో ప్రభుత్వ ,అసైన్డ్ భూముల పరిరక్షిస్తాం. వాటి రక్షణ బాధ్యత తహసీల్దార్లకు అప్పగించాం. భూ కబ్జాదారులపై కేసుల నమోదుకు వెనుకాడం. అక్రమ భవన నిర్మాణాలు ,లే అవుట్లపై ఉక్కుపాదం మోపుతాం. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే చర్యలను సమర్ధించం. అటువంటి వారికి సహకరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం . అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతాం .

మౌలిక వసతుల కల్పనకు కృషి

జిల్లాలో 4 నగరపాలక సంస్థలు ,12 మున్సిపాలిటీల్లో ప్రజలకు కనీస వసతుల కల్పన లక్ష్యంగా పని చేస్తాం. సమీకృత మార్కెట్ల నిర్మాణాల్లో వేగం పెంచుతాం. రోడ్లు,పారిశుద్ధ్యం,డ్రైనేజీ సమస్యలపై దృష్టి సారిస్తాం. ఆస్తి పన్ను మదింపు , ట్రేడ్ లైసెన్సుల జారీ, భవన నిర్మాణ అనుమతులు, ఇంటి నంబర్ల అలాట్ మెంట్, ఖాళీ స్థలాలపై పన్ను వంటి విషయాలను పరిశీలిస్తున్నాం. లక్ష్యానికి తగ్గట్టుగా 16 పురపాలికల్లో రూ.365 కోట్ల పన్నులు వసూలు చేస్తాం. ఇప్పటి వరకు 34 శాతం పన్నులు వసూలయ్యాయి.

పరిశ్రమలు, ఐటీ విస్తరణకు చర్యలు..

జిల్లాలో పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. ఐటీ రంగం కూడా పురోగతిలో ఉంది. వీటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటూనే... వాటి విస్తరించే దిశగా ముందడగు వేస్తాం. కొత్త పరిశ్రమలు ,ఐటీ రంగ విస్తరణకు సంబంధించి అవసరమైన భూసేకరణపై చర్యలు తీసుకుంటాం. వలస కుటుంబాలు అధికంగా ఉండటంతో శ్రామిక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తాం.

ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలపై దృష్టి

ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలైన ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు ,గృహలక్ష్మీ, గ్యాస్ రాయితీ తదితర పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు 1800 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది .ఇళ్లు నిర్మించుకునేందుకు జిల్లాలో పేదలకు నివాస స్థలాలు లేవు. ఈ నేపథ్యంలో స్లమ్స్ రీ–డెవలప్‌మెంట్ పోగ్రామ్ కింద జిల్లాలోని 16 పురపాలక సంఘాల పరిధిలో ఉన్న స్లమ్స్ గుర్తిస్తున్నాం. అక్కడే నివాసముంటున్న నిరుపేదలకు ఈప్రోగ్రామ్ కింద ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటాం.


పారదర్శక పాలన....

ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లడంతోపాటు అధికారులు, ఉద్యోగుల్లో జవాబుదారీతనాన్ని పెంచేందుకు పారదర్శక పాలనకు అందిస్తాం. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ,ఉద్యోగులు సమయపాలన పాటించేలా హాజరు శాతాన్ని మెరుగు పరుస్తాం. కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానం అమల్లో ఉంది. అయితే ఇప్పటి వరకు కొందరు అధికారులు ,ఉద్యోగులు బయోమెట్రిక్‌లో తమ పేరు రిజిస్టర్ చేసుకోలేదని తెలిసింది. వెంటనే నమోదు చేసుకోవాలని ఆదేశించాం. జిల్లా అధికారులు తమ కార్యాలయానికి రాకుండా .. ఫీల్డ్ విజిట్, ఇతర పనులకు వెళితే ముందుస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించాం. పాటించని వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయి.

ప్రోస్టేటైటిస్‌తో జర భద్రం

సాక్షి, సిటీబ్యూరో: పురుషులను ఎక్కువగా వేధించే సమస్యల్లో ప్రోస్టేట్ సమస్య ఒకటని ఏఐఎన్‌యూ యూరాలజిస్టు రాగూరి దీపక్ అన్నారు. 30 ఏళ్లు దాటిన వారిలో 10 శాతం నుంచి 12 శాతం మంది బాధితులుగా మారుతున్నారని నివేదికలు పేర్కొంటున్నాయన్నారు. దీనికి ప్రధానంగా మూత్రనాళాల్లో ఇన్ఫెక్షన్లు, టీబీ వంటివి కారణాలుగా కనిపిస్తున్నాయి. ప్రోస్టేటైటిస్ ఉన్న వారిలో తరచూ మూత్రానికి వెళ్లాల్సి రావడం, మూత్ర విసర్జన సమయంలో మంట, నొప్పి, జ్వరం రావడం, వృషణాల్లో అసౌకర్యంగా ఉండటం, వీర్యంతో పాటు రక్తం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆలస్యం చేస్తే జీవన నాణ్యత దెబ్బతింటుందని, ముందస్తుగా గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.జబ్బు తీవ్రతను బట్టి 4 వారాల నుంచి 6 వారాల పాటు మందులు వాడితే నెమ్మదిగా నయమవుతుందన్నారు. ప్రోస్టేటైటిస్ తీవ్రమైతే మాత్రం పుండులా మారిపోతుందని, శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుందని, అశ్రద్ధ చేస్తే మొదటికే మోసం వస్తుందని తెలిపారు.

నేడు భాగ్యలక్ష్మీ అమ్మవారికి బంగారు బోనం..



చార్మినార్: సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి భక్తులు బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు, వడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా ఏడుగురు అమ్మవార్లకు బంగారు బోనాలను సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి బోనాన్ని గత నెల 26న గోల్కొండ జగదాంబ అమ్మవారికి సమర్పించారు. రెండో బంగారు బోనాన్ని విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి, మూడో బోనాన్ని బల్కంపేట ఎల్లమ్మ తల్లికి, నాలుగో బోనాన్ని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి,ఐదో బోనాన్ని సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి సమర్పించారు. ఆరో బోనంగా మంగళవారం చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు,వడి బియ్యం సమర్పించనున్నామని కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘువేందర్ తెలిపారు. పాతబస్తీ హరిబౌలిలోని అక్కన్న మాదన్న దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా చార్మినార్‌కు తరలి వెళతామన్నారు. జోగిని అవిక బంగారు బోనమెత్తనున్నట్లు తెలిపారు.

సహదేవ్ మృతి సీపీఐకి తీరని లోటు



అల్వాల్: సీపీఐ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సమితి సభ్యులు కాపు సహదేవ్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం యాప్రాల్‌లో సహదేవ్ పార్థివ దేహానికి కూనంనేనితో సహా పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లాలో కామ్రేడ్ సహదేవ్ అనేక భూ పోరాటాలను నిర్వహించి పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వీఎస్.బోస్, జాతీయ సమితి సభ్యులు ఎండీ.యూసుఫ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిలుగౌడ్, జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, అనిల్, ధర్మేంద్ర, అంజయ్యనాయక్, దామోదర్‌రెడ్డి, శంకర్ రావు, శంకర్, కిషన్, స్వామి, హరినాథ్, సత్యప్రసాద్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో అస్థిపంజరం

- హబీబ్‌నగర్‌లో కలకలం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

నాంపల్లి: తాళం వేసి ఉన్న ఇంట్లో అస్థిపంజరం లభ్యమైన సంఘటన హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికంగా ఈ ఘటన తీవ్ర చర్చాంశనీయంగా మారింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం స్థానిక యువకులు క్రికెట్ ఆడుతుండగా బాల్ తాళం వేసి ఉన్న ఇంట్లో పడింది. దీంతో ఓ యువకుడు బాల్ తీసుకువచ్చేందుకు ఇంటి వెనుకవైపు ఉన్న గోడ దూకి లోపలికి వెళ్లాడు. లోపలికి వెళ్లిన అతడికి రిఫ్రిజిరేటర్ ఎదుట అస్థి పంజరం కనిపించింది. అస్థి పంజరం చుట్టూ ఉన్న వస్తువులకు బూజు పట్టి ఉన్నాయి.ఈ దృశ్యాన్ని అతను సెల్‌ఫోన్‌లో రికార్డు చేయడమేగాక సోషల్ మీడియాలో అప్లోడ్ చేశారు. ఇది వైరల్ కావడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించారు. దీనిపై సమాచారం అందడంతో ఆసిఫ్‌నగర్ ఏసీపీ బి.కిరణ్‌కుమార్, హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టి.పురుషోత్తమ్ రావు తదితరులు సంఘటనా స్థలానికి పరిశీలించారు. ఫోరెన్సిక్ టీం, క్లూస్ టీం ఆధారాలు సేకరించాయి. అస్థిపంజరం ఎవరిదనే కోణంలో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కొన్నేళ్ల క్రితమే అతను మృతి చెంది ఉండవచ్చని భాస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సదరు ఇంటికి సంబంధించిన వ్యక్తులను ఫోన్లు చేసి పోలీస్ స్టేషన్‌కు రప్పించే ప్రయత్నంలో చేశారు.

కుటుంబ సభ్యుల లెక్క తేలితేనే..

సదరు ఇంట్లో మునీర్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి నివాసం ఉండేవాడు. ఆయనకు పది మంది సంతానం. వీరిలో ఐదుగురు అన్నదమ్ములు, ఐదుగురు అక్కచెల్లెలు. కరోనా కంటే ముందు అందరూ కలిసే ఉన్నారు. తండ్రి మరణం తర్వాత కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్ధలు రావడంతో వారు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ముర్గీ మార్కెట్‌లోని సదరు ఇంట్లో పెళ్లికాని సోదరుడు అమీర్ ఉన్నట్లుగా పోలీసులు చెబుతున్నారు. తండ్రి మరణం తర్వాత కుటుంబ సభ్యుల మధ్య మాటలు లేకపోవడంతో ఎవరు ఎక్కడున్నారో కూడా తెలియని నెలకొంది. ఆ తర్వాత ఏవరూ నాంపల్లికి వచ్చిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో కేసును చేధించేందుకు పోలీసులు కుటుంబ సభ్యులందరినీ స్టేషన్‌కు రప్పించే ప్రయత్నం చేయగా కేవలం ఇద్దరు మాత్రమే పీఎస్‌కు వచ్చారు. మిగతా వారందరూ పోలీసులకు సహకరించడం లేదని తెలిసింది. మరికొారందరికి ఫోన్లు చేసినా అందుబాటులోకి రావడం లేదు. దీంతో అస్థి పంజరం ఎవరనేది తేలడం పోలీసులకు కష్టంగా మారింది. ఇంటి యజమాని విదేశాల్లో ఉంటాడని స్థానికులు చెబుతుండగా..పాత బస్తీలోనే ఉన్నారంటూ బంధువులు, పోలీసులు చెబుతున్నారు. పెళ్లి, ఆస్తి కోసం గొడవ పడిన అమీర్ ఖాన్‌ను ఎవరైనా హత్య చేసి తాళం వేశారా? లేక అతడే ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైనా మునీర్ కుటుంబ సభ్యులందరూ ఒకే చోటకు వస్తే కానీ ఈ కేసు చిక్కు ముడి వీడేలా లేదు.

రోగి సహాయకురాలితో వార్డుబాయ్ అసభ్య ప్రవర్తన

- డీడీహెచ్‌లో ఘటన
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

నల్లకుంట: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆసుపత్రిలో చేరిన ఓ రోగి సహాయకురాలు (రోగి భార్య)తో ఆసుపత్రిలో పనిచేసే వార్డు బాయ్ అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి కేకలు విన్న ఇతర రోగుల సహాయకులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్ ప్రాంతానికి చెందిన శివ లక్ష్మణ్ (40) అనే వ్యక్తి హైబీపీతో బాధపడుతూ గత శుక్రవారం విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరాడు. వైద్యులు అతడిని పరీక్షించి చికిత్సలు అందించినా బీపీ అదుపులోకి రాకపోవడంతో ఐసీయూలో చేర్పించారు. ఆదివారం అతడి ఆరోగ్యం మెరుగుపడటంతో జనరల్ వార్డులోని షేరింగ్ రూం 14 లోకి మార్చారు. ఈ క్రమంలో రోగి వద్ద అతడి భార్య సహాయకురాలిగా ఉంటోంది. సోమవారం తెల్లవారు జామున జనరల్ వార్డులో నైట్ డ్యూటీలో ఉన్న సీతారాం బెడ్ షీట్ మార్చాలనే సాకుతో షేరింగ్ రూంలోకి వచ్చాడు. ఆ సమయంలో బెడ్‌పై రోగి నిద్రపోతుండటాన్ని గుర్తించి గది తలుపుకు గడియ పెట్టి రోగి సహాయకురాలిగా ఉన్న మహిళ చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో తోటి రోగుల సహాయకులు అతడిని పట్టుకుని చితకబాదారు. నల్లకుంట పోలీసులకు అప్పగించారు. ఓయూ ఏసీపీ జగన్, నల్లకుంట ఎస్‌హెచ్‌ఓ జగదీశ్వర్ రావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు సీతారాం

అతను మానసిక రోగి అని ఆలస్యంగా తెలిసింది

వార్డు బాయ్ సీతారాం మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు అతని కుటుంబ సభ్యులు చెప్పారు. అతను గత కొంత కాలంగా ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మందులు వాడుతున్నట్లు తెలిసింది. ఈ విషయం మాకు తెలియక విధుల్లో పెట్టుకున్నాము. సోమవారం ఉదయం 14 వార్డులోకి వెళ్లిన తాను పొరపాటున తూలి పడ్డానని చెబుతున్నాడు. పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

-డాక్టర్ ఉమాపతి. డీడీహెచ్ ఆర్ఎంవో

లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు



శివరాత్రి మల్లేశ్

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఆమె ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి సోమవారం తీర్పు చెప్పారు. ఏపీపీలు సునీత, రఘు కథనం మేరకు వివరాలివిలా ఉన్నాయి. మీర్‌పేట్ ఠాణా పరిధిలో లెనిన్ నగర్‌లో మైనర్ బాలిక(17) తన కుటుంబంతో కలిసి నివాసం ఉండేది. అదే ప్రాంతంలో ఉంటున్న బాలిక బంధువు మల్లేశ్ తరచూ వారి ఇంటికి వచ్చి వెళ్లేవాడు. బాలికకు మాయమాటలు చెప్పి ఆమెపై పలు మార్లు బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో బాలిక గర్భం దాల్చింది. దీనిని గుర్తించిన బాధితురాలి తండ్రి ఆమెను ఆస్పత్రికి తరలించగా ఏడు నెలల గర్భవతి అని తేలడంతో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ చేశారు. ఇదిలా ఉండగా 2019 మే 07న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బాలిక కడుపులోని పసికందు డీఎన్‌ఏ నిందితుడి డీఎన్‌ఏతో మ్యాచ్ కావడం, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలి కుటుంబానికి రూ. 2లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేశారు. నిందితుడికి శిక్షలా కృషి చేసిన పోలీసులు యాదగిరి, కవిత, కృష్ణంరాజు, శోభలను ఉన్నతాధికారులు అభినందించారు.

కరెంటు స్తంభాన్నీ కలిపేసుకున్నాడు



రహమత్‌నగర్: ఎస్ఎస్‌బీనగర్‌లో ఓ వ్యక్తి తన భవనం సెల్బాలు విస్తరించేందుకు ఏకంగా విద్యుత్ స్తంభం పైన ఉండే యాంగిల్స్‌ను కూడా తన భవనంలో కలిపేసుకుని నిర్మాణం చేపట్టాడు. బస్తీలోని ప్రభుత్వ పాఠశాల ఎదుట ప్రమాదకరంగా మారిన విద్యుత్తు స్తంభంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కల్లును నిషేధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర



మాట్లాడుతున్న బాలగోని బాలరాజు గౌడ్

హిమాయత్‌నగర్: తెలంగాణ సంస్కృతిలో భాగమైన కల్లును నిషేధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే తమ వైఖరి మార్చుకోవాలని, లేని పక్షంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లు గీత వృత్తిపై ఆధారపడి లక్షలాదిమంది జీవనం సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కల్లు దుకాణాలపై ఎక్సైజ్ ఆఫీసర్లు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఒక ప్రాంతంలో జరిగిన సంఘటనను రాష్ట్రంలోని మొత్తం కల్లు దుకాణాలకు ఆపాదించడం సరికాదన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై నిజనిర్ధారణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కూకట్‌పల్లిలో జరిగిన కల్తీ కల్లు ఘటనలో లిక్కర్ మాఫియా కుట్ర ఉందని, దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లిక్కర్ అమ్మకాలు పెంచేందుకు కల్లు గీత వృత్తి పట్ల దుష్ప్రచారం తగదన్నారు. కమిటీ నాయకులు అయిలి వెంకన్న గౌడ్, దుర్గయ్య గౌడ్, ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్, వంగ సదానందం గౌడ్, బైరు శేఖర్, గోదా వెంకటేష్ గౌడ్, కొత్త నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



రమాకాంత్ (ఫైల్)

దుండిగల్: బెట్టింగ్ యాప్ నిర్వాహకుల వేధింపులతో మనస్తాపానికి లోనైన ఓ బీటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు తోటపల్లి తిరుపతి కుమారుడు రమాకాంత్ (20) మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో ఉంటున్నాడు. ఆన్ లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన అతను నెల రోజుల క్రితం జ్ఞానేశ్వర్ అనే వ్యక్తికి రూ.34 వేలు ఇచ్చానని, మరో 10వేలు అప్పు ఉన్నట్లు తండ్రికి తెలిపాడు. ఈ నెల 13న మధ్యాహ్నం అతడి గదికి వచ్చిన బెట్టింగ్ యాప్ నిర్వాహకులు ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ తీసుకెళ్లారు. దీంతో ఆదివారం తండ్రికి ఫోన్ చేసిన రమాకాంత్ బెట్టింగ్ యాప్ నిర్వాహకులు ఇంకా డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నారని తెలిపాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం అతను గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అతడిని కిందకు దింపి బహదూర్‌పల్లిలోని ఎస్.వి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బెట్టింగ్ యాప్ నిర్వాహకుల వేధింపుల కారణంగానే తన కుమారుడు మృతి చెందాడని తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి విద్యార్థిని దుర్మరణం

జగద్గిరిగుట్ట: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కింద పడి ఓ విద్యార్థిని మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి వరంగల్‌కు చెందిన వంగాల రూపేష్ కుమార్, లక్ష్మీ దంపతులు ఆల్విన్ కాలనీ సాయిబాబా ఆలయ సమీపంలో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె శ్రీజ(16) కూకట్‌పల్లిలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం ఆమె కాలేజీకి వెళ్లేందుకు ఆల్విన్ కాలనీ రోడ్డులోని బస్టాప్‌కు వచ్చింది. అదే సమయంలో కదిలేందుకు సిద్ధంగా ఉన్న ఉప్పల్ డిపోకు చెందిన బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా అదుపుతప్పి కింద పడింది. బస్సు టైర్లు ఆమె మీదుగా వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. దీనిని గుర్తించిన స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శాకాంబరి అలంకరణలో రాజరాజేశ్వరి దేవి



ఫిలింనగర్: ఫిలింనగర్ దైవసన్నిధానం శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారు సోమవారం భక్తులకు శాకాంబరి దేవిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవారిని పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు.

రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలి



కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–13లోని శ్రీరామ్‌నగర్ బస్తీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను సోమవారం గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించిన ఆమె ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో ఫోన్‌లో మాట్లాడారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, రెండు నెలల్లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. పనులను వేగవంతం చేయాలని కోరారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



రేషన్‌కార్డులదారుల పత్రాలను తనిఖీలు చేస్తున్న అధికారి నసీర్

శ్రీనగర్‌కాలనీ: సోమాజీగూడ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో నూతన రేషన్‌కార్డు వెరిఫికేషన్‌ను నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సోమవారం పత్రాలను వెరిఫై చేశారు. రేషన్‌కార్డుల వెరిఫికేషన్ అధికారి నసీర్ మాట్లాడుతూ అర్హులైన వారికి తప్పక జారీ చేస్తామని చెప్పారు. స్థానిక ఎంఐఎం నేత ఎర్ర నగేష్, స్థానిక బస్తీ నేతలు రేషన్‌కార్డుదారులకు పలు సూచనలు చేశారు.

సర్కిల్–19 డిప్యూటీ కమిషనర్‌గా రజినీకాంత్‌రెడ్డి



డిప్యూటీ కమిషనర్ రజినీకాంత్‌రెడ్డి

వెంగళరావునగర్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 యూసుఫ్‌గూడ ఉప కమిషనర్‌గా జి.రజినీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–17 ఖైరతాబాద్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెండింగ్ పనులు, ట్యాక్స్, శానిటేషన్ తదితర అంశాలపై దృష్టి సారిస్తానని చెప్పారు. ఈ మేరకు త్వరలోనే ఆయా శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

జీహెచ్‌ఎంసీ పీఆర్‌ఓగా దశరథం



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దశరథం

లక్డీకాపూల్: జీహెచ్‌ఎంసీ పీఆర్‌ఓగా మామిండ్ల దశరథం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆయన తొలుత జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సీపీఆర్‌ఓ మహమ్మద్ ముర్తుజాను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు ఆయన సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. డిప్యుటేషన్‌పై జీహెచ్‌ఎంసీ పీఆర్‌ఓగా నియమితులయ్యారు. గతంలో కామారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్ జిల్లా పౌర సంబంధాల అధికారిగా, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్లలో పీఆర్‌ఓగా విధులు నిర్వర్తించారు.

ఆస్పత్రుల్లో అధికారుల తనిఖీలు

- జ్వరం వచ్చిన వారి వివరాలు సేకరణ
- ఆయా ప్రాంతాల్లో దోమల నివారణపై దృష్టి
- పారిశుద్ధ్య సమస్య లేకుండా చూసుకోవాలని సూచన



పంజగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీ దవాఖానాలో వివరాలు తెలుసుకుంటున్న డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్: వాతావరణ మార్పులు ఒకవైపు.. వానాకాలం మరోవైపు.. వ్యాధుల విజృంభణకు కారణమవుతున్నాయి. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి దోమలు విజృంభిస్తుండటంతో ప్రజలు జ్వరాల బారిన పడుతూ మంచాలకు పరిమితమవుతున్నారు. ఆస్పత్రులకు కూడా జ్వరం బాధితులు క్యూ కడుతున్నారు. లార్వా దశలోనే దోమలను నివారించే ప్రక్రియలో భాగంగా కొంత కాలంగా జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది యాంటీలార్వా పనులు చేపడుతున్నారు. అయితే జ్వరాలు విజృంభిస్తున్న ప్రాంతాలను గుర్తించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ర్యాండమ్‌గా బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వివరాలు ఆరా తీస్తున్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధులు నమోదవుతున్న ప్రాంతాలపై దృష్టి పెట్టేందుకు ఆస్పత్రుల్లో వివరాలు తెలుసుకుంటున్నారు. ఏదైనా ఆస్పత్రిలో డెంగీ కేసు నమోదైతే సదరు బాధితుడు ఏ ప్రాంతానికి చెందిన వాడో తెలుసుకుని అక్కడ పారిశుద్ధ్యం, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

అన్ని ప్రాంతాలను ప్రతిరోజూ సందర్శిస్తూ..

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 8 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, 23 బస్తీ దవాఖానాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతిరోజూ సందర్శిస్తూ జ్వరంతో ఇబ్బంది పడుతున్న వారి వివరాలను తెలుసుకుంటున్నారు. ఎక్కడైనా జ్వరం కేసులు నమోదైతే అక్కడి పరిసరాలను



నివాసాల్లో దోమల నివారణపై చర్యలు తీసుకుంటున్న సిబ్బంది

పరిశీలిస్తున్నారు. ఒకవేళ దోమల ద్వారా వస్తే ఫాగింగ్ చేపట్టడమే కాకుండా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి జ్వరాలు వస్తే వారు ఎక్కడి నుంచి వచ్చారో తెలుసుకుని ఆ ప్రాంతాలకు సమాచారం ఇస్తున్నారు. దీని ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టడమే కాకుండా పారిశుద్ధ్య సమస్యను కూడా పరిష్కరించే అవకాశం లభిస్తుందని జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 డీసీ సమ్మయ్య తెలిపారు. తాము ఎంటమాలజీ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నివాసితులు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇళ్ల ప్రాంగణాల్లో మురుగు, వరదనీరు నిల్వకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. పాడుబడ్డ టైర్లు, కుండీలు, పాత కుర్చీలు, చెక్కలు, ఇతర ప్లాస్టిక్ సామాన్లు పేరుకుపోవడం వల్ల దోమలు విజృంభిస్తుంటాయని, వీటి ద్వారానే దోమలు వృద్ధి చెందుతాయని అధికారులు పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుందని అధికారులు అంటున్నారు.

సమస్యలకు పరిష్కారం చూపాలని మేయర్‌కు వినతి



మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీనేతలు

వెంగళరావునగర్: కొన్నేళ్లుగా కాలనీలో పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారం చూపాలని వెంగళరావునగర్‌కాలనీ నేతలు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. ఈ మేరకు సోమవారం వెంగళరావునగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి తమ సమస్యలను వివరించారు. అనంతరం ఆమెకు వినతి పత్రాన్ని సమర్పించారు. ముఖ్యంగా కాలనీలో రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ అసంపూర్తిగా మిగిలిందని, సీసీ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, అనేకచోట్ల సీవరేజ్ లైన్లు పాడైపోయి మురుగు పొంగి పారుతోందని అన్నారు. వీధి దీపాలు లేకపోవడంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, కాలనీలోని టీ–జంక్షన్ చౌరస్తా వద్ద ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను తక్షణమే తొలగించాలని కోరారు. మేయర్‌ను కలిసిన వారిలో రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్.రెడ్డి, కాలనీ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ డి.నాగార్జునరెడ్డి, అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.శౌరిరాజు, జాయింట్ సెక్రటరీ డి.ధనుంజయ్‌రెడ్డి నాయకులు సోమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ మల్లు రవి పుట్టిన రోజు వేడుకలు



75 కేజీల భారీ కేక్‌ను కట్ చేస్తున్న ఎంపీ మల్లు రవి

బంజారాహిల్స్: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి 75వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లోని ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసంలో టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు బన్సూరి మోహన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ వేడుకల్లో ఆయన 75 కేజీల భారీ కేక్‌ను అభిమానులు, కార్యకర్తలు, నేతల సమక్షంలో కట్ చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తదితరులు ఆయనను కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

తీన్మార్ మల్లన్నకు వైప్లస్ కేటగిరి భద్రత కల్పించాలి



అభివాదం చేస్తున్న మున్నూరు కాపు సంఘాల నేతలు

పంజగుట్ట: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ప్రభుత్వం తక్షణమే వై ప్లస్ కేటగిరి భద్రత కల్పించాలని మున్నూరు కాపు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు మున్నూరు కాపు సంఘాల నేతలు ఉగ్గే శ్రీనివాస్ పటేల్, పర్వతం వెంకటేశ్వరు, పిడికిలి రాజు, మణికొండ వెంకటేశ్వర్లు, పెద్ది పెంటయ్య, ఎడ్ల రవి కుమార్ బాలశ్రీనివాస్, దాదె వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యం వాడే ఒక మామూలు సామెత వాడినందుకు మల్లన్న మీద హత్యాయత్నం చేయడం జాగృతి కవిత అగ్రకుల అహంకారానికి ప్రతీక అన్నారు. దాడి చేసిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ధర్మపురి అరవింద్‌పై దాడి చేయించిందని, ఇప్పుడు మల్లన్నపై కవిత రెండవ మున్నూరు కాపు నాయకుడిపై దాడులు చేయించిందని, మున్ముందు ఆమెకు ఓటుతోనే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొండపల్లి రజిత, ఎడ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి హెల్త్ కిట్స్ పంపిణీ

హిమాయత్‌నగర్: మున్సిపల్ సిబ్బందికి హెల్త్ కిట్స్‌ను హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ సోమవారం పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేదల గురించి, వారి ఆరోగ్యం గురించి ఆలోచించి అన్ని విధాలుగా ఆదుకుంటోందని అన్నారు. కార్యక్రమంలో డీఎంసీ మారుతి దివాకర్, ఏఎం అండ్ హెచ్‌వో హేమలత, ఎస్‌ఎఫ్‌ఏ సతీష్, కాంగ్రెస్ నాయకులు మహేష్, ప్రియరాజ్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ పురోగతికి తోడ్పడేలా నైపుణ్య శిక్షణ

హిమాయత్‌నగర్: దేశ పురోగతికి తోడ్పడేలా ఎక్కువ మంది హిప్నోథెరపిస్టులను తీర్చిదిద్ది సైకాలజిస్టులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఇప్పటికే ఉన్న హిప్నోథెరపిస్టులకు ప్రోత్సాహం అందిస్తామని మైండ్ సపోర్ట్ హిప్నోసిస్, కౌన్సిలింగ్ సంస్థ ఫౌండర్ డైరెక్టర్, హిప్నోసిస్ కోచ్ శశికిరణ్ పేర్కొన్నారు. హిప్నోథెరపీ సేవలు అందిస్తున్న హిప్నోథెరపిస్టులకు 'కిక్ స్టార్ట్' అవార్డులను సంస్థ అధ్యక్షులు దేవాన్షితో కలసి ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ విద్యార్థులు తెలంగాణ, ఏపీతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాలలో అద్భుతమైన థెరపీలు అందిస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



రహమత్‌నగర్: కారు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రగడ్డ శాస్త్రీనగర్‌కు చెందిన సత్యనారాయణ యాక్టివా ద్విచక్ర వాహనంపై రాజీవ్‌నగర్ మిడ్ లాండ్ బేకరి వద్ద నుంచి రాజీవ్‌నగర్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే వేగంగా వచ్చిన స్కోడా కారు యాక్టీవాను ఢీ కొట్టడంతో ఆయన అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న బోరబండ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్ల మెయింటనెన్స్, ట్రీ కట్టింగ్ పనుల్లో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. హుస్సేన్‌సాగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బతుకమ్మకుంట, పాటిగడ్డ, నెక్లెస్ రోడ్డు, జెండా పీటి ఏరియా, లేక్ ప్లాజా ఏరియా, లుంబినీపార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బుద్ధపూర్ణిమా, అమోఘం హోటల్, బోట్స్ క్లబ్, లుంబినీపార్క్, హుస్సేన్ సాగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎన్టీఆర్ మార్గ్, హనుమాన్ టెంపుల్, ఎన్టీఆర్ ఘాట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యం

హిమాయత్‌నగర్: పతాంజలి యోగ సమితి వారి ద్వారా యోగ, ఆహారంపై అవగాహన సదస్సు సోమవారం బాబు జగ్జీవన్ రామ్ ప్రభుత్వ కళాశాల(స్వయంప్రతిపత్తి)లో ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.ఎం.విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. అయన మాట్లాడుతూ ఆరోగ్యంగా మానసికంగా శక్తివంతులుగా ఉండాలంటే ఏకాగ్రత సాధనలో యోగ, నిత్య ఆహార అలవాట్లు దోహదపడతాయని తెలిపారు. ముఖ్య అతిథిగా తెలంగాణ పతాంజలి యోగ సమితి అధ్యక్షులు వాస్ప్రారి శివుడు మాట్లాడుతు చక్కటి ఆరోగ్యానికి, ఏకాగ్రత, చురుకుదనానికి ఆధారం యోగ, నిత్య ఆహారపు అలవాట్లే అన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇరువురి అరెస్ట్

వెంగళరావునగర్: గంజాయి సేవిస్తున్న ఇద్దరిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. వెంగళరావునగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గంజాయి తాగుతున్నారని మధురానగర్ పీఎస్‌కు సమాచారం అందింది. దాంతో పీఎస్ నుంచి పెట్రోలింగ్‌ను కట్టుదిట్టం చేశారు. ఆదివారం అర్ధరాత్రి యాదగిరినగర్ కమాన్‌గల్లీలో ఎస్ఐ జి.శివశంకర్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సౌరవ్ రంజన్ సాహో, అమలేఖ్ అనే ఇద్దరు గంజాయి తాగుతూ కనిపించారు. పోలీసులు వారి వద్దకు వెళ్లగా పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద 5 గ్రాముల గంజాయి ఉంది. వారిని అరెస్టు చేసి గంజాయిని సీజ్ చేశారు. మధురానగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనదారుడిపై ఆటోడ్రైవర్ దాడి

వెంగళరావునగర్: నిర్లక్ష్యంగా ఆటో నడపడమే కాకుండా ద్విచక్ర వాహనదారుడిపై ఆటో డ్రైవర్, అతడి స్నేహితులు దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నాగర్‌కర్నూల్‌కు చెందిన ఏ.నరేష్ మియాపూర్‌లో ఉంటూ ఆటో నడిపిస్తున్నాడు. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై మియాపూర్ వెళ్తున్నాడు. అమీర్‌పేట సిగ్నల్స్ వద్దకు రాగానే శ్రీకాంత్ అనే వ్యక్తి ఆటో నడుపుతూ సడన్‌గా బ్రేక్ వేశాడు. దాంతో వెనుక ద్విచక్ర వాహనంపై వస్తున్న నరేష్ కింద పడ్డాడు. ఆటో డ్రైవర్ శ్రీకాంత్ కింద పడిన నరేష్ వద్దకు వచ్చి బెదిరించాడు. అంతేగాకుండా తన స్నేహితులను పిలిపించి నరేష్‌పై దాడి చేశాడు. బాధితుడు సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ భారతినాయక్

బంజారాహిల్స్: పేద, మధ్య తరగతి ప్రజలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్య ఖర్చులు భారం కావడంతో వారికి సహాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ బి.భారతి నాయక్ అన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు సోమవారం ఆదర్శ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 20 మంది లబ్ధిదారులకు ఆమె సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకంలో లబ్ధిదారులు కావాలంటే స్థానిక ఎమ్మెల్యేకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తులు అందజేస్తే సరిపోతుందని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ డివిజన్ కాంగ్రెస్ నేత పి.రాములుచవాన్ పాల్గొన్నారు.

బీఆర్కే భవన్ వద్ద ఫ్రీలెఫ్ట్ పునరుద్ధరించాలి



జోనల్ కమిషనర్‌తో సమావేశమైన ట్రాఫిక్ ఏసీపీ మోహన్‌రావు

బంజారాహిల్స్: సెక్రటేరియట్ చౌరస్తాలోని బీఆర్కే భవన్ వద్ద ఫ్రీలెఫ్ట్ కోసం రోడ్డును విస్తరించాల్సిందిగా సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ మోహన్ కుమార్, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి సోమవారం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్‌జయంతితో సమావేశమయ్యారు. బీఆర్కే భవన్ వద్ద ట్రాఫిక్ విపరీతంగా ఉంటుందని, ఇక్కడ ఫ్రీలెఫ్ట్ ఏర్పాటు చేస్తే సమస్య చాలా వరకు తగ్గుముఖం పడుతుందని, స్థలం కూడా అందుబాటులో ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఓల్డ్ తెలుగుతల్లి ఫ్లైఓవర్, ఇక్బాల్‌మినార్, అంబేడ్కర్ విగ్రహం తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనదారుల ఇబ్బందులను వివరిస్తూ ఫ్రీలెఫ్ట్ అవసరాన్ని పేర్కొంటూ వినతి పత్రం కూడా అందజేశారు. అదేవిధంగా చాలా జంక్షన్లలో జీబ్రా లైన్స్ చెరిగిపోయాయని, తిరిగి జీబ్రా లైన్స్ వేయాలని వారు కోరారు.

ట్రిపుల్‌ఐటీలో ఇద్దరు రాజ్‌భవన్ విద్యార్థులకు సీటు



చాతుర్యరెడ్డి



దీప్తిరెడ్డి

బంజారాహిల్స్: రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. ఈ ఏడాది పదో తరగతిలో 22 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రిపుల్ ఐటీ కోసం ఇద్దరు విద్యార్థులు చాతుర్యరెడ్డి, దీప్తిరెడ్డిలు దరఖాస్తు చేసుకోగా ఇద్దరికీ సీట్లు దక్కాయి. చాతుర్యారెడ్డికి మహబూబ్‌నగర్‌లో నూతనంగా ప్రారంభిస్తున్న ట్రిపుల్ ఐటీలో సీటు రాగా, దీప్తిరెడ్డికి బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు వికారుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని పీజేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పి.విజయారెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్–7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు స్కూల్ బ్యాగులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తాము పీజేఆర్ ఫౌండేషన్ తరపున బుక్స్, బ్యాగులు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందని, పేద పిల్లల చదువుల కోసం తాము కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు భీమ్‌రావు, నజీర్, అప్పారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఏఐ మహోత్సవ్



ఏఐ భారత్ మహోత్సవ్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: దేశంలో శరవేగంగా విస్తరిస్తున్న ఏఐ టెక్నాలజీ పట్ల యువతలో అవగాహన కల్పించేందుకు 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఏఐ భారత్ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సమావేశాల చైర్మన్ డాక్టర్ సీవీ మహేష్ కుమార్ తెలిపారు. 17వ తేదీన హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో, 18న డ్రాప్ అవుట్, స్టార్టప్ కేంద్రం గచ్చిబౌలిలో, 19వ తేదీన మేడ్చల్ సీఎంఆర్ కాలేజీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని శాస్త్రవేత్త డాక్టర్ ఇ.జి.రాజన్, శిరీష, రఘు, అభినవ్, కనుప్రియ, ఎ.ప్రవీణతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి ఏఐ టెక్నాలజీ ఒక ఆయువుపట్టు అని, భవిష్యత్‌లో ఏఐ టెక్నాలజీ అన్నిరంగాలకు వ్యాపిస్తుందని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సులో ఎంతో మంది ప్రముఖులు పాల్గొని ఏఐ అద్భుతాల గురించి వివరిస్తారని తెలిపారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో వన మహోత్సవం



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వన మహోత్సవాన్ని సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడంలో భాగంగా విద్యార్థుల్లో విలువలను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటడం వంటి చిన్న కార్యక్రమాలు గ్రహం మీద శాశ్వత ప్రభావాన్ని చూపుతాయని విద్యార్థులు గుర్తుచేశారు. ప్రీ–ప్రైమరీ విద్యార్థుల నృత్యం ఆలోచింపజేసింది. దీని తర్వాత విద్యార్థులు వృక్షజాలం, జంతుజాలం ప్రాముఖ్యతపై ప్రదర్శన ఇచ్చారు. చెట్లు నిస్వార్థంగా మనకు నీడ, గాలి, ఆహారం ఆశ్రయాన్ని ఎలా ఇస్తాయో గుర్తు చేశారు. ప్రాథమిక విద్యార్థులు చేసిన 'మానస వీణ' నృత్యం వన మహోత్సవ వేడుకలకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభను జోడించింది. కార్యక్రమంలో అధ్యక్షులు ముకుంద్‌మురళీ, డైరెక్టర్ వరలక్ష్మీ, ప్రిన్సిపాల్ కాంచనవల్లి తదితరులు పాల్గొన్నారు.



కొడుకుల నుంచి ప్రాణహాని ఉంది

పోలీసులను వేడుకున్న ఓ వృద్ధ తల్లి భద్రమ్మ



బాధితురాలు భద్రమ్మ

హిమాయత్‌నగర్: కన్న కొడుకుల నుంచి ప్రాణహాని ఉంది రక్షణ కల్పించాలంటూ ఓ వృద్ధ తల్లి పోలీసులను వేడుకుంది. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మల్కాజిగిరికి చెందిన భద్రమ్మ(67) తన గోడును వెళ్లబోసుకుంది. తన భర్త కష్టపడి సంపాదించిన ఆస్తిని తన కొడుకులు అనిల్, వినయ్ అక్రమంగా ఆక్రమించుకొని తనను రోడ్డుపాలు చేశారని కన్నీరు పెట్టుకుంది. తన కూతురు చేరదీయకపోతే అడుక్కొని బతకాల్సిన పరిస్థితి వచ్చేదని ఆవేదన వ్యక్తం చేసింది. రూ.3 కోట్ల విలువ చేసే ఆస్తిని కాజేయాలని నకిలీ పత్రాలను సృష్టించారని తెలిపింది. దీనిపై మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో తన కొడుకులపై ఫోర్జరీ కేసు నమోదు చేసినప్పటికీ పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించింది. తనను ఎలాగైనా అంతమొందించి ఆస్తి కాజేయాలని చూస్తున్నారని వాపోయింది. తన కొడుకులు అనిల్, వినయ్‌లపై చర్యలు తీసుకొని తనకు రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకుంది.

నగరంలో నేడు

- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో జరుగుతుంది
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఓయూ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రొ.జి.రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ)లో 2025–26 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ, పీజీ కోర్సుల్లో మొదటి విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డైరెక్టర్ ప్రొ.భట్రచార్యులు సోమవారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం డిగ్రీ కోర్సులతోపాటు ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ, ఎంకాం, రెండు ఎమ్మెస్సీ కోర్సులు, పీజీ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హతలు, ఫీజులు, ఇతర వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు.

సినారె పురస్కారానికి డాక్టర్ అఫ్సర్ ఎంపిక



సుల్తాన్‌బజార్: కవి, విమర్శకుడు డాక్టర్ అఫ్సర్‌కు ఈ ఏడాది డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేయాలని తెలంగాణ సారస్వత పరిషత్ నిర్ణయించింది. ఈ నెల 26న పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన సారస్వత పరిషత్ కళామందిరంలో జరిగే సినారె 94వ జయంతి ఉత్సవంలో పురస్కారాన్ని అందజేయనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారం కింద రూ.20 వేల నగదు అందజేసి జ్ఞాపికతో సత్కరిస్తామన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన అఫ్సర్ 1980 నుంచి రచనలు చేస్తున్నారని, అనేక కవితా సంపుటాలను అత్యాధునిక విమర్శన గ్రంథాలను వెలువరించారన్నారు.

దేవాదాయ భూముల పరిరక్షణకు చర్యలు

మంత్రి కొండా సురేఖ



కాచిగూడ: అన్యాక్రాంతమైన దేవాదాయ శాఖ భూములను పరిరక్షిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో కాచిగూడ తుల్జాభవన్‌లో నిర్వహిస్తున్న పంచకుండాత్మక చండీ కుబేర పాశుపత యాగాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. సకాలంలో వర్షాలు కురవాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఇలాంటి యాగాలు చేపట్టాలని అన్నారు. తమ ప్రభుత్వం అర్చకుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. ఇప్పుడు అనేక గుడులను ఎంపిక చేసి రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామని చెప్పారు. అయితే దానిని రూ.30 వేలకు పెంచాలని అర్చకులు కోరుతున్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, తుల్జాభవన్ ఈఓ ఎస్.అంజనారెడ్డి, అర్చక సంఘం నేతలు డాక్టర్ పోతులపాటి రామలింగేశ్వర శర్మ, నందనం హరికిషన్ శర్మ, కొందూరు విశాలాక్షి, ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

నేపాల్ ప్రజాప్రతినిధులకు శిక్షణ

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో నేపాల్ ప్రజాప్రతినిధులైన మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, ప్రధాన పరిపాలన అధికారులకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అర్బన్ గవర్నెన్స్‌పై సోమవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ శిక్షణ భారత్, నేపాల్ అనుబంధాలను మరింత బలోపేతం చేస్తుందన్నారు. శిక్షణలో భాగంగా వ్యవసాయం, ఉద్యానతోటలపై అధ్యయనం, గ్రామీణ, పట్టణ పాలనలో భారత అనుభవం వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. దీంతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, హైదరాబాద్‌లోని ఎంపిక చేసిన పట్టణ, గ్రామీణ ప్రాంత్రాలు, వ్యవసాయ క్షేత్రాలను వారికి చూపించనున్నారు. ఈ శిక్షణ జూలై 23 వరకు ఉంటుందని తెలిపారు.

కలిసి వస్తూ.. ఫిర్యాదులు చేస్తూ..

- హైడ్రా అధికారుల దృష్టికి తీసుకువస్తున్న వైనం
- సోమవారం నాటి ప్రజావాణిలో అందిన 61 ఫిర్యాదులు

ప్రభుత్వ స్థలాల కబ్జాలపై సామాన్యుల్లో చైతన్యం

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని భూఆక్రమణలపై సామాన్యులు గళం విప్పుతున్నారు. కాలనీల్లోని రహదారుల మూసివేతపై గరంగరం అవుతున్నారు. పార్కు స్థలాల కబ్జాలపై నిరసన తెలుపుతున్నారు. ప్రైవేట్ స్థలాలకు అడ్డుగా వెలిసిన నిర్మాణాల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటల కబ్జాలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) దృష్టికి తీసుకు వస్తున్నారు. సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 61 ఫిర్యాదులు దాఖలయ్యాయి. అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య వీటిని పరిశీలించి సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కార బాధ్యతలను అప్పగించారు. ఆయా ఫిర్యాదులు ఇలా...

- శేరిలింగంపల్లి రాఘవేంద్ర షెల్టర్స్ కాలనీ సమీపంలో ఉన్న ప్రెస్టిన్ ఐవీవై అపార్ట్‌మెంట్స్ ఎదురుగా 40 అడుగుల వెడల్పుతో రహదారిని ఉండేది. దీన్ని కొందరు మూసివేశారు. ప్లాట్ నంబర్లు 9–23, 44–53 మధ్య ఉన్న ఈ రహదారి మూతపడటంతో పార్క్‌కు వెళ్లేదారి లేకుండా పోయింది. ప్లాట్ నంబర్లు 22–23, 24 – 26 మధ్య ఉన్న మరో 40 అడుగుల రహదారి దాదాపు ఏడు అడుగుల మేర ఆక్రమణకు గురైంది.
- గాజుల రామారంలోని సర్వే నంబర్ 307/1, 308/2, 3, 5ల్లో ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జా అయిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. 271 ఎకరాలకుపైగా ఉన్న ఈ భూమి తెలంగాణ ప్రభుత్వానికి చెందినదిగా ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. గతంలో ఏపీఎస్ఎఫ్‌సీ నుంచి భూమిని తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తీసుకోగా కబ్జాదారులు పాగా వేశారు.
- దూలపల్లి విలేజ్ ఇండస్ట్రియల్ ఏరియాలో 1967లో 157 ఎకరాల్లో 1,696 ప్లాట్లతో లే ఔట్ వేశారు. దీని ప్రకారం అక్కడ నాలుగు పార్కులు ఉండాలి. అందులో రెండు పార్కులు ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వెళ్లినట్లు నిర్ధారణ అయింది. మరో రెండు పార్కులు ఆ లేఔట్ వేసిన వారి వారసులే కబ్జా చేశారు. ఆ రెండు పార్కులను కాపాడి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అక్కడి కాలనీ సంక్షేమ సంఘానికి చెందిన ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.
- గాజుల రామారం, మెట్టుకానిగూడెం పెద్ద చెరువును ఆక్రమణల బారి నుంచి కాపాడాలని అక్కడి మత్స్యకార సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మొత్తం 26.3 ఎకరాల పరిధిలో ఉన్న ఈ చెరువు ఇప్పటికే ఆరు ఎకరాల వరకూ కబ్జాకు గురైందని ఫిర్యాదు చేశారు. ఎగువన ఉన్న ఐదు చెరువుల నుంచి ఈ చెరువుకు వరద వచ్చేదని, కాలువలను బైపాస్ చేసి వర్షాకాలంలో కూడా నీరు రాకుండా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు చెరువు ఆనవాళ్లు లేకుండా చేసి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.
- శేరిలింగంపల్లి శాంతినగర్ హౌసింగ్ సొసైటీ లేఔట్‌లోని సర్వే నం.132లో ఉన్న 60 అడుగుల రహదారిని అక్రమంగా మూసివేశారని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. లేఅవుట్ ఆమోదించినప్పుడు ఈ రోడ్డు ఉందని పేర్కొన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు చట్టవ్యతిరేకంగా దానిని పూర్తిగా మూసేసి రాకపోకలకు అంతరాయం కల్పిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సమాజంలో సోదరభావాన్ని పెంపొందించాలి

అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: సమాజంలో ఒకరికొకరు సోదరభావాన్ని పెంపొందించుకోవాలని, పరస్పరం గౌరవించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. వర్సిటీ తెలుగు శాఖ, యక్షి సంస్థ ఆధ్వర్యంలో 'దళిత బహుజన కళారూపాలు–రాజ్యాంగ విలువగా అందే గౌరవం'సృజనాత్మక సంభాషణతో కూడిన 'చావడి'పేరుతో సోమవారం చర్చా వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చక్రపాణి మాట్లాడుతూ మన రాజ్యాంగంలో అందరూ సమానమేనని చెప్పినా, ఇప్పటికీ సమానత్వం సాధించడానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం అందరి కోసం రాశారని, కేవలం రిజర్వేషన్లను మాత్రమే సృష్టించలేదని చెప్పారు. ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ విస్మరణకు గురవుతున్న కళారూపాలను ప్రభుత్వాలు కాపాడుకోవాలని కోరారు. ప్రముఖ పాత్రికేయుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కుల వృత్తులపై ఆధారపడ్డ వారిని గౌరవించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, లేదంటే రానున్న రోజుల్లో ఈ కళారూపాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ప్రముఖ కవి, వాగ్గేయకారులు గోరటి వెంకన్న మాట్లాడుతూ సామాజిక గౌరవం ప్రతి ఒక్కరి హక్కు అని అన్నారు. గోండు, దుబ్బుల, కిన్నెర, నాయీబ్రాహ్మణ, తెరచీరల, కాటిపాపాల, గౌండ్ల జెట్టీలు తదితర కళారూపాల కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో గోగు శ్యామల, బండారు విజయ, పద్మ వంగపల్లి, రమేష్ కార్తీక్ నాయక్, నరేష్‌కుమార్ సూఫీ, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎల్వీకేరెడ్డి, కళల విభాగం డీన్ రాణి రజిత మాధురి, తెలుగు విభాగ అధిపతి ఎస్.రజని, యక్షి డైరెక్టర్ మధుసూదన్, యక్షి అధిపతి అపర్ణ తోట, ఉర్దూ, తెలుగు, హిందీ భాష పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాన హక్కులతోనే సమాజం సమతుల్యం

'బహుజనగణమన' ఆవిష్కరణ సభలో హరియాణా గవర్నర్ దత్తాత్రేయ



బహుజనగణమన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దత్తాత్రేయ. చిత్రంలో జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

పంజగుట్ట: సమాజం సమతుల్యంగా ఉండాలంటే అందరికీ సమాన హక్కులు ఉండాలన్న దార్శనిక ఆలోచనలతో 'బహుజనగణమన'దీర్ఘ కావ్యం వెలువడిందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రముఖ రచయిత, కవి, జర్నలిస్టు జూలూరి గౌరీశంకర్ రచించిన 'బహుజనగణమన' కావ్య సంచికను దత్తాత్రేయ ఆవిష్కరించారు. తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దత్తాత్రేయ మాట్లాడుతూ సమాజంలో కులాల వారీ విభజన వస్తుందనే ఇన్నాళ్లూ పాలకులు కుల గణన చేయలేదని అన్నారు. ఉన్నత వర్గాల నుంచి అధికారం చేజారిపోతుందనే భయం కూడా ఒక కారణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టడం హర్షణీయమన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఉద్యమకారులకు బహుజనగణమన ఒక కరదీపికగా ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆలోచన మార్చేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్టార్ హోటల్‌లో బిర్యానీ తిని బహుజనుల గూర్చి రాసేవారు కొందరైతే, నాలుగు రోజులుగా ఆకలితో ఉండి రాసిన వారు కొందరని, ఆకలిలో నుంచి పుట్టిన కవిత్వం బహుజనగణమన అని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వచ్చేది బీసీల రాజ్యమని, బీసీ సాహిత్యాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ అన్ని ఉద్యమాల్లో బహుజనులు ముందుంటున్నా అంతిమంగా రాజ్యాధికారం అగ్రవర్ణాలకే వెళ్తుండటం బాధాకరమని అన్నారు. పుస్తక రచయిత జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ .. అగ్రవర్ణాల ఆధిపత్య పెత్తనం ఎలా ఉంటుందో ఈ పుస్తకంలో చూపించానని, ఈ పుస్తకం రాయడం ద్వారా నా జన్మ ధన్యమయ్యిందని అన్నారు. ఇప్పటివరకు అందరి కోసం రాశానని ఇప్పుడు నా జాతుల కోసం రాశానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెస్ ఐ.తిరుమలి, సంగిశెట్టి శ్రీనివాస్, జ్వలిత, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్లు దుకాణాలపై స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: కల్తీకల్లు అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. వారంపాటు కల్లు అమ్మకాలు జరిగే అన్ని కాంపౌండ్‌లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నారు. కల్లు దుకాణాలపై నిఘా పెట్టి ఆకస్మిక దాడులు నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం తెలిపారు. కల్లును అక్రమ రవాణా చేయడంతోపాటు కల్తీ కల్లు తయారు చేస్తున్న కేంద్రాలపై కూడా దాడులను ఉధృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. వారం పాటు నిర్వహించే ఈ స్పెషల్ డ్రైవ్‌లో లైసెన్స్‌లు లేని కల్లు దుకాణాలను సీజ్ చేయనున్నారు. కల్లు దందాల్లో సిండికేట్ వ్యవస్థను గుర్తించి చర్యలు చేపట్టనున్నారు.

టీచింగ్ వైద్యుల బదిలీలకు ప్రభుత్వం సానుకూలం



సాక్షి, సిటీబ్యూరో: దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న ప్రభుత్వ టీచింగ్ వైద్యులకు ముందుగా బదిలీలు నిర్వహించి అర్హులైన వారికి పదోన్నతులు కల్పించడానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.కిరణ్ బొల్లేపాక, కార్యదర్శి డా.కిరణ్ మాదాల, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.నరహరి, కార్యదర్శి డా.లల్లూ తెలిపారు. సోమవారం ఆయా సంఘాల నేతలతో సహా సుమారు వంద మంది వైద్యులు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నరేంద్రకుమార్‌తో సమావేశమయ్యారని పేర్కొన్నారు. పెరిఫెరల్ మెడికల్ కాలేజీల భత్యాన్ని అమలులోకి తేవాలని కోరారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చడానికి ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించడంపై వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో ఎంవీఐలే కీలకం

ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: రోడ్డు ప్రమాదాల నివారణలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)ల పాత్ర కీలకమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ) డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు అన్నారు. గచ్చిబౌలిలోని ఎస్కీ సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో కొత్త అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)లకు ప్రత్యేక ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత, వాహనాల ప్రమాణాలు, ట్రాఫిక్ నియంత్రణలో ఎంవీఐలు కీలకపాత్ర పోషిస్తారన్నారు. వాహనాల తనిఖీ, వాహనాల మెకానికల్ స్థితిని పరిశీలించడం తదితర కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కోట్లాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేసే రంగంలో అడుగుపెడుతున్న ఎంవీఐలు విధి నిర్వహణలో అంకితభావాన్ని ప్రదర్శించాలని సూచించారు. ఆటోమొబైల్ రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పెరుగుతోందని, దానిపట్ల కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్ఐటీ మెకానికల్ హెడ్ డాక్టర్ జి.సంతోష్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. రవాణా శాఖ సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్ డివిజన్ హెడ్ డాక్టర్ ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ వరకు మొత్తం 102 మంది ఏఎంవీఐలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మేడ్చల్ డీటీఓ రఘునందన్‌గౌడ్, ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ జి సంతోష్‌కుమార్, ఎంవీఐ శీతల్, ఎస్కీ ఫ్యాకల్టీ తిలక్, సునీత తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా, జీహెచ్ఎంసీ దోస్తీపై వినూత్న నిరసన



కమిషనర్ చైర్ వద్ద కొబ్బరికాయ కొట్టి, అరటి పళ్లు నైవేద్యం పెట్టి దండం పెడుతున్న శ్రవణ్

లక్డీకాపూల్: హైడ్రాతో జీహెచ్ఎంసీ దోస్తీపై సోమవారం మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అధికారాలను క్రమేణా హైడ్రాకు బదిలీ చేస్తూ జీహెచ్ఎంసీ నిద్రాణస్థితికి చేరుకుంటోందని ధ్వజమెత్తారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాయలంలో జరిగిన ప్రజావాణికి ఆయన హాజరయ్యారు. డీసీ, జోనల్ కమిషనర్ కార్యాలయాల్లో ఎవరూ అందుబాటులో ఉండటంలేదంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ సీట్‌కు కొబ్బరికాయ కొట్టి, అరటిపళ్లు నైవేద్యంగా పెట్టారు. ఆయన నాలా డిజాస్టర్ రెస్పాన్స్ పనులను హైడ్రా చేతుల్లో పెట్టడాన్ని ఆక్షేపించారు. సమస్తం హైడ్రా పరం చేయడంతో నగరం దిక్కుతోచని స్థితిలోకి పోయిందని, జీహెచ్ఎంసీ ఏం చేస్తుందో, హైడ్రా ఏం చేస్తుందో స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బోనాలు, వినాయక చవితి, బతుకమ్మ పండుగల పనులకు అనుమతుల విషయంలో ఉదాసీనత అవలంబించడంపై మండిపడ్డారు.

సమస్యలపై జాప్యం తగదు: అడిషనల్ కమిషనర్

జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 170 అర్జీలు అందాయని, వీటి పరిష్కారంలో జాప్యం చేయరాదని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ అధికారులకు సూచించారు. ప్రజావాణిలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, సత్యనారాయణ, గీతా రాధిక పంకజ, అలివేలు మంగతాయారు పాల్గొని ప్రజల విన్నపాలు స్వీకరించారు. క్షుణ్ణంగా పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

జీఎస్టీ అడిషనల్ కమిషనర్ వేధిస్తున్నారు..

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ (జీఎస్టీ) అడిషనల్ కమిషనర్ జి.లావణ్య కొన్ని నెలలుగా తమను పలు రకాల వేధింపులకు గురి చేస్తున్నారంటూ జీఎస్టీకి చెందిన ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు సోమవారం అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీఎస్టీ అబిడ్స్ డివిజన్‌లోని బషీర్‌బాగ్–1 వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా కె.శ్రీనివాస్, బషీర్‌బాగ్–2 విభాగం అసిస్టెంట్ కమిషనర్‌లుగా జి.వేణుగోపాల్‌రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. అబిడ్స్ డివిజన్ జీఎస్టీ అడిషనల్ కమిషనర్ జి.లావణ్య ప్రతినిత్యం అధికారుల ముందు, ఉద్యోగుల ముందు తమను నానా రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, ఫిర్యాదులపై విచారణ ప్రారంభించినట్లు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఏ ఇమ్మాన్యుయేల్ తెలిపారు. ఇద్దరు అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డిలు లిఖిత పూర్వకంగా పలు ఆధారాలతో వేరు వేరుగా ఫిర్యాదులు చేశారని ఇన్‌స్పెక్టర్ వివరించారు. ఉద్యోగులు, సిబ్బంది, ముందే ఆమె పలుసార్లు తమను దుర్భాషలాడారని, తమపట్ల అవహేళనంగా వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. అబిడ్స్ డివిజన్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ విచారణ ప్రారంభించారు.

వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు

వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్లు కె.శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డిలు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కె.హరితకు అడిషనల్ కమిషనర్ లావణ్య వేధింపులపై ఫిర్యాదు చేశారు. సోమవారం 50 మంది అధికారులతో కలిసి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. లావణ్య వేధింపులకు సంబంధించిన పూర్తి ఆధారాలను కమిషనర్ హరితకు లిఖిత పూర్వకంగా అందించినట్లు తెలిపారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని హరిత తెలిపారన్నారు.

నేడు కంటోన్మెంట్ బోర్డు సమావేశం

'ఎస్ఆర్‌డీపీ'కి అనుమతులపై కీలక చర్చ



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సాధారణ సమావేశం నేడు(మంగళవారం) జరగనుంది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ ఎస్.రాకేశ్ నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యురాలు బానుక నర్మదతోపాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొననున్నారు. కంటోన్మెంట్ పరిధిలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, కాంట్రాక్ట్‌ల కేటాయింపు, భవన నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేయనున్నారు. స్ట్రాటజిక్ రోడ్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా కంటోన్మెంట్ పరిధిలో రాష్ట్ర రహదారి–1, జాతీయ రహదారి–44 మార్గాల్లో చేపట్టే ఎలివేటెడ్ కారిడార్ల పనులకు వర్కింగ్ పర్మిషన్ ఇవ్వడంపై చర్చించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం సేకరించిన 24 ఎకరాల కంటోన్మెంట్ భూములకు సంబంధించిన పరిహారం సొమ్ము రూ.303 కోట్లను కంటోన్మెంట్‌లోనే వినియోగించుకునేలా ఇటీవల కేంద్రం అనుమతులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సంబంధిత నిధులతో పికెట్ నాలా, హస్మత్‌పేట నాలాల అభివృద్ధి బాధ్యతలను జీహెచ్ఎంసీకి అప్పగించనున్నారు. కంటోన్మెంట్‌లోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ బాధ్యతలను జలమండలికి అప్పగించాలని భావిస్తున్నారు. ఈ మేరకు బోర్డులో చర్చించి తీర్మానం చేయనున్నారు.

వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి డిమాండ్ చేశారు. వికలాంగుల సంక్షేమంపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పిస్తూ అసెంబ్లీలో చట్టం చేయాలని, వికలాంగుల కార్పొరేషన్ బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముట్టడి, 23న సెర్ప్ కమిషనర్ కార్యాలయం ముట్టడి చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తి అవుతున్నా ఎన్నికల హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు కె.వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేష్, నాయకులు పి.సాయిబాబా, రామారావు, శ్రీనివాస్, నాగలక్ష్మీ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ ధర్నా



సాంకేతిక విద్యామండలి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

నాంపల్లి: పాలిసెట్ కౌన్సెలింగ్‌ను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర సాంకేతిక విద్యామండలి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆందోళనలో విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వెంటనే పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహించి విద్యార్థులకు సీట్లు కేటాయించాలని నినాదాలు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా మాట్లాడుతూ కౌన్సెలింగ్ గురించి సరైన సమాచారం లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ఫీజులు నిర్ణయించకపోవడంతో కౌన్సెలింగ్ ఆలస్యం అవుతోందని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు బోర్డు కార్యదర్శి పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. మరో రెండు రోజుల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామని పుల్లయ్య హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, జిల్లా కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి, నేతలు రజనీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ చట్టం అవసరం



అభివాదం చేస్తున్న జస్టిస్ చంద్రకుమార్, జాజుల, పూర్ణచంద్రరావు, నారగోని తదితరులు

బీసీ కుల, ప్రజా సంఘాల డిమాండ్

పంజగుట్ట: బీసీలపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలంటే బీసీ రక్షణ చట్టం తీసుకురావల్సిన ఆవశ్యకత ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం బీసీ కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆల్ ఇండియా బీఎస్పీ జాతీయ కో ఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ బి.పూర్ణచంద్రరావు, పొలిటికల్ జస్టిస్ ఫోరం అధ్యక్షుడు వి.జి.ఆర్.నారగోని, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ హాజరయ్యారు. బీసీ సమాజ్ వ్యవస్థాపకుడు సంగెం సూర్యారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఎదుటివారిని నోరుమూయించేందుకు, వారి ప్రభావాన్ని తట్టుకోలేకపోతున్నామని అనుకున్నప్పుడే దాడులు చేస్తారని, భౌతిక దాడులు చేయాలన్న ఆలోచనే దుర్మార్గమని అన్నారు. మల్లన్న వాడిన తెలంగాణ సామెతలో తప్పుందని అనిపిస్తే చర్చించాలని, చట్టపరంగా వెళ్లాలని, దాడులు చేయడం హేతుబద్ధం కాదని పేర్కొన్నారు. రిటైర్డ్ డీజీపీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీ ఎమ్మెల్యేల సంఖ్య పెరగాలని, రాజ్యాధికారం దిశగా బీసీలు ముందుకు వెళ్లినప్పుడే దాడులు ఆగుతాయన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మల్లన్నపై జరిగిన దాడి ఒక వ్యక్తి మీద కాదని, యావత్ బీసీ సమాజంపై జరిగినట్లుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. బీసీ నేతల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నా, సమస్య వచ్చినప్పుడు అంతా ఒక్కటే అని చెప్పారు. వెంటనే కవితపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సాంబశివ గౌడ్, సోగరా బేగం, జయంతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 15, జూలై, 2025



మణికొండలో సందర్శకులను ఆకట్టుకుంటున్న ఉత్పత్తులు

హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్

మణికొండ : దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన బట్టలు, గృహోపకరణాల ఆల్ ఇండియా హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని సుందర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో సోమవారం ప్రారంభించారు. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్ డిజైనర్ ఉత్పత్తులతో పాటు, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారీ, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్స్, డిజైనర్ బ్లౌజులు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, ఇతర గృహోపకరణాలు ప్రదర్శనలో ఉంచారు. అనేక రాష్ట్రాల్లో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట మంచి నాణ్యతతో లభిస్తుండటంతో సందర్శకులు, కొనుగోలు దారులు ఆదరిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. కొన్ని రోజులు మాత్రమే ఎగ్జిబిషన్ ఉంటుందని మణికొండ మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు అక్బర్ కోరారు.





ఒకప్పుడు చిన్నారులకు చందమామ కథలు చెబుతూ అన్నం తినిపించేవారు అమ్మలు. ఆ కథలు వింటూ మరో లోకంలో విహరించేవి ఆ పసిహృదయాలు. చిన్న తలుపు తట్టినా చప్పట్లతో పరుగులుతీసి ఆటలాడేవారు. ఇప్పుడు ఆ రోజులు వెనక్కి పోయాయి. చందమామ చూపించే తల్లుల బదులు, యూట్యూబ్ కార్టూన్లు ప్లే చేసే అమ్మలుగా మార్పుచెందారు. బాల్యంలోనే మొబైల్‌తో స్నేహం చేస్తూ పెరుగుతున్న ఈ తరం అది లేకుండా ఉండలేని స్థితికి చేరింది. ఇది అధునాతన సాంకేతికత అందించిన సౌకర్యమే కాదు, అనేక మానసిక, శారీరక సమస్యలకు దారితీసే వ్యసనం కూడా.

ప్రస్తుత తరుణంలో టెక్నాలజీని పూర్తిగా నిరాకరించడం సాధ్యమా అంటే.. కాదనే చెబున్నాయి అధ్యయనాలు.. అలా అని అంతలా అవసరమా అంటే అదీ కాదనే చెబుతున్నారు. కానీ చిన్నారుల మెదడు అభివృద్ధి, మానసిక స్థితి, నైపుణ్యాల పెరుగుదల అన్నిటికీ స్థిరమైన అనుసంధానం కావాలంటే, మొబైల్ వినియోగాన్ని సమతుల్యంగా నియంత్రించడం తల్లిదండ్రుల బాధ్యత. వారు చూపిన దారిలోనే పసి పిల్లలు నడుస్తారు.. మనం మొబైల్ ఆఫ్ చేస్తే, వారు జీవితాన్ని ఆనందించడంలో ముందుకు వస్తారన్నది నిపుణుల మాట.

- సాక్షి, సిటీబ్యూరో

చిట్టి చేతుల్లో స్క్రీన్.. అంతటా అదే సీన్..



మొబైల్ ఫోన్లకు బానిసలుగా చిన్నారులు

- చందమామ కథ మాని యూట్యూబ్, కార్టూన్ చూపిస్తున్న తల్లులు
- అన్నం తినాలన్నా.. అల్లరి తగ్గించాలని అదే ఆయుధంగా
- పెద్దలతో సమానంగా పిల్లలకూ ఫోన్లు, ట్యాబ్‌లు
- దీర్ఘకాలిక సమస్యల బారిన చిన్నారుల భవితవ్యం
- పరిష్కార మార్గాలు మన చేతుల్లోనే అంటున్న నిపుణులు



ఇటీవలి కాలంలో పిల్లల్లో ఫోన్లు, ట్యాబ్‌ల వినియోగం భారీగా పెరిగిపోతోంది. నగరాల నుంచి పల్లెలకూ ఈ విష సంస్కృతి విస్తరించింది. సహజమైన ఆటలతో అలసిపోవాల్సిన పసి హృదయాలు డిజిటల్ గేమ్స్‌కు బానిసలవుతున్నారు. దీనికి ప్రధాన కారకులు తల్లిదండ్రులేనని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అన్నం తినిపించడానికో.. అల్లరి తగ్గించడానికో మనం అలవాటు చేసే ఈ పద్ధతికి బాల్యం బలైపోతోంది. కొంత కాలానికి అదే అడిక్షన్‌గా మారుతోంది. చిన్నారులకు మొబైల్ వినియోగం వల్ల కలిగే నష్టాలు సాధారణమైనవి కాదు, వారు పెరుగుతూ ఉంటే ఈ వ్యసనం పోతుందని నిర్లక్ష్యం వహించడం సరైనది కాదని మానసిక వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రభావం చేత చిన్నారులు దీర్ఘకాలిక సమస్యల భారిన పడుతున్నారు.

- **దృష్టి సమస్యలు :** నిరంతరం మొబైల్ స్క్రీన్ చూడటంవల్ల, మరీ దగ్గర నుంచి చూస్తుండటం వల్ల చూపు బలహీనపడే అవకాశం ఉంది. ముఖ్యంగా మైల్స్ డిసార్డర్స్, డ్రై ఐ వంటి సమస్యలు పెద్ద సమస్యలుగా మారే అవకాశముంది.
- **నిద్రలేమి :** స్మార్ట్‌ఫోన్ నుంచి వచ్చే నీలి కిరణాలు(బ్లూ లైట్) నిద్రకు ఉపకరించే మెలటోనిన్ హార్మోన్‌ను నియంత్రిస్తుంది. తద్వారా దీర్ఘకాలిక నిద్రలేమికి గురయ్యే ప్రమాదం ఉంది.
- **అవగాహనాలేమి :** వీడియోలు, రీల్స్ వంటి తక్షణ వినోదం చిన్నారుల్లో సహనాన్ని తగ్గిస్తుంది. దృష్టి ఎటుపోతుందో అక్కడే ఆలోచన కూడా ఆగిపోతుంది. ఇది భవిష్యత్తులో అత్యంత ప్రమాదకరంగా మారవచ్చు.
- **మానసిక అసంతృప్తి :** ఎక్కువగా డిజిటల్ ప్రపంచంతో మమేకమవుతూ, వాస్తవ ప్రపంచానికి దూరమవ్వడం వల్ల పిల్లల్లో ఒంటరితన భావన, ఆందోళన, కొంతవరకూ డిప్రెషన్‌కు గురికావచ్చు.
- **చూడకూడనివన్నీ చూస్తూ :** కొన్ని రీల్స్, యూట్యూబ్ వీడియోల్లో పిల్లలకు అవసరం లేని కంటెంట్ ఉంటుంది. అది వారి ప్రవర్తన, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే దుష్ఫలితాలను కలిగిస్తుంది.



ఇతర వ్యాపకాల వైపు..

పిల్లలను మొబైల్‌కి దూరం చేయడానికి పరిష్కార మార్గాలు మనచేతుల్లోనే ఉంటాయి. వారి మానసిక స్థితికి అనుగుణంగా, వారి ఇష్టాలపై ఆసక్తి పెంచేలా ఇతర వ్యాపకాలతో మునిగిపోయేలా చేయొచ్చు.



- **పెద్దలే ఆదర్శంగా :** తల్లిదండ్రులే ముందుగా మొబైల్‌కి బానిసలుగా ఉంటే.. పిల్లలు ఎలా దూరమవుతారు? ఫోన్‌ల వాడకాన్ని తల్లిదండ్రులే మొదట నియంత్రించాలి. తద్వారా పిల్లలకు ఆదర్శంగా మారాలి.



- **నియంత్రిత కంటెంట్ :** పిల్లలకు పూర్తిగా మొబైల్ తీసేయడం కాకుండా, వారితో ఓపెన్ డైలాగ్ పెట్టి, వారికి సేఫ్ కంటెంట్ మాత్రమే చూపించడం అవసరం.
- **డిజిటల్ డిటాక్స్ షెడ్యూల్ :** రోజులో ఒక నిర్దిష్ట సమయానికి మొబైల్ పూర్తిగా వదిలేసి, కుటుంబంతో సమయాన్ని గడపడం, ఆటలు, పుస్తకాలు, చర్చలతో సమయాన్ని గడిపేలా చేయాలి.
- **ఆఫ్‌లైన్ వినోదాన్ని ప్రోత్సహించాలి :** బొమ్మల కథలు, బోర్డు గేమ్స్, డ్రాయింగ్, సంగీత తరగతులు, నృత్యం లాంటి క్రియేటివ్ యాక్టివిటీలతో వారి దృష్టిని డైవర్ట్ చేయాలి.

సమస్య ఎక్కడో పరిష్కారం అక్కడే..

ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో పిల్లలు మొబైల్ చూడకుండా ఉండేందుకు కొన్ని విడియోలు, టిప్స్, ట్రిక్స్ వైరల్‌గా మారుతున్నాయి. ముఖ్యంగా 'కిట్ బ్యాగ్ ట్రిక్', 'బుక్స్ బిఫోర్ స్క్రీన్' వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి. వాటిపై తల్లిదండ్రులు దృష్టిసారించాలి. కొందరు తల్లిదండ్రులు పిల్లలకి యాక్టివిటీ జర్నల్స్ ఇవ్వడం, పజిల్ ఛాలెంజ్‌లు పెట్టడం ద్వారా మొబైల్ బదులుగా కొత్త అలవాట్లు పెంచుతున్నారు. ఈ డిజిటల్ తరం కాబట్టి అవసరమైనంత మేర రైమింగ్స్, కిడ్స్ ఐక్యూ వంటి వీడియోలు చూపించి వారి వ్యసనాన్ని నియంత్రించాలి.

కిలకిలలు.. కేరింతలు..

మొబైల్ స్క్రీన్లకు అతుక్కుపోయిన కళ్లు.. ప్రకృతి, పక్షుల అందాల వైపు మళ్లుతున్నాయి. ల్యాప్‌టాప్స్, డెస్క్‌టాప్‌లపై కదలాడే వేళ్లు కెమెరాలను క్లిక్‌మని అనిపిస్తున్నాయి. నగరంలో తొలిసారిగా జరుగుతున్న పక్షుల నమోదు కార్యక్రమం 'బర్డ్ అట్లాస్' పలువురు నగరవాసుల జీవనశైలిలో మార్పులు తెస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో

- సందడిగా సాగుతున్న బర్డ్ అట్లాస్
- కుటుంబ సమేతంగా పాల్గొంటున్న వైనం



తెలంగాణలో మొట్ట మొదటిది..

'ఇది తెలంగాణ మొట్టమొదటి నగర పక్షి అట్లాస్, దీనిని అనుభవజ్ఞులైన పక్షి ప్రేమికులు, ఔత్సాహికులు కలిసి రూపొందిస్తున్నారు' అని ఈ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీరామ్ రెడ్డి అంటున్నారు. ఈ డేటా పట్టణ ప్రణాళికలో సహాయపడుతోంది. తద్వారా పక్షుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను పార్కులు లేదా అభయారణ్యాలుగా సంరక్షించవచ్చు. అంతేకాదు సిటిజన్లలో పక్షుల పరిశీలనను అభిరుచిగా ప్రోత్సహిస్తోంది, ప్రకృతితో అనుబంధం పెంచుతుంది అంటున్నారాయన.

నగరానికి చెందిన డబ్ల్యూడబ్ల్యూఎఫ్, డెక్కన్ బర్డర్స్ హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ కార్యక్రమం వందల సంఖ్యలో వాలంటీర్ల భాగస్వామ్యంతో ఉత్సాహంగా దూసుకుపోతోంది. 'ఒకప్పుడు చాలా మంది పిల్లల్లాగే, మా వాళ్లు కూడా మొబైల్స్‌కు అతుక్కుని ఉండేవారు. అయితే ఈ కార్యక్రమంలో జేర్పించి ప్రోత్సహించడంతో ఇప్పుడు బర్డ్ లవర్స్‌గా, అంతకు మించి నేచర్ లవర్స్‌గా మారిపోయారు' అని బర్డ్ అట్లాస్‌లో పాల్గొంటున్న కృష్ణ ప్రసాద్ అంటున్నారు. ఆయన ఇద్దరు చిన్నారుల్లో ఒకరు బర్డ్ ఫొటోగ్రఫీపై పూర్తిగా ఆసక్తి చూపిస్తున్నాడని ఇప్పటికే 150కిపైగా పక్షి జాతులను గుర్తించడంతో పాటు పర్యావరణ దినోత్సవం రోజు జరిగిన ఫొటోగ్రఫీ పోటీలో మూడో బహుమతిని కూడా గెలుచుకున్నాడని ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



భవిష్యత్తు నగర చిత్ర పటాన్ని మార్చేలా..

వివిధ సీజన్లలో నగరం అంతటా పక్షి జాతులను నమోదు చేయడం అనే సుదీర్ఘ ప్రక్రియ 'బర్డ్ అట్లాస్'లో భాగంగా ఫిబ్రవరిలో శీతాకాలంలో నిర్వహించిన మొదటి సీజన్‌లో 209 మంది వాలంటీర్లు 195 కంటే ఎక్కువ జాతులను 70 వేల కంటే ఎక్కువ సైటింగ్స్ నమోదు చేశారు. వీటిలో స్థానికంగా నివాసం ఉండేవాటితో పాటు వలస జాతులు కూడా ఉన్నాయి. ఈ క్రతువు నగర పక్షుల జీవితంపై విలువైన నివేదికను తయారు చేస్తోంది. ప్రస్తుతం రెండో సీజన్ దశలో.. వర్షాల సమయంలో పక్షుల తీరుతెన్నులపై దృష్టి పెడుతోంది. పచ్చదనం, వర్షపాతం కీటకాలతో నగర ప్రకృతి దృశ్యం మారుతున్నప్పుడు వచ్చే కాలానుగుణ మార్పులను ట్రాక్ చేస్తోంది.





అవగాహన పెంచడానికి..

పక్షుల గురించి ఎటువంటి పరిజ్ఞానం లేని వ్యక్తులు ఈ ప్రాజెక్టులో పాల్గొని ప్రకృతి ప్రేమికులుగా మారుతున్నారు. ఇందులో పాల్గొటున్న వాలంటీర్లలో దాదాపు అందరూ 50 నుంచి 150 జాతుల వరకూ గుర్తించగలుగుతున్నారని 'ఈ ప్రాజెక్ట్ కేవలం డేటా సేకరణల గురించి మాత్రమే కాదనీ' ఇది అవగాహన పెంచడం గురించి అని వీరు అంటున్నారు. కనిపించని కొత్త పక్షి జాతులను తర్వాత సీజన్లు పరిచయం చేస్తాయని భావిస్తున్నారు. వర్షాకాలంలో తడి భూముల పరిస్థితులు పట్టణ పచ్చదనం పట్ల పక్షులు ఎలా స్పందిస్తాయో కూడా స్వచ్ఛంద సేవకులు అధ్యయనం చేస్తారు.







సోషల్ ట్రెండ్స్..

- ఏఐ రాకతో రోజుకో వింత ఆర్ట్స్
- మొన్న గిబ్లీ, నిన్న బేబీ పాడ్‌కాస్ట్స్, నేడు యానిమల్ వ్లాగ్
- సామాజిక మాధ్యమాల్లో నెటిజన్ల సందడి





శ్రీనగర్ కాలనీ : మొన్న గిబ్లీ ఆర్ట్.. నిన్న బేబీ పాడ్‌కాస్ట్.. నేడు 'యానిమల్ వ్లాగ్', అవెంజర్స్, హల్క్ విడియోస్.. ఇలా సోషల్ మీడియాలో రోజుకో వింత ట్రెండ్ అవుతోంది.. సామాజిక మాధ్యమాల్లో ఏఐ హవా కొనసాగుతుంది. ఒక్కో నెల ఒక్కో ఏఐ స్పెషల్స్‌తో నెటిజన్లు సందడి చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఏఐ ట్రెండింగ్ యుగం కొనసాగుతోంది. ఐదు నెలల క్రితం గిబ్లీ ఆర్ట్‌తో సోషల్ మీడియా హోరెత్తింది. ఎటుచూసినా గిబ్లీ ఆర్ట్ ఫొటోలతో నెటిజన్లు, ప్రజలు సందడి చేశారు. రెండు నెలల క్రితం బేబీ పాడ్‌కాస్ట్, బేబీ ఏఐ వీడియోలు వైరల్ అయ్యాయి. నేడు యానిమల్ వ్లాగ్, అవెంజర్ హల్క్ వీడియోస్ నెటిజన్లను అలరిస్తున్నాయి. ఏఐతో ట్రావెలర్స్, ఫ్రెండ్స్ ట్రావెలింగ్‌తో చేసే వ్లాగ్ వీడియోస్ మంకీ, చింపాజీలు చేసేలా చేసి నెటిజన్లను నవ్విస్తున్నారు.



సోషల్ మీడియాలోని ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లతో పాటు అన్ని యాప్‌లలో యానిమల్ వ్లాగ్, అవెంజర్, హల్క్ వీడియోలు దర్శనమిస్తున్నాయి. అవెంజర్, హల్క్ తెలంగాణకు వస్తే, ఒక అవ్వ చేతి మనవడిగా సరదా సరదా సంభాషణల వీడియోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. ఛాట్ జీపీటీ యానిమల్ వ్లాగ్, అవెంజర్ హల్క్ వీడియోస్ చేస్తున్నారు. ఇక జంతుప్రేమికులైతే ఇలాంటి వాటిని ఇష్టపడుతున్నారు. మరికొందరు ముందడుగేసి యానిమల్ వ్లాగ్‌గా మార్చేస్తున్నారు.

క్లుప్తంగా...

అసాధారణ నటి సరోజాదేవి

ప్రధాని మోదీ సంతాపం



సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ సినీనటి బి.సరోజాదేవి మరణంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. భారతీయ సినిమా, సంస్కృతికి ప్రతీకగా, అసాధారణ నటిగా ఆమె గుర్తుండిపోతారని పేర్కొన్నారు. సరోజాదేవి తన నటవైవిధ్యంతో అన్ని తరాలపైనా చెరగని ముద్ర వేశారని కొనియాడారు. వివిధ భాషలు, అనేక ఇతివృత్తాల్లో నటనతో ఆమె బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారని గుర్తు చేశారు. 'బి.సరోజాదేవి మరణం బాధాకరం. ఆమె కుటుంబానికి, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి..'అంటూ ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

ప్రముఖ నటి సరోజాదేవి మృతి విచారకరం

మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: ప్రముఖ నటి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత బి.సరోజాదేవి మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. 'ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న సరోజాదేవి మృతి విచారకరం. 200కు పైగా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ చిత్రాల్లో అగ్రనటుల సరసన నటించి, మెప్పించి.. పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి గొప్ప పురస్కారాలు అందుకున్న సరోజాదేవి.. సేవా దృక్పథంలోనూ స్ఫూర్తిగా నిలిచారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ నివాళులు'అని 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు. సరోజాదేవి కుటుంబసభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చలనచిత్ర పరిశ్రమకు ఆమె చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని వైఎస్ జగన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటు అని.. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్‌తో కవితకు లోపాయికారీ ఒప్పందం

త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని తీన్మార్ మల్లన్న జోస్యం



మేడిపల్లి: బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న తనపై తెలంగాణ జాగృతి కార్యకర్తలు దాడిచేస్తే అండగా ఉండాల్సిన ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఎమ్మెల్సీ కవితకు మద్దతు తెలుపుతూ.. తన పైననే నిందలు వేయడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని క్యూన్యూస్ ఆఫీస్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర కాంగ్రెస్ పెద్దలు ప్రెస్‌మీట్ పెట్టిమరీ కవితకు అండగా నిలిచారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి, కవితకు మధ్య లోపాయికారీ ఒప్పందం నడుస్తోందని, ఇటీవల ముగ్గురు మంత్రుల ప్రమాణ స్వీకారం జరిగినప్పుడే కవిత సైతం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉందని, ఇది నిజమోకాదో.. కాంగ్రెస్ పెద్దలే చెప్పాలని అన్నారు. కవిత త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి రంగం సిద్ధమైందని మల్లన్న జోస్యం చెప్పారు. కాగా, మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి ఎమ్మెల్సీ కవిత ఆదేశాల మేరకు పనిచేస్తున్నారని, తనపై దాడి జరిగితే తనపైనే కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సీఐ గోవిందరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీపీకి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

మహిళా కమిషన్‌కు జాగృతి ఫిర్యాదు



మహిళా కమిషన్ సభ్యులకు వినతిపత్రం సమర్పించిన జాగృతి నాయకులు

సాక్షి, హైదరాబాద్ : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగృతి మహిళా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం తెలంగాణ మహిళా కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద అందుబాటులో లేకపోవడంతో కమిషన్ సభ్యులు సుదం లక్ష్మి, రేవతి రావు, ఉమ, అఫ్రోజ్ సహీనాకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఫిర్యాదుపై సభ్యులు స్పందిస్తూ.. విషయాన్ని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అంతకు ముందు తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తమను కమిషన్ కార్యాలయం లోపలికి అనుమతించకపోవడంపై జాగృతి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కార్యాలయం గేటు ఎదుట నిరసన తెలిపారు. మహిళలను కించపరిచిన వ్యక్తులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందా? అని ప్రశ్నిస్తూ నినాదాలు చేయడంతో జాగృతి నాయకులను లోనికి అనుమతించారు.

సాక్షిపై ఏపీ సర్కారు కుట్ర భగ్నం

విజిలెన్స్ నివేదికతో ఇబ్బంది పెడదామనుకున్న కూటమికి చెంపపెట్టు

- ఆ నివేదికను తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు
- గత ప్రభుత్వంలో గ్రామ, వార్డు వాలంటీర్, గ్రామ, వార్డు సచివాలయాలకుఏదైనా ఒక దినపత్రిక కొనేందుకు నెలకు రూ.200 మేర ఆర్థిక సాయం
- దీనిపై విజిలెన్స్ విచారణ జరిపించామని.. నివేదికను పరిశీలించాలని ఢిల్లీ హైకోర్టును కోరిన కూటమి ప్రభుత్వం



సాక్షి, అమరావతి: విజిలెన్స్ నివేదిక పేరుతో తన ఆస్థాన పచ్చ పత్రిక 'ఈనాడు' కోసం 'సాక్షి'ని ఇబ్బందిపెట్టేందుకు కూటమి ప్రభుత్వం పన్నిన కుట్రను ఢిల్లీ హైకోర్టు భగ్నం చేసింది. విస్తృత సర్క్యులేషన్ ఉన్న ఏదైనా ఒక దినపత్రికను కొనుగోలు చేసుకునేందుకు ప్రతి గ్రామ, వార్డు వలంటీర్, గ్రామ, వార్డు సచివాలయాలకు నెలకు రూ.200 మేర ఆర్థిక సాయాన్ని అందజేస్తూ గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విజిలెన్స్‌తో విచారణ జరిపించామని, ఇందుకు సంబంధించిన నివేదికను పరిశీలించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనను హైకోర్టు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. 'మా భుజంపై తుపాకీ పెట్టి కాల్చాలనుకుంటున్నారు. అందుకు మేం ఎంతమాత్రం అనుమతించబోం' అని స్పష్టం చేసింది. తాము ఆదేశించకపోయినా విజిలెన్స్ విచారణ జరిపించడంపై హైకోర్టు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తామేమీ విజిలెన్స్ విచారణ కోరలేదని గుర్తు చేస్తూ... అలాంటప్పుడు దాని నివేదికతో తమకు పని లేదని తేల్చి చెప్పింది. ఈనాడు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ముగిస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం వలంటీర్ల వ్యవస్థ లేదని గుర్తు చేసిన ఢిల్లీ హైకోర్టు, ఇంకా ఏవైనా అభ్యంతరాలుంటే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) వద్దకు వెళ్లాలని ఈనాడు యజమాన్యానికి తేల్చి చెప్పింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏం చేసినా చట్ట ప్రకారం చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, న్యాయమూర్తి జస్టిస్ తుషార్‌కుమార్ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా ఒక తెలుగు దిన పత్రిక కొనుగోలుకు గ్రామ, వార్డు వలంటీర్, గ్రామ, వార్డు సచివాలయాలకు నెలకు రూ.200 మేర ఆర్థిక సాయం అందజేస్తూ గత ప్రభుత్వం 2023లో ఉత్తర్వులు జారీ చేసింది. వీటిపై ఈనాడు యాజమాన్యం మొదట ఏపీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల అమలును నిలిపివేయాలని కోరుతూ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. అలాగే వాలంటీర్లు, సచివాలయాలు చేసే సాక్షి పత్రిక కొనుగోళ్లను పరిగణనలోకి తీసుకోకుండా ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్ (ఏబీసీ)ను ఆదేశించాలని కోరుతూ మరో అనుబంధ పిటిషన్ కూడా వేసింది. ఈ రెండు అనుబంధ పిటిషన్లపై విచారణ జరిపిన ఏపీ హైకోర్టు ధర్మాసనం వాటిని కొట్టివేస్తూ ఉత్తర్వులిచ్చింది.


ఏపీ హైకోర్టులో చుక్కెదురుతో సుప్రీంకు

ఏపీ హైకోర్టులో చుక్కెదురవడంతో ఈనాడు యాజమాన్యం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఏపీ హైకోర్టులో ఈనాడు వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేస్తూ 2023 ఏప్రిల్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఢిల్లీ హైకోర్టు విచారణ మొదలుపెట్టింది. సోమవారం ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతి రాజు

- హరియాణా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషిమ్ కుమార్ ఘోష్
- లద్దాక్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా
- కొత్తగా ముగ్గురు గవర్నర్‌లను నియమించిన రాష్ట్రపతి ముర్ము



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గోవా, హరియాణా, లద్దాక్‌కు కొత్త గవర్నర్‌లను నియమించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులయ్యారు. హరియాణా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ స్థానంలో ప్రొఫెసర్ ఆషిమ్ కుమార్ ఘోష్‌ను నియమించారు. కేంద్రపాలిత ప్రాంతం లద్దాక్ గవర్నర్‌గా ఉన్న బ్రిగేడియర్ (డాక్టర్) బీడీ మిశ్రా (రిటైర్డ్) రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి.. ఆయన స్థానంలో కవీందర్ గుప్తాను నూతన లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్రపతి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

అశోక్ గజపతిరాజు నేపథ్యమిదీ..

1951 జూన్ 16న విజయనగరంలో జన్మించిన అశోక్ గజపతిరాజు గ్వాలియర్‌లోని సింధియా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, విశాఖలోని ప్రభుత్వ కృష్ణా కళాశాలలో చదువుకున్నారు. అశోక్ ఇప్పటివరకు 7 పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా పనిచేశారు. 1978లో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనతాపార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన.. ఆ తర్వాత రాజకీయాల్లో వెనుదిరిగి చూడలేదు. 1982లో ఎన్టీఆర్ పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీలో చేరిన అశోక్.. 1983, 85, 89, 94, 99 ఎన్నికల్లో వరుసగా ఐదు పర్యాయాలు విజయనగరం నుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో తొలిసారిగా ఓటమి చెందారు. ఆ తర్వాత 2009లో మళ్లీ విజయం సాధించారు. 2014లో టీడీపీ అధిష్టానం సూచన మేరకు విజయనగరం పార్లమెంట్ స్థానానికి పోటీచేసి విజయకేతనం ఎగురవేశారు. అలాగే ఎన్టీఆర్, చంద్రబాబు క్యాబినెట్‌లలో పలు శాఖలకు మంత్రిగానూ సేవలందించారు. 2014 నుంచి 18వరకు నరేంద్రమోదీ కేబినెట్‌లో పౌర విమానయాన శాఖ మంత్రిగా సేవలందించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. 2018 తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు విరామం ఇచ్చారు.

నైపుణ్యం లేదనడం అనుచితం!

- బరాజ్‌ల నిర్మాణ డిజైన్ల రూపకల్పన బాధ్యత సీఈ సీడీఓదే.. నీటిపారుదల శాఖ లేఖ

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ చర్యలకు అవసరమైన డిజైన్ల తయారీకి తమకు నైపుణ్యం లేదని నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ విభాగం చీఫ్ ఇంజనీర్ (సీఈ సీడీఓ) విభాగం చేతులెత్తేయడంపై ఆ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'సాగునీటి ప్రాజెక్టుల డిజైన్లు, డ్రాయింగ్స్ రూపకల్పనకు నీటిపారుదల శాఖలో సర్వోన్నత విభాగం సీఈ సీడీఓ. అటువంటి విభాగం సేవలు అవసరమైనప్పుడు బాధ్యత తీసుకోకుంటే ఎలా?'అని నీటిపారుదల శాఖ ప్రశ్నించింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్డీఎస్ఏ) సిఫారసుల ఆధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకి డిజైన్లను చేసే బాధ్యతకు ఈ విభాగం కట్టుబడి ఉండాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు నీటిపారుదల ఈఎన్సీ (జనరల్) సీఈఓ సీడీఓకు లేఖ రాశారు.

ఆ బాధ్యత మీదే..: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై అధ్యయనం చేసిన ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సమర్పించిన తుది నివేదికను గత ఏప్రిల్ 24న కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. నివేదికలోని సిఫారసుల ఆధారంగా ఆయా బరాజ్‌ల పునరుద్ధరణకి డిజైన్లు, డ్రాయింగ్స్‌ను రూపొందించాల్సి ఉంది. ఈ బాధ్యత తీసుకోవాల్సిన సీఈ సీడీఓ తమకంత నైపుణ్యం లేదని పేర్కొనడంపై ఈఎన్సీ(జనరల్) లేఖ రాశారు. అవసరమైన డిజైన్ల రూపకల్పనలో జాప్యం చేయకుండా తక్షణమే ఆసక్తి వ్యక్తీకరణ(ఈఓఐ)ను ఆహ్వానించాలని స్పష్టం చేశారు. బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూడటం అనుచితమని లేఖలో పేర్కొన్నారు. బరాజ్‌లలోని లోపాలపై అధ్యయనం చేసి వాటి పునరుద్ధరణకి డిజైన్లు తయారు చేయాలని 2023 అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 9 లేఖలు రాయగా, వాటికి సీఈ సీడీఓ నామమాత్రంగానే స్పందించడంపై నీటిపారుదల శాఖ అసంతృప్తి వ్యక్తం చేసింది.

వైద్యశాఖలో 'హైదరాబాద్' లొల్లి

ప్రమోషన్ల బదిలీల ఆప్షన్లలో హైదరాబాద్‌ను మినహాయించిన సర్కార్

- ముందుగా రూరల్‌లో ఉండే వారిని హైదరాబాద్‌కు బదిలీ చేయాలంటున్న డాక్టర్లు
- బదిలీల తరువాతే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్
- పదోన్నతులు పొందిన వారు సైతం హైదరాబాద్ విడిచేందుకు అనాసక్తి



సాక్షి, హైదరాబాద్: మెడికల్ కాలేజీల్లో వివిధ హోదాల్లో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న డాక్టర్లకు పదోన్నతి లభించిన ఆనందం లేకుండా పోయింది. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకం కోసం ప్రభుత్వం గత నెలాఖరున నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే మరో 714 పోస్టుల భర్తీకి మెడికల్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో 44 మంది ప్రొఫెసర్లను అదనపు డీఎంఈలుగా, 278 అసోసియేట్ ప్రొఫెసర్లను ప్రొఫెసర్లుగా ప్రమోట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పదోన్నతులు కల్పించినప్పటికీ, బదిలీలు చేయలేదు. అదే సమయంలో ప్రస్తుతం వివిధ కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాల్లో పనిచేస్తున్న డాక్టర్లు కొత్త వివాదాన్ని తెరపైకి తెస్తున్నారు. జిల్లాల్లో కొన్నేళ్లుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిని బదిలీ చేసిన తరువాతే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బదిలీలకు సంబంధించిన ఆప్షన్లలో 'హైదరాబాద్'ను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, కుత్బుల్లాపూర్, మహేశ్వరం, మానసిక ఆసుపత్రి, ఛాతీ ఆసుపత్రి, నిలోఫర్, పేట్లబురుజు వంటి ఆసుపత్రుల్లో బదిలీకి అవకాశం ఇవ్వడం లేదు. ఈ ఆసుపత్రుల్లో బదిలీలకు అవకాశమిస్తే, జిల్లాల్లోని బోధనాసుపత్రుల్లో పనిచేసేందుకు ఎవరూ ఉండరనేది ప్రభుత్వ వాదన.

జిల్లాల్లోని వారిని హైదరాబాద్‌కు బదిలీ చేశాకే...


రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మెడికల్ కాలేజీల పరిధిలోని బోధనాసుపత్రుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిని హైదరాబాద్‌కు బదిలీ చేసిన తరువాతే కొత్త పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వ వైద్యుల సంఘాలు, బోధనాసుపత్రి వైద్యుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బదిలీలతో హైదరాబాద్ వచ్చిన తరువాత ప్రమోషన్లు ఇస్తే, హైదరాబాద్‌లో పనిచేసే వారు అక్కడే ఉండే అవకాశం ఉంటుందనే ఆలోచనతో పదోన్నతులపై మెలిక పెడుతున్నారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి.నరహరి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, టీచింగ్ హాస్పిటల్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ బొల్లేపాక, జనరల్ సెక్రటరీ డాక్టర్ కిరణ్‌మాదలతో పాటు మరో వంద మంది వైద్యులు డీఎంఈ నరేంద్రకుమార్‌ను ప్రత్యేకంగా కలిశారు. ఏళ్ల తరబడి జిల్లాల్లో ప్రభుత్వ పెద్దాసుపత్రుల్లో పనిచేస్తున్న డాక్టర్లను వెంటనే బదిలీ చేయాలని కోరారు. గతేడాది జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్లలో గాంధీ, ఉస్మానియా నుంచి జిల్లాల్లోని కాలేజీల్లోకి బదిలీ అయిన డాక్టర్లు మళ్లీ గాంధీ, ఉస్మానియాలో తిష్టవేసేందుకు యత్నిస్తున్నట్లు కొందరు అసోసియేట్ ప్రొఫెసర్లు చెబుతున్నారు.

ఎన్ఎంసీ రూల్స్ ప్రకారమే..

నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రకారం గాంధీ, ఉస్మానియాలో సరైన టీచింగ్ ఫ్యాకల్టీ ఉందని ప్రభుత్వం చెప్పుండగా, గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 107, జిల్లాల్లో మరో 240 ఖాళీలు ఉన్నట్లు డాక్టర్ల సంఘాలు చెబుతున్నాయి. దీంతోనే జిల్లాల్లో ఏళ్ల తరబడి నుంచి పనిచేస్తున్న సుమారు 70 మందిని హైదరాబాద్‌కు షిఫ్ట్ చేసి, ఆ తర్వాత ఇక్కడ ఏర్పడిన ఖాళీలతోపాటు అన్ని జిల్లా మెడికల్ కాలేజీల్లో ఖాళీలను చూపించాలని డాక్టర్ల సంఘం డిమాండ్ చేసింది. ఆ తర్వాతే అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రమోషన్లు కల్పిస్తూ పోస్టింగ్ ఇవ్వాలని టీచింగ్ ఆసుపత్రుల వైద్య సంఘాలూ డీఎంఈని కోరాయి. కానీ హైదరాబాద్‌లో ఏ ఒక్క ఖాళీ లేదని, జిల్లాల్లో పనిచేసేందుకు ఇష్టపడని కొందరు ప్రమోషన్లను అడ్డుకునేందుకు ఈ తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

ఉద్యమ పంథాలో పార్టీ కార్యాచరణ

- యువత, విద్యార్థులకు చేరువ కావడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ కార్యక్రమాలు
- ఈ నెల 21 తర్వాత తెలంగాణ భవన్‌లో విద్యార్థి విభాగం భేటీ
- స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం
- నందినగర్ నివాసంలో కేటీఆర్, హరీశ్‌లతో కేసీఆర్ సమావేశం
- పార్టీ ముఖ్య నేతలతోనూ బీఆర్‌ఎస్ అధినేత వరుస భేటీలు



సాక్షి, హైదరాబాద్: పార్టీని కొత్త మార్గంలో నడిపే దిశగా కసరత్తు చేస్తున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సోమవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావుతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ప్రస్తుతం నందినగర్ నివాసంలో ఉన్న ఆయన ఈ ఇద్దరు ముఖ్య నాయకులతోనే కాకుండా గత కొద్ది రోజులుగా పార్టీ కీలక నేతలతో కూడా వరుసగా సమావేశమవుతున్నారు. జాతీయ, స్థానిక రాజకీయాలతో పాటు క్షేత్ర స్థాయిలో నెలకొన్న ప్రజా సమస్యలపై కూడా కేసీఆర్ వారితో చర్చిస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రంలో అనుసరిస్తున్న వ్యూహాలు, ఎత్తుగడలపై కేసీఆర్ లోతుగా విశ్లేషిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెపుతున్నాయి.

కొత్త పంథాలో భవిష్యత్తు కార్యాచరణ

బీఆర్‌ఎస్ లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీతో పాటు కొన్ని మీడి యా సంస్థలు సాగిస్తున్న ప్రచారం, దాని వెనుక ఏపీకి చెందిన కొన్ని శక్తులు పనిచేస్తున్న తీరుపై కేసీఆర్ ఈ భేటీల్లో కీలక వ్యాఖ్యలు చేస్తున్నట్లు సమాచారం. బీసీ రిజర్వేషన్ల పట్ల చిత్తశుద్ధి లేకుండా, సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోకుండా రేవంత్ ప్రభుత్వం ఆడుతున్న రాజకీయ క్రీడ ను ప్రజలకు వివరించాలని కేసీఆర్ భావిస్తున్నారు. పార్టీ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి కొత్త పంథాలో భవిష్యత్తు కార్యాచరణను రూపొందించాల్సిన అవసరాన్ని కేసీఆర్ ఈ భేటీల్లో నొక్కి చెప్తున్నారని సమాచారం.

యువత, విద్యార్థులను చేరడం లక్ష్యంగా

తెలంగాణ ఉద్యమ సమయం తరహాలో తెలంగాణ అస్తిత్వభావనను మరోమారు జనసామాన్యంలోకి తీసుకెళ్లాలనే అభిప్రాయంలో కేసీఆర్ ఉన్నట్లు తెలిసింది. యువత, విద్యార్థులకు చేరువ కావడమే లక్ష్యంగా తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని కేసీఆర్ ఆదేశించారు. ఇందులో భాగంగా త్వరలో పార్టీ విద్యార్థి విభాగం సమావేశాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నెల 21 తర్వాత తెలంగాణ భవన్‌లో జరిగే విద్యార్థి విభాగం సమావేశానికి కేటీఆర్, హరీశ్‌రావులు హాజరవుతారని తెలుస్తోంది.

స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత దిశగా..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వం గందరగోళంలో ఉందని, ఈ నేపథ్యంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా పార్టీ కేడర్ సన్నద్ధంగా ఉండేలా చూడాలని కేసీఆర్ దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించేందుకు స్థానిక సంస్థల ఎన్నికలను ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని కేసీఆర్ నొక్కి చెప్తున్నట్లు సమాచారం. యువతకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని, ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జిలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కేటీఆర్, హరీశ్‌లకు కేసీఆర్ సూచించారు. ఉద్యమ పంథాలో పార్టీ కార్యక్రమాలు చేపట్టాడానికి సంబంధించిన కార్యాచరణను కేసీఆర్ త్వరలో స్వయంగా ప్రకటించే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు చెపుతున్నాయి.

అందరినీ కడుపులో పెట్టుకుని కాపాడుకుంటా..

- భవిష్యవాణిలో స్వర్ణలత
- ముగిసిన లష్కర్ బోనాలు



రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్): అంగరంగ వైభవంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ముగిశాయి. లక్షలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించగా.. సోమవారం జరిగిన రంగంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి భవిష్యవాణితో పాటు పోతరాజుల వీరంగాలు, అంబారీపై అమ్మవారి ఊరేగింపు, అమ్మవారి ఘటానికి వీడ్కోలు జరిగాయి. ఉత్సవాల్లో రెండో అంకమైన 'రంగం'లో భాగంగా ఉదయం అవివాహితైన స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. ఈ సందర్భంగా స్వర్ణలత రాబోయే రోజుల్లో జరగబోయేవి, పూజల్లో లోటుపాట్లను వివరించారు.

రక్తబలి కావాలి.. నా రూపాన్ని ప్రతిష్ఠించాలి

ఇన్నేళ్లుగా తనకు సాకలు పోసి, బోనాలతో సంతోషపెడుతున్నారని, ప్రతిసారి అడుగుతున్నా పట్టించుకోకుండా పొరపాట్లు చేస్తున్నారని అమ్మవారు పేర్కొన్నారు. ఏటా తన బిడ్డలను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్నానని, ప్రతిసారి భక్తుల్ని అడుగుతూనే ఉన్నా.. లెక్క చేయడం లేదని చెప్పారు. గోరంత రక్తపు చుక్కను కూడా తనకు బలి ఇవ్వడం లేదని, ఏటా తన పేరు చెప్పి భక్తులు ఆరగించేందుకే సరిపోవడం లేదన్నారు. తన కొత్త రూపాన్ని ప్రతిష్ఠించాలని గతంలోనే కోరినా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఎవరైతే వీటన్నిటికీ అడ్డు పడుతున్నారో.. వాళ్ల రక్తం కక్కుకుని చనిపోతారని, తన బిడ్డలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంటానని అమ్మవారు చెప్పారు. పిల్లలను విచ్చలవిడిగా వదిలి పెడుతున్నారని, వారిని అదుపులో పెట్టుకోండని హెచ్చరించారు.ఐదు వారాలు తనకు పప్పు, బెల్లాలు, సాకతో, పసుపు, కుంకుమతో పూజలు చేయాలని కోరారు. అప్పుడే ఈ అకాల మరణాలు ఆగిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మరో మహమ్మారి రానుందని, ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని.. అమ్మవారు భవిష్యవాణిలో హెచ్చరించారు.

జల వివాదాలపై కేంద్రం దృష్టి

▶ మొదటి పేజీ తరువాయి

కూడా పంపించాలని సూచించారు.

తెలంగాణ వాటాల కోసం కేంద్రంపై ఒత్తిడి

కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన ప్రతి నీటి బొట్టును సాధించడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కృష్ణా బేసిన్‌లోని రాష్ట్ర ప్రాజెక్టులకు వెంటనే క్లియరెన్సు ఇవ్వాలని, నీటి కేటాయింపులతో పాటు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరనున్నారు. 16న ఢిల్లీలో జరిగే సమావేశంలో రాష్ట్ర నీటి వాటాల సాధనతో పాటు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, కొత్త ప్రాజెక్టులకు పట్టుబట్టాలని నిర్ణయించారు. 'కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణకు తీరని ద్రోహం జరిగింది. కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో న్యాయంగా రావాల్సిన నీటి వాటాలు సాధించడంలో దారుణంగా విఫలమైంది. తెలంగాణకు 299 టీఎంసీల నీటి వాటాకు అంగీకరించి ఏపీకి 512 టీఎంసీలు కట్టబెట్టింది. శ్రీశైలం ఎగువన ఏపీ అక్రమంగా నిర్మించుకున్న ప్రాజెక్టులన్నింటికీ వంత పాడింది. కృష్ణా నీళ్లను ఏపీ యథేచ్ఛగా మళ్లించుకుంటే మౌనం వహించింది. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణాపై నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఇవ్వకుండా అసంపూర్తిగా వదిలేసింది..' అని సీఎం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు.

'ఇచ్చంపల్లి'కి అనుమతించండి

▶ మొదటి పేజీ తరువాయి

చొరవచూపాలని విజ్ఞప్తి చేశారు. లేఖలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..

ఏపీ అక్రమ ప్రాజెక్టులు

- శ్రీశైలం జలాశయం అట్టడుగు స్థాయి నుంచి బేసిన్ వెలుపలి ప్రాంతాలకు రోజుకు 10 టీఎంసీలు చొప్పున 20 రోజుల్లో 200 టీఎంసీల జలాలను అక్రమంగా మళ్లించేందుకు ఏపీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. దీనివల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలలో జల విద్యుదుత్పత్తిపై దుష్ప్రభావం పడటంతో పాటు తెలంగాణలోని నాగార్జునసాగర్, కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి, డిండి, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టుల ఆయకట్టుకు నీటి కొరత ఏర్పడుతుంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు అనుసంధానమై ఉన్న శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 89 వేల క్యూసెక్కులకు పెంచుకున్న ఏపీ.. తాజాగా దానిని 1.5 లక్షలకు పెంచుకునేందుకు ఏర్పాట్లు చేస్తోంది. శ్రీశైలం 841 అడుగుల నుంచే రోజుకు 8 టీఎంసీలను మళ్లించేలా కాల్వల నిర్మాణాలు చేపట్టింది. ఎన్జీటీ స్టేను ఉల్లంఘించి 797 అడుగుల వద్ద రోజుకు 3 టీఎంసీలు తీసుకెళ్లేందుకు రాయలసీమ ఎత్తిపోతలు, ముచ్చుమర్రి, మల్యాల, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులు నిర్మిస్తోంది.

కృష్ణా ట్రిబ్యునల్ విచారణ త్వరగా పూర్తి చేయాలి

- 1979లో ఎస్ఎల్బీసీ, 1984లో కల్వకుర్తి, 1997లో నెట్టెంపాడు, 2013లో పాలమూరు-రంగారెడ్డి, 2007లో డిండి, 2005లో కొల్లాపూర్, 2014లో నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. కృష్ణా ట్రిబ్యునల్-1 అవార్డు ప్రకారం చేపట్టిన ఈ ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతులు ఇవ్వాలి. కృష్ణా ట్రిబ్యునల్ విచారణ త్వరగా పూర్తి కావాలి.
- నిబంధనలకు విరుద్ధంగా ఇతర బేసిన్లకు నీటిని మళ్లించడాన్ని కేఆర్ఎంబీ అడ్డుకోవాలి.
- శ్రీశైలం డ్యామ్ నిర్వహణ ప్రమాదకరంగా మారింది. డ్యామ్ భద్రత, నిరంతర కార్యకలాపాలు, జల విద్యుత్తు ఉత్పత్తి, నీటిపారుదల అవసరాలు, తాగునీటి సరఫరాకు తక్షణ చర్యలు చేపట్టాలి.
- గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల వాటాలో నుంచి ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు 80 టీఎంసీలను సర్దుబాటు చేయాలి. ఏఐబీపీ కింద ఆర్థిక సాయం అందించాలి.

హ్యామ్ పద్ధతిలో ఉత్తర రింగు

▶ మొదటి పేజీ తరువాయి


మూడు నెలల క్రితం ఎన్‌హెచ్ఏఐ టెండర్లు పిలిచింది. మొత్తం 8 లేన్లకు గాను తొలివిడతలో 4 వరుసలుగా నిర్మించాలని టెండర్ డాక్యుమెంటులో పేర్కొంది. ఈ రోడ్డు మీద టోల్ ఆదాయం తక్కువగా ఉంటుందనే అంచనాతో కాంట్రాక్టర్లు ఈపీసీ పద్ధతిలో పని చేపట్టేందుకే ముందుకొస్తారని ఎన్‌హెచ్ఏఐ భావించింది. ఈపీసీ పద్ధతిలో నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. పనులు జరిగేకొద్దీ ఎప్పటికప్పుడు అయ్యే వ్యయాన్ని నిర్మాణ సంస్థకు విడుదల చేయాల్సి ఉంటుంది. నిధుల విడుదల నిలిచిపోతే పనులు కూడా ఆగిపోతాయి. అయితే పీఎం గతిశక్తిలోని నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ ఈ ప్రాజెక్టుపై సమీక్షించి ఆర్ఆర్ఆర్ వల్ల ఆయా ప్రాంతాల్లో మంచి అభివృద్ధి జరిగే అవకాశం ఉన్నందున, ఆ రోడ్డుపై వాహనాల సంఖ్య కూడా అధికంగానే ఉంటుందని, దీనివల్ల టోల్ ఆదాయం కూడా ఎక్కువే ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేసింది. రోడ్డును 4 వరుసలుగా కాకుండా, తొలి దశలోనే 6 వరుసలతో నిర్మించాలని సూచించింది. ఈ మేరకు మరోసారి ట్రాఫిక్ స్టడీ నిర్వహించాలని పేర్కొంది. కాగా భవిష్యత్తులో వాహనాల సంఖ్య భారీగా ఉండనుందని ట్రాఫిక్ స్టడీ తేల్చింది. దీంతో 6 వరుసల రోడ్డు, 8 వరుసలతో వంతెనలు నిర్మించాలని కేంద్రానికి ఎన్‌హెచ్ఏఐ ప్రతిపాదించింది. తాజాగా దానికి కేంద్ర ఉపరితల రవాణాశాఖ ఆమోదం తెలిపింది. ఈపీసీ పద్ధతిలో కాకుండా, హ్యామ్ మోడల్‌లో రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం చేసుకోవాలని కూడా ఆదేశించింది. దీంతో పాత టెండర్ డాక్యుమెంట్‌ను మార్చి ఆ మేరకు మార్పులు చేయాలని ఆదేశించింది.

హ్యామ్‌తో ఇదీ వెసులుబాటు..

హ్యామ్ మోడల్‌లో ప్రభుత్వం మొత్తం నిర్మాణ వ్యయంలో తొలుత 40 శాతం మాత్రమే భరిస్తుంది. మిగతా మొత్తాన్ని నిర్మాణ సంస్థ బ్యాంకుల నుంచి రుణం ద్వారా సమకూర్చుకుంటుంది. సొంత ఆర్థిక వనరులుంటే రుణంతో సంబంధం లేకుండా కూడా ఖర్చు చేసుకోవచ్చు. ఈ మొత్తాన్ని 15 ఏళ్ల సమయం (ఒప్పందంలో పేర్కొనే గడువు)లో ప్రభుత్వం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి ఆరు నెలలకు ఓ వాయిదా చొప్పున చెల్లిస్తుంది. అంతకాలం రోడ్డు నిర్వహణ బాధ్యతను ఆ సంస్థనే పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇక రోడ్డుపై టోల్‌వసూలు చేసే బాధ్యతను మరో టెండర్ ద్వారా ఇంకో సంస్థకు అప్పగిస్తుంది.

త్వరలో రోడ్డుకు నంబర్..: ఈ రోడ్డును చేపట్టాలంటే దానికి కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోద ముద్ర అవసరం. రోడ్డు పనులకు అయ్యే వ్యయం వివరాలను సమీక్షించి, ఆ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై కమిటీ చర్చించి ఆమోద ముద్ర వేస్తుంది. అప్పుడే ఆ రోడ్డుకు జాతీయ రహదారి నంబరు కేటాయిస్తుంది. ఆ తర్వాత టెండర్ తెరిచి నిర్మాణ సంస్థతో ఒప్పందం చేసుకుంటారు. ఈ వారంలో కమిటీ సమావేశం జరగనున్నట్టు తెలిసింది. అందుకు వీలుగా ఎన్‌హెచ్ఏఐ నివేదిక సిద్ధం చేస్తోంది.

నివాళి - బి. సరోజా దేవి



'శ్రీరామాంజనేయ యుద్ధం'లో సీత... ఆ కళ్లల్లో కరుణ
'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో సుభద్ర... ఆ కళ్లల్లో ఆత్మవిశ్వాసం...
పాత్రల్లోనేనా... పాటల్లోనూ ఆ కళ్లు ఎన్నో భావాలు పలికించాయి.
'చిటపట చినుకులు పడుతూ ఉంటే'.... ఆ కళ్లు వెచ్చని హాయిని కనబర్చాయి...
'గిల్లి కజ్జాలు తెచ్చుకునే అమ్మాయి'.... ఆ కళ్లల్లో కవ్వింపు...
ఇలా వెండితెరపై ఆమె కళ్లు జీవించాయి.
అందుకే తెలుగులో 'జగదేక నటి',
మాతృభాష కన్నడంలో 'అభినయ సరస్వతి',
తమిళంలో 'కన్నడత్తు పైంగిళి' (కన్నడ చిలుక).
బి. సరోజా దేవి కళ్లు ఇక విశ్రమించాయి...
అవి కనబర్చిన అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో జీవించే ఉంటాయి.

ఆ కంటిచూపు మన వెన్నంటి...

ప్రముఖ నటి బి. సరోజా దేవి (87) సోమవారం ఉదయం కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా ఆమె కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు. బెంగళూరులోని మల్లేశ్వరంలో గల తన స్వగృహంలో సోమవారం ఎప్పటిలాగే ఉదయాన్నే నిద్రలేచిన సరోజా దేవి పూజ చేసి, టీవీ ఆన్ చేసి, కుర్చీలో కూర్చొని ఉండగా అస్వస్థతకు గురయ్యారని, సమీపంలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

సినిమాలంటే ఇష్టం లేని ఓ తార 'చతుర్భాష తారె'(నాలుగు భాషల తార)గా కితాబులు అందుకున్నారు. అవును... బి. సరోజా దేవికి సినిమాలంటే ఇష్టం లేదు. అయితే ఆమె తండ్రి భైరప్పకు నటనంటే ఇష్టం. వృత్తిరీత్యా ఆయన పోలీసు అయినప్పటికీ ఓ నాటక సంస్థలో నాటకాల్లో నటించేవారు. చిన్నప్పుడు సరోజా దేవితో కూడా నటింపజేసి, మురిసిపోయారు.

బెంగళూరులో 1938లో జనవరి 7న సరోజా దేవి జన్మించారు. ఆమె తల్లిదండ్రులకు నలుగురు కుమార్తెలు కాగా సరోజా దేవి ఆఖరి అమ్మాయి. మగపిల్లలు లేకపోవడంతో ఆమెకి అబ్బాయిలా డ్రెస్సులు వేసేవారు. దాంతో స్కూల్లో అబ్బాయిలు వెక్కిరిస్తే... ఇంటికొచ్చి ఏడ్చిన కూతురితో 'కావాలంటే మీరూ అమ్మాయిలా బట్టలేసుకోండి' అని చెప్పు అంటూ ఆమె తల్లి రుద్రమ్మ ఆత్మవిశ్వాసం నూరిపోశారు.

టీనేజ్‌లో వెండితెరపై...

ఓవైపు చదివిస్తూ మరోవైపు కూతురితో నాటకాల్లో నటింపజేశారు భైరప్ప. పదిహేడేళ్ల వయసులో సరోజాదేవి నటించిన ఒక నాటకం చూసి, కన్నడ దర్శక-నిర్మాత హొన్నప్ప భాగవతార్ ఆమెకు 'మహాకవి కాళిదాశ' (1955) సినిమాలో అవకాశం ఇచ్చారు. జాతీయ అవార్డు సాధించిన ఆ చిత్రంతో సరోజా దేవికి మంచి పేరు వచ్చింది. నిజానికి సరోజా దేవిని నటిని చేయాలనుకుని, డ్యాన్స్ కూడా నేర్పించారు భైరప్ప. డ్యాన్స్ ప్రాక్టీస్ అప్పుడు కుమార్తె కాళ్లు వాచిపోతే, ఓపికగా మసాజ్ చేసేవారట. అలాగే రుద్రమ్మ మాత్రం ఎప్పటికీ స్విమ్ సూట్ ధరించకూడదని, స్లీవ్‌లెస్ బ్లౌజులు వేయకూడదని కూతురికి నిబంధన విధించారట. తన కెరీర్ మొత్తంలో ఆ నిబంధనను పాటించారు సరోజా దేవి.



'మహాకవి కాళిదాస' తమిళంలో 'మహాకవి కాళిదాస్'గా అనువాదమై, 1956లో విడుదలైంది. ఆ రకంగా తమిళ పరిశ్రమ దృష్టి సరోజా దేవిపై పడింది. విశేషం ఏంటంటే... తమిళంలో రిలీజైన నాలుగేళ్లకు శివాజీ గణేశన్, షావుకారు జానకిల కాంబినేషన్‌లో 'మహాకవి కాళిదాస్' (1966)గా రీమేక్ కూడా చేశారు. ఇక తమిళంలో 'తిరుమణమ్' (1956)లో నటించే అవకాశం సరోజా దేవికి దక్కింది. ఆ తర్వాత వరుసగా కన్నడ, తమిళ చిత్రాలు చేస్తున్న ఆమెకు తెలుగు నుంచి ఆహ్వానం అందింది. ఎన్టీఆర్ హీరోగా రూపొందిన 'పాండురంగ మహత్మ్యం' (1957)లో నటించే చాన్స్ అందుకున్నారు సరోజ. ఏ భాషలో నటిస్తే అది ఆమె మాతృభాష ఏమో అనిపించేలా నటన ఉండటంతో తెలుగు, తమిళ, కన్నడంలో వరుసగా ఆఫర్స్ వచ్చి, బిజీ తారగా మారిపోయారు. అలా ఆమె 'పైఘమ్, ససురాల్' తదితర హిందీ చిత్రాల్లోనూ నటించారు.



'ఆత్మబలం'లో చిటపట చినుకులు పాటలో...

గాసిప్ లేని నటి

దాదాపు ఏడు దశాబ్దాల కెరీర్‌లో నాలుగు (కన్నడ, తెలుగు, తమిళ, హిందీ) భాషల్లో ఎందరో స్టార్ హీరోల సరసన నటించారు సరోజా దేవి. అయితే ఏ ఒక్క హీరోతోనూ తనకు లింకులు పెట్టి వదంతులు రాకపోవడం తన అదృష్టం అని ఓ సందర్భంలో సరోజా దేవి తెలిపారు. అలా గాసిప్ లేని నటి అనిపించుకోవడం తన పుణ్యం అని కూడా అన్నారామె.

తెలుగులో పాతిక వరకూ...

తెలుగులో ఓ పాతిక సినిమాలు చేశారు సరోజ. ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఎక్కువ చిత్రాలు చేశారామె. వాటిలో 'ఉమాచండీ గౌరీ శంకరుల కథ, శ్రీరామాంజనేయ యుద్ధం, దాన వీర శూర కర్ణ' వంటివి ఉన్నాయి. అలాగే అక్కినేని సరసన 'శ్రీకృష్ణార్జున యుద్ధం, ఆత్మ బలం, అమర శిల్పి జక్కన్న' వంటివి చేశారు. 'ఆత్మ బలం'లో ఏఎన్నార్‌తో కలిసి 'చిటపట చినుకులు పడుతూ ఉంటే...' పాటలో సరోజ వేసిన స్టెప్స్, కళ్లల్లో పలికించిన రొమాన్స్‌కి నాటి ప్రేక్షకులు 'భేష్' అన్నారు. ఈ 'చిటపట చినుకులు...' పాటలో ఆమె తలకు స్కార్ఫ్ కట్టుకుని కనబడతారు. దానికో కథ ఉంది... అదేంటంటే...

ఆ కళ్లల్లో ఆరిన తడి

సరోజా దేవికి ఇద్దరు కూతుళ్లు (ఇందిర, భువనేశ్వరి), ఒక కుమారుడు (గౌతమ్ రామచంద్రన్). కాగా భువనేశ్వరి అనారోగ్యంతో కన్నుమూయడం సరోజా దేవికి ఓ షాక్. అలాగే 1986లో ఆమె భర్త కూడా చనిపోయారు. 'నా అనుకున్నవాళ్లు నా కళ్ల ముందే దూరం కావడం నాకు బాధగా అనిపించింది' అంటూ ఆమె కంట తడి పెట్టిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇక భర్త చనిపోయాక సరోజా దేవికి కంటి సమస్య వచ్చింది. బాగా ఏడవడం వల్ల కళ్ల తడి ఆరిపోయి, 'డ్రై ఐస్'తో బాధపడ్డారామె. చాన్నాళ్లపాటు ఆమెను ఈ బాధ వెంటాడింది. దీన్నిబట్టి భర్త పట్ల సరోజా దేవికి ఎంత మమకారం ఉండేదో ఊహించవచ్చు. ఇక కుమార్తె భువనేశ్వరి పేరిట అవార్డు ప్రవేశపెట్టి, సాహిత్య రంగంలో ప్రతిభావంతులకు అందజేస్తూ వచ్చారు.



భర్త శ్రీహర్షతో...

ట్రెండ్ అయిన స్కార్ఫ్

'చిటపట..' చిత్రీకరించే ముందు సరోజ ఓ హిందీ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆ షూట్‌లో భాగంగా నెత్తిపై పాల కడవ పెట్టుకుని నడుస్తుంటే, ఆకతాయిలు ఆమెపై రాళ్లు విసురుతూ ఆట పట్టిస్తారు. ఓ రాయి సరిగ్గా సరోజ ముఖానికి తగిలి, గాయాలయ్యాయి. అదే సమయానికి ఇటు ఏఎన్నార్ కాంబినేషన్‌లో 'చిట పట..' పాట షూట్‌లో పాల్గొనాలి. దాంతో ముఖంపై మచ్చలు కనబడనివ్వకుండా స్కార్ఫ్‌తో మేనేజ్ చేశారు. ఆ తర్వాత ఆ స్కార్ఫ్ ఫ్యాషన్ ట్రెండ్‌గా మారిపోవడం విశేషం. ఇక తనకు బాగా నచ్చిన పాటల్లో 'చిట పట' ఒకటని సరోజ పలు సందర్భాల్లో చెప్పారు.

శక్తిమంతమైన స్త్రీ పాత్రల్లో ...



1824లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా పోరాడిన భారతీయ వీర వనిత కిత్తూరు చెన్నమ్మ పాత్రను చేశారు సరోజా దేవి. 'కిత్తూరు రాణి చెన్నమ్మ' టైటిల్‌తో రూపొందిన ఆ చిత్రంలో సరోజా దేవి అభినయం అద్భుతం. ఆ చిత్రానికి జాతీయ అవార్డు దక్కింది. అలాగే 'చింతామణి, శకుంతల' వంటి కన్నడ చిత్రాల్లోనూ తెలుగులో 'పండంటి కాపురం, గృహిణి' తదితర చిత్రాల్లోనూ శక్తిమంతమైన స్త్రీ పాత్రలు పోషించి, మెప్పించారు.

సరోజ చీరలు ఫేమస్

1960లలో సరోజా దేవి ధరించిన చీరలు, జాకెట్టులు, నగలు, హెయిర్ స్టైల్‌కి ప్రత్యేకమైన క్రేజ్ ఉండేది. ఆ తరం అమ్మాయిలు ఆమె స్టైల్‌ని, మేనరిజమ్స్‌ని ఫాలో అయ్యేవారు. ముఖ్యంగా తమిళ చిత్రాలు 'ఎంగ వీట్టు పిళ్లై, అన్బే వా'లోని చీరలు, నగలను ఫాలో అయ్యారు.

బిజీగా ఉన్నప్పుడే వివాహం

1955లో నటిగా పరిచయమై, అక్కణ్ణుంచి పదేళ్లు బిజీ బిజీగా సినిమాలు చేస్తున్న సమయంలో సరోజా దేవికి ఇంజినీర్ శ్రీహర్షతో 1967లో పెళ్లయింది. పెళ్లయ్యాక సినిమాలు చేయాలా? వద్దా? అనే మీమాంసలో పడ్డారట సరోజ. అయితే భర్త శ్రీహర్ష ప్రోత్సాహంతో సినిమాల్లో కొనసాగారు సరోజ. ఇక ఆమె భర్త అనారోగ్యం బారిన పడక ముందు 'లేడీస్ హాస్టల్' (1985) అనే కన్నడ సినిమా అంగీకరించారు. ఆ సినిమా అప్పుడే శ్రీహర్ష అనారోగ్యానికి గురి కావడంతో ఆమె షూటింగ్స్‌కి దూరమయ్యారు. చివరికి 1986లో భర్త చనిపోవడంతో ఆమె ఏడాది పాటు షూటింగ్స్‌కి దూరంగా ఉండటంతో పాటు కుటుంబ సభ్యులు కానివారిని కలవడానికి కూడా ఇష్టపడలేదు. ఏడాది తర్వాత 'లేడీస్ హాస్టల్' సినిమాతో పాటు అప్పటికే అంగీకరించిన ఎనిమిది చిత్రాలను పూర్తి చేశారామె. ఆ తర్వాత ఐదేళ్లు బ్రేక్ తీసుకున్నారు.

ఫస్ట్ కన్నడ ఫిమేల్ సూపర్ స్టార్

నిర్మాతలు, అభిమానుల కోరిక మేరకు మళ్లీ కథానాయికగా సినిమాలు చేయడం మొదలుపెట్టారు. ఆ తర్వాత క్యారెక్టర్ నటిగానూ చేశారు. దాదాపు 200 చిత్రాల్లో నటించారు. ఆమె నటించిన చివరి కన్నడ చిత్రం 'నట సార్వభౌమ' (2019). కన్నడంలో ఫస్ట్ ఫిమేల్ సూపర్ స్టార్ రికార్డ్ ఆమెదే. ఇక వరుసగా 150కి పైగా చిత్రాల్లో కథానాయికగా నటించడం ఓ అరుదైన ఘనత.

జాతీయ అవార్డుల జ్యూరీ అధ్యక్షురాలిగా...

1998, 2005లో సరోజా 45వ జాతీయ సినిమా అవార్డు, 53వ జాతీయ సినిమా అవార్డుల జ్యూరీ అధ్యక్షురాలిగా వ్యవహరించారు. కర్నాటక ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కి అధ్యక్షురాలిగా, కన్నడ చలన చిత్ర సంఘ ఉపాధ్యక్షురాలిగానూ చేశారు. ఇక 60వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం సరోజా దేవిని 'జీవిత సాఫల్య' పురస్కారంతో సత్కరించింది. అలాగే అంతకు ముందు 1969లో ప్రతిష్ఠాత్మక 'పద్మశ్రీ', 1992లో 'పద్మభూషణ్' పురస్కారాలు అందుకున్నారామె. ఇంకా కన్నడ, తెలుగు, తమిళ రాష్ట్రాలకు చెందిన పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఈ అభినయ సరస్వతికి దక్కాయి.

ఆ ముగ్గురి జోడీ హిట్



అటు కన్నడ స్టార్ రాజ్‌కుమార్ ఇటు తెలుగు స్టార్ ఎన్టీఆర్ మరోవైపు తమిళ స్టార్ ఎంజీ రామచంద్రన్‌లకు జోడీగా సరోజా దేవి ఎక్కువ సినిమాల్లో నటించారు. ఈ ముగ్గురు హీరోలు–సరోజాదేవిది 'హిట్ పెయిర్'. జయలలిత తర్వాత ఎంజీఆర్‌కి జోడీగా ఎక్కువ సినిమాల్లో నటించిన రికార్డ్ సరోజా దేవిదే. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'నాడోడి మన్నన్' బ్లాక్ బస్టర్. సరోజా దేవికి ఎంజీఆర్ అంటే చాలా అభిమానం. ఎంత అభిమానం అంటే... తన తనయుడికి ఆయన పేరు వచ్చేట్లుగా 'గౌతమ్ రామచంద్రన్' అని పెట్టుకున్నారు. ఇక ఇంకో విశేషం ఏంటంటే.... తమిళ హీరో శివాజీ గణేశన్‌తో బ్యాక్ టు బ్యాక్ 22 హిట్ చిత్రాల్లో నటించారు సరోజా దేవి. వాటిలో 'తంగమలై రహస్యం, భాగ పిరివినై, పార్తాల్ పసి తీరుమ్' వంటివి ఉన్నాయి. అలాగే జెమినీ గణేశన్‌తో 15కి పైగా తమిళ చిత్రాల్లో నటించారు.

ముద్దు మాటల ముద్దుగుమ్మ

సరోజా దేవి మాటలు ముద్దు ముద్దుగా ఉంటాయి. చిన్నపిల్లలు మాట్లాడినట్లే. అయితే తన సహజ ధోరణి అది అని, కావాలని మాట్లాడలేదని ఓ ఇంటర్వ్యూలో సరోజా దేవి పేర్కొన్నారు. ప్రేక్షకులు తన మీద అభిమానంతో అలా ముద్దు మాటలు అనేవారని ఆమె అన్నారు.

చివరి కోరిక అదే

ఇప్పటివరకూ సరోజకు రీప్లేస్‌మెంట్‌గా మరో తార రాలేదు... భవిష్యత్తులోనూ రాకపోవచ్చు. అయితే ఆ కళ్లు కొన్నేళ్ల పాటు చూస్తుంటాయి. ఎందుకంటే మరణించిన తర్వాత నేత్రదానం చేయాలన్నది సరోజ చిట్ట చివరి కోరిక. కుటుంబ సభ్యులు ఆ కోరికను నెరవేర్చారు. ఇక... నటిగా ఆ కళ్లు ప్రేక్షకుల హృదయాల్లో జీవించే ఉంటాయి.

నేడు అంత్యక్రియలు

సరోజ మృతి పట్ల పలువురు కన్నడ, తెలుగు, తమిళ తదితర భాషల సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం సరోజా దేవి స్వగ్రామం రామనగర జిల్లా చెన్నపట్టణ తాలూకా దశవార గ్రామంలో ఒక్కలిగ సామాజిక వర్గ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరగనున్నాయి.

– డి.జి. భవాని

బులియన్

జూలై 14న ముగింపు
(బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,710
బంగారం (22 క్యారెట్లు)	91,230
వెండి	1,15,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,01,230
బంగారం (22 క్యారెట్లు)	91,550
వెండి	1,17,000
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,880
బంగారం (22 క్యారెట్లు)	91,550
వెండి	1,25,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,01,230
బంగారం (22 క్యారెట్లు)	94,300
వెండి	1,17,000
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,300
బంగారం (22 క్యారెట్లు)	90,440
వెండి	1,14,200
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,870
బంగారం (22 క్యారెట్లు)	91,550
వెండి	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు

సాక్షి సినిమా

సింగిల్ షెడ్యూల్‌లో...



● విశాల్, దుషారా విజయన్

విశాల్ హీరోగా 35వ సినిమా షూటింగ్ షురూ అయింది. రవి అరసు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దుషారా విజయన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్‌పై రూపొందుతోన్న 99వ చిత్రమిది. ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు సోమవారం చెన్నైలో జరిగాయి. దర్శకుడు వెట్రిమారన్, శరవణ సుబ్బయ్య (సిటిజన్), మణిమారన్ (ఎన్‌హెచ్ 4), వెంకట్ మోహన్ (అయోగ్య), శరవణన్ (ఎంగే యుమ్ ఎప్పోదుం), నటులు కార్తీ, జీవా, కెమెరామేన్ ఆర్థర్ ఎ విల్సన్, డిస్ట్రిబ్యూటర్ తిరుప్పూర్ సుబ్రమణ్యం వంటి ప్రముఖులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''మద గజ రాజా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత విశాల్ నటిస్తున్న చిత్రమిది. విశాల్, దర్శకుడు రవి అరసు కాంబినేషన్‌లో మొదటి సినిమా ఇది. 'మద గజ రాజా' తర్వాత విశాల్, సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం.నాథన్ ఈ సినిమా కోసం మరోసారి కలిసి పని చేస్తున్నారు. అలాగే 'మార్క్ ఆంటోనీ' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ మరోసారి ఈ సినిమా కోసం విశాల్‌తో కలిశారు. 45 రోజుల సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్‌ను పూర్తి చేయనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

ఐఎఫ్‌ఎఫ్‌ఎం నామినేషన్స్‌లో కల్కి



● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటించిన పాన్ ఇండియన్ మూవీ 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రం ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ (ఐఎఫ్‌ఎఫ్‌ఎం) నామినేషన్స్‌లో చోటు దక్కించుకుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ ఇతర పాత్రలు పోషించారు. సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా గత ఏడాది జూన్ 27న విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచింది. తాజాగా ఐఎఫ్‌ఎఫ్‌ఎం నామినేషన్స్ జాబితాని విడుదల చేయగా ఉత్తమ చిత్రం విభాగంలో తెలుగు నుంచి 'కల్కి 2898 ఏడీ' రేసులో నిలిచింది. ఇంకా ఈ విభాగంలో 'హోమ్ బౌండ్, ఎల్ 2: ఎంపురాన్, మహారాజ్, స్త్రీ 2, సూపర్ బాయ్స్ ఆఫ్ మాలేగావ్' చిత్రాలు నామినేషన్స్‌లో నిలిచాయి. అదే విధంగా ఉత్తమ నటుడు కేటగిరీలో మోహన్ లాల్ (ఎల్2: ఎంపురాన్), అభిషేక్ బచ్చన్ (ఐ వాంట్ టు టాక్), ఆదర్శ్ గౌరవ్ (సూపర్‌బాయ్స్ ఆఫ్ మాలేగావ్), ఇషాన్ కట్టర్ (హోమ్ శ్రీశ్రీబౌండ్), విశాల్ జెత్వా (హోమ్‌బౌండ్), జునైద్ ఖాన్ (మహారాజ్) పోటీ పడుతున్నారు. ఆగస్టు 14న విజేతల వివరాలు ప్రకటించనున్నారు. ఆగస్టు 14 నుంచి 24 వరకు మెల్‌బోర్న్‌లో (ఆస్ట్రేలియా) ఐఎఫ్‌ఎఫ్‌ఎం అవార్డుల ప్రదానం జరగనుంది.

ప్రేమ మాత్రం బాగుండాలి!



● కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కే-ర్యాంప్'.యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో వీకే నరేశ్, సాయికుమార్, 'వెన్నెల' కిశోర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబరు 18న విడుదల కానుంది. నేడు (మంగళవారం) కిరణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం 'రిచెస్ట్ చిల్లర్ గయ్' అంటూ 'కే-ర్యాంప్' నుంచి గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. 'మనం ఏఎంబీ సినిమాలో మలయాళ ప్రేమకథలు చూసి, హిట్ చేస్తాం, కానీ తెలుగు ప్రేమకథలతోనే మనకు ప్రాబ్లమ్. ఎందుకంటే ఆ సినిమాల్లో ఉండే ఆథెంటిసిటీ మన సినిమాల్లో ఉండదు, ప్రేమ మాత్రం బాగుండాలి..'' అన్న డైలాగ్స్ ఈ వీడియోలో ఉన్నాయి.

మోసం చేశారు.. అయినా భయపడలేదు

- టి. నరసింహా రెడ్డి



● అనుపమ, నరసింహా రెడ్డి

''ఎంతో తపన ఉంటేనే సినిమాలు నిర్మిస్తాం. ఎన్నో వ్యయప్రయాసలు పడితే కానీ మా 'మిస్టర్ రెడ్డి' సినిమా బయటకు రావడం లేదు. ఈ క్రమంలో నన్ను ఎంతోమంది మోసం చేశారు. కానీ నేను భయపడలేదు. నా ప్రతిభను నమ్ముకుని, ఇక్కడి వరకు వచ్చాను'' అని టి. నరసింహారెడ్డి (టీఎస్‌ఆర్) అన్నారు. ఆయన హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'మిస్టర్ రెడ్డి'. వెంకట్ రెడ్డి వోలాద్రి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మహాదేవ్, అనుపమా ప్రకాశ్, దీప్తి శ్రీరంగం, భాస్కర్, మల్లికార్జున్, శంకర్ మహతి ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో టీఎస్‌ఆర్ మాట్లాడుతూ–''నా జీవితంలో జరిగిన కథే ఈ చిత్రం. ఇందులోని ప్రేమకథ ఆడియన్స్‌ను అలరిస్తుంది'' అని చెప్పారు. ''అందరం కలిసి ఒక మంచి సినిమా తీశాం. ప్రేక్షకులు ఆదరించాలి'' అని పేర్కొన్నారు వెంకట్ వోలాద్రి.




● జనార్దన్ ● బాబ్జీ

పోలీస్ వారి సందేశం

సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, 'శుభలేఖ' సుధాకర్, షాయాజీ షిండే తదితరులు ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్దన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌కి మట్టి కవి బెల్లి యాదయ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ''ఈ చిత్రం సమాజానికి మంచి సందేశాన్నిస్తుంది'' అన్నారు. ''నేను ఆర్మీలో పని చేసి వచ్చాను. మంచి కంటెంట్ ఉన్న మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు జనార్దన్. బాబ్జీ మాట్లాడుతూ– ''ఒక మంచి సందేశాన్ని ప్రేక్షకులకు చెబుతున్నాం. సినిమా చూశాక సమాజం మీద ఒక ప్రేమతో, బాధ్యతతో ప్రేక్షకులు థియేటర్ నుండి బయటకి వస్తారు'' అని చెప్పారు. ''ఈ చిత్రంలో మంచి పాత్ర చేశాను'' అన్నారు సన్నీ అఖిల్.


కొత్తపల్లికి కనెక్ట్ అయ్యారు



● మనోజ్ చంద్ర

''కొత్తపల్లిలో ఒకప్పుడు' చిత్రం ఔట్ అండ్ ఔట్ కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందింది. వైజాగ్, విజయవాడ, వరంగల్ వంటి చోట్ల మా సినిమా ప్రివ్యూస్ వేశాం. అన్ని వర్గాల ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకున్నారు. ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. వారి మాటలతో సినిమాపై చాలా నమ్మకంగా ఉన్నాం'' అని హీరో మనోజ్ చంద్ర తెలిపారు. మనోజ్ చంద్ర, మోనిక జోడీగా నటించిన చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. ప్రవీణ పరుచూరి దర్శకత్వంలో రానా దగ్గుబాటి సమర్పణలో గోపాలకృష్ణ పరుచూరి–ప్రవీణ పరుచూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మనోజ్ చంద్ర మాట్లాడుతూ– ''నేను అమెరికాలో ఉన్నప్పుడు ప్రవీణగారితో పరిచయమైంది. 'కొత్తపల్లిలో ఒకప్పుడు'లో హీరో పాత్ర పేరు రామకృష్ణ. ఆ పాత్రకి సరిపోయే నటుడి కోసం వెతుకుతున్నానంటూ స్క్రిప్ట్ చదవమని ఇచ్చారామె. ఆ కథ నాకు నచ్చడంతో నేను చేస్తానంటూ ఆడిషన్స్ ఇచ్చాను. ఆ పాత్రకి నేను న్యాయం చేయగలనని ఆమెకు నమ్మకం కుదరడంతో ఈ సినిమా చేసే అవకాశం నాకు దక్కింది. ఇది ఒక ఊరి కథ. ఈ చిత్రంలో రామకృష్ణకి సావిత్రి అనే అమ్మాయి అంటే ఇష్టం. ఒకరోజు సావిత్రిని కలవడానికి ఒక గడ్డి వాము దగ్గరికి వెళ్తాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది ఆసక్తిగా ఉంటుంది. హీరోగా నా తొలి సినిమా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' విడుదల కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను'' అని చెప్పారు.

అగ్రహారంలో అంబేద్కర్



● మంద కృష్ణ మాదిగ, కృష్ణ చైతన్య

కృష్ణ చైతన్య హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'అగ్రహారంలో అంబేద్కర్'. రామోజీ–లక్ష్మోజీ ఫిల్మ్స్ పతాకంపై రూపొందిన ఈ సినిమా టైటిల్ సాంగ్‌ని మందకృష్ణ మాదిగ విడుదల చేసి, మాట్లాడుతూ– ''కృష్ణచైతన్య ఎన్నో కష్టాలు పడి తెరకెక్కించిన 'అగ్రహారంలో అంబేద్కర్' చిత్రం అసాధారణ విజయం సాధించాలి. అంబేద్కర్ అభిమానులైన ప్రతి ఒక్కరూ ఈ సినిమాని చూడాలి'' అని కోరారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ– ''భారత రాజ్యాంగ రూప శిల్పి బాబా సాహెబ్ అంబేద్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితో రూపొందిన చిత్రం ఇది. అంబేద్కర్‌గారి భావజాలాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా తెరకెక్కించాం. ఈ చిత్రాన్ని సినిటేరియా మీడియా వర్క్స్ ద్వారా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. కుల, మత, ప్రాంత, వర్గ వైషమ్యాలకు అతీతంగా సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన అంబేద్కర్‌గారికి నివాళిగా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాం. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో మా సినిమా పురస్కారాలు అందుకుంది'' అన్నారు.



ప్రిక్వార్టర్ ఫైనల్లో హారిక, వైశాలి

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ద్రోణవల్లి హారిక, వైశాలి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... వంతిక అగర్వాల్ పోరాటం ముగిసింది. మూడో రౌండ్‌లో నిర్ణీత రెండు గేమ్‌ల తర్వాత హారిక (భారత్)-సాలాకిడూ సోటిరూలా (గ్రీస్)... వైశాలి (భారత్)-కరిస్సా యిప్ (అమెరికా)... వంతిక అగర్వాల్ (భారత్)-కాటలీనా లాగ్నో (రష్యా) 1-1తో సమంగా నిలిచారు. దాంతో విజేతను నిర్ణయించేందుకు సోమవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. టైబ్రేక్‌లో హారిక 3-1తో స్టావ్‌రూలాపై... వైశాలి 3-1తో కరిస్సా యిప్‌పై గెలిచి ముందంజ వేశారు. వంతిక 1.5-2.5తో కాటలీనా లాగ్నో చేతిలో ఓడిపోయింది. భారత్‌కే చెందిన కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ ఇప్పటికే ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నారు. మంగళవారం విశ్రాంతి దినం. బుధవారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్ తొలి గేమ్‌లలో అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)తో హంపి; జు జినెర్ (చైనా)తో దివ్య దేశ్‌ముఖ్; కాటలీనా లాగ్నో (రష్యా)తో హారిక; మెరూర్ట్ కమాలిదెనోవా (కజకిస్తాన్)తో వైశాలి తలపడతారు.



పోరాడినా... పరాజయమే

లార్డ్స్ టెస్టులో భారత్ గుండె పగిలింది. విజయానికి ఎంతో చేరువగా వచ్చినా చివరకు ఓటమే పలకరించింది. ఐదో రోజు చేతిలో 6 వికెట్లతో 135 పరుగులు చేయాల్సిన టీమిండియా లక్ష్యాన్ని అందుకోవడంలో విఫలమైంది. ఆశలు పెట్టుకున్న పంత్, రాహుల్ విఫలం కాగా... 82/7 నుంచి జట్టును గెలిపించేందుకు రవీంద్ర జడేజా పోరాడినా లాభం లేకపోయింది. ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ జట్టును ముందుండి నడిపించగా... పట్టుదలగా బౌలింగ్ చేసిన ఆతిథ్య జట్టు మ్యాచ్ చేజారకుండా కాపాడుకోగలిగింది. ఈ టెస్టులో పలు సందర్భాల్లో శుబ్‌మన్ గిల్ బృందం ఆధిక్యం ప్రదర్శించినా... కీలక క్షణాలను ఇంగ్లండ్ సరిగ్గా ఒడిసి పట్టుకుంది. టీమ్ వెనుకబడిన ప్రతీసారి పోరాటయోధుడిలా నేనున్నానంటూ ముందుకొచ్చి సత్తా చాటిన స్టోక్స్‌దే ఈ గెలుపు అనడం అతిశయోక్తి కాదు.



సిరాజ్ అవుటైన వేళ...

లార్డ్స్ టెస్టులో భారత్ అనూహ్య ఓటమి

- 22 పరుగులతో గెలిచిన ఇంగ్లండ్
- సిరీస్‌లో 2-1తో ముందంజ
- రవీంద్ర జడేజా పోరాటం వృథా

లండన్: 'అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ'లో ఇంగ్లండ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సోమవారం లార్డ్స్ మైదానంలో ముగిసిన మూడో టెస్టులో ఇంగ్లండ్ 22 పరుగుల స్వల్ప తేడాతో భారత్‌పై విజయం సాధించింది. అనూహ్య మలుపులు, ఉత్కంఠతో సాగుతూ వచ్చిన మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యం భారత్‌ను దెబ్బ తీసింది. 193 పరుగుల లక్ష్యంతో ఐదో రోజు బరిలోకి దిగిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. రవీంద్ర జడేజా (181 బంతుల్లో 61 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా ఎవరూ ప్రభావం చూపలేకపోయారు. ఇంగ్లండ్ పదునైన బౌలింగ్‌తో స్వల్ప స్కోరును కూడా కాపాడుకోవడంలో సఫలమైంది. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 77 పరుగులు చేయడంతో పాటు 5 వికెట్లు తీసిన బెన్ స్టోక్స్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్నాడు. సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ముందంజలో ఉండగా... నాలుగో టెస్టు ఈ నెల 23 నుంచి మాంచెస్టర్‌లో జరుగుతుంది.

ఆర్చర్ పదునైన బౌలింగ్...

ఓవర్‌నైట్ స్కోరు 58/4తో ఆటను కొనసాగించిన భారత్‌కు చివరి రోజు సరైన ఆరంభం లభించలేదు. 11 పరుగుల వ్యవధిలో జట్టు మూడు కీలక వికెట్లు కోల్పోయింది. గాయంతో బాధపడుతున్న పంత్ తడబడుతూనే బ్యాటింగ్ చేశాడు. ఆర్చర్ అద్భుత బంతితో పంత్ (9)ను క్లీన్‌బౌల్డ్ చేయగా, స్టోక్స్ బౌలింగ్‌లో కేఎల్ రాహుల్ (58 బంతుల్లో 39; 6 ఫోర్లు) వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ అవుట్ ఇవ్వకపోవడంతో రివ్యూ కోరిన ఇంగ్లండ్ ఫలితం సాధించింది. తర్వాతి ఓవర్లోనే ఆర్చర్ తన బౌలింగ్‌లో అద్భుత రిటర్న్ క్యాచ్‌తో సుందర్ (0)ను పెవిలియన్ పంపించాడు. 82/7 వద్ద పరిస్థితి చూస్తే భారత్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతో సమయం పట్టదనిపించింది.



జడేజా

జడేజా పోరాటం...

అప్పటి వరకు 15 బంతులు ఎదుర్కొని 8 పరుగులు చేసిన జడేజా... జట్టు భారాన్ని తనపై వేసుకున్నాడు. తాను ప్రధాన పాత్ర పోషిస్తూ తర్వాతి ముగ్గురు బ్యాటర్లతో అతను కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. భారీ షాట్లకు పోకుండా సింగిల్స్‌తోనే ఒక్కో పరుగు జోడించడంతో పాటు అవతలి బ్యాటర్లను కాపాడుకుంటూ అతని ఇన్నింగ్స్ సాగింది. ఈ క్రమంలో పరుగుల రాక కూడా బాగా తగ్గిపోయింది. పదునైన డిఫెన్స్ చూపించగలిగినా... నితీశ్ కుమార్ రెడ్డి (53 బంతుల్లో 13; 1 ఫోర్) లంచ్‌కు ముందు వోక్స్ చక్కటి బంతికి వెనుదిరిగాడు. ఆ తర్వాత జస్‌ప్రీత్ బుమ్రా (54 బంతుల్లో 5; 1 ఫోర్), జడేజా భాగస్వామ్యం ఏకంగా 22 ఓవర్ల పాటు సాగింది. సహనం కోల్పోయిన బుమ్రా భారీ షాట్ ఆడబోయి అవుట్ కాగా... మొహమ్మద్ సిరాజ్ (40 బంతుల్లో 4) అండతో జడేజా జట్టును గెలుపు దిశగా నడిపించాడు. అయితే చివర్లో పెరిగిన ఉత్కంఠ మధ్య స్పిన్నర్ బషీర్ బౌలింగ్‌లో సిరాజ్ వికెట్‌తో భారత్ ఓటమి ఖాయమైంది.

అలా ముగిసింది...

భారత్ విజయానికి మరో 46 పరుగులు కావాల్సిన సమయంలో జడేజాతో సిరాజ్ జత కలిశాడు. జడేజా జాగ్రత్తగా స్ట్రయికింగ్ నిలబెట్టుకుంటుండగా... సిరాజ్ కూడా పట్టుదలగా 29 బంతులు ఆడి సహకరించాడు. మెలమెల్లగా భాగస్వామ్యం 13.1 ఓవర్లలో 23 పరుగులు పూర్తి చేసుకుంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరి వికెట్ తీయలేక ఇంగ్లండ్ శిబిరంలో అసహనం పెరిగిపోతోంది. ఇలాగే సాగితే సింగిల్స్‌తో మరో 23 పరుగులు కావడం సాధ్యమే అనిపించింది. అయితే సిరాజ్ అనూహ్య వికెట్‌తో ఆట ముగిసింది. బషీర్ వేసిన బంతిని సిరాజ్ దానిని చక్కగా డిఫెన్స్ ఆడాడు. అయితే కింద పడిన బంతి నెమ్మదిగా అతని కాలి వెనక భాగం వైపు వెళ్లగా, దానిని సిరాజ్ గుర్తించలేకపోయాడు. తేరుకునేలోపే బంతి స్టంప్స్‌ను తాకి ఒక బెయిల్ కింద పడటంతో ఇంగ్లండ్ సంబరాలు చేసుకుంది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 387; భారత్ తొలి ఇన్నింగ్స్: 387; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 192; **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) స్మిత్ (బి) ఆర్చర్ 0; రాహుల్ (ఎల్బీ) (బి) స్టోక్స్ 39; కరుణ్ నాయర్ (ఎల్బీ) (బి) కార్స్ 14; గిల్ (సి) స్మిత్ (బి) కార్స్ 6; ఆకాశ్‌దీప్ (బి) స్టోక్స్ 1; పంత్ (బి) ఆర్చర్ 9; జడేజా (నాటౌట్) 61; సుందర్ (సి అండ్ బి) ఆర్చర్ 0; నితీశ్ రెడ్డి (సి) స్మిత్ (బి) వోక్స్ 13; బుమ్రా (సి) (సబ్) కుక్ (బి) స్టోక్స్ 5; సిరాజ్ (బి) బషీర్ 4; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (74.5 ఓవర్లలో ఆలౌట్) 170. వికెట్ల పతనం:** 1-5, 2-41, 3-53, 4-58, 5-71, 6-81, 7-82, 8-112, 9-147, 10-170. **బౌలింగ్:** వోక్స్ 12-5-21-1, ఆర్చర్ 16-1-55-3, స్టోక్స్ 24-4-48-3, కార్స్ 16-2-30-2, రూట్ 1-0-1-0, బషీర్ 5.5-1-6-1.

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మెడల్‌తో స్టోక్స్



మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాగుబడి

పునర్వసు కార్తె: జూలై 19 వరకు
పుష్యమి కార్తె: 20 నుంచి

ఎడారి మొక్క బ్రహ్మజెముడు (కాక్టస్) రసంతో పర్యావరణ హితమైన ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేసే టెక్నాలజీని మెక్సికన్ మహిళా ప్రొఫెసర్ సాండ్రా పాస్కో ఓర్టిజ్ అభివృద్ధి చేశారు. ఒక ప్రయివేటు యూనివర్సిటీలో ఆమె కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ ప్లాస్టిక్ పనితీరులో అచ్చం పెట్రోలియం ఆధారిత ప్లాస్టిక్‌ను పోలి ఉంటుంది. సాధారణ ప్లాస్టిక్ సీసాలు 450 ఏళ్లు, ప్లాస్టిక్ కవర్లు వెయ్యి ఏళ్లకు గాని భూమిలో కలిసిపోవు. కానీ, బ్రహ్మజెముడు ప్లాస్టిక్ నెల రోజుల్లోనే విచ్ఛిన్నమై మట్టిలో కలిసిపోతుంది.



బ్రహ్మజెముడు ప్లాస్టిక్!

- పర్యావరణ కాలుష్యంతో పాటు మైక్రోప్లాస్టిక్ కణాలు మన దేహాలను సైతం కలుషితం చేస్తున్న ఈ తరుణంలో వెలువడిన ఈ ఆవిష్కరణ ఒక విప్లవాత్మక పురోగతిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. డాక్టర్ సాండ్రా పాస్కో ఓర్టిజ్ చాలా మంది అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేశారు.
- బ్రహ్మజెముడు రసం నుంచి తయారు చేసిన ఈ ప్లాస్టిక్ పూర్తిగా బయోడిగ్రేడబుల్. విషపూరితమైనది కాదు. తినదగినంత సురక్షితం! కఠినమైన ఎడారి పరిస్థితుల్లో తక్కువ వనరులతో పెరుగుతున్న బ్రహ్మజెముడు, సాధారణ నోపాల్ కాక్టస్ (ప్రిక్లీ పియర్)ను ఉపయోగించి, ఆమె ప్రపంచవ్యాప్తంగా ప్యాకేజింగ్, తయారీ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే వినూత్న ప్లాస్టిక్‌ను అభివృద్ధి చేశారు.



- బ్రహ్మజెముడు రసంలోని సహజ చక్కెరలు, పెక్టిన్, సేంద్రియ ఆమ్లాల ఆధారంగా ఈ ప్లాస్టిక్ తయారవుతుంది. ప్రయోగశాలలో ఉత్పత్తి ప్రక్రియకు దాదాపు 10 రోజులు పడుతుంది. ఈ పురోగతి ఆహార ప్యాకేజింగ్, షాపింగ్ బ్యాగులు, లెక్కలేనన్ని ఇతర సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీని సమూలంగా మార్చగలదు. వర్షాధార వ్యవసాయదారుల ఆదాయం పెంపొందించేందుకు ఈ ఆవిష్కరణ దోహదపడుతుందని నిపుణులు చెబుతున్నారు.





రొయ్యలకు ప్రత్యామ్నాయం 'పాంపనో'!

పంట మార్పిడి చెయ్యటం అనేది పంట పొలాల్లో మాదిరిగానే ఆక్వా సాగులోనూ అత్యవసరమైన విషయమే. తీరప్రాంతాల్లోని ఉప్పునీటి చెరువుల్లో వనామీ తదితర ఉప్పునీటి రొయ్యలకు ప్రత్యామ్నాయంగా పంట మార్పిడి చేయటానికి అవకాశాలు చాలా తక్కువ. సముద్రంలో పెరిగే జలజీవులను ఉప్పు నీటి చెరువుల్లో పెంచడాన్ని మారికల్చర్ అంటారు. ఈ దిశగా కేంద్రీయ సముద్ర చేపల పరిశోధనా సంస్థ (సీఎంఎఫ్ఆర్ఐ), జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు(ఎన్ఎఫ్‌డీబీ) వంటి సంస్థల శాస్త్రవేత్తలు, అధికారుల కృషి ఫలితంగా రెండు సముద్ర చేపలు ఏపీ తీరప్రాంత చెరువుల్లో సాగులోకి వచ్చాయి. ఈ కోవలో మొదటిది సీబాస్ (పండుగప్ప)కు తాజాగా సముద్ర చేప పాంపనో (చందువా పార)తోడైంది.

'చందువా జాతికి చెందినదే పాంపనో కూడా. ఒకే ముల్లు ఉంటుంది. అయితే, పాంపనో చేప ముల్లు మరింత గట్టిగా ఉంటుంది. అంతే తేడా' అని సీఎంఎఫ్ఆర్ఐ విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయానికి చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మెగారాజన్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. 2016లో పాంపనో పిల్లల ఉత్పత్తి సాంకేతికతను రూపొందించటంతో శాస్త్రవేత్తలు విజయం సాధించారు.

ఆ నేపథ్యంలోనే పాంపనో సాగును కృష్ణా తదితర జిల్లాల్లో అనేక చోట్ల 2020 తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) తోడ్పాటుతో ప్రోత్సహించామని, వందెకరాల్లో సాగవుతోందన్నారు. పాంపనో చేపల రుచి హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాల్లో చేపల వినియోగదారులకు ఇప్పటికే తెలుసు. తద్వారా పాంపనో చేపలకు మంచి మార్కెట్ ఉందని డా. మెగారాజన్ అన్నారు. సముద్రంలో చందువాల సంఖ్య తగ్గిపోవటంతో పాంపనో చేపలను చెరువుల్లో పెంచటం ద్వారా ఆక్వా రైతులు ఆదాయం పొందవచ్చన్నారు.

పాంపనో సీడ్ ఉత్పత్తి సాంకేతికతను ఆర్నెల్ల క్రితమే ఒక ప్రైవేటు హేచరీకి సీఎంఎఫ్ఆర్ఐ బదిలీ చేసింది. తూర్పుగోదావరి జిల్లా తుని వద్ద ఏర్పాటైన ఈ హేచరీ ఇప్పటికే పాంపనో సీడ్ ఉత్పత్తి ప్రారంభించింది. ఉప్పునీటి రొయ్యల చెరువుల్లో వైట్‌స్పాట్ వంటి వ్యాధులు అదుపులో ఉండాలంటే పంట మార్పిడి చేయాలి. అందుకు అన్ని విధాలా అనువైనది పాంపనో చేప. ఇప్పుడు సీడ్ అందుబాటులోకి రావటంతో పాంపనో సాగు విస్తరించే అవకాశం ఉందని అన్నారాయన.






పాంపనో సాగులో రిస్క్ తక్కువ!

ఇండియన్ పాంపనో (చందువా పార) నీటిలో ఉప్పదనం 5 నుంచి 40 పిపిటి వరకు తట్టుకొని పెరుగుతుంది. ఉప్పునీటి రొయ్యలకు ప్రత్యామ్నాయంగా సాగు చేయొచ్చు. పండుగప్ప పెద్ద చేపలు చిన్న చేపలను తినేస్తాయి. అయితే, పాంపనోతో ఆ సమస్య లేదు. రొయ్యలకు మాదిరిగా ప్రాణాంతక వ్యాధులు ముసురుకోవు. వ్యాధుల రిస్క్ తక్కువ. 10 గ్రా./2 అంగుళాల పిల్లలను చెరువులో వేసుకుంటే.. 5-6 నెలల్లో 500-600 గ్రా. బరువు పెరుగుతాయి. పెల్లెట్ల మేతను చక్కగా తింటాయి. రైతుకు కిలో రూ. 350-450 ధర వస్తుంది. రైతులకు మంచి నికరాదాయం వస్తుంది. పాంపనో సాగు 3 కోస్తా జిల్లాల్లో మొదలైంది. వచ్చే ఐదేళ్లలో బాగా ప్రాచుర్యంలోకొస్తుంది.

– డా. మెగారాజన్ (95057 68370)
సీనియర్ శాస్త్రవేత్త,
ఈఎంఎఫ్ఆర్ఐ ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం

మూలపాలంలో పాంపనో సాగు!



శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం మూలపాలం గ్రామంలోని జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ)కి చెందిన ఇంటిగ్రేటెడ్ కోస్టల్ ఆక్వాకల్చర్ ఫెసిలిటీలోని చెరువుల్లో తొలిసారి సముద్ర చేపలు పాంపనో (చందువా పార), సీబాస్ (పండుగప్ప) సాగును ప్రారంభించారు. రొయ్యపిల్లల ఉత్పత్తి కేంద్రం అభివృద్ధి చేయడానికి 2008లో 97.45 ఎకరాల భూమిని ఎన్ఎఫ్‌డీబీకి ప్రభుత్వం కేటాయించింది. రెండేళ్ల క్రితం వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. 2023లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదించడంతో ప్రాజెక్టు తొలి దశకు అడుగు ముందుకు పడింది. నర్సరీ చెరువులు, కల్చరల్ చెరువులు, సముద్రపు నీటిని తీసుకురావడం, బయటకు పంపించడం, వడపోత వ్యవస్థలు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటయ్యాయి.

ఈ ప్రాజెక్టులో భాగంగా ఒక చెరువులో తొలిసారి 2024 జూలైలో పాంపనో (చందువా పార) సాగు టెక్నికల్ కన్సల్టెంట్ ఆంజనేయులు ప్రారంభించారు. చేప పిల్లలను సీఎఫ్‌టీఆర్ఐ ద్వారా తెచ్చి, రెండు నెలలు సీడ్ ట్యాంకుల్లో పెంచి, తర్వాత పెంపకపు చెరువులోకి మార్చారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు అధికారులు, శాస్త్రవేత్తల సలహాతో 25 సెంట్ల చెరువులో 3 వేల పిల్లలను విడిచి పెట్టారు. 8 నెలలు పెంచిన తరువాత గత నెల 29న 900 కిలోల పాంపనో చేపల్ని పట్టుబడి చేసి విక్రయించారు. ఇంకో 900 కిలోల చేపలు ఉన్నాయి. అధిక విస్తీర్ణంలో సాగు చేయటం లాభదాయకమేనన్నారు. పాంపనో సాగులో నష్టం వచ్చే అవకాశాలు తక్కువన్నారు. చెరువు నీటిలో పాంపనో సాగు మొదటిసారి విజయవంతం కావడంతో అధికారులు ఆంజనేయులును అభినందించారు. ప్రస్తుతం మరో రెండు చెరువుల్లో పండుగప్ప చేపలను సాగు చేస్తున్నారు. అధికారులు, శాస్త్రవేత్తల మార్గదర్శకత్వంలో టెక్నికల్ కన్సల్టెంట్ కె. ఆంజనేయులు పాంపనో మొదటి చేపల సాగు జయప్రదమైంది. దీంతో ఈ ప్రాంత ఆక్వా రైతుల్లో రొయ్యలకు ప్రత్యామ్నాయంగా సముద్ర చేపల సాగుపై ఆశలు రేకెత్తుతున్నాయి.

– పిరియ ధర్మేంద్ర,
సాక్షి, సోంపేట, శ్రీకాకుళం జిల్లా

2 కిలోల మేతకు కిలో చేప



సముద్రపు జాతుల చేపలను ఉప్పునీటి చెరువుల్లో పెంచ డాని (మారికల్చర్)కి అనుభవంతో పాటు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు శ్రద్ధగా పాటించటం అవసరం. ఎన్నో సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న భూమిలో పనులు మొదలుపెట్టి అధికారులు అప్పగించిన లక్ష్యాన్ని పూర్తి చేయడం ఆనందంగా ఉంది. 25 సెంట్ల చెరువులో సాధారణంగా వెయ్యి పాంపనో పిల్లలు వేస్తారు. అయితే, అధికారులు, శాస్త్రవేత్తల సలహాతో అధిక సాంద్రతలో 3 వేల పిల్లలను పెంచాం. కిలో చేప పెరగడానికి రెండు కిలోల మేత అవసరమైంది. పిల్లలన్నీ చక్కగా పెరగటం సంతృప్తినిచ్చింది. మరో రెండు చెరువుల్లో పండుగప్ప చేపలను సాగు చేస్తున్నాం. మున్ముందు ఈ చేపల పిల్లలను ఉత్పత్తి చేసి ఆక్వా రైతులకు విక్రయిస్తాం.

– కె.ఆంజనేయులు, టెక్నికల్ కన్సల్టెంట్, ఎన్ఎఫ్‌డీబీ ఇంటిగ్రేటెడ్ కోస్టల్ ఆక్వాకల్చర్ ఫెసిలిటీ, మూలపాలం, శ్రీకాకుళం జిల్లా

సాక్షి బిజినెస్

మంగళవారం
15-7-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
247	68
82,253	25,082

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,649	△	63
డోజోన్స్	44,446	△	75
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,998	△	57
డాక్స్	24,161	▽	57
సాంఘై	3,519	△	9
నికాయ్	39,460	▽	110

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		85.60	86.62
£	బ్రిటన్ పౌండ్		114.60	117.53
€	యూరో		99.19	101.93
¥	జపాన్ యెన్ (100)		57.70	59.19
AU$	ఆస్ట్రేలియా డాలర్		55.43	57.66
S$	సింగపూర్ డాలర్		64.80	69.49
SAR	సౌదీ రియాల్		22.05	23.54
UAE D	యూఏఈ దిర్హామ్		22.52	24.30
¥	చైనా యువాన్		11.12	12.94

కొండెక్కిన వెండి!

ఒకే రోజు రూ.5,000 ర్యాలీ

- ఢిల్లీలో రూ.1,15,000కు చేరిక

న్యూఢిల్లీ: వెండి ధరలు సరికొత్త గరిష్టాలకు చేరాయి. సోమవారం ఢిల్లీ మార్కెట్లో కిలోకి రూ.5,000 పెరగడంతో రూ.1,15,000 స్థాయిని నమోదు చేసింది. డాలర్ బలహీనతకు తోడు పెట్టుబడుల మద్దతు ర్యాలీకి దారితీసింది. గత శనివారం సైతం వెండి కిలోకి రూ.4,500 పెరగడం గమనార్హం. 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.200 లాభపడి రూ.99,570కు చేరుకుంది. 99.5 శాతం స్వచ్ఛత పసిడి సైతం ఇంతే మేర పెరగడంతో రూ.99,000 స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ఔన్స్‌కు 1.71 డాలర్లు పెరిగి 39 డాలర్లకు చేరుకుంది. అంతర్జాతీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లో ఔన్స్ బంగారం 3,353 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యింది.



''వెండి ధరలు దేశీ మార్కెట్లో సరికొత్త గరిష్టాన్ని తాకాయి. అంతర్జాతీయ మార్కెట్లో 14 సంవత్సరాల గరిష్టానికి చేరాయి. బంగారానికి ప్రత్యామ్నాయ సాధనంగా వెండి పట్ల ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరగడమే ఇందుకు దారితీసింది''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఎంసీఎక్స్‌లో సిల్వర్ ఫ్యూచర్ కాంట్రాక్ట్ రూ.2,135 పెరిగి రూ.1,15,136 స్థాయికి చేరుకుంది.

మల్టిపుల్స్ చేతికి వీఐపీ

ప్రమోటర్ల వాటాలో 32 శాతం విక్రయం

- షేరుకి రూ. 388 ధరలో ఓపెన్ ఆఫర్

న్యూఢిల్లీ: లగేజీ, ప్రయాణ సంబంధ వస్తువుల తయారీ దిగ్గజం వీఐపీ ఇండస్ట్రీస్‌లో ప్రమోటర్లు ప్రధాన వాటా విక్రయించనున్నారు. దిలీప్ పిరమల్, కుటుంబ సభ్యులు 32 శాతంవరకూ వాటాను ఆల్టర్నేట్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ మల్టిపుల్స్‌కు అమ్మివేసేందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ అంశాన్ని రెండు సంస్థలు సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. దీంతో వీఐపీ ఇండస్ట్రీస్ వాటాదారులకు సెబీ నిబంధనల ప్రకారం మల్టిపుల్స్ కన్సార్షియం ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. పబ్లిక్ వాటాదారుల నుంచి 26 శాతం వాటా(3.7 కోట్ల షేర్లు) కొనుగోలుకి షేరుకి రూ. 388 ధరలో ఆఫర్‌ను ప్రకటించింది. ఇందుకు వాటాదారులు పూర్తిస్థాయిలో స్పందిస్తే రూ. 1,438 కోట్లవరకూ మల్టిపుల్స్ ఇన్వెస్ట్ చేయవలసి ఉంటుంది. కాగా.. ఓపెన్ ఆఫర్ శుక్రవారం ముగింపు ధర రూ. 456తో పోలిస్తే 15 శాతం తక్కువకావడం గమనార్హం! గత ఏడాది కాలంలో కంపెనీ షేరు 2024 సెప్టెంబర్ 24న రూ. 590 వద్ద గరిష్టాన్ని తాకగా.. 2025 ఏప్రిల్ 7న రూ. 249 వద్ద కనిష్టాన్ని చవిచూసింది. 2025 మార్చికల్లా ప్రమోటర్లు, ప్రమోటర్ సంస్థ 51.73 శాతం వాటాను కలిగి ఉన్నాయి. వాటా కొనుగోలుకి సెబీ, సీసీఐ అనుమతులు లభించవలసి ఉంది. ఈ లావాదేవీ తదుపరి కంపెనీ నియంత్రణ మల్టిపుల్స్ పీఈకి బదిలీ కానుంది. దిలీప్ పిరమల్, కుటుంబ సభ్యులు వాటాదారులుగా కొనసాగనున్నారు. దిలీప్ పిరమల్ కంపెనీకి చైర్మన్ ఎమిరిటస్‌గా వ్యవహరించనున్నట్లు వీఐపీ ఇండస్ట్రీస్ పేర్కొంది. మల్టిపుల్స్ పీఈ ఫండ్స్‌తోపాటు.. సమ్విభాగ్ సెక్యూరిటీస్, మిథున్ పాదమ్ సాచేటి, సిద్ధార్థ సాచేటి, ప్రాఫిటెక్స్ షేర్స్ అండ్ సెక్యూరిటీస్ కన్సార్షియం వీఐపీ ఇండస్ట్రీస్‌ను సొంతం చేసుకోనుంది.

ఆహ్వానిస్తున్నాం..

కంపెనీలో వ్యూహాత్మక భాగస్వామికానున్న మల్టిపుల్స్ కన్సార్షియంకు ఆహ్వానం పలుకుతున్నట్లు వీఐపీ చైర్మన్ దిలీప్ పిరమల్ పేర్కొన్నారు. కంపెనీకున్న పటిష్ట బ్రాండ్ విలువ పునరుద్ధరణలో ఇది కీలక ముందడుగుగా వ్యాఖ్యానించారు. దీంతో ఇటీవల కొన్నేళ్లుగా సవాళ్లు ఎదుర్కొంటున్న కంపెనీ దేశీ లగేజీ మార్కెట్లో తిరిగి బలపడనున్నట్లు అభిప్రాయపడ్డారు. అత్యంత పటిష్ట కార్యకలాపాలు కలిగిన వీఐపీ యాజమాన్య మార్పిడిపై ఉద్వేగంగా ఉన్నట్లు మల్టిపుల్స్ ఆల్టర్నేట్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ వ్యవస్థాపకుడు, ఎండీ, సీఈవో రేణుకా రామ్‌నాథ్ వ్యాఖ్యానించారు. కంపెనీ బ్రాండు విలువను మరింత పెంచడంతోపాటు.. తదుపరి దశ వృద్ధికి కృషి చేయనున్నట్లు తెలియజేశారు.



వీఐపీ సంగతిదీ..

ముంబై కేంద్రంగా 1971లో ఏర్పాటైన వీఐపీ ఇండస్ట్రీస్ లగేజీ తయారీకి ప్రపంచంలోనే రెండో పెద్ద కంపెనీగా నిలుస్తోంది. ఆసియాలోకెల్లా అతి పెద్ద కంపెనీకాగా.. శామ్‌సోనైట్, సఫారీ ఇండస్ట్రీస్‌తో దేశీయంగా పోటీ పడుతోంది. వీఐపీ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ. 6,482 కోట్లుకాగా.. అరిస్టోకాట్, వీఐపీ, కార్ల్‌టన్, స్కైబ్యాగ్స్, క్యాప్రీస్ బ్రాండ్లను కలిగి ఉంది. 2024కల్లా బ్రాండెడ్ లగేజీ మార్కెట్లో 50 శాతం మార్కెట్ వాటాను పొందింది. అయితే ప్రత్యర్థి కంపెనీలతో పోటీ పెరగడంతో మార్కెట్ వాటాను కోల్పోతూ వస్తోంది. గతేడాది (2024–25) వీఐపీ ఇండస్ట్రీస్ ఆదాయం రూ. 2,170 కోట్లకు చేరింది.

ఈ వార్తల నేపథ్యంలో వీఐపీ ఇండస్ట్రీస్ షేరు బీఎస్‌ఈలో 6 శాతం జంప్‌చేసి రూ. 482 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 487–431 మధ్య ఊగిసలాడింది.

నాలుగో రోజూ నష్టాలే

సెన్సెక్స్ నష్టం 247 పాయింట్లు



ముంబై: ఐటీ షేర్లలో అమ్మకాలతో స్టాక్ సూచీలు నాలుగో రోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 247 పాయింట్లు పతనమై 82,253 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 68 పాయింట్లు కోల్పోయి 25,082 వద్ద నిలిచింది. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, ట్రంప్ పలు దేశాలపై తాజా సుంకాల విధింపు ఆందోళనలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఒక దశలోనే సెన్సెక్స్ 490 పాయింట్లు కోల్పోయి 82,010 వద్ద, నిఫ్టీ 148 పాయింట్లు పతనమై 25,002 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 12 పైసలు బలహీనపడి 85.92వద్ద క్లోజైంది.

- దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ కంపెనీ తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికిలోనయ్యాయి. టెక్ మహీంద్రా 2%, విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ 1.50% పతనమయ్యాయి. టీసీఎస్, ఎల్‌టీఐఎం, ఎంఫసిస్ షేర్లు ఒకశాతం నష్టపోయాయి.
- ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్ షేరు తొలిరోజు ఇన్వెస్టర్లకు నష్టాలు మిగిల్చింది. ఇష్యూ ధర(రూ.1,100)తో పోలిస్తే బీఎస్‌ఈలో 2.38% ప్రీమియంతో రూ.1,126 వద్ద లిస్టయ్యింది. చివరికి 2.25% నష్టంతో రూ.1,075 వద్ద ముగిసింది.

ధరలు.. దిగొచ్చాయ్!

- ఆరేళ్ల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- జూన్‌లో 2.1 శాతానికి పరిమితం
- దిగొచ్చిన కూరగాయలు, పప్పుల ధరలు



న్యూఢిల్లీ: కూరగాయలు, ఆహార ధరలు మరింత దిగొచ్చాయి. ఫలితంగా జూన్‌లో వినియోగ ధరల సూచీ (రిటైల్ ద్రవ్యోల్బణం/సీపీఐ) 2.1 శాతానికి దిగొచ్చింది. ఇది ఆరేళ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. ఈ ఏడాది మేలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.82 శాతం కాగా, గతేడాది జూన్‌లో 5.08 శాతంగా ఉంది. ఈ వివరాలను జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) విడుదల చేసింది. చివరిగా 2019 జనవరిలో నమోదైన 1.97 శాతం రిటైల్ ద్రవ్యోల్బణం గత కనిష్ఠ స్థాయిగా ఉంది. కూరగాయలు, పప్పులు, మాంసం, చేపలు, ధాన్యాలు, చక్కెర, పాలు, పాల ఉత్పత్తులు, దినుసుల ధరలు దిగిరావడమే రిటైల్ ద్రవ్యోల్బణం మరింత కిందకు వచ్చేందుకు సాయపడినట్టు ఎన్ఎస్‌వో తెలిపింది. ఆహార ధరల విభాగంలో ద్రవ్యోల్బణం మైనస్ 1.06 శాతానికి క్షీణించింది. ఈ ఏడాది మే నెలతో పోల్చి చూస్తే 2 శాతం దిగొచ్చింది.

మైనస్‌లోకి టోకు ద్రవ్యోల్బణం...

జూన్ నెలకు సంబంధించి టోకు ద్రవ్యోల్బణం (టోకు ధరల సూచీ/డబ్ల్యూపీఐ) ఏకంగా ప్రతికూల స్థాయికి పడిపోయింది. మైనస్ 0.13 శాతంగా నమోదైంది. 19 నెలల తర్వాత మళ్లీ ప్రతికూల స్థాయికి చేరింది. ఆహారోత్పత్తులు, మినరల్ ఆయిల్స్, ఇంధనాలు, బేసిక్ మెటల్స్, తయారీ ఉత్పత్తుల వ్యయాలు దిగిరావడం ఇందుకు దారితీసింది. ఈ ఏడాది మే నెలకు టోకు ద్రవ్యోల్బణం 0.39 శాతం కాగా, గతేడాది జూన్ నెలలో 3.43 శాతం చొప్పున ఉంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
హెచ్‌సీఎల్ టెక్, ఓలా ఎలక్ట్రిక్, టాటా టెక్ ఫలితాలు | ఎకానమీకి జీసీసీల దన్ను

జేన్ స్ట్రీట్ నుంచి రూ. 4,844 కోట్లు

సెబీ ఎస్క్రో ఖాతాలో డిపాజిట్



న్యూఢిల్లీ: యూఎస్ హెడ్జ్ ఫండ్ జేన్ స్ట్రీట్ తాజాగా సెబీ పేరున ఎస్క్రో ఖాతాలో దాదాపు రూ. 4,844 కోట్లు డిపాజిట్ చేసింది. దీంతో సంస్థపై విధించిన ఆంక్షలు ఎత్తివేయవలసిందిగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీని అభ్యర్థించింది. మార్కెట్ మ్యానిప్యులేషన్ ద్వారా భారీ ఆర్జనకు తెరతీసిందన్న ఆరోపణలతో జేన్ స్ట్రీట్‌పై సెబీ కఠిన ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా రూ. 4,843.57 కోట్లు జమ చేయవలసిందిగా ఆదేశించింది. ఈ నేపథ్యంలో జేన్స్ స్ట్రీట్ అభ్యర్థనను పరిశీలిస్తున్నట్లు సెబీ పేర్కొంది. ఎఫ్అండ్‌వో, నగదు విభాగాలలో పొజిషన్లు తీసుకోవడం ద్వారా జేన్ స్ట్రీట్ ఇండెక్సులను మ్యానిప్యులేట్ చేసిందని, తద్వారా భారీగా సంపాదించిందని ఈ నెల 3న జారీ చేసిన తాత్కాలిక ఆదేశాలలో సెబీ పేర్కొంది. 2023 జనవరి– 2025 మే నెల మధ్య రూ. 36,671 కోట్లు ఆర్జించినట్లు సెబీ దర్యాప్తులో వెల్లడైంది. ఫలితంగా హెడ్జ్ ఫండ్‌ను మార్కెట్ కార్యకలాపాల నుంచి దూరం పెడుతూ ఆదేశాలు జారీ చేసింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

కొచ్చి(కేరళ)లోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్‌ఎల్) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఆఫీసర్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- » **అర్హత:** 60 శాతం మార్కులతో డిగ్రీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ), పీజీ(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వేతనం:** మొదటి సంవత్సరం నెలకు రూ. 46,000, రెండో సంవత్సరం రూ.48,000, మూడో సంవత్సరం రూ.50,000.
- » **వయసు:** 18.07.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, సర్టిఫికేట్‌ల పరిశీలన, పవర్‌పాయంట్ ప్రజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.07.2025
- » **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

డీఎస్ఎస్ఎస్‌బీ, న్యూఢిల్లీలో 2,119 గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టులు

న్యూఢిల్లీలోని ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్(డీఎస్ఎస్ఎస్‌బీ).. వివిధ శాఖలలో, స్వయం ప్రతిపత్తి సంస్థలలో, స్థానిక సంస్థలలో ఖాళీగా ఉన్న టీచింగ్, మెడికల్(గ్రూప్-బి, గ్రూప్-సి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 2,119.
- » **పోస్టుల వివరాలు:** మలేరియా ఇన్‌స్పెక్టర్-37, ఆయుర్వేద ఫార్మసిస్ట్-08, పీజీటీ ఇంజనీరింగ్ గ్రాఫిక్స్(పురుషులు)-04, పీజీటీ ఇంజనీరింగ్ గ్రాఫిక్స్(మహిళలు)-03, పీజీటీ ఇంగ్లిష్(పురుషులు)-64, పీజీటీ ఇంగ్లిష్(మహిళలు)-29, పీజీటీ సంస్కృతం(పురుషులు)-06, పీజీటీ సంస్కృతం(మహిళలు)-19, పీజీటీ హార్టికల్చర్(పురుషులు)-01, పీజీటీ అగ్రికల్చర్(పురుషులు)-05, డొమెస్టిక్ సైన్స్ టీచర్-26, అసిస్టెంట్(ఆపరేషన్ థియేటర్ సంబంధిత విభాగాలు)-120, టెక్నీషియన్(ఆపరేషన్ థియేటర్ సంబంధిత విభాగాలు)-70, ఫార్మసిస్ట్(ఆయుర్వేద)-19, వార్డెన్(పురుషులు మాత్రమే)-1676, ల్యాబొరేటరీ టెక్నీషియన్-30, సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్(కెమిస్ట్రీ)-01, సీనియర్ సైంటిఫిక్ అసిస్టెంట్(మైక్రోబయాలజీ)-01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగాల్లో డిప్లొమా /డిగ్రీ/పీజీ డిగ్రీ, బీఈడీ/బీఏఈడీ /బీఎస్సీఈడీ/ఎంఈడీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** పోస్టును అనుసరించి 18 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** పోస్టును అనుసరించి నెలకు లెవల్ 2(రూ.19,900 నుంచి రూ.63,200) నుంచి లెవల్ 8(రూ.47,600 నుంచి రూ.1,51,100) వరకు ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు. కొన్ని పోస్టులకు ఫిజికల్ టెస్ట్/స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్ ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.08.2025
- » **వెబ్‌సైట్:** https://dsssb.delhi.gov.in

ఎన్ఐఎస్ఎస్‌టీలో వివిధ ఉద్యోగాలు

పంజాబ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెకండరీ స్టీల్ టెక్నాలజీ(ఎన్ఐఎస్ఎస్‌టీ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- » **పోస్టుల వివరాలు:** టెక్నికల్ మేనేజర్(మెకానికల్)-03, హెచ్‌ఆర్ మేనేజర్-01, టెక్నికల్ అసిస్టెంట్ టు డైరెక్టర్-01.
- » **విభాగాలు:** మెకానికల్, మెటలర్జీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏఐసీటీఈ గుర్తించిన ఇన్‌స్టిట్యూట్ నుంచి డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:**01.06.2025 నాటికి 35ఏళ్లు ఉండాలి
- » **వేతనం:** నెలకు టెక్నికల్ మేనేజర్‌కు రూ.1,25,000, హెచ్‌ఆర్ మేనేజర్‌కు రూ.1,00,000, టెక్నికల్ అసిస్టెంట్‌కు 50,000
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.07.2025
- » **వెబ్‌సైట్:** https://nisst.org

మెయిన్స్‌లో మెరవాలంటే!



సివిల్ సర్వీసెస్ మెయిన్ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ సహా 23 ఉన్నత స్థాయి ఉద్యోగాల భర్తీకి నిర్వహించే మూడంచెల ఎంపిక ప్రక్రియలో.. రెండో దశ పరీక్ష! ఇందులో విజయం సాధిస్తే.. సివిల్ సర్వీసులోకి చేరాలనే తమ స్వప్నం సాకారానికి అడుగుదూరంలో ఉన్నట్లే!! విస్తృతమైన సిలబస్‌తో అభ్యర్థి ప్రతిభను లోతుగా పరీక్షించే మెయిన్‌లో విజయం సాధించాలంటే.. వ్యూహాత్మకంగా ప్రిపరేషన్ సాగించాల్సి ఉంటుంది. తాజాగా సివిల్స్-2025 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదలయ్యాయి. మెయిన్ పరీక్షలు ఆగస్ట్ 22 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. సివిల్స్ మెయిన్‌లో రాణించేందుకు ప్రిపరేషన్ గైడెన్స్...

- » ఇటీవల విడుదలైన ప్రిలిమ్స్ ఫలితాలు
- » 14,161 మందికి మెయిన్స్‌కు అర్హత
- » ఆగస్ట్ 22 నుంచి మెయిన్ ఎగ్జామ్స్

- **979:** సివిల్స్–2025 ఎంపిక ప్రక్రియ ద్వారా భర్తీ చేయనున్న పోస్ట్‌ల సంఖ్య.
- **14,161:** ప్రిలిమ్స్‌లో విజయం సాధించి మెయిన్స్‌కు అర్హత పొందిన వారి సంఖ్య.
- **1:2 లేదా 1:2.5 నిష్పత్తి:** మెయిన్స్‌లో ప్రతిభ ఆధారంగా ఇంటర్వ్యూకు ఎంపికయ్యే అభ్యర్థుల సంఖ్య!! అంటే... మెయిన్స్ నుంచి 2000లోపు మందికి మాత్రమే చివరి దశలో పర్సనాలిటీ టెస్ట్‌గా పిలిచే ఇంటర్వ్యూకు అర్హత లభిస్తుంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు.. మెయిన్స్‌లోనూ తమ ప్రతిభ చూపడానికి అత్యంత పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాల్సిన ఉంటుంది.

ఏడు పేపర్లు.. అప్రమత్తంగా

సివిల్ సర్వీసెస్ మెయిన్ ఎగ్జామినేషన్‌లో ఒక జనరల్ ఎస్సే పేపర్, నాలుగు జనరల్ స్టడీస్ పేపర్లు, మరో రెండు ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్లు.. ఇలా మొత్తం ఏడు పేపర్లు ఉంటాయి. వీటికి అదనంగా ఇంగ్లిష్, రీజనల్ లాంగ్వేజ్ పేపర్లు ఉంటాయి. వీటిల్లో అర్హత సాధిస్తే సరిపోతుంది. ఇంగ్లిష్, రీజనల్ లాంగ్వేజ్ పరీక్షలు అర్హత పేపర్లే అయినప్పటికీ.. వీటిలో కనీస అర్హత మార్కులు సాధిస్తేనే మిగతా పేపర్లు మూల్యాంకన చేస్తారు. కాబట్టి ఈ రెండు అర్హత పేపర్ల ప్రిపరేషన్‌కు కూడా కొంత సమయం కేటాయించాల్సి ఉంటుంది.

సిలబస్ అధ్యయనం

మెయిన్స్ అభ్యర్థులు మొదట సిలబస్ అంశాలను తులనాత్మక అధ్యయనం చేయాలి. పేపర్ వారీగా సిలబస్ అంశాలను క్షుణ్నంగా పరిశీలించాలి. అనుసంధాన విధానంలో ప్రిపరేషన్ సాగించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. మెయిన్స్‌లో జనరల్ ఎస్సే పేపర్‌ను మిగతా అన్ని పేపర్లతో అనుసంధానం చేసుకునే వీలుంది. అదే విధంగా.. పాలిటీ-ఎకానమీ,ఎకానమీ–జాగ్రఫీ,జాగ్రఫీ–ఎకలాజీ అంశాలను కూడా అనుసంధానం చేసుకుంటూ చదవొచ్చు. ఫలితంగా ఒకే సమయంలో రెండు పేపర్లలోని టాపిక్స్‌పై అవగాహన లభించడమే కాకుండా.. ఎంతో విలువైన సమయం ఆదా అవుతుంది.

పేపర్ 1.. సమకాలీన ప్రాధాన్యంగా

పేపర్–1గా పేర్కొనే జనరల్ ఎస్సేలో వ్యాసరూప సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఈ పేపర్లో అడుగుతున్న ప్రశ్నలు సమకాలీన అంశాల సమ్మిళితంగా ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు తొలుత జనరల్ ఎస్సే విభాగంలో అడిగేందుకు అవకాశమున్న అంశాలను గుర్తించాలి. సమకాలీన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇరాన్-ఇజ్రాయెల్, ఉక్రెయిన్–రష్యా, గాజా,ఇండియా–పాకిస్తాన్,ట్రంప్ టారిఫ్‌లు,నాటో,ఈయూ,బ్రిక్స్, ఆసియాన్ తదితర అంతర్జాతీయ పరిణామాలు, పర్యావరణ అంశాలు, జాతీయ స్థాయిలో ఇటీవల చర్చనీయాంశంగా మారిన సంఘటనలను అధ్యయనం చేయాలి. వీటి నుంచి అడిగే ప్రశ్నలకు విశ్లేషణాత్మక సమాధానాలు రాసే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

పేపర్-2 .. చరిత్ర, భౌగోళిక అంశాలు

ఈ పేపర్‌లో రాణించడానికి అభ్యర్థులు ప్రాచీన, మధ్య, ఆధునిక భారత దేశ చరిత్రలను అనుసంధానిస్తూ చదవాలి. సంగీతం, సాహిత్యం, నాట్యం, వాస్తు–శిల్పకళ, మత ఉద్యమాలు, తత్వాలు తదితర అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. ముఖ్యంగా 18వ శతాబ్దం మధ్య కాలం నుంచి ఇప్పటి వరకు చోటుచేసుకున్న ప్రధాన సంఘటనల్ని పరిశీలించాలి. స్వాతంత్ర్యోద్యమం గురించి ప్రత్యేకంగా చదవాలి. అదే విధంగా రాజ్యాంగం, పంచవర్ష ప్రణాళికలు, భూ సంస్కరణలు, నెహ్రూ విదేశాంగ విధానం, అలీనోద్యమం, హరిత విప్లవం తదితరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ప్రపంచ చరిత్రకు సంబంధించి.. పారిశ్రామిక విప్లవం, ప్రపంచ యుద్ధాలు, ఐరోపాలో నూతన రాజ్యాల ఆవిర్భావం, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లో వలసవాదం, స్వాతంత్ర్య ఉద్యమాలను ప్రధానంగా చదవాలి. భూకంపాలు, సునామీలు, అగ్ని పర్వతాలు, తుపానులు తదితరాల గురించి శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలి. ప్రాంతీయ అభివృద్ధికి దోహద పడే సహజ వనరుల గురించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

పేపర్-3.. రాజ్యాంగం, సుపరిపాలన

పాలన, రాజ్యాంగం సంబంధిత అంశాలతో ఉండే ఈ పేపర్‌లో రాణించేందుకు ముందుగా సిలబస్‌ను క్షుణ్నంగా పరిశీలించాలి. ఇది మన దేశ ప్రజాపరిపాలన, రాజకీయ వ్యవస్థ, అంతర్జాతీయ సంబంధాల సమ్మేళనంగా ఉంది. భారత రాజ్యాంగం గురించి చదివే క్రమంలో.. 1858 భారత ప్రభుత్వ చట్టం దగ్గరి నుంచి 1947 స్వాతంత్ర్య చట్టం వరకు చదవాలి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలపై దృష్టి సారించాలి. రాజ్యాంగం మూల నిర్మాణాన్ని అర్థం చేసుకునేందుకు కేశవానంద భారతి, మినర్వా మిల్స్ కేసులను పరిశీలించాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన, కార్యనిర్వాహక, ఆర్థిక అధికారాల విభజన, భారత రాజకీయ వ్యవస్థలోని అర్ధ సమాఖ్య స్వభావంపై దృష్టిపెట్టాలి. 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాల ప్రభావాన్ని పరిశీలించాలి. అంతేకాకుండా ఆయా పథకాల పనితీరు, ఉద్దేశం, లక్ష్యం, ఫలితాలను అధ్యయనం చేయాలి.

పేపర్ 4(జీఎస్-3).. ఎస్ అండ్ టీ, సమకాలీన అంశాలు

ఈ పేపర్‌లో టెక్నాలజీ, ఆర్థికాభివృద్ధి, బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్, సెక్యూరిటీ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లను అధ్యయనం చేయాలి. ప్రణాళికా పెట్టుబడుల్లో భాగంగా ప్రభుత్వ రంగ వనరుల సమీకరణకు ఆధారాలు, వాటి ధోరణులు, వివిధ రంగాల మధ్య వనరుల పంపిణీ తదితర అంశాలను క్షుణ్నంగా చదవాలి. భారత్‌లో సమ్మిళిత వృద్ధి పాత్ర, ఆహార భద్రత, బడ్జెటింగ్ తీరుతెన్నులతోపాటు స్వాతంత్ర్యం తర్వాత వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులను చదవాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో అభివృద్ధితోపాటు దైనందిన జీవితంలో దాని అనువర్తనాలపై దృష్టిపెట్టాలి.

పేపర్ 5.. పాలన, నైతిక విలువలు

భవిష్యత్తులో సివిల్ సర్వెంట్స్‌గా ప్రజా సేవ చేయాలనుకుంటున్న అభ్యర్థులు ప్రత్యేక శ్రద్ధతో ఈ పేపర్‌కు సన్నద్ధమవ్వాలి. వీటికి సంబంధించిన సిలబస్‌లోని ఎక్కువ అంశాలు ప్రభుత్వ పాలన(పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్)కు సంబంధించినవి. కాగా మరి కొన్ని ఫిలాసఫీ, సైకాలజీకి చెందినవి. అభ్యర్థులు పరిపాలనలో నైతిక విలువల ఆవశ్యకతకు సంబంధించిన అంశాలపై దృష్టిసారించాలి. వ్యక్తిగత, సామాజిక సంబంధాల్లో ఈ విలువలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయో తెలుసుకోవాలి. నైతిక శాస్త్రంలో అప్లయిడ్ ఎథిక్స్(అనువర్తిత నైతిక శాస్త్రం)పై దృష్టి పెట్టాలి. ప్రధానంగా అభ్యర్థులు 'పబ్లిక్ సర్వీస్ ఎథిక్స్'కు సంబంధించిన అంశాలను చదవాలి. ప్రభుత్వ విధానాల అమలు, నిధుల ఖర్చు, విధుల నిర్వహణలో జావాబుదారీతనం, పారదర్శకతలో నైతికత ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలి. మతం–నైతికత, వర్ణ వ్యవస్థ–నైతికత, కుటుంబం-నైతికత.. ఇలా వివిధ సామాజిక అంశాలను, సమకాలీన అంశాలతో అనుసంధానిస్తూ చదవాలి. నైతిక విలువలు పెంపొందించడంలో కుటుంబం, సమాజం, విద్యా సంస్థల పాత్ర ఏమిటో తెలుసుకోవాలి. ఈ పేపర్‌లో అభ్యర్థులు అవగాహన పెంచుకోవాల్సిన మరో ప్రధాన అంశం.. అటిట్యూడ్(వైఖరి). లక్ష్య సాధనలో, విధి నిర్వహణలో ఎంతో కీలకంగా నిలిచే వైఖరి అంశాన్ని ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలి. భారత్‌కు సంబంధించి చార్వాక, వివేకానంద, రాజారాం మోహన్‌రాయ్, మహాత్మాగాంధీ, అంబేద్కర్ తదితరుల తాత్విక భావనల గురించి ప్రత్యేకంగా చదవాలి.

ఆప్షనల్ సబ్జెక్ట్.. రెండు పేపర్లు ఇలా

ఆప్షనల్ సబ్జెక్ట్‌కు సంబంధించి అభ్యర్థులు రెండు పేపర్లు రాయాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే.. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ, ఫిలాసఫీ, సైకాలజీ తదితర ఆప్షనల్స్ జనరల్ స్టడీస్‌కు కలిసొచ్చే విధంగా ఉన్నాయి. ఆప్షనల్ ఏదైనా సరే వాటిని ఆమూలాగ్రం అధ్యయనం చేయాలి. ప్రశ్నలు అడిగే ఆస్కారం ఉన్న అంశాలను గుర్తించి వాటిపై మరింత లోతుగా అధ్యయనం చేయాలి. అదే విధంగా గత కొన్నేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించి, ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

వేయి మార్కుల లక్ష్యంగా

అభ్యర్థులు మెయిన్‌లో మొత్తం 1750 మార్కులకు గాను వేయి మార్కుల సాధనే లక్ష్యంగా ప్రిపరేషన్ సాగించాలి. మెయిన్ పరీక్షల్లో ప్రతి ఏటా ప్రశ్నల క్లిష్టత స్థాయి పెరుగుతున్న విషయాన్ని గుర్తించాలి.సమాధానాలు స్పష్టంగా సూటిగా,అడిగిన ప్రశ్నకు అవసరమైన సమాచారం మాత్రమే రాసేలా సన్నద్ధమవ్వాలి. ఇందుకోసం ప్రిపరేషన్ సమయం నుంచే ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. పరీక్షలో లభించే సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ.. నమూనా ప్రశ్నలకు సమాధానాలు రాయడంపై కసరత్తు చేయాలి. ఫలితంగా టైమ్ మేనేజ్‌మెంట్‌తోపాటు, ఆయా ప్రశ్నలకు అనుగుణంగా ముఖ్యమైన అంశాలను జోడించే నైపుణ్యం లభిస్తుంది.

కోర్, కాంటెంపరరీ, అనాలిసిస్

మెయిన్స్‌కు హాజరయ్యే అభ్యర్థులు కోర్ అంశాలతోపాటు.. సమకాలీన పరిణామాలను సమ్మిళితం చేస్తూ అభ్యసనం సాగించాలి. సమాధానాలు రాసే క్రమంలో కోర్‌తో తాజా పరిణామాలను జోడించి రాయడం ద్వారా ఎగ్జామినర్‌ను ఆకట్టుకునే అవకాశం ఉంటుంది. అదే విధంగా పరీక్షకు నెల రోజుల ముందు నుంచి పూర్తిగా ప్రాక్టీస్‌కు, మోడల్ టెస్ట్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఫలితంగా రైటింగ్ సామర్థ్యంతోపాటు ప్రజెంటేషన్ స్కిల్స్ సైతం అలవడతాయి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్

గాంధీ.. గాడ్సే...... నోబెల్ శాంతి బహుమతి!



శాంతి, అహింసా సిద్ధాంతాన్ని ప్రవచించిన మహాత్ముడికి నోబెల్ శాంతి బహుమతి ఎందుకు దక్కలేదు?

ఆయన దారిలో నడిచిన వారెందరినో వరించిన ఆ పురస్కారం.. ఆయన్నెందుకు వరించలేదు?

కారణం.. నాథూరాం గాడ్సేనా??

గాంధీని చంపిన గాడ్సే.. ఆయనకు నోబెల్ దక్కే అవకాశాన్ని కూడా చంపేశాడా?

అందుకే 1948లో నోబెల్ శాంతి బహుమతిని ఎవరికీ ఇవ్వలేదా?

పైగా.. తగు యోగ్యత కలిగిన వ్యక్తి ఎవరూ జీవించి లేనందున ఆ పురస్కారాన్ని ఇవ్వడం లేదన్న నోబెల్ కమిటీ ప్రకటన దీన్నే సూచిస్తోందా?

అసలు.. గాంధీకి నోబెల్ రాకపోవడానికి గాడ్సేకు ఉన్న లింకేంటి?

1930ల్లో ఏం జరిగిందంటే..

నోబెల్ శాంతి బహుమతికి మహాత్మా గాంధీ 5 సార్లు నామినేట్ అయ్యారు. 1937, 1938, 1939, 1947, 1948ల్లో ఆయనకు ఈ పురస్కారం దక్కే అవకాశం వచ్చింది. గాంధీ అహింసా మార్గం లేదా శాంతి మార్గం అన్నది తన దేశ స్వాతంత్ర్యం కోసం తప్ప.. అంతర్జాతీయ శాంతి కోసం కాదని నోబెల్ కమిటీలోని కొందరు సభ్యులు ఆ టైంలో అభ్యంతరం వ్యక్తం చేశారు. పైగా.. రెండో ప్రపంచ యుద్ధంలో భారత్ పాల్గొనడానికి ఆయన షరతులతో సమ్మతి తెలపడాన్ని వాళ్లు ఎత్తి చూపారు. స్వాతంత్ర్య సముపార్జనకు ఆయన అనుసరిస్తున్న పద్ధతులు వినూత్నమైనవని వారు అంగీకరించినప్పటికీ.. అంతర్జాతీయ సంఘర్షణలను పరిష్కరించడానికి అవి ఎంత మేరకు ఉపయోగపడతాయన్న దానిపై సందేహాలు వ్యక్తం చేశారు. అప్పటి నివేదికలో ఆ వివరాలు ఉన్నట్లు నోబెల్ సంస్థ మాజీ డైరెక్టర్ గేర్ లూండెస్టాడ్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.


మీకు తెలుసా?

దానికి తోడు నోబెల్ బహుమతులను ఇచ్చే నార్వే.. అప్పట్లో తటస్థ దేశం. అతి శక్తిమంతమైన బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా చేసిన పోరాటాలకు అవార్డులు ఇవ్వకూడదని ఆ దేశం అనుకోవడం కూడా ఒక ప్రధాన కారణంగా చెబుతారు. ఒకవేళ అవార్డిస్తే ఆ పోరాటాలకు మద్దతిచ్చి, బ్రిటన్‌తో తలగోక్కున్నట్టు అవుతుందని వెనక్కు తగ్గిందట.

1947 వచ్చేసరికి ఆ సమయంలో విభజన కారణంగా చెలరేగిన హింస.. మతపరమైన హింసను నిరోధించడానికి గాంధీజీ చేసిన ప్రయత్నాలు పూర్తిగా విజయవంతం కాకపోవడం వంటివి అవరోధంగా మారాయి. విభజన హింస.. గాంధీ శాంతి సందేశాన్ని మరుగునపడేటట్లు చేసిందని ప్రఖ్యాత చరిత్రకారుడు రామచంద్ర గుహ పేర్కొన్నారు. పైగా.. అప్పుడంతా ఐరోపా, అమెరికా ఆధిపత్యం నడిచేది.. 1900 నుంచి 1960 వరకూ పురస్కారాలను గమనిస్తే మనకీ విషయం అర్థమవుతుందని గేర్ లూండెస్టాడ్ అన్నారు.

1948లో ఎందుకు రాలేదంటే..

1948లో గాంధీజీ మళ్లీ నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఆ ఏడాది గాంధీ పేరును అమెరికాకు చెందిన శాంతి కార్యకర్త, ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత ఎమిలీ గ్రీన్ బాల్చ్, బాంబే స్టేట్ తొలి సీఎం బాలాసాహెబ్ గంగాధర్ ఖేర్, యునైటెడ్ ప్రావిన్సెస్ తొలి సీఎం గోవింద్ వల్లభ్ పంత్, లోక్‌సభ తొలి స్పీకర్ గణేశ్ వాసుదేవ్ మౌలాంకర్.. ఇలా ఎందరో ప్రముఖులు ప్రతిపాదించారు. ఆ ఏడాది మహాత్మునికే శాంతి బహుమతి దక్కుతుందని అంతా అనుకున్నారు. ఆయనతోపాటు మరో ఇద్దరు పేర్లతో షార్ట్ లిస్ట్ (గాంధీ పేరు ఈ జాబితాలోకి రావడం మూడోసారట) రెడీ అయ్యింది. అయితే, నోబెల్ శాంతి బహుమతి నామినేషన్ల గడువు ఇంకో రెండ్రోజుల్లో ముగుస్తుందనగా.. జనవరి 30న మహాత్ముడిని గాడ్సే పొట్టనబెట్టుకున్నాడు. తద్వారా ఆయనకు నోబెల్ శాంతి బహుమతి వచ్చే అవకాశం లేకుండా చేశాడు. ఎందుకంటే.. ఆ సంవత్సరం ఎవరికీ నోబెల్ శాంతి బహుమతి ఇవ్వడం లేదని 1948, నవంబర్ 18న కమిటీ ప్రకటించింది. పైగా.. ప్రస్తుతం జీవించి ఉన్నవారిలో ఆ అవార్డు పొందేందుకు తగు అర్హత కలిగిన వ్యక్తి ఎవరూ లేనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అప్పటి నిబంధనల ప్రకారం.. మరణానంతరం నోబెల్ ఇచ్చే సంప్రదాయం లేదు. తర్వాతి కాలంలో దాన్ని సవరించారు. ఈ నేపథ్యంలోనే ఒకవేళ మహాత్ముడు జీవించి ఉండి ఉంటే.. 1948 నోబెల్ శాంతి బహుమతి ఆయనకే దక్కి ఉండేదన్నది అత్యధికుల వాదన. పైగా.. 'గాంధీ ఈ పురస్కారాన్ని దాదాపుగా దక్కించుకునే దాకా వచ్చారు. అయితే, ఆయన మరణం దాన్ని దూరం చేసింది' అని 1948 నోబెల్ కమిటీ రికార్డుల్లో నమోదై ఉండటం కూడా ఆ వాదనను మరింత బలపరిచింది. గాంధీకి నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడం అన్నది కమిటీ చరిత్రలో అతిపెద్ద తప్పిదమని గేర్ లూండెస్టాడ్ అన్నారు. తర్వాత నోబెల్ కమిటీ కూడా మహాత్ముడికి శాంతి బహుమతి దక్కకపోవడంపై 1989, 2006లలో విచారం వ్యక్తం చేసింది.



గాంధీ గొప్పోడని చెప్పడానికి ఆయనకు నోబెల్ అక్కర్లేదు..

కానీ నోబెల్ గొప్ప అవార్డు అని చెప్పుకోవడానికి మాత్రం గాంధీ కావాలి!

దట్సిట్..

సాక్షి, సెంట్రల్ డెస్క్

కృత్రిమ పాదం ఆవిష్కరణ

బీబీనగర్ ఎయిమ్స్ వైద్యుల ప్రతిభ

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాల వైద్యులు కృత్రిమ పాదాన్ని ఆవిష్కరించి చరిత్ర సృష్టించారు. డీఆర్‌డీఎల్‌తో కలిసి అభివృద్ధి చేసిన అప్టిమైజ్డ్ కార్బన్ ఫుట్ ప్రొస్థెసిస్‌ను.. మేకిన్ ఇండియా డిజైన్ చొరవతో సోమవారం ఎయిమ్స్‌లో ఆవిష్కరించారు. భువనగిరి పట్టణానికి చెందిన దివ్యాంగుడైన 52 ఏళ్ల తిరుమల్ చావన్‌కు కృత్రిమ పాదాన్ని విజయవంతంగా అమర్చారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్, డీఆర్‌డీఎల్ డాక్టర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. అధిక పనితీరు కలిగిన కార్బన్ ఫైబర్ ఫుట్ ప్రొస్థెసిస్‌ను తొలిసారిగా ఆవిష్కరించినట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ప్రొస్థెటిక్ లింబ్స్ అనేవి సహాయక సాంకేతికతలని, ఇవి అవయవాలు కోల్పోయిన వ్యక్తులకు చలనశీలత, జీవన నాణ్యత అవకాశాలను మెరుగుపరుస్తాయని వివరించారు. అంగవైకల్యం కలిగిన వారికి అధిక నాణ్యత, తక్కువ ధరకు లభించేలా కృత్రిమ పాదాన్ని రూపొందించినట్లు తెలిపారు. 125 కిలోల బరువును తట్టుకునేలా పాదాన్ని చేసినట్లు చెప్పారు. పాదం నిర్మాణానికి ఎయిమ్స్ అధ్యాపకులు, డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్తలు కలిసికట్టుగా అంకితభావంతో కృషి చేయడంతో సాధ్యమైందని ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్యులు ఎంఎస్ఆర్ ప్రసాద్, జాన్ రోజారియో, సంతోష్, గోపికృష్ణ, మహేశ్వర్‌రెడ్డి, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



తిరుమల్ చావన్ కాలికి అమర్చిన కృత్రిమ పాదం, కార్యక్రమంలో పాల్గొన్న ఎయిమ్స్, డీఆర్‌డీఎల్ వైద్యులు

'ఉపాధి' కూలీలపై మరిన్ని ఆంక్షలు

- ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం ఫొటో తీయాల్సిందే
- దళిత సంఘాల అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో భాగంగా కూలీల హాజరులో అవకతవకలకు చెక్ పెట్టేందుకు కేంద్రం తాజాగా జారీ చేసిన ఉత్తర్వులపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎంఎంఎస్) యాప్ ద్వారా తీసుకున్న ఉపాధి కూలీల హాజరు ఫొటోలను రోజూ విధిగా గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పరిశీలించి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఈ విధానంపై గందరగోళం నెలకొంది. దీంతోపాటు ప్రతి జిల్లా కార్యాలయంలో.. జూలై 14 నుంచి ప్రతి గ్రామంలో ఫొటోలు క్యాప్చర్ చేసిన ప్రతి హాజరును విధిగా భద్రపరచాలని సూచించింది. ప్రతి మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఎన్ఎంఎంఎస్‌కి సంబంధించిన ఒక మానిటరింగ్ సెల్‌ని ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. ప్రతిరోజూ ఫొటోలను వెరిఫై చేసి ఇచ్చిన ఫార్మాట్లలో పైఆఫీసులకి పంపించాల్సిన బాధ్యులుగా ఈ సిబ్బందే ఉండాలని ఈ ఆదేశాల్లో పేర్కొంది. ఉపాధి కూలీలకు సంబంధించి రోజూ ఉదయం, మధ్యాహ్నం ఫొటో క్యాప్చర్ చేయకపోతే మరుసటి రోజు అటెండెన్స్ తీసుకోవడాన్ని ఆపేస్తారు. అలాగే వేజ్ లిస్ట్ జెనరేషన్‌ని ఆపేయనున్నారు. ఒక పూట మాత్రమే ఫొటో తీసిన కూలీలకు అంతమేరకే కూలీ వస్తుంది. కేంద్రం దశల వారీగా ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి ఎత్తివేసే చర్యల్లో భాగంగానే ఇలాంటి ఆంక్షలు, నిబంధనలు విధిస్తోందని 'సాక్షి'తో మాట్లాడుతూ దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ మండిపడ్డారు.

జప్తు చేసిన వాహన అప్పగింత రుణ సంస్థ కోరలేదు

- హైపోథికేషన్ ఇస్తే యజమాని కాజాలదు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: దర్యాప్తు సంస్థలు జప్తు చేసిన వాహన అప్పగింతను రుణం మంజూరు చేసిన సంస్థ కోరలేదని, హైపోథికేషన్ ఇచ్చినంత మాత్రాన యజమాని కాజాలదని హైకోర్టు తేల్చిచెప్పింది. రుణం పూర్తిగా చెల్లించేవరకు వాహన యజమాని తామే అవుతామన్న సంస్థ వాదనను తప్పుబట్టింది. కొన్నిసార్లు హిట్ అండ్ రన్ కేసులో యజమానిని కూడా నిందితుల జాబితాలో చేరుస్తారని.. అలాంటి కేసులో సంస్థ కూడా బాధ్యత వహిస్తుందా అని ప్రశ్నించింది. రోడ్డు ప్రమాదాల్లో వాహనం నుజ్జునుజ్జయినా ఎలాంటి సంబంధం లేదంటూ రుణం వసూలు చేస్తారు కదా అని పిటిషనర్ న్యాయవాదిని అడిగింది. డాక్యుమెంట్లు లేకుండా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని మహబూబాబాద్ జిల్లా మరిపెడ ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. ఈ వాహనాన్ని విడుదల చేయాలంటూ టైగర్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వాహన జప్తుతో సంస్థ ఆర్థికంగా ఇబ్బందులుపడే అవకాశం ఉందని, వాహనాన్ని రుణ సంస్థకు అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తరఫున ఏజీపీలు విశాల్‌గౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ వాహన యజమాని ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా నల్లబెల్లం, పటిక తరలిస్తుండగా బొలెరోను సీజ్ చేశారన్నారు. కేసు ముగిసే వరకు వాహన అప్పగింత సాధ్యంకాదన్నారు. వాహనాన్ని యజమానికే తప్ప రుణసంస్థకు అప్పగించడం చట్టవిరుద్ధమని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వాహనం అప్పగింతకు నిరాకరించారు. సేల్స్ ట్యాక్స్‌పై దాఖలైన కేసులో రుణ సంస్థకు ఎలాంటి సంబంధం ఉండదని, గతంలో ఇదే కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేస్తూ పిటిషన్ కొట్టివేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

కొలనుపాక సోమేశ్వరునికి మహర్దశ


శ్రీ సోమేశ్వరాలయ సముదాయం

- ప్రసాద్.2.0 పథకంలోకి సోమేశ్వరాలయం
- సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్రం
- పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధికి చర్యలు
- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లాలో అతి పురాతనమైన కొలనుపాక లోని శైవ, జైన దేవాలయాల ప్రాంతాలకు మహర్దశ కలగనుంది. ఈ క్షేత్రాన్ని కేంద్రం స్వదేశీ దర్శన్ ప్రసాద్ 2.0 (తీర్థయాత్ర పునరుజ్జీవం, ఆధ్యాత్మిక వృద్ధి డ్రైవ్) పథకంలో చేర్చనుంది. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అంగీకారం తెలిపారు. తెలంగాణలోని బౌద్ధ ప్రాంతాలను సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భువనగిరి, నాగార్జునసాగర్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేపట్టింది.

ప్రసాద్ పథకంలో అభివృద్ధి చేయాలని..

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో చారిత్రక ప్రాధాన్యమున్న శ్రీ సోమేశ్వర స్వామి దేవస్థానం ఉంది. దీన్ని అభివృద్ధి చేస్తూ సంరక్షించడానికి అవసరమైన నిధులను పీఆర్‌ఏఎస్‌ఏడీ 2.0 (ప్రసాద్ 2.0) పథకం కింద విడుదల చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి.. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి కోరారు.


శ్రీ సోమేశ్వరాలయ సముదాయంలో పురావస్తు శాఖ మ్యూజియం



శివలింగ రూపంలో దర్శనం

శతాబ్దాలుగా ప్రముఖ శైవ క్షేత్రంగా కొలనుపాక గ్రామం పేరొందింది. సోమేశ్వర స్వామి శివలింగ రూపంలో భక్తులకు దర్శనమిస్తాడు. నిత్యం ఆలయంలో ధూప, దీప, నైవేద్యాలు, శాస్త్రోక్తంగా పూజలు జరుగుతాయి. శ్రీ సోమేశ్వర స్వామి ఆలయానికి అతి సమీపంలో 2000 ఏళ్ల చరిత్ర కలిగిన శ్వేతాంబర జైన దేవాలయం ఉంది. జైన తీర్థంకరులు ఈ దేవాలయంలో ఉన్నారు. రోజూ వేలాది మంది జైనులతోపాటు ఇతర మతస్తులు ఆలయాన్ని సందర్శిస్తారు.

కొలనుపాకకు చారిత్రక ప్రాధాన్యం

శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం కల్యాణ చాళుక్యుల కాలం (7 – 10వ శతాబ్దం) నాటి ప్రాచీన శైవ ఆలయం. చాళుక్యుల అనంతరం కాకతీయుల కాలంలో (12వ – 13వ శతాబ్దం) అత్యంత ప్రాధాన్యమున్న శైవ క్షేత్రంగా చారిత్రక నేపథ్యం కలిగి ఉంది. ఈ ఆలయం చాళుక్య శిల్పకళా నైపుణ్యం, కాకతీయుల శిల్ప సౌందర్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఉజ్జయినీ జగద్గురు శ్రీ సిద్ధలింగ రాజదేశి కేంద్ర శివాచార్య స్వామీజీ ఆలయ నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు.

ఎక్కడ ఉందంటే..

కొలనుపాక ఆలయం జాతీయ రహదారి 163 (హైదరాబాద్-వరంగల్ మార్గం)లో ఉంది. సికింద్రాబాద్-కాజీపేట రైల్వే మార్గంలో.. ఆలేరుకు కేవలం 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఏటా వేలాది మంది భక్తులు, పర్యాటకులు దేశ విదేశాల నుంచి తరలివచ్చి ఆలయాన్ని శ్రీ చండికాంబ సహిత సోమేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ప్రతి శివ రాత్రి పర్వదినాన పెద్ద ఎత్తున రథోత్సవం జరుగుతుంది. ఆలయ ప్రాంగణంలో ప్రాచీన విగ్ర హాలు, కాకతీయుల చరిత్రను తెలిపే శాసనాల (శిలాశాసనాలు)తో రాష్ట్ర పురావస్తు శాఖ మ్యూజియం ఉంది.

మఠాలకు నెలవు

కొలనుపాక గ్రామంలో అనేక సామాజిక ఆదారిత మఠాలను నిర్మించారు. ఈ ప్రాంతం మతపరమైన ప్రాధాన్యాన్ని మరింతగా పెంచింది. కులాల వారీగా ఉన్న మఠాలతో సోమేశ్వర ఆలయ ప్రాంగణం గొప్ప శివ క్షేత్రంగా పేరొందింది.

కొలనుపాకకు కేంద్రం నిధులు




ప్రసాద్ 2.0 పథకంలో కొలనుపాకను చేర్చడానికి కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అంగీకరించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపిస్తాం. కొలనుపాక దేవాలయాల అభివృద్ధి, వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని మే నెలలో లేఖను అందజేశాను. కొలనుపాక దేవాలయాల అభివృద్ధికి కేంద్రం ప్రతిపాదనలు కోరింది. సోమేశ్వరాలయానికి, కర్ణాటక ప్రభుత్వానికి మధ్య సాంకేతిక సమస్యలను తెలుసుకుని వాటిని కూడా పరిష్కరిస్తాం.

– చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ భువనగిరి

మౌలిక సదుపాయల లేమి

ప్రాధాన్యమున్న శ్రీ సోమేశ్వర స్వామి ఆలయానికి మౌలిక సదుపాయాల లేమి ఉంది. సదుపాయాల కల్పన, పర్యాటక అభివృద్ధికి నిధుల కొరత ఉంది. ప్రధానంగా ఆలయంలో ఎన్నో విశిష్టమైన శిల్పకళా, శాసనాలు ఆలనా పాలనా లేకుండా పడిఉన్నాయి. వాటిని పునరుద్ధరించాలి. దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు, రోడ్లు, వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. ఆలయ పరిసరాల సుందరీకరణ, విద్యుత్ వెలుగులు, పార్కులు, ఆలయ విశిష్టతను తెలిపే మార్గదర్శక ఫలకాలను ఏర్పాటు చేయాలి. తెలంగాణలోని ఇతర వారసత్వ ప్రాంతాలతో కలిపి కొలనుపాకను.. మతపరమైన, సాంస్కృతిక పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలి. గ్రామానికి వచ్చే సందర్శకుల్లో సాంస్కృతిక అవగాహన పెంచేందుకు మ్యూజియాన్ని డిజిటలైజేషన్ చేయాలి. ఇందుకోసం ఈ చారిత్రక యాత్రాక్షేత్రం పునరుజ్జీవానికి.. ప్రసాద్ 2.0 పథకం కింద నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ చామల కోరారు.


సోమేశ్వరాలయ సముదాయం..

బుద్ధవనానికి విదేశాల్లో ప్రచారం

- మంత్రి జూపల్లితో బాలీవుడ్ నటుడు గగన్‌మాలిక్

సాక్షి, హైదరాబాద్: బుద్ధవనంపై విదేశాల్లో ప్రాచుర్యం కల్పించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని బాలీవుడ్ నటుడు గగన్ మాలిక్ అన్నారు. సోమవారం ఆయన పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావుతో భేటీ అయ్యారు. ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా రూపొందిన బుద్ధవనానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం కల్పించటం, బౌద్ధాన్ని అనుసరించే దేశాల నుంచి భక్తులు వచ్చేలా చూడటం, ఆయా దేశాల సాంస్కృతిక కేంద్రాలను బుద్ధవనంలో ఏర్పాటు చేయటం, అక్టోబరులో థాయిలాండ్‌కు చెందిన 100 మంది భక్తులు గుల్బర్గా మీదుగా బుద్ధవనానికి పాదయాత్రగా వచ్చే కార్యక్రమం.. తదితర అంశాలపై చర్చించారు. బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య కూడా పాల్గొన్నారు.

ఎంపీ ఈటలకు హైకోర్టులో ఊరట

- 'ఎన్నికల'కేసులో ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు

సాక్షి, హైదరాబాద్: హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో దాఖలైన కేసులో ఎంపీ ఈటల రాజేందర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ట్రయల్‌కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. పోలీసులకు నోటీసులు జారీచేస్తూ, కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఆగస్టు 4కు వాయిదా వేసింది. 2021, సెప్టెంబర్‌లో హుజూరాబాద్ నియోజకవర్గ ఉపఎన్నిక సందర్భంగా అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారంటూ ప్రభుత్వ అధికారి ఖాజా బషీరుద్దీన్ ఫిర్యాదు చేశారు. కోవిడ్ నిబంధనలు కూడా ఉల్లంఘించారన్న ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలంటూ ఈటల రాజేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున జి.సంజీవ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రాథమికంగా వాస్తవాలను ధ్రువీకరించుకోకుండానే ఈటలపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో తప్పుడు సంకేతాలు తీసుకెళ్లేందుకు, ఈటల ప్రతిష్టను దెబ్బతీసేందుకే కేసు నమోదు చేశారని చెప్పారు. ట్రయల్‌కోర్టు ఈ కేసు విచారణ ఆగస్టు 14కు వాయిదా వేసిందన్నారు. ఈటల ప్రస్తుతం ఎంపీగా ఉన్నారని, రాజకీయాల్లో భాగంగా పెట్టిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరారు. తక్షణ ఉపశమనంగా ట్రయల్‌కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేయగా.. న్యాయమూర్తి ఈ మేరకు మినహాయింపునిస్తూ విచారణ వాయిదా వేశారు.

నాలుగు వారాల్లో విచారణ చేపట్టండి

- చిరంజీవి దరఖాస్తుపై జీహెచ్‌ఎంసీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-25లోని ఇంటి నిర్మాణానికి సంబంధించి క్రమబద్ధీకరణ కోరుతూ ప్రముఖనటుడు చిరంజీవి చేసుకున్న దరఖాస్తుపై నాలుగు వారాల్లో విచారణ చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కమిషనర్‌కు హైకోర్టు స్పష్టంచేసింది. పిటిషనర్‌కు నోటీసులు జారీ చేసి, విచారణ చేపట్టి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. జీహెచ్‌ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 455ఏఏ కింద నివాస గృహాన్ని క్రమబద్ధీకరించాలని కోరుతూ గత నెల 5న తాను చేసుకున్న దరఖాస్తుపై కమిషనర్ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదంటూ చిరంజీవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి విచారణ చేపట్టి తీర్పు వెలువరించారు. ఉత్తర్వుల కాపీ అందిన నాటి నుంచి నాలుగు వారాల్లో విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

మా కుమార్తె వివాహానికి రండి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు జగ్గారెడ్డి దంపతుల ఆహ్వానం



సాక్షి, న్యూఢిల్లీ: తమ కుమార్తె జయ రెడ్డి వివాహానికి హాజరై ఆశీర్వదించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం కుమార్తె జయ రెడ్డితో వారు రాహుల్ గాంధీని ఢిల్లీలో కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఏ కుక్క అయితేనేం.. కాట్లు కామనే!



సాక్షి, హైదరాబాద్: వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు.. ఇలా ఏ శునకాలైనా నగర ప్రజలకు కాట్లు మాత్రం తప్పడం లేదు. జంతుప్రేమికులు ఎన్ని కారణాలు చెబుతున్నా.. కుక్కకాటు బాధితులు పెరుగుతూనే ఉన్నారు. కుక్కలు కరవడం తమ ప్రాంతంలో సర్వసాధారణమైందని.. లోకల్ సర్కిల్స్ సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో 71 శాతం మంది స్పష్టం చేయడం గమనార్హం. వీధికుక్కలతోనే ఈ తరహా ముప్పు ఉంటోందని 68 శాతం మంది తెలిపారు. కుక్కకాటు నుంచి ప్రజల్ని కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం సర్వేలో వ్యక్తమైంది. వీధి కుక్కల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కొందరు కోరారు. బాధితుల్లో 20 శాతం మంది 15 ఏళ్లలోపు వయసున్న వారేనని తేలింది. దేశవ్యాప్తంగా 362 జిల్లాల్లో 11వేల మందికి పైగా అభిప్రాయాలు సేకరించి.. సర్వే నివేదిక రూపొందించినట్టు లోకల్ సర్కిల్స్ సంస్థ తెలిపింది. అందులో పేర్కొన్న ప్రకారం.. సర్వేలో 67 శాతం మంది పురుషులు, 33 శాతం మంది మహిళలు పాల్గొన్నట్టు సంస్థ పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా 2024లో మొత్తం 26,99,850 జంతువుల కాటు కేసులు నమోదవగా.. ఇందులో 22 లక్షలు కుక్కకాటు కేసులేనని కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఇదే కొనసాగితే 2030 నాటికి రేబిస్ రహిత భారతదేశాన్ని సాధించాలన్న లక్ష్యాన్ని చేరడం కష్టమేనని సర్వే ఫలితాలు హెచ్చరిస్తున్నాయి.

పెరుగుతున్న కుక్క కాట్లు

- కుక్కలు కరవడం సర్వసాధారణమైందంటున్న 71 శాతం మంది
- వీధి కుక్కలతోనే ముప్పందంటున్న 68 శాతం మంది
- కుక్కకాటు బాధితుల్లో 20 శాతం మంది 15 ఏళ్ల లోపు పిల్లలే
- గతేడాది దేశవ్యాప్తంగా 22 లక్షల కుక్కకాటు ఘటనలు నమోదు
- లోకల్ సర్కిల్స్ సర్వే నివేదికలో వెల్లడి



లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వే వివరాలు

మీ ప్రాంతంలో కుక్కకాటు ఘటనలు ఉన్నాయా?	
మా ప్రాంతంలో వీధికుక్కల కాటు సర్వసాధారణం	55 శాతం
మా ప్రాంతంలో పెంపుడు కుక్కల కాటు సర్వసాధారణం	3 శాతం
మా ప్రాంతంలో రెండు రకాల కుక్కకాట్లు ఉన్నాయి	13 శాతం
అలాంటి ఘటనలు లేవు	24 శాతం
చెప్పలేం	5 శాతం

వీధికుక్కల బెడద తగ్గించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- వీధికుక్కలు, ఇతర జంతువులకు ఆహారం అందించడంపై ప్రత్యేక నిబంధనలు తేవాలి: 47 శాతం మంది
- వీధికుక్కల సంక్షేమ మిషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులివ్వాలి: 39 శాతం మంది
- వీధి జంతువుల సంక్షేమ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి: 24 శాతం మంది
- వీధి జంతువుల నిర్వహణకు మున్సిపాలిటీలు, పంచాయతీలకు నిధులివ్వాలి: 53 శాతం మంది
- వీధి జంతువుల సంక్షేమానికి సీఎస్ఆర్ నిధులు వచ్చేలా ప్రోత్సహించాలి: 32 శాతం మంది
- ఇతర అంశాలు 13 శాతం మంది
- ఏ చర్యలు అవసరం లేదు.. వీధి జంతువులను వాటి మానాన వాటిని వదిలేయాలి: 3 శాతం మంది
- చెప్పలేం: 3 శాతం మంది

గురుకులాల్లో విద్యార్థుల మరణాలకు బాధ్యులెవరు?

- ప్రభుత్వంపై మాజీమంత్రి హరీశ్‌రావు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: 'గురుకులాల్లో విద్యార్థుల మరణాలకు బాధ్యులెవరు?, గురుకులాల ఖ్యాతి నానాటికీ దిగజారడానికి కారకులు ఎవరు?..'అని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. హనుమకొండ ధర్మసాగర్ మండలం కరుణాపురం మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థి మృతిచెందారని, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా 20 నెలల కాంగ్రెస్ పాలనలో 93 మంది విద్యార్థులు మృతిచెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన గురుకులాలు, రేవంత్ రెడ్డి పాలనా వైఫల్యంతో నిర్వీర్యమవుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు మెస్ చార్జీలను చెల్లించేందుకు గ్రీన్ చానల్ ఏర్పాటు చేస్తామని చెప్పి ఏడాదైనా అమలు కాలేదన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, ఫుడ్ పాయిజన్లు నిరోధించాలని, ఆత్మహత్యలు జరగకుండా చర్యలు చేపట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయె



ఒక్క క్షణం ఊపిరి ఆడకపోతేనే మనిషి ఉక్కిరిబిక్కిరి అయిపోతాడు. అలాంటిది ఒక కుక్క తల డబ్బాలో ఇరుక్కుపోవడంతో నాలుగు రోజులుగా నరకం అనుభవిస్తోంది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో డబ్బాలో ఇరుక్కున్న ఒక కుక్క నాలుగు రోజులుగా నీళ్లు, ఆహారం లేకుండా తిరుగుతూ ఆకలితో అలమటిస్తోంది. కొందరు డబ్బా తీసేందుకు ప్రయత్నిస్తున్నా.. అది వారిని చూసి పరుగులు తీస్తోంది.

-హుస్నాబాద్ రూరల్

కురిడీకి ఉత్తరాది ఊపు

అంబాజీపేట మార్కెట్‌లో వెయ్యికాయల ధర రూ.29,500

చిన్నకాయలు రూ.28 వేలు / శ్రావణం వచ్చేలోపు రూ.30 వేలు దాటేస్తుందని అంచనా / దక్షిణాది రాష్ట్రాలలో దిగుబడి తగ్గడమే కారణం

ఉత్తరాది రాష్ట్రాల నుంచి భారీ డిమాండ్ కారణంగా ఆంధ్రా కొబ్బరి ధరలు రికార్డుల మీద రికార్డులు మోగిస్తున్నాయి. రెండు నెలలుగా కురిడీ కొబ్బరి, పచ్చి కొబ్బరి ధరలు మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అంచనాలకు మించి పెరుగుతున్నాయి. తాజాగా కురిడీ కొబ్బరి ధరలు మరోసారి పెరిగాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్‌లో సోమవారం కురిడీ కొబ్బరి ధరలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. పాతకాయలలో గండేరా రకం (పెద్ద కాయలు) వెయ్యి కాయల ధర రూ.29,500 పలికింది. చిన్నకాయలకు (గటగట) రూ.28 వేల లభించింది. గడచిన శనివారం ఇక్కడి మార్కెట్‌లో గండేరా రకం ధర రూ.26,500 ఉండగా.. గటగట రకం ధర రూ.25,500 ఉంది. కేవలం రెండు రోజుల వ్యవధిలో రెండు రకాలకు కలిపి రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు పెరగడం విశేషం. ఇక కొత్త రకం కాయలలో గండేరా రకం వెయ్యి కాయల ధర రూ.28,500 వరకు ఉండగా, గటగట రకం రూ.27 వేల వరకు ఉంది.

– సాక్షి, అమలాపురం

దిగుబడి తగ్గటమే కారణం

దక్షిణాదిలో కొబ్బరి అధికంగా పండే నాలుగు రాష్ట్రాల్లో దిగుబడి గణనీయంగా తగ్గింది. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఆరేడు నెలలుగా సగటు దిగుబడిలో 30 శాతం మాత్రమే వస్తోంది. దీంతో ఉత్తరాది రాష్ట్రాల అవసరాలన్నీ ఏపీ కొబ్బరి తీర్చాల్సి వస్తోంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కొబ్బరి అధికంగా పండుతున్నా.. కోనసీమ జిల్లాలో మాత్రమే కురిడీ కొబ్బరి తయారీ అధికం. ఈ జిల్లాలో సైతం కొబ్బరి కాయను చెట్టు నుంచి దింపిన వెంటనే ఏదో ఒక రూపంలో జాతీయ మార్కెట్‌కు తరలిపోతోంది. దీంతో కురిడీ కొబ్బరి నిల్వలు సైతం అయిపోతున్నాయి. ఈ కారణంగానే ధర అనూహ్యంగా పెరిగింది. గతంలో సగటున రోజుకు 130 నుంచి 150 లారీల కురిడీ కొబ్బరి జాతీయ మార్కెట్‌కు ఎగుమతి అయ్యేది. రెండు నెలల క్రితం ఇది 25 నుంచి 30 లారీలకు తగ్గగా.. ఇప్పుడు 15 నుంచి 20 లారీలకు తగ్గిపోయింది. శ్రావణ మాసం వస్తున్నందున కురిడీ కొబ్బరి ధర రూ.30 వేలు దాటుతుందని కోనసీమకు చెందిన వ్యాపారులు, రైతులు అంచనా వేస్తున్నారు.

ముందెప్పుడూ చూడలేదు



మార్కెట్‌లో కురిడీ కొబ్బరికి ఈ స్థాయిలో ధరలు రావడం ఇదే మొదటిసారి. కనీసం మా ఊహకు కూడా అందని ధర ఇది. వరుసగా పండుగలు ఉన్నందున రూ.30 వేలు దాటే అవకాశముందని అంచనా వేస్తున్నాం. ఈ ఏడాది ఆరంభం నుంచి ధరలు ఎక్కువగానే ఉన్నాయి.

– అప్పన బాలాజీ, కురిడీ వ్యాపారి, అంబాజీపేట



కురిడీ కొబ్బరి

క్లుప్తంగా...

బాలల హక్కుల కమిషన్ కోసం కమిటీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్, సభ్యుల ఎంపిక కోసం తగిన సిఫార్సులు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి చైర్‌పర్సన్‌గా టీడీపీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జనగణనలో కులగణన కూడా అంతర్భాగంగా ఉండాలి

బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా నిర్వహించే జనగణనలో కులగణనను కూడా అంతర్భాగంగా చేసి నిర్వహించాలని, సమగ్ర కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ అన్నారు. విజయవాడలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను లెక్కించాలన్నారు. 90 ఏళ్ల తర్వాత జరుగుతున్న కులగణన వెనుకబడిన కులాలకు సామాజిక న్యాయాన్ని అందించడంలో ఒక నూతన అధ్యయనాన్ని సృష్టించనుందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డైరెక్టరేట్ ఆఫ్ సెన్సెస్ రాష్ట్ర కార్యాలయం హైదరాబాద్‌లో ఉందని, ఇంకా అక్కడే కొనసాగుతున్న దాన్ని ఏపీకి తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కులగణనకు ముందు అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ సంస్థల్లో విలీనం చేయండి

త్రిసభ్య కమిటీకి జేఎల్ఎం గ్రేడ్–2 ఎనర్జీ అసిస్టెంట్ల విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జేఎల్ఎం గ్రేడ్–2 ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని, ఏపీఎస్ఈబీ రెగ్యులేషన్స్ వర్తింపచేయాలని పలు విద్యుత్, ఎనర్జీ అసిస్టెంట్ యూనియన్ల నాయకులు హెచ్ఆర్ కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఎనర్జీ అసిస్టెంట్లకు అసిస్టెంట్ లైన్‌మెన్లుగా పదోన్నతులు కల్పించే అంశంపై ముగ్గురు అధికారులతో హెచ్ఆర్ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ సభ్యులైన ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, విద్యుత్ అధికారులు ఉష, రోజాలను యూనియన్ నేతలు సోమవారం విద్యుత్ సౌధలో కలిశారు. రాష్ట్రంలోని అన్ని డిస్కంల పరిధిలో ఉన్న ఎనర్జీ అసిస్టెంట్ల సంతకాలతో సేకరించిన వినతిపత్రాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు, జేఎల్ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్ల రాష్ట్ర కన్వీనర్ పెంచల ప్రసాద్, ఎనర్జీ అసిస్టెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

పరీక్షల మూల్యాంకనానికి పారితోషికమేదీ?

ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం

సాక్షి, అమరావతి: పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్, ఇతర మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఇంతవరకూ పారితోషికం ఇవ్వలేదని, ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఏటా పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనాన్ని వేసవిలో అరకొర వసతులతో నిర్వహిస్తూ సుదూర ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులను పిలిచి చేయిస్తున్నారని సంఘం అధ్యక్షుడు బాజీ పఠాన్ ఒక ప్రకటనలో తెలిపారు. దారుణ పరిస్థితుల్లో ఈ మూల్యాంకనం చేయించి ఇప్పటివరకూ పారితోషికం విడుదల చేయకపోవడం దారుణమన్నారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఘన వ్యర్థాల నిర్వహణకు త్వరలో 8 విద్యుత్ ప్లాంట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఘన వ్యర్థాలతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు త్వరలో 8 వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్టు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎనిమిది ప్లాంట్లతో రాష్ట్రంలో ప్రతి రోజూ విడుదలయ్యే 6,500 టన్నుల్లో 6 వేల టన్నుల ఘన వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్టు వివరించారు.

అవస్థలు బడి!



ఎమ్మిగనూరులోని ఎంఎస్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చెట్ల కింద విద్యా బోధన

అసౌకర్యాల విద్య

- సంఖ్యా పరంగా రాష్ట్రంలోనే మొదటిస్థానం
- 3,630 మంది విద్యార్థినులతో కిటకిటలాడుతున్న ఎమ్మిగనూరు పాఠశాల
- సరిపడా తరగతి గదులు లేక ఆరుబయట చదువులు
- మరుగుదొడ్ల కొరతతో తప్పని క్యూలు
- ఏడాదైనా అసంపూర్తిగానే అదనపు తరగతి గదులు



నిరుపయోగంగా ఆర్ఓ ప్లాంట్

పాఠశాలలో అన్నీ సమస్యలే..

- ఇక్కడ ఆర్ఓ ప్లాంట్ గత ఏడాది నుంచి పనిచేయక మూలనపడింది.
- విధిలేని పరిస్థితుల్లో విద్యార్థినీలు ఇంటి నుంచి బాటిళ్లలో నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది.
- మధ్యాహ్న భోజన సమయంలో వెక్కిళ్లు వస్తే వీళ్ల పరిస్థితి వర్ణనాతీతం.
- వర్షాకాలంలో పాఠశాల ఆవరణ తడిచి ముద్దవుతోంది.
- గ్రౌండ్‌లోనూ వర్షం నీరు నిలుస్తుండటంతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి.

ఎమ్మిగనూరు టౌన్: విద్యాభివృద్ధికి గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌ను తలదన్నేలా రూపుదిద్దుకున్నాయి. నాడు–నేడులో భాగంగా కల్పించిన మౌలిక సదుపాయాలతో అడ్మిషన్ల సంఖ్య కూడా మునుపెన్నడూ లేనివిధంగా పెరిగింది. దశాబ్దాలుగా శిథిలమైన పాఠశాలలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో చూడచక్కన రూపాన్ని సంతరించుకుని విద్యార్థులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఇదే సమయంలో జగనన్న విద్యా కానుకతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించడంతో తల్లిదండ్రులు ప్రయివేట్ చదువులను మాన్పించి ప్రభుత్వ పాఠశాల దిశగా అడుగులు వేయించడం విశేషం.

విద్యార్థినుల అడ్మిషన్లలో రాష్ట్రంలోనే మొదటిస్థానం

ప్రస్తుత విద్యాసంవత్సరంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు జెడ్పీ పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య 3,680. వీరిలో ఒక్క 6వ తరగతిలోనే కొత్తగా 850 మంది విద్యార్థినులు ప్రవేశం పొందడం విశేషం. ఫలితంగా ఈ ఒక్క తరగతికే 11 సెక్షన్లు నిర్వహిస్తున్నారు. విద్యార్థినుల సంఖ్య పరంగా ఈ పాఠశాల రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. 7వ తరగతిలో 680 మంది విద్యార్థినులకు 10 సెక్షన్లు, 8వ తరగతిలో 750 మందికి 10 సెక్షన్లు, 9వ తరగతిలో 700 మందికి 10 సెక్షన్లు, 10వ తరగతికి 9 సెక్షన్లతో బోధన సాగిస్తున్నారు. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా 94 మంది ఉపాధ్యాయులు ఇక్కడ పనిచేస్తున్నారు. ఇంకా 5 హిందీ, 6 ఒకేషనల్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

ఏడాదైనా పూర్తికాని అదనపు తరగతి గదులు

గత ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా రెండవ విడత నాడు–నేడు కింద 12 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పూనుకుంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులను పూర్తిగా విస్మరించింది. ఈ కారణంగా విద్యార్థినులు పాఠశాల ఆవరణలోని చెట్ల కింద, వరండాల్లో అష్టకష్టాలు పడుతూ చదువుకుంటున్నారు. ఇదే సమయంలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో నేల చదువులు తప్పడం లేదు. ఒకే తరగతి గదిలో కొందరు డెస్కులపై, మరికొందరు నేలపై కూర్చోవడం వల్ల వివక్షను ఎదుర్కొంటున్నారు.

3,630 మంది విద్యార్థినులకు 22 మరుగుదొడ్లే..

రాష్ట్రంలోనే విద్యార్థినుల సంఖ్య పరంగా ఈ పాఠశాల మొదటిస్థానంలో ఉంది. మొత్తం 3,630 మంది విద్యార్థినీలు ఉన్న ఈ పాఠశాలలో 22 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఈ కారణంగా విద్యార్థినీలు అత్యవసరమై మరుగుదొడ్లను ఉపయోగించుకోవాల్సి వస్తే క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. సంఖ్యకు అనుగుణంగా మరో 20 మరుగుదొడ్లు అవసరం కాగా, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించని పరిస్థితి. ఇక విద్యార్థినుల సంఖ్య అధికంగానే ఉన్నప్పటికీ కేవలం నలుగురు మాత్రమే ఆయాలు పని చేస్తున్నారు. ఈ కారణంగా పాఠశాలలో పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది.



ఈ విద్యార్థినులు మరుగుదొడ్లను వినియోగించుకునేందుకు ఇలా క్యూలో నిల్చొన్నారు. పాఠశాలలో 3,630 మంది విద్యార్థినులు ఉండగా 22 మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో విధిలేని పరిస్థితుల్లో ఇలా క్యూలో నిల్చొని వీరు ఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతం.

నాడు–నేడు రెండో విడతకు రూ.2.08కోట్లు

గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొదటి విడత నాడు–నేడు కింది టాయిలెట్స్ ఇతర మౌలిక సదుపాయాలకు రూ.1.01కోట్లు మంజురు కాగా ఆయా పనులన్నీ పూర్తయ్యాయి. ఇక రెండో విడత నాడు–నేడు కింద 20 అదనపు తరగతి గదులకు రూ.2.08కోట్లు మంజూరయ్యాయి. కాగా అందులో 8 తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆయా గదుల బయట ప్లాస్టింగ్ చేయకపోయినా సున్నం కొట్టించి వాటిలోనే తరగతులను నిర్వహిస్తున్నారు. మిగిలిన 12 గదుల నిర్మాణాలు పిల్లర్లకే పరిమితమయ్యాయి. ఏడాది కాలంగా ప్రస్తుత ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడం గమనార్హం.

పాఠశాల విద్యలోనూ రాజకీయమే..



అసంపూర్తి తరగతి గదుల్లోనే కొనసాగుతున్న చదువులు

గత ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యలోనూ రాజకీయం చొప్పించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ఏడాది కాలంగా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. ఈ కారణంగా విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మా పాఠశాలలో విద్యార్థినీల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదుల్లేవు. నాడు–నేడు కింద నిలిచిపోయిన 12 తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. పాఠశాల అభివృద్ధికి దాతలు కూడా ముందుకొస్తున్నారు. అధికారుల ఆదేశాలతో అవసరమైతే వారి సహకారం కూడా తీసుకొంటాం. అదనపు మరుగుదొడ్లు అత్యవసరం.

– కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు, ఎంఎస్, జెడ్పీ బాలికల హైస్కూల్, ఎమ్మిగనూరు

ప్రభుత్వం ఎప్పుడు మేల్కొంటుందో?



మరుగుదొడ్లకు వెళ్లేందుకు కూడా విద్యార్థినులు క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి చూస్తే ఈ ప్రభుత్వం ఎంతటి దిగజారుడు పాలన సాగిస్తుందో అర్థమవుతోంది. విద్యార్థుల విషయంలో కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కారు పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుత ప్రభుత్వం వీటిని పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏడాది గడిచినా ఇప్పటికీ ప్రభుత్వం మేల్కొకపోవడం దారుణం.

– బుట్టా రేణుక, వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మిగనూరు

గోదావరి కడలిపాలు

- ప్రతి ఏటా జూలై, ఆగస్టులో వరదలు
- రెండు వరదల్లో సగటున వెయ్యి టీఎంసీలు వృథా
- 120 రోజుల వర్షాకాల వ్యవధిలో 1900 టీఎంసీలు సముద్రం పాలవుతున్నట్టు అంచనా
- ఈ నెలలో ఇప్పటివరకు 420.26 టీఎంసీలు కడలిపాలు
- తగ్గుముఖం పట్టిన వరద తీవ్రత
- ప్రాజెక్టులో 30 టీఎంసీల నీరు నిల్వ



పోలవరం ప్రాజెక్టుకు చేరిన వరద నీరు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : గోదావరి మహోగ్రరూపం దాల్చి కడలిపాలవుతోంది. ఒకటి, రెండు టీఎంసీలు కాదు ఏటా సగటున 1900 టీఎంసీల గోదావరి జలాలు పోలవరం నుంచి ధవళేశ్వరం మీదుగా సముద్రంలో కలిసిపోతున్నాయి. ప్రధానంగా రెండు వరదల సీజన్లలోని వెయ్యి టీఎంసీలు వృథాగా పోతున్నాయనేది అధికారిక అంచనా. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పోలవరం పనులు వేగంగా సాగడంతో పాటు 2020 నుంచి ప్రాజెక్టులో 30 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకున్నారు. నేటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. ఇంకోవైపు గోదావరి వరద తీవ్రత దాదాపుగా తగ్గుముఖం పట్టింది. ఈ నెలలో గోదావరి వరద తీవ్రతతో 420.26 టీఎంసీల నీరు సముద్రంలో కలిసిపోయింది. ఈ నెల రెండో తేదీ నుంచి పోలవరం ప్రాజెక్టుకు వరద తాకిడి ప్రారంభమైంది. రెండో తేదీ నుంచి 10వ తేదీ వరకు సగటున 2 లక్షల క్యూసెక్కుల నీరు, 11వ తేదీ నుంచి 13 వరకు రోజుకు సగటున 7.50 లక్షల క్యూసెక్కుల నీరు మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి గోదావరిలో చేరింది. దీంతో గోదావరితో పాటు ఉపనది అయిన శబరి పొంగిపొర్లుతుండటంతో ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు ముంపు మండలాలు, పశ్చిమగోదావరిలోని యలమంచిలి, లంక గ్రామాల్లో స్వల్ప ఇబ్బందులు తలెత్తాయి. ఈ వరదల సీజన్‌లో మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరడంతో వేలేరుపాడు మండలంలోని ఎద్దులవాగు వంతెన, కుక్కునూరులోని గుండేటివాగులోని లోలెవల్ వంతెనలు నీటమునిగాయి. దీంతో వేలేరుపాడులో 18 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెండు మండలాల్లో సుమారు 270 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. సోమవారం గోదావరి ఉధృతి గణనీయంగా తగ్గింది. భద్రాచలం వద్ద 22.60 అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తోంది. దీంతో పోలవరం ప్రాజెక్టు నుంచి 3,78,800 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. ఇంకోవైపు నీటమునిగిన ఎద్దులవాగు, గుండేటివాగు లోలెవల్ వంతెనలు మంగళవారానికి యథాస్థితికి చేరే అవకాశం ఉంది.

వందల టీఎంసీలు కడలి పాలు

2020 నుంచి పోలవరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేస్తున్నారు. అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు వేగవంతంగా నడిచాయి. 2020 నుంచి 25.72 మీటర్ల మేర 30 టీఎంసీల నీటిని నిల్వ చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం 51 మీటర్లు పూర్తయితే 197 టీఎంసీల నీటిని నిల్వ చేసే పరిస్థితి ఉంటుంది. పునరావాసం పూర్తికాకపోవడం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపులు జరపకపోవడంతో వరద నీటిని నిల్వ చేయలేని పరిస్థితి. దీంతో వరద నీరు వస్తే 48 గేట్లు ఎత్తేసి ఎంత నీరు వస్తే అంత దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రతి ఏటా వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది. ప్రత్యేకంగా జూలై, ఆగస్టు నెలల్లోనే 1500 టీఎంసీల నీరు సముద్రం పాలవుతోంది. ఈ నెల 2వ తేదీ నుంచి 14 వరకు 420.26 టీఎంసీల నీరు సముద్రంలోకి చేరింది. మరో వారం రోజుల పాటు పోలవరం నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగే అవకాశం ఉంది.

టీడీపీ ఎమ్మెల్యే గంటాకు షాక్



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వాహనానికి అడ్డంగా కూర్చున్న మహిళలు

తగరపువలస: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వాహనాన్ని సోమవారం ఆనందపురం మండలం పాలవలస పంచాయతీలో పార్టీలకు అతీతంగా ప్రజలు అడ్డుకున్నారు. ఆయన వాహనాన్ని ముందుకు కదలనీయబోమని మహిళలు వాహనానికి అడ్డంగా కూర్చుకున్నారు. వారిని శాంతింపచేయడానికి ఆనందపురం పోలీసులకు తలప్రాణం తోకకు వచ్చినట్లయింది. వివరాల్లోకి వెళితే ఇదే పంచాయతీకి చెందిన మద్ది శివ అనే మహిళకు లాండ్ పూలింగ్ ద్వారా రావలసిన వారసత్వ వాటా 1410 గజాలను ఇవ్వకుండా అత్త సీతయ్యమ్మ, బావ లక్ష్మినాయుడు, అతని కుమారుడు శేఖర్, తోడికోడలు నాగమణి కాజేశారు. వాటా అడగడానికి వెళ్లిన ఆమెను, అల్లుడు పాలవలస రమేష్‌ను ఇటీవల శేఖర్‌తో పాటు రెడ్డి మహేష్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధితులు ఆనందపురం పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లినా న్యాయం జరగలేదు. టీడీపీలో తాను చెప్పిందే వేదమని ఏమైనా చేయగలనని శేఖర్ తరచూ తన పిన్ని అయిన శివను బెదిరించడంతో విసిగిపోయిన ఆమె, గ్రామస్తుల సాయంతో గంటా శ్రీనివాసరావును అడ్డుకుంది. తనకు న్యాయం చేయాలని కోరుతూ అరగంటకు పైగా రోడ్డుపై బైఠాయించారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు న్యాయం చేస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.

క్లస్టర్ కాంప్లెక్స్‌లకు రూ.8.06 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని క్లస్టర్ కాంప్లెక్స్‌ల నిర్వహణకు సమగ్రశిక్ష రాష్ట్ర విభాగం నిధులను మంజూరు చేసింది. మొత్తం 2,809 క్లస్టర్లకు రూ.8.06 కోట్లను విడుదల చేస్తూ సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యా సంబంధ అవసరాలు, టీఏ, నిర్వహణ, కంటెన్జెన్సీ, టీఎల్ఎం గ్రాంట్ కింద ఒక్కో క్లస్టర్ కాంప్లెక్స్‌కు రూ.28,700 చొప్పున ఇస్తున్నట్టు తెలిపారు. అలాగే పాఠశాల విద్యలో అంతర్భాగమైన మండల రిసోర్స్ సెంటర్లకు సమగ్ర శిక్ష విభాగం నిధులను విడుదల చేసింది. రాష్ట్రంలో 679 ఎమ్మార్సీలకు సగటున రూ.70 వేల చొప్పున రూ.4.75 కోట్లను మంజూరు చేశారు.

డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్ల సేవల పునరుద్ధరణ

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న లెక్చరర్ల సేవలను ప్రభుత్వం పునరుద్ధరించింది. గత విద్యా సంవత్సరంలో పనిచేసి, ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి 60 ఏళ్లలోపు వయసున్న 693 మంది కాంట్రాక్టు సిబ్బంది సేవలను 2025–26 విద్యా సంవత్సరానికి పునరుద్ధరించారు. ఈమేరకు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30 వరకు (11 నెలలు) వీరు కొనసాగుతారని పేర్కొన్నారు.



• ఆంబ్లోపియా

లేజీ ఐ

ఓ కన్నేయండి!

కొన్ని సందర్భాల్లో రెండు కళ్లలో... ఏదో ఓ కన్ను పనిచేయడానికి కాస్త బద్ధకిస్తుంటుంది. ఈ సమస్య అందరిలోనూ వచ్చే అవకాశమున్నా ముఖ్యంగా చిన్న పిల్లల్లో ఇలాంటి కేసులు ఎక్కువ. అయితే... తమకు ఉన్న రెండు కళ్లలో ఒకటి... తన పక్కదానంత బాగా పనిచేయడం లేదన్న విషయం వారికి తెలిసే అవకాశం సాధారణంగా ఉండదు. ఇలాంటి సందర్భాల్లో స్పష్టంగా కనిపించే కంటి నుంచే ప్రతిబింబాలను గ్రహించి, అస్పష్టంగా కనిపించే ప్రతిబింబాలను మెదడు నిరాకరిస్తుంది. అంటే ఈ రెండు కళ్లలో ఒకటి ప్రతిబింబాన్ని ప్రసారం చేయడంలో కాస్త బద్ధకంగా పనిచేస్తుందన్నమాట. ఇలా బద్ధకంగా పనిచేసే కన్ను పనితీరు క్రమంగా తగ్గిపోతూ... ఒక దశలో పూర్తిగా పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ సమస్యనే వాడుక భాషలో 'లేజీ ఐ' అనీ, వైద్యపరిభాషలో 'ఆంబ్లోపియా' అని అంటారు. సాధారణంగా ఆంబ్లోపియా సమస్య ఉన్నప్పుడు... కొద్దిగానైనా చూపు ఉన్నంత కాలం... తమ కళ్లలో ఒక దానికి సమస్య ఉందన్న విషయమే బాధితులకు తెలిసే అవకాశం పెద్దగా ఉండదు. ఈలోపే జరగాల్సిన అనర్థాలు జరిగే అవకాశముంది. అందుకే 'లేజీ ఐ' (యాంబ్లోపియా)పై అవగాహన అవసరం. అందుకు ఉపయోగపడేదే ఈ కథనం.

డాక్టర్ కె. రవికుమార్ రెడ్డి
సీనియర్
కంటి వైద్య నిపుణులు

ఎంత త్వరగా చికిత్స జరిగితే... అంత మేలైన ఫలితాలు

ఆంబ్లోపియాను ఎంత త్వరగా గుర్తించి, ఎంత చిన్న వయసులో చికిత్స చేయిస్తే ఫలితాలు అంత మెరుగ్గా ఉంటాయి. అయితే ఆ పసివయసులో తమ చూపులో లోపం ఉందన్న విషయాన్ని పిల్లలు గ్రహించలేకపోవడం, అలాగే చిన్నారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ లేకపోవడంతో తల్లిదండ్రులు కూడా దీన్ని ఒకపట్టాన గుర్తించలేరు.

అయితే చిన్నతనంలోనే అంటే... రెండు నుంచి ఎనిమిది ఏళ్లలోపు గుర్తించి, చికిత్స చేయిస్తే ఫలితాలు చాలా మెరుగ్గా ఉంటాయి. అంతమాత్రాన నిరాశపడాల్సిన అవసరం లేదు. పన్నెండేళ్ల నుంచి పద్దెనిమిదేళ్ల వరకు చికిత్స చేయించడానికి అవకాశం ఉంది. కాకపోతే ఫలితాలు చిన్నప్పటితో పోలిస్తే కాస్త నిదానంగా కనిపిస్తాయి. పెద్దవాళ్లలో కూడా 'విజన్ థెరపీ' ద్వారా కొంతవరకు ఫలితాలను రాబట్టవచ్చు.





ఓ కేస్ స్టడీ

శిరీష (పేరు మార్చాం) అనే ఓ ఎనిమిదేళ్ల చిన్నారి రెండు కళ్లలో ఒక కన్నులోంచే దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ రెండో కన్ను మంచి ప్రతిబింబాన్ని పంపడంలో కాస్త బద్ధకిస్తోంది. ఇలా కంటిన్యువస్‌గా జరిగే సమయంలో ఎదుటి దృశ్యాన్ని స్పష్టంగా పంపే కంటి తాలూకు ప్రతిబింబాన్నే మెదడు తీసుకుంటోంది. సరిగ్గా కనిపించని కంటి నుంచి వచ్చే ఆ సమాచారాన్ని తీసుకోవడాన్ని నిరాకరిస్తూ పోవడంతో కొంతకాలానికి ఆ కంటికి క్రమంగా అంధత్వం వచ్చే ప్రమాదం ఏర్పడింది. ఈలోపు ఏదో ఇతర పరీక్ష కోసం వెళ్లిన సమయంలో డాక్టర్లకు ఒక కన్ను బద్ధకిస్తోన్న విషయం తెలిసివచ్చింది. దాంతో డాక్టర్లు అతి కష్టమ్మీద ఆ రెండో కంటి చూపునూ కాపాడగలిగారు.

అసలు 'లేజీ ఐ' పై అవగాహన రావాలంటే ముందుగా... చూడడమనే ప్రక్రియ ఎలా జరుగుతుందో తెలియడం చాలా ప్రధానం. మనం ఏదైనా దృశ్యాన్ని లేదా వస్తువును చూడాలంటే... తొలుత ఆ వస్తువుపై కాంతి పడి, మళ్లీ అదే కాంతి మన కంటిని చేరాలి. అప్పుడది తొలుత నల్లగుడ్డు అయిన కార్నియా నుంచి, తర్వాత పారదర్శకమైన మన లెన్స్ నుంచీ ప్రసరించి... రెటీనా అనే తెరపై ఆ వస్తువు తాలూకు ప్రతిబింబాన్ని తలకిందులుగా పడేలా చేస్తుంది. 'ఆప్టిక్ నర్వ్' అనే కీలకమైన నాడి ద్వారా రెటీనాపై నున్న ప్రతిబింబం సమాచారాన్ని మెదడుకు చేరవేస్తుంది. దాంతో ఆ వస్తువు కనిపించడం వల్ల మనకు దృష్టిజ్ఞానం కలుగుతుంది.

ఏమిటీ 'లేజీ ఐ'?

మనకు కలిగే దృష్టి జ్ఞానాన్ని 'బైనాక్యులర్ విజన్' అంటారు. అంటే... మన రెండు కళ్లలోని దృశ్యాలూ తమ తమ రెటీనాలపై కలిసి (ఇంటిగ్రేట్ అయి) ఆ రెండూ ఒకే దృశ్యంగా / వస్తువుగా కనిపిస్తాయి. అంటే 'బై' అంటే రెండు... 'ఆక్యులార్' అంటే 'కళ్లు'... ఈ రెండు కళ్లూ కలిసి ఒకే దృశ్యాన్ని చూపడమే 'బైనాక్యులార్ విజన్'! ఏదైనా కారణాలతో ఒకవేళ ఒకరి రెండు కళ్లలో... ఒకదానికి ఏదైనా కొంత లోపం ఉంటే... అలాంటప్పుడు ఒక కంటిలోని ప్రతిబింబం చాలా స్పష్టంగానూ, లోపమున్న కంటిలోని ప్రతిబింబం కొంత అస్పష్టంగా... ఇలా తన రెండు రెటీనాలపై ప్రతిబింబాలను చూపుతుంది. అయితే రెండు కళ్లతో చూసేప్పుడు బైనాక్యులర్ విజన్ కారణంగా ఆ లోపం తెలియకపోవచ్చు. ఒక్కో కంటితో విడివిడిగా, పరీక్షగా చూసినప్పుడు మాత్రమే అది తెలిసిరావచ్చు.

ఇలాంటి సందర్భాల్లో స్పష్టమైన ప్రతిబింబాన్నే మెదడు స్వీకరిస్తుంది. అస్పష్టమైన దాన్ని క్రమంగా నిరాకరిస్తూ పోతుంది. ఇలా అస్పష్టమైన ప్రతిబింబాన్ని నిరాకరించడాన్ని 'సప్రెషన్' అంటారు. ఒక కంట్లో ప్రతిబింబం అస్పష్టంగా ఏర్పడుతున్నప్పుడూ, ఆ సమాచారాన్ని మెదడు క్రమంగా నిరాకరిస్తూపోతూ ఉండే మెడికల్ కండిషన్‌ను 'లేజీ ఐ' అనీ, వైద్యపరిభాషలో 'ఆంబ్లోపియా' అని అంటారు.

లేజీ ఐ / ఆంబ్లోపియా సమస్య ఉన్నవారిలో తొలుత ఎలాంటి లోపమూ కనిపించదు. చిన్నపిల్లల్లోనైతే వాళ్ల కన్ను అభివృద్ధి / వికాసం కూడా మామూలుగానే జరుగుతాయి. వైద్యపరీక్షల్లోనూ కంటి గురించి ఎలాంటి లోపమూ తెలియదు. కాని కొన్నిసార్లు ఏదో ఒక కంట్లోగానీ లేదా ఒక్కోసారి రెండు కళ్లల్లోనూ చూపు మందగిస్తుంది. 'లేజీ ఐ' కండిషన్ వయసుతో పాటు పెరుగుతూ పోతుంది. పైకి అంతా బాగానే ఉండటంతో ఈ కండిషన్‌ను తొలిదశల్లో గుర్తుపట్టడమూ కష్టమే.

ఆంబ్లోపియా విస్తృతి : మన దేశంలోని చిన్నారుల్లో దీని విస్తృతి దాదాపు రెండు శాతం. అంటే ప్రతి వంద మంది పిల్లల్లో ఇద్దరిలో ఈ లోపం కనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా దీని విస్తృతి ఇంకా ఎక్కువ. అంటే దాదాపు 4 శాతం.

ఆంబ్లోపియా రకాలు

- **అన్ ఐసోమెట్రోపిక్ ఆంబ్లోపియా :** ఒక కంట్లో ఉన్న దృష్టిలోపానికీ (రిఫ్రాక్టివ్ ఎర్రర్‌కూ), మరో కంటికీ తేడా ఉండటం. ఈ సమస్య ఉన్న వాళ్లలో చాలా ఎక్కువమందిలో ఈ సమస్యే ఉంటుంది.
- **ఐసోమెట్రిక్ ఆంబ్లోపియా :** రెండు కళ్లలోనూ ఎక్కువ దృష్టిలోపం (రిఫ్రాక్టివ్ ఎర్రర్) ఉండటం. (ఉదా + 6.0 ; +6.0)
- **మెరిడోనల్ ఆంబ్లోపియా:** కళ్లలో సిలెండ్రికల్ పవర్ '2.0' కంటే ఎక్కువ ఉండటం.
- **స్ట్రెబిస్మస్ ఆంబ్లోపియా :** మెల్ల కన్ను కారణంగా వచ్చే ఆంబ్లోపియా ఇది.
- **డిప్రివేషనల్ ఆంబ్లోపియా :** పుట్టుకతోనే కంట్లో శుక్లం ఉండటం, కార్నియా సమస్య, రెటీనా సమస్య, కనురెప్ప వాలిపోవడం వంటి సమస్యలున్నప్పుడు, కాంతి కిరణాలు రెటీనాకు సరిగా చేరకపోవడం ఈ తరహా ఆంబ్లోపియా వస్తుంది.

అంబ్లోపియాకు కారణాలు (ఆంబ్లోజెనెసిస్)

విజువల్ డిప్రవేషన్ : చూపు విషయంలో ఒక కంటిలో ఉన్నంత స్పష్టత మరో దానిలో లేకపోవడం.

లైట్ డిప్రవేషన్ : కంటిలోని కొన్ని దోషాల కారణంగా (కాటరాక్ట్ వంటి వాటివల్ల) రెటీనాకు తగినంత కాంతి చేరకపోవడం.

అబ్-నార్మల్ బైనాక్యులార్ విజన్ : అంటే రెండు కళ్లూ సమంగా ఒకే వస్తువుపై కేంద్రీకరించలేకపోవడం... ఈ అంశాలు ఉన్నవారిలో ఆంబ్లోపియా క్రమంగా వృద్ధిచెందుతుంది.

లక్షణాలు / నిర్ధారణ

- నిజానికి చాలా మంది తమకు లోపం ఉన్నట్లు గుర్తించలేరు / చెప్పలేరు.
- ఒక కంటిలో చూపు తగ్గడం
- **క్రౌడింగ్ ఫినామినా:** అంటే... అనేక అక్షరాలు ఉన్నప్పుడు ఏదో ఒక అక్షరాన్ని మాత్రమే చూడగలగటం. ఒక్క అక్షరాన్ని మాత్రమే చదవడగలగడం.
- **న్యూట్రల్ డెన్సిటీ ఫిల్టర్ :** దీనితో పరీక్షించినప్పుడు మామూలు కంటి చూపు ఉన్నవారికి స్పష్టంగా కనిపించదు. కానీ 'ఆంబ్లోపియా' ఉన్నవారు దీనిలోంచి చూసినప్పుడు... వారికి మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది.
- కొంతమందిలో మెల్లకన్ను ఉండటం, అలాగే రంగులు చూసే సామర్థ్యం తక్కువగా ఉండటం.

కంటి డాక్టర్లు పైన పేర్కొన్న లక్షణాలను బట్టి 'ఆంబ్లోపియా'ను నిర్ధారణ చేస్తారు.

నివారణ

- మూడు నుంచి ఐదేళ్ల వయసులోని పిల్లలకు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించాలి. లోపాలుండి శస్త్రచికిత్స అవసరమైన వారికి వీలైనంత త్వరగా చేయించాలి.
- అక్లూజన్ థెరపీ ద్వారా చూపు తిరిగి వచ్చాక కూడా 'మెయింటెనెన్స్ థెరపీ' అంటూ రోజూ రెండు గంటల పాటు అక్లూజన్ ప్రక్రియను కొనసాగిస్తూ ఉండాలి.
- తరచూ కంటి డాక్టర్‌ను సంప్రదిస్తూ ఉండాలి.

లేజీ-ఐ చికిత్స ఇలా...

- **ఏ కారణంతో ఆంబ్లోపియా వచ్చిందో దానికి చికిత్స చేయడం :** అంటే ఉదాహరణకు దృష్టిలోపాల వల్ల సమస్య వచ్చినట్లయితే దానికి సరిపడిన అద్దాలను ఇవ్వడం. ఉదాహరణకు ప్లస్ పవర్, మైనస్ పవర్, సిలెండ్రికల్ పవర్.
- **మెల్లకన్ను కారణంగా ఆంబ్లోపియా వస్తే** మెల్లకన్ను కరెక్షన్ చికిత్సతో దాన్ని సరిచేయడం.
- **డిప్రివేషన్ ఆంబ్లోపియా జబ్బులకు...** అంటే శుక్లం, కార్నియా, రెటీనా, వాలిపోయే కనురెప్పలు వంటి సమస్యలు ఉన్నప్పుడు వాటిని సరిచేయడం ద్వారా లోపాల్ని తొలగించవచ్చు. ఉదాహరణకు...
- **పుట్టుకతోనే శుక్లం (కాటకార్ట్) కారణంగా ఆంబ్లోపియా వస్తే...** శస్త్రచికిత్స ద్వారా తొలుత పారదర్శకత కోల్పోయిన శుక్లాన్ని తొలగించాలి. ఆ స్థానంలో ఇంట్రా ఆక్యులార్ లెన్స్‌ను అమర్చాలి. శుక్లం కేవలం ఒకే కంట్లోనే ఉంటే- బిడ్డ పుట్టిన వెంటనే ఈ ఆపరేషన్ చేయవచ్చు. ఒకవేళ శుక్లాలు రెండు కళ్లలోనూ ఉంటే ఆపరేషన్‌కు కొన్ని మాసాల వ్యవధి తీసుకోవచ్చు. కాని శస్త్రచికిత్స మాత్రం తప్పనిసరిగా చేయించాలి. ఆపరేషన్ ఎంత త్వరగా చేస్తే చూపు వచ్చే అవకాశాలు అంత మెరుగ్గా ఉంటాయి. ఆపరేషన్ తర్వాత కూడా పిల్లలకు డాక్టర్లు సూచించిన ప్రకారం... క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయిస్తూ ఉండాలి. ఇలా ఆ చిన్నారికి 14 ఏళ్ల వయస్సు వచ్చే వరకూ పరీక్షలు చేయించడం తప్పనిసరి.
- పిల్లల్లో మెల్లకన్ను ఉన్నప్పుడు అశ్రద్ధ చేయకుండా కంటి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లాలి. మూడేళ్లలోపు పిల్లలకు ఇది వచ్చే అవకాశం ఎక్కువ. కొందరిలో పుట్టగానే మెల్లకన్ను ఉండవచ్చు. కొందరు తల్లిదండ్రులు తమ బిడ్డకు మెల్లకన్ను ఉండటాన్ని అదృష్టంగా భావిస్తారు. పిల్లలు ఎదిగిన తర్వాత పరీక్షలు చేయించవచ్చని మరికొంతమంది తల్లిదండ్రులు అభిప్రాయపడుతుంటారు. ఈ రెండూ సరికాదు. పిల్లల్లో మెల్లకన్నును గమనించగానే వెంటనే పిల్లలను డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలి. మెల్లకంటి సమస్యకూ ఎంతత్వరగా చికిత్స చేయిస్తే... అంత మంచిది.
- కంటి రెప్ప వాలిపోవడం వల్ల ఆంబ్లోపియా వస్తే... ఆ రెప్ప పైకెత్తి నిలిపి ఉంచేలా ఓ శస్త్రచికిత్స అవసరమవుతుంది. దీన్నే 'టోసిస్ కరెక్షన్' సర్జరీ అంటారు. ఈ ఆపరేషన్ తర్వాత కూడా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయిస్తూ ఉండటం అవసరం. కొందరిలో కంటికి అద్దాలు అవసరమవుతాయి. ఇలాంటివారు అద్దాలు వాడుతూనే ఆంబ్లోపియాకూ చికిత్స చేయించాలి.



• అక్లూజన్ థెరపీ

ఈ చికిత్స ప్రక్రియలో నార్మల్‌గా ఉన్న కంటిని పూర్తిగా మూసివేసి, చూపు మందగించిన కంటి తాలూకు దృష్టి మెరుగుపడేలా స్టిమ్యులేట్ చేస్తారు. నార్మల్‌గా ఉన్న కంటిని ఎన్నాళ్లు మూసి ఉంచి... ఈ స్టిమ్యులేషన్ చికిత్స చేయాల్సి ఉంటుందన్నది డాక్టర్ నిర్ధారణ చేస్తారు. ఈ చికిత్స వల్ల 8 నుంచి 10 ఏళ్ల వరకు ఉన్న పిల్లల్లో మంచి ఫలితాలు కనిపిస్తాయి.

• విజన్ థెరపీ

పైన పేర్కొన్న అక్లూజన్ పద్ధతిలో చికిత్స చేస్తూ... కంప్యూటర్ ప్రోగ్రామ్ ద్వారా బలహీనమైన కంటిని చురుగ్గా మారేలా చేస్తారు. దీని వల్ల మెదడు కూడా తిరిగి ప్రతిబింబాన్ని గ్రహించేలా, పక్క కన్ను ప్రతిబింబంతో పోల్చుకుని... మళ్లీ చూపు, బైనాక్యులర్ విజన్‌పొందేలా ప్రయత్నం జరుగుతుంది. ఈ ప్రక్రియకు దాదాపుగా 100 నుంచి 200 గంటల పాటు చికిత్స అవసరమవుతుంది.

• పీనలైజేషన్

అట్రోపిన్ చుక్కల మందులు లేదా బలమైన లెన్స్‌లను బాగా కనిపించే కంటికి వాడతారు. అప్పుడు బలహీనంగా ఉన్న కన్ను స్టిమ్యులేట్ అవుతుంది. దాంతో అది చూడటానికి ప్రయత్నించడాన్ని మొదలు పెడుతుంది. కన్నును మూసివేసి ఉంచి చేసే చికిత్స అయిన 'అక్లూజన్ థెరపీ'లోలా కాకుండా, కన్ను తెరచే ఉంచి చేసే చికిత్స ఇది.

• ఫార్మకోథెరపీ

లీవోడోపా వంటి మందుల ద్వారా కంటి నరాలు బాగా పనిచేసేలా చేస్తారు.

• ఫ్యూజనల్, స్టీరియాప్టిక్ ఎక్సర్‌సైజెస్

లేజీ ఐ తన చురుకుదనాన్ని పొందేలా చేసిన చికిత్స ప్రక్రియల తర్వాత ఆ రెండు కళ్లూ ఒకేలాంటి మంచి ప్రతిబింబాన్నే మెదడుకు ఇచ్చేలా చేసేందుకు కొన్ని వ్యాయామాలు చేయిస్తారు. ఇందులో ఫ్యూజనల్ ఎక్సర్‌సైజ్‌లో రెండు కళ్లూ తాము ప్రతిబింబించే దృశ్యాన్ని మెదడు ఒకేలా గ్రహించేలా చేస్తారు. ఇక స్టీరియాప్టిక్ ఎక్సర్‌సైజ్‌లో ఈ రెండు కళ్లూ డెప్త్ / 3 డీ ఇమేజ్ సాధించేలా చేయడానికి చేయిస్తారు. ఈ రెండు ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తేనే భవిష్యత్తులో లేజీ ఐ లో చూపు తగ్గకుండా ఉంటుంది. లేదంటే మళ్లీ వెనక్కువెళ్లే అవకాశాలు ఉంటాయి.

భవిష్యత్తు చికిత్స ప్రక్రియల్లో జీన్ థెరపీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సరికొత్త చికిత్స ప్రక్రియలు అందివచ్చే అవకాశాలున్నాయి. ఇటీవల అడల్ట్ ఆంబ్లోపియాకు కూడా మరిన్ని అధునాతన చికిత్సలను అందుబాటు తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నిర్వహణ: యాసీన్

బిజినెస్ రీల్

నేపాల్‌లో రిలయన్స్ 'క్యాంపా కోలా'



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ తమ సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్ 'క్యాంపా కోలా'ను నేపాల్ మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఇందుకోసం కంపెనీ ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ (ఆర్‌సీపీఎల్), నేపాల్‌కి చెందిన చౌదరి గ్రూప్‌తో (సీజీ) ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఫుడ్, బెవరేజెస్ విభాగంలో క్యాంపా ఉత్పత్తుల తయారీ, దేశవ్యాప్తంగా పంపిణీకి సీజీ తోడ్పడుతుంది. క్యాంపా పోర్ట్‌ఫోలియో కింద తొలుత క్యాంపా కోలా, క్యాంపా లెమన్, క్యాంపా ఆరెంజ్, క్యాంపా ఎనర్జీ గోల్డ్ బూస్ట్, క్యాంపా ఎనర్జీ బెర్రీ కిక్ ఉత్పత్తులను ప్రవేశపెడతారు. ప్రాంతీయంగా మరింత వృద్ధి సాధించే దిశగా దీర్ఘకాలిక విజన్‌తో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు ఆర్‌సీపీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేతన్ మోదీ తెలిపారు. తమ బెవరేజ్ పోర్ట్‌ఫోలియోను విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని సీజీ గ్రూప్ ఎండీ నిర్వాణ చౌదరి చెప్పారు. 2022లో క్యాంపా బ్రాండ్‌ను రిలయన్స్ కొనుగోలు చేసింది. 2023లో దాన్ని దేశీ మార్కెట్లో సరికొత్తగా ప్రవేశపెట్టింది. అటు సీజీ గ్రూప్ అంతర్జాతీయంగా 200 పైగా కంపెనీలు, 260 పైచిలుకు బ్రాండ్లను నిర్వహిస్తూ నేపాల్‌లో అగ్రగామిగా నిలుస్తోంది. భారత్ సహా పలు దేశాల్లో అమ్ముడయ్యే 'వై వై' బ్రాండ్ ఇన్‌స్టంట్ నూడుల్స్ ఈ సంస్థకు చెందినవే.

అమెజాన్‌లో రోర్ ఈజెడ్ ఈవీల విక్రయం



బెంగళూరు: విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఒబెన్ ఎలక్ట్రిక్ తాజాగా తమ రోర్ ఈజెడ్ మోటర్ సైకిల్‌ను ఈ–కామర్స్ పోర్టల్స్ ద్వారా కూడా అందుబాటులోకి తెచ్చింది. దీన్ని అమెజాన్‌లో విక్రయిస్తున్నట్లు సంస్థ వివరించింది. ఈ వాహనం రెండు వేరియంట్లలో లభిస్తుంది. ధర రూ. 1,19,999 నుంచి ప్రారంభమవుతుంది. గరిష్ఠంగా గంటకు 95 కి.మీ. వేగం, 175 కి.మీ. రేంజి, ఫాస్ట్ చార్జింగ్, రెట్టింపు బ్యాటరీ లైఫ్ తదితర ఫీచర్లు రోర్ ఈజెడ్‌లో ఉన్నాయి. ఎలెక్ట్రో యాంబర్, ల్యూమినా గ్రీన్ వంటి నాలుగు రంగుల్లో లభిస్తుంది. రూ. 9,999కి ఎనిమిదేళ్ల లేదా 80,000 కి.మీ. వరకు బ్యాటరీపై వారంటీ ఇస్తున్నట్లు సంస్థ ఫౌండర్ మధుమిత అగర్వాల్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

15-7-2025

విశాఖ	540–00
చిత్తూరు	583–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	496–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	271	2.9
TITAN	3,402.00	1.2
HDFCLIFE	767	1.05
ONGC	244.15	0.99
GRASIM	2,789.00	0.98

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JIOFIN	319.3	-2
TECHM	1,575.00	-1.72
WIPRO	254.25	-1.57
INFY	1,570.50	-1.53
HCLTECH	1,613.50	-1.51

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,162
ఎన్ఎస్ఈ	99,598
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,31,608
ఎఫ్ఐఐ	- 1,614
డీఐఐ	+ 1,788

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.96 (రాత్రి 11.30కు)	$ 68.45 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.18 (రాత్రి 11.30కు)	$ 70.36 (క్రితం ముగింపు)

ఎకానమీకి జీసీసీల దన్ను

2030 నాటికి 200 బిలియన్ డాలర్ల ప్రయోజనం

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ: గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి గణనీయంగా తోడ్పడనున్నాయి. 2030 నాటికి వీటితో ఎకానమీకి 200 బిలియన్ డాలర్ల మేర ప్రయోజనం చేకూరనుంది. అలాగే మరిన్ని ఉద్యోగాల కల్పనకు కూడా ఇవి తోడ్పడనున్నాయి. సీఐఐ–జీసీసీ బిజినెస్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ విషయాలు తెలిపారు. 2024లో సగటున వారానికొక జీసీసీ చొప్పున ఏర్పాటైందని వివరించారు. ఫార్చూన్ 500 కంపెనీల్లో 50 శాతం సంస్థలు భారత్‌లో తమ సెంటర్లను నెలకొల్పాయని పేర్కొన్నారు. గత అయిదేళ్లుగా పరిశ్రమ ఏటా 11 శాతం చొప్పున వృద్ధి చెందిందన్నారు. వీటిలో దేశీయంగా సుమారు 21.6 లక్షల మంది ప్రొఫెషనల్స్ పని చేస్తుండగా 2030 నాటికి ఈ సంఖ్య 28 లక్షలకు చేరనుందని మంత్రి చెప్పారు. భారత జీసీసీ రంగం స్థూలంగా 68 బిలియన్ డాలర్ల విలువను (జీవీఏ) ఎకానమీకి జోడించిందని, 2030 నాటికి ఇది 150–200 బిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందని తెలిపారు. వ్యయాల పరంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాతో పోలిస్తే మన దగ్గర నిపుణుల సేవలు దాదాపు 30–50 శాతం తక్కువకే లభిస్తున్నాయని పేర్కొన్నారు.

పాలసీలను క్రమబద్ధీకరించాలి..

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) భారత్ హబ్‌గా ఎదగాలంటే జాతీయ స్థాయిలో వాటికి సంబంధించిన పాలసీలను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి అనురాధ ఠాకూర్ తెలిపారు. జీసీసీలు అత్యధికంగా ఉన్న తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలాంటి రాష్ట్రాలు పాటిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, వాటిని దేశవ్యాప్తంగా అమలు చేసే అవకాశాలను పరిశీలించాల్సి ఉంటుందని వివరించారు. చాలా రాష్ట్రాల్లో నిపుణుల లభ్యత పుష్కలంగా ఉందని, పెద్ద ఎత్తున జీసీసీలు ఏర్పాటైతే తక్కువ వ్యయాలతోనే సేవలందించడంలో అంతర్జాతీయంగా పోటీపడే వీలుంటుందని వివరించారు. భారత్‌లో సుమారు 1,800 జీసీసీలు ఉన్నాయి. బహుళ జాతి సంస్థలు (ఎంఎన్‌సీ) తమ వ్యాపార లావాదేవీల నిర్వహణ కోసం వీటిని ఏర్పాటు చేశాయి. స్టార్టప్ వ్యవస్థ కూడా వీటి విస్తరణకు దోహదపడింది. ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ జీసీసీల ఏర్పాటును ప్రోత్సహించే దిశగా రాష్ట్రాలకు మార్గనిర్దేశం చేసే విధానాన్ని రూపొందించడంపై కేంద్రం దృష్టి పెడుతోంది.

మూడేళ్లలో ఆరు లక్షల గ్రామాలకు బ్రాడ్‌బ్యాండ్..

మూడేళ్ల వ్యవధిలో దాదాపు ఆరు లక్షల గ్రామాల్లో హై–స్పీడ్ ఆప్టికల్ ఫైబర్ ఆధారిత బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తేనున్నట్లు సీఐఐ–జీసీసీ సదస్సులో పాల్గొన్న సందర్భంగా టెలికం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ తెలిపారు. జీసీసీలు ప్రస్తుతం ఎక్కువగా పెద్ద నగరాలకే పరిమితమవుతున్నాయని, కనెక్టివిటీ పెరుగుతున్న నేపథ్యంలో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు కూడా విస్తరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో డేటా చార్జీలు అత్యంత తక్కువగా ఉండటమనేది, జీసీసీల ఏర్పాటుకు ఎంతో ప్రయోజనకరమైన అంశమని వివరించారు. అలాగే, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి కీలకమైన నిపుణుల లభ్యత, కనెక్టివిటీ, కొత్త ఆవిష్కరణలు చేసే సామర్థ్యాలు, మేధోహక్కుల పరిరక్షణకు పటిష్టమైన చట్టాలు మొదలైనవన్నీ భారత్‌కు సానుకూలాంశాలని పేర్కొన్నారు.



దేశీయంగా బ్రాడ్‌బ్యాండ్ స్పీడ్ సగటున 138 ఎంబీపీఎస్‌గా ఉంటోందని మిట్టల్ చెప్పారు. అదనంగా మరింత స్పెక్ట్రంను అందుబాటులోకి తేవడం, పరిశోధనలు .. అభివృద్ధి కార్యకలాపాలకు అనువైన పరిస్థితులు కల్పించడం, చిన్న..మధ్య తరహా సంస్థలు అలాగే స్టార్టప్‌లను ప్రోత్సహించడం తదితర చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దీనితో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు విస్తరించినప్పుడు జీసీసీలకు డిజిటల్ మౌలిక సదుపాయాల కొరత ఉండదని మిట్టల్ తెలిపారు.

ఓలా ఎలక్ట్రిక్ ఆదాయం జూమ్

క్యూ1లో రూ. 828 కోట్లు • షేరు 18 శాతం హైజంప్



న్యూఢిల్లీ: ద్విచక్ర ఈవీల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. త్రైమాసికవారీగా ఏప్రిల్–జూన్(క్యూ1)లో మొత్తం ఆదాయం 36 శాతం ఎగసి రూ. 828 కోట్లను తాకింది. గతేడాది(2024–25) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో కేవలం రూ. 611 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో 33 శాతం వృద్ధితో 68,192 వాహనాలను డెలివరీ చేసింది. గత క్యూ4లో 51,375 యూనిట్లను డెలివరీ చేసింది. ఆటో బిజినెస్ జూన్‌లో సానుకూల నిర్వహణ లాభం(ఇబిటా)స్థాయికి చేరినట్లు కంపెనీ తెలియజేసింది. ఇందుకు బలపడిన స్థూల మార్జిన్లు దోహదపడినట్లు వెల్లడించింది. ప్రాజెక్ట్ లక్ష్యనిర్వహణ సామర్థ్యాలను భారీగా మెరుగుపరచినట్లు పేర్కొంది. దీంతో నెలవారీ ఆటో నిర్వహణ వ్యయాలు రూ. 178 కోట్ల నుంచి రూ. 105 కోట్లకు తగ్గినట్లు వివరించింది. కన్సాలిడేటెడ్ నిర్వహణ వ్యయాలు ప్రస్తుతం నెలకు రూ. 150 కోట్లు చొప్పున నమోదవుతున్నట్లు తెలియజేసింది. ఈ ఏడాది 3,25,000–3,75,000 వాహనాలు విక్రయించగలమని అంచనా వేసింది. తద్వారా రూ. 4,200–4,700 కోట్ల ఆదాయం సాధించనున్నట్లు అభిప్రాయపడింది. రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్) నుంచి సానుకూల ఇబిటాను కొనసాగించే వీలున్నట్లు తెలియజేసింది. కొత్తగా విడుదల చేసిన జెన్ 3 స్కూటర్లు క్యూ1 విక్రయాలలో 80 శాతం వాటా ఆక్రమించినట్లు వెల్లడించింది. రోడ్‌స్టర్ ఎక్స్ మోటార్‌సైకిళ్లు దేశవ్యాప్తంగా 200 స్టోర్లలో అందుబాటులోకిరాగా.. రానున్న పండుగల సీజన్‌లో అమ్మకాలు పుంజుకోనున్నట్లు ఆశిస్తోంది.

ఫలితాల నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ షేరు బీఎస్ఈలో 18 శాతంపైగా జంప్‌చేసి రూ. 47 వద్ద ముగిసింది.

విదేశీ విస్తరణలో హీరో మోటోకార్ప్


- ద్వితీయార్థంలో జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్‌లోకి ఎంట్రీ
- కంపెనీ చైర్మన్ పవన్ ముంజాల్ వెల్లడి



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ అంతర్జాతీయంగా కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) ద్వితీయార్థంలో జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, బ్రిటన్ మార్కెట్లలోకి అడుగు పెట్టే ప్రణాళికల్లో ఉంది. 2024–25 వార్షిక నివేదికలో షేర్‌హోల్డర్లను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కంపెనీ చైర్మన్ పవన్ ముంజాల్ ఈ విషయాలు తెలిపారు. హీరో ఫర్‌స్టార్టప్స్ తదితర సొంత వేదికల ద్వారా కొత్త తరం ఎంట్రప్రెన్యూర్లను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. కొత్త ఉత్పత్తులు, సేవలపై పరిశోధనలు సాగించేందుకు, వాటిని అభివృద్ధి చేసేందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దక్షిణాసియా నుంచి లాటిన్ అమెరికా వరకు అంతర్జాతీయ మార్కెట్లలో 2024–25లో 43 శాతం వార్షిక వృద్ధి సాధించినట్లు ముంజాల్ వివరించారు. రిటైల్‌లో వ్యూహాత్మక విస్తరణతో ఎలక్ట్రిక్ స్కూటర్ విడా అమ్మకాలు 200 శాతం పెరిగాయని చెప్పారు. ఇక లిస్టెడ్ కంపెనీ ఏథర్ ఎనర్జీతో భాగస్వామ్యం కట్టడమనేది దేశీయంగా ఈవీ చార్జింగ్ నెట్‌వర్క్‌ను, ప్రీమియం ఎలక్ట్రిక్ వాహనాల సెగ్మెంట్‌లో స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు దోహదపడినట్లు పేర్కొన్నారు. అటు అమెరికన్ సంస్థ జీరో మోటర్‌సైకిల్స్‌తో భాగస్వామ్యం ద్వారా సరికొత్త ప్రీమియం మోటర్‌సైకిల్ వస్తోందని చెప్పారు. యూలర్ మోటర్స్‌లో రూ. 510 కోట్ల పెట్టుబడి పెట్టడమనేది అంతర్జాతీయంగా ఎలక్ట్రిక్ త్రీ–వీలర్ సెగ్మెంట్లో తమ కార్యకలాపాల విస్తరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ప్రొఫెషనల్ ట్రేడర్ల కోసం 'గ్రో' కొత్త ప్లాట్‌ఫాం

న్యూఢిల్లీ: స్టాక్ బ్రోకింగ్ సంస్థ 'గ్రో' అనుభవజ్ఞులైన, ప్రొఫెషనల్ ట్రేడర్ల కోసం ప్రత్యేక ట్రేడింగ్ టెర్మినల్‌ను ప్రవేశపెట్టే యోచనలో ఉంది. '915' పేరుతో వ్యవహరిస్తున్న ఈ టెర్మినల్, దేశీయంగా ఈ కోవకు చెందిన ట్రేడింగ్ ప్లాట్‌ఫాంలలో మొట్టమొదటిది అవుతుందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. అధిక వాల్యూమ్స్‌తో ట్రేడ్ చేసే వారికి ఇది అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. వివిధ రకాల ట్రేడింగ్ స్టయిల్స్, డేటా వనరులకు అనుగుణంగా తమ డ్యాష్‌బోర్డులను కస్టమైజ్ చేసుకునేలా ఈ ప్లాట్‌ఫాం ఉంటుందని వివరించారు. అత్యధిక సామర్థ్యాలు, మరింత అధునాతన సాధనాలు, సంపూర్ణంగా కస్టమైజ్ చేసుకోతగిన విధంగా ఉండే వర్క్‌స్పేస్‌ను కోరుకునే వారికి అనువుగా ఈ టెర్మినల్ ఉంటుందని మార్కెట్ వర్గాలు తెలిపాయి.



హెచ్‌సీఎల్ టెక్ లాభం డౌన్

క్యూ1లో రూ. 3,843 కోట్లు • షేరుకి రూ. 12 డివిడెండ్



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 10 శాతం క్షీణించి రూ. 3,843 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 4,257 కోట్లు ఆర్జించింది. అధిక వ్యయాలు, క్లయింట్ దివాలా లాభాలను దెబ్బతీసినట్లు కంపెనీ పేర్కొంది. మొత్తం ఆదాయం మాత్రం 8 శాతం ఎగసి రూ. 30,349 కోట్లను తాకింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 12 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు రికార్డ్ డేట్ జూలై 18కాగా.. 28కల్లా చెల్లించనుంది. ఈ కాలంలో 1,984 మంది ఫ్రెషర్స్‌కు ఉపాధి కల్పించింది. అయితే త్రైమాసికవారీగా మొత్తం ఉద్యోగుల సంఖ్య 269 తగ్గి 2,23,151కు చేరింది.

3–5 శాతం వృద్ధి

పూర్తి ఏడాదికి ఆదాయంలో 3–5 శాతం వృద్ధి సాధించగలమని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. ఉద్యోగులు, ఇతర అంశాలలో పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ సి.విజయకుమార్ పేర్కొన్నారు. ఏఐ విభాగంలో మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణకు తెరతీసినట్లు తెలియజేశారు. గైడెన్స్‌ను సాధించే బాటలో భారత్‌కు వెలుపలగల ప్రాంతాలలో కేంద్రాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం, ఉద్యోగులను తగ్గించుకోవడం చేపట్టనున్నట్లు వివరించారు. తద్వారా మార్జిన్లను 18–19 శాతానికి పెంచుకోనున్నట్లు తెలియజేశారు. క్యూ1లో నిర్వహణ లాభ మార్జిన్లు 16.3 శాతానికి పరిమితమైనట్లు వెల్లడించారు. యుటిలైజేషన్ తగ్గడం, జెన్ఏఐ, జీటీఎం పెట్టుబడులు ప్రభావం చూపినట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు బీఎస్ఈలో 1 శాతం నష్టంతో రూ. 1,620 వద్ద ముగిసింది.

పీఎస్‌యూ టెల్కోలకు లైన్ క్లియర్

మిగులు ఆస్తుల విక్రయానికి మార్గదర్శకాలు



న్యూఢిల్లీ: పీఎస్‌యూ టెలికం దిగ్గజాలు బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఐటీఐలకు మద్దతుగా అత్యున్నత కమిటీ మార్గదర్శకాలకు తెరతీసింది. దీంతో వేలం లేకుండానే ఇతర ప్రభుత్వ రంగ కంపెనీలకు మిగులు భూమి, భవనాలను బదిలీ చేసేందుకు వీలు చిక్కనుంది. గత నెలలో సమావేశమైన సెక్రటరీల కమిటీ ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. టెలికం పీఎస్‌యూ సంస్థల ఆస్తులను సొంతం చేసుకోవాలనుకునే ఇతర ప్రభుత్వ రంగ కంపెనీలు సంబంధిత అనుమతులతోపాటు ఆసక్తి వ్యక్తీకరణ బిడ్‌ను దాఖలు చేయవలసి ఉంటుంది. అంతే కాకుండా క్లెయిమ్‌ను రిజిస్టర్ చేసుకునేందుకు ఆస్తుల సంకేత విలువలో 2 శాతం సొమ్మును డిపాజిట్ చేయవలసి ఉంటుంది. ఆయా ఆస్తుల మానిటైజేషన్‌కు సంబంధిత వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ వెలువడిన 90 రోజుల్లోగా వీటిని పూర్తి చేయవలసి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు తొలి ప్రాధాన్యతా హక్కును వినియోగించుకునే వీలుంటుంది. అయితే నోటిఫికేషన్ వెలువడిన 90 రోజుల తదుపరి ఇతర ప్రయివేట్ రంగ కంపెనీలకు ఆస్తులను విక్రయించే వెసులుబాటును బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, ఐటీఐ పొందుతాయి.

టాటా టెక్నాలజీస్ లాభం ప్లస్

క్యూ1లో రూ. 170 కోట్లు

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ టాటా టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 5 శాతం పుంజుకుని రూ. 170 కోట్లను అధిగమించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 162 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా నీరసించి రూ. 1,244 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో రూ. 1,269 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు రూ. 1,072 కోట్ల నుంచి రూ. 1,080 కోట్లకు నామమాత్రంగా పెరిగాయి. క్యూ1ను అప్రమత్తంగా ప్రారంభించినప్పటికీ క్లయింట్లు కంపెనీపట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నట్లు సీఈవో, ఎండీ వారెన్ హారిస్ పేర్కొన్నారు. వెరసి దీర్ఘకాలిక కట్టుబాట్లయిన ప్రొడక్ట్ ఇన్నోవేషన్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్‌ను కొనసాగించనున్నట్లు తెలియజేశారు. దీంతో ఆరు వ్యూహాత్మక డీల్స్ కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ప్రొడక్ట్ ఇంజినీరింగ్, ఎంబెడ్డెడ్ సాఫ్ట్‌వేర్, పీఎల్ఎమ్ సేవలకు వోల్వో కార్స్ వ్యూహాత్మక సరఫరాదారుగా ఎంపిక చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో టాటా టెక్ షేరు బీఎస్ఈలో 1.2 శాతం బలపడి రూ. 717 వద్ద ముగిసింది.





ట్రంప్ టారిఫ్‌లు.. మన ఎగుమతులకు మంచిదే

భారత్ కంటే చైనా, కెనడా, మెక్సికోపైనే అధిక ప్రభావం

- నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా మార్కెట్లో భారత ఎగుమతులు మరింత పోటీతత్వంగా మారినట్టు నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. చైనా, కెనడా, మెక్సికోలపై ట్రంప్ సర్కారు అధిక టారిఫ్‌లు విధించడం మనకు అనుకూలిస్తుందని పేర్కొంది. సంఖ్యా పరంగా, విలువ పరంగా అమెరికా మార్కెట్లో భారత ఎగుమతులకు గణనీయమైన అవకాశాలున్నట్టు తెలిపింది. ''30కు గాను 22 విభాగాల్లో భారత పోటీతత్వం పెరగనుంది. ఈ విభాగాల మార్కెట్ పరిమాణం 2,285 బిలియన్ డాలర్లుగా ఉంది''అని ఈ నివేదిక వెల్లడించింది. ఈ విభాగాల్లో అమెరికాకు చైనా, కెనడా, మెక్సికో ప్రధాన ఎగుమతిదారులుగా ఉన్నట్టు తెలిపింది. ఈ దేశాలపై 30 శాతం, 35 శాతం, 25 శాతం చొప్పున అధిక సుంకాల బాదుడుతో భారత ఎగుమతుల పోటీతత్వం పెరగనున్నట్టు అంచనా వేసింది. ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రికల్ మెషినరీ తదితర విభాగాల్లో మార్కెట్ వాటా పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది. ఇక 30కు గాను 6 విభాగాల్లో భారత పోటీతత్వంలో ఎలాంటి మార్పు ఉండబోదని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతుల్లో వీటి వాటా 32.8 శాతంగా (26.5 బిలియన్ డాలర్లు) ఉంటుందని తెలిపింది. ''ఆరు ఉత్పత్తుల విభాగాల్లో భారత్ 1-3 శాతం మేర అధిక టారిఫ్‌లను ఎదుర్కోనుంది. యూఎస్‌కు భారత ఎగుమతుల్లో 52 శాతం వాటా కలిగిన 78 ఉత్పత్తుల విభాగాల్లో పోటీతత్వం పెరగనుంది. 17 ఉత్పత్తుల విభాగాల్లో ఎలాంటి మార్పు ఉండదు''అని వివరించింది.

ఈ రంగాలకు సానుకూలం..

చైనా, కెనడా, మెక్సికోలపై టారిఫ్‌లతో పోల్చి చూస్తే.. భారత మినరల్స్, ఇంధనాలు, వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్స్, ఫర్నిచర్, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులకు ప్రయోజనం చేకూరనున్నట్టు నీతి ఆయోగ్ తన నివేదికలో విశ్లేషించింది. ఎంఎస్ఎంఈలకు మద్దతుగా నిలిచేందుకు, ఎగుమతుల పోటీతత్వాన్ని పెంచేందుకు వీలుగా ఉత్పత్తి అనుసంధాన ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని (పీఎల్ఐ) విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించింది. లెదర్, ఫుట్‌వేర్, ఫర్నిచర్, హ్యాండిక్రాఫ్ట్స్‌కు సైతం పీఎల్ఐ కింద మద్దతు ఇవ్వాలని పేర్కొంది. అలాగే, విద్యుత్ టారిఫ్‌లను తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించింది. దీనివల్ల తయారీ వ్యయాలు తగ్గుతాయని వివరించింది. ఐటీ, ఆర్థిక సేవలు, నైపుణ్య సేవలు, విద్యా రంగాలను దృష్టిలో పెట్టుకుని అమెరికాతో సేవల ఆధారిత వాణిజ్య ఒప్పందానికి కృషి చేయాలని సూచించింది.

ప్రేమతో టై... పెళ్లితో బ్రేక్!

మైదానంలో అలరించిన భారత క్రీడాకారులు పతకాలు, ట్రోఫీలతో పాటు అభిమానుల మనసుల్ని గెలుస్తారు. అలాగే తమ మనసు గెలిచిన వారితో మనసారా ఒక్కటవుతారు. టోర్నీల్లో లాగానే మొదట పరిచయంతో ప్రేమపెళ్లికి 'క్వాలిఫై' అవుతారు. తర్వాత 'మెయిన్ రౌండ్'లో ప్రేమించుకుంటారు. 'ఫైనల్'కు వచ్చేసరికి పెళ్లి చేసుకుంటారు. అయితే ఇక్కడితోనే 'పెళ్లి' టైటిల్‌కు శుభం కార్డు పడుతుందనుకుంటే తప్పులో కాలేసినట్లే! కొన్నాళ్లకు, కొన్నేళ్లకు కొన్ని క్రీడా జంటలకు 'విడాకులు'తో అశుభం కార్డు పడుతోంది. అలా ఈ కోవలో ఒక్క'టై'.. 'బ్రేక్' చేసుకున్న జంటల కథలు... - సాక్షి క్రీడా విభాగం

క్రీడాకారుల వివాహ బంధాల్లో విడాకుల పర్వం

తాజాగా సైనా-కశ్యప్‌ల పెళ్లికీ బీటలు

క్రీడాకారుల విజయాలు వార్తలవడం సహజం. విజయవంతమైన క్రేజీ స్టార్ల ప్రేమలు కూడా హాట్ న్యూస్‌లే! తర్వాత ఫారిన్ ట్రిప్పులు, చెట్టాపట్టాల్ అన్నీ కూడా మీడియా కంటపడకుండా ఉండవు. చివరకు పెళ్లి ముచ్చట ఇవన్నీ బాగానే ఉన్నా... కొందరి 'ప్రేమ-పెళ్లి-విడాకుల' తంతు పరిపాటిగా మారడమే క్రీడాకారుల దాంపత్య బంధాన్ని పలుచన చేస్తున్నాయి. తాజాగా వెటరన్ బ్యాడ్మింటన్ స్టార్‌ల జోడీ సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ తాము విడిపోతున్నట్లు ప్రకటించింది. గతంలో పాపులర్ షట్లర్‌లు గుత్తా జ్వాల, చేతన్ ఆనంద్‌లు బ్యాడ్మింటన్ కోర్టులో జోడీ కట్టి... తర్వాత పెళ్లి పీటలెక్కారు. కొన్నాళ్లకే కోర్టుకెక్కి విడాకులు తీసుకున్నారు. అయితే ఇటీవల 'టై బ్రేక్' జోడీల సంఖ్య ఎక్కువవుతోంది. వారి వివరాలివే...



సైనా కశ్యప్

సింధు మేనియా ముందువరకు సైనానే సూపర్‌స్టార్‌గా వెలుగొందింది. కామన్వెల్త్ క్రీడల్లో రెండుసార్లు చాంపియన్‌గా నిలిచింది. ఎన్నో సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచింది. ఒకప్పుడు క్రీడా వార్తల్లో టెన్నిస్‌లో సానియా మీర్జా, బ్యాడ్మింటన్‌లో సైనాల విజయాలే పతాక శీర్షికలయ్యేవి. 2012-లండన్ ఒలింపిక్స్‌లో సైనా కాంస్య పతకం గెలుచుకుంది అంతగా పాపులారిటీ సంపాదించుకున్న ఆమె... గోపీచంద్ అకాడమీలో శిక్షణ సందర్భంగా పారుపల్లి కశ్యప్‌ను ప్రేమించింది. వీరి ప్రేమాయణం 2018లో మూడుముళ్ల బంధంగా మారింది. ఏడడుగులు నడిచిన ఈ జంట ఏడేళ్లు పూర్తయ్యేసరికి తమ బంధానికి బైబై చెప్పింది.



సానియా షోయబ్

హైదరాబాదీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మహిళల టెన్నిస్‌లో మహారాణిగా వెలిగింది. సింగిల్స్‌లో గ్రాండ్‌స్లామ్ టోర్నీలాడిన ఆమె తదుపరి ఫిట్‌నెస్ సమస్యలతో డబుల్స్‌కు పరిమితమై గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచింది. ఆటతో... పాపులారిటీతో భారత మహిళా అథ్లెట్ల బ్రాండింగ్‌ను పెంచిన సానియా 2010లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షోయబ్ మాలిక్‌ను ప్రేమపెళ్లి చేసుకుంది. 14 ఏళ్ల తర్వాత గతేడాది ఉన్నపళంగా తామిద్దరం విడాకులు తీసుకున్నట్లు ప్రకటించి ఆశ్చర్యపరిచింది.

హార్దిక్ పాండ్యా నటాషా

భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సెర్బియన్ మోడల్ నటాషా స్టాంకోవిచ్ మనసుపడి మనువాడాడు. 2020లో కోవిడ్ సమయంలో ప్రపంచం మొత్తం లాక్‌డౌన్ అయిన సమయంలో తొలుత పెళ్లి చేసుకున్నారు. మళ్లీ 2023లో హిందూ, సెర్బియా మతాచారాల ప్రకారం మళ్లీ పెళ్లాడారు. కానీ ఇంతలా ఇష్టపడ్డ సెర్బియన్ నెచ్చెలితో పెళ్లి ముచ్చట కొన్నాళ్లకే ముగిసింది. 2024లో ఇద్దరు విడాకుల ప్రకటన చేశారు.



షమీ హసీన్ జహాన్

భారత సీనియర్ సీమర్ మొహమ్మద్ షమీ ప్రేమ పెళ్లి ముచ్చట వివాదాలు, ఆరోపణలతో నాలుగేళ్లకే క్లీన్‌బౌల్డయ్యింది. తనకు పరిచయమైన హసీన్ జహాన్‌తో కొంతకాలం ప్రేమాయణం జరిపిన తర్వాత 2014లో ఇద్దరు పెళ్లితో ఒక్కటయ్యారు. అయితే హసీన్ రచ్చకెక్కి మరీ గృహహింస కేసులు పెట్టి చివరకు 2018లో విడిపోయారు.





ధావన్ అయేషా

భారత క్రికెటర్ శిఖర్ ధావన్ సరిహద్దులు దాటిన ప్రేమ తదుపరి పెళ్లినాటి ప్రమాణాలు కూడా కొన్నేళ్ల తర్వాత గుదిబండగా మారడంతో చివరికి చెరోదారి చూసుకోవాల్సి వచ్చింది. మెల్‌బోర్న్‌లో స్థిరపడ్డ భారత సంతతికి చెందిన అయేషా ముఖర్జీతో మొదలైన పరిచయం కొన్నాళ్లకే ప్రణయానికి దారితీసింది. ధావన్ కంటే అయేషా ఏకంగా 12 ఏళ్లు పెద్ద వయస్కురాలు. అయితే ఈ వయస్సు ప్రేమకి, పెళ్లికి అడ్డంకి కాలేదు. 2012లో వివాహబంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట పెళ్లి తర్వాత మనస్పర్థలతో 2023లో విడిపోయింది.



చహల్ ధనశ్రీ

భారత క్రికెట్‌లో మణికట్టు స్పిన్నర్‌గా బక్కపలుచని యోధుడు యజువేంద్ర చహల్ కొన్నాళ్లు వెలుగు వెలిగాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఐపీఎల్‌లో తమ జట్లకు చిరస్మరణీయ విజయాలు అందించిన చహల్... సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ధనశ్రీ వర్మతో ప్రేమలో పడ్డాడు. వీరిజంట నెట్టింట 'మూడు రీల్స్... ఆరు జిగేల్స్'గా తెగ హల్‌చల్ చేసింది కొన్నాళ్లు! కానీ చిత్రంగా పెళ్లి మూణ్నాళ్ల ముచ్చటగానే చెదిరిపోయింది. ప్రేమ బాసలు, పెనవేసుకున్న ఊసులతో 2020లో మ్యారేజ్ చేసుకున్న చహల్-ధనశ్రీ వర్మ రెండేళ్లకే విడిపోయారు. 2022లో డివోర్స్ కార్డ్ వేశారు.

సన్‌రైజర్స్ బౌలింగ్ కోచ్‌గా వరుణ్ ఆరోన్

హైదరాబాద్: వచ్చే ఏడాది ఐపీఎల్ టోర్నీ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కొత్త బౌలింగ్ కోచ్‌ను నియమించుకుంది. జార్ఖండ్‌కు చెందిన భారత జట్టు మాజీ పేస్ బౌలర్ వరుణ్ ఆరోన్ 2026 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. గత సీజన్‌లో సన్‌రైజర్స్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న జేమ్స్ ఫ్రాంక్లిన్ (న్యూజిలాండ్) స్థానాన్ని వరుణ్ ఆరోన్ భర్తీ చేయనున్నాడు. 35 ఏళ్ల వరుణ్ ఆరోన్ 2011 నుంచి 2015 వరకు భారత జట్టు తరఫున 9 టెస్టులు ఆడి 18 వికెట్లు, 9 వన్డేలు ఆడి 11 వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే టోర్నీలో చివరిసారి ఆరోన్ జార్ఖండ్ తరఫున బరిలోకి దిగాడు. జార్ఖండ్ జట్టు నాకౌట్ దశకు చేరడంలో విఫలం కావడంతో ఆరోన్ తన క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం వరుణ్ ఆరోన్ టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నాడు.



భారత జట్టుకు భారీ ఓటమి

షెన్‌జెన్ (చైనా): ఆసియా కప్ మహిళల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత్‌కు తొలి పరాజయం ఎదురైంది. ఆదివారం మొదలైన ఈ టోర్నీలో తొలి రోజు కజకిస్తాన్ జట్టుపై 85-68 పాయింట్ల తేడాతో నెగ్గి శుభారంభం చేసిన భారత్‌కు రెండో రోజు ఓటమి ఎదురైంది. చైనీస్ తైపీతో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ 39-83 పాయింట్ల తేడాతో పరాజయం పాలైంది. తొలి క్వార్టర్‌లో 10 పాయింట్లు స్కోరు చేసిన టీమిండియా... రెండో క్వార్టర్‌లో తొమ్మిది పాయింట్లు... మూడో క్వార్టర్‌లో, నాలుగో క్వార్టర్‌లో భారత బృందం పది పాయింట్ల చొప్పున సాధించింది. భారత్ తరఫున అన్‌మోల్‌ప్రీత్ కౌర్ 8 పాయింట్లు, పుష్ప సెంథిల్ కుమార్ 7 పాయింట్లు, సత్య కృష్ణమూర్తి 5 పాయింట్లు స్కోరు చేశారు. బుధవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో తాహితి జట్టుతో భారత్ ఆడుతుంది.



సిరాజ్‌కు జరిమానా



లండన్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో మ్యాచ్ నాలుగో రోజు ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్‌ను అవుట్ చేసినప్పుడు... ప్రదర్శించిన స్పందనకు భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ శిక్షకు గురయ్యాడు. డకెట్‌ను అవుట్ చేసి అతని దగ్గరకు వచ్చి తీవ్రంగా ఉద్వేగం చూపించడంతో పాటు డకెట్ శరీరాన్ని తాకుతూ వెళ్లాడు. దీనిపై చర్య తీసుకుంటూ ఐసీసీ... సిరాజ్ మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించడంతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్‌ను అతని ఖాతాలో వేసింది.

టైటిల్ కోసం మరో ప్రయత్నం

నేటి నుంచి జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

- సింధు, లక్ష్య సేన్, సాత్విక్-చిరాగ్ శెట్టిలపైనే దృష్టి

టోక్యో: ఈ ఏడాది ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మరో టోర్నమెంట్‌కు సిద్ధమైంది. నేడు మొదలయ్యే జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో సింధు మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో దక్షిణ కొరియా ప్లేయర్, ప్రపంచ 14వ ర్యాంకర్ సిమ్ జు యున్‌తో సింధు ఆడనుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 16వ స్థానంలో ఉన్న సింధు ఈ ఏడాది ఇండియా ఓపెన్, ఇండోనేసియా మాస్టర్స్, ఆల్ ఇంగ్లండ్ ఓపెన్, స్విస్ ఓపెన్, మలేసియా మాస్టర్స్, సింగపూర్ ఓపెన్, ఇండోనేసియా ఓపెన్‌లతోపాటు ఆసియా చాంపియన్‌షిప్, సుదిర్మన్ కప్ టోర్నీలలోఆడింది. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరడమే ఈ సీజన్‌లో సింధు అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో సింధు విశేషంగా రాణిస్తేనే జపాన్ ఓపెన్‌లో ఆమెకు ఆశించిన ఫలితం లభిస్తుంది. మహిళల సింగిల్స్‌లో సింధుతో పాటు భారత్ నుంచి అనుపమ, ఉన్నతి హుడా, రక్షిత శ్రీ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ 7వ ర్యాంకర్ పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్)తో ఉన్నతి హుడా; రక్షిత శ్రీతో అనుపమ పోటీపడతారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి లక్ష్య సేన్ మాత్రమే బరిలో ఉన్నాడు. బుధవారం జరిగే తొలి రౌండ్‌లో చైనా ప్లేయర్ వాంగ్ జెంగ్ జింగ్‌తో లక్ష్య సేన్ ఆడతాడు.

పురుషుల డబుల్స్‌లో భారత్ నుంచి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి; హరిహరన్-రూబన్ కుమార్ జోడీలు పోటీపడుతున్నాయి. తొలి రౌండ్‌లో కాంగ్ మిన్ హియుక్-కి డాంగ్ జు (దక్షిణ కొరియా)లతో సాత్విక్-చిరాగ్; కిమ్ వన్ హో-సియో సెంగ్ జే (దక్షిణ కొరియా)లతో హరిహరన్-రూబన్ తలపడతారు. మహిళల డబుల్స్‌లో భారత్ నుంచి సెల్వం కవిప్రియ-సిమ్రన్; రుతపర్ణ-శ్వేతా పర్ణ పాండా జోడీలు ఆడుతున్నాయి.



తన కోచింగ్ బృందంతో టోక్యోలో సింధు

టి20 సిరీస్‌లోనూ దక్షిణాఫ్రికా శుభారంభం

తొలి మ్యాచ్‌లో 5 వికెట్లతో జింబాబ్వేపై జయభేరి

హరారే: రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్న దక్షిణాఫ్రికా ముక్కోణపు టి20 సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. సోమవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో సఫారీ జట్టు 5 వికెట్ల తేడాతో జింబాబ్వేపై విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. కెప్టెన్ సికందర్ రజా (38 బంతుల్లో 54; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీతో రాణించగా... బ్రియాన్ బెన్నెట్ (28 బంతుల్లో 30; 4 ఫోర్లు), రియాన్ బర్ల్ (20 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. ప్రొటీస్ బౌలర్లలో జార్జ్ లిండే 3 వికెట్లు తీశాడు. ఇన్‌గిడి, బర్గర్, పీటర్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 15.5 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసి గెలిచింది. ప్రిటోరియస్ (0), హెండ్రిక్స్ (11), కెప్టెన్ డసెన్ (16) ఇలా టాపార్డర్ బ్యాటర్లు జట్టు స్కోరు 38 పరుగులకే పెవిలియన్ చేరినప్పటికీ... రుబిన్ హెర్మన్ (37 బంతుల్లో 45; 5 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బ్రెవిస్ (17 బంతుల్లో 41; 1 ఫోర్, 5 సిక్స్‌లు) బాధ్యతగా ఆడి గెలిపించారు. బ్రెవిస్ భారీ షాట్లతో విరుచుకుపడటంతో 4.1 ఓవర్ల ముందే సఫారీ లక్ష్యాన్ని చేరుకుంది. రిచర్డ్ ఎన్‌గరవ, ట్రెవోర్ వాండు 2 వికెట్లు తీశారు. ఇదే వేదికపై 16న న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాల మధ్య రెండో మ్యాచ్ జరుగనుంది.



బ్రెవిస్

హడలెత్తించిన పేసర్లు

రెండో రోజు 15 వికెట్లు

- విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 143 ఆలౌట్
- ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 99/6

కింగ్‌స్టన్ (జమైకా): ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌ల మధ్య జరుగుతున్న డే-నైట్ మూడో టెస్టును పేస్ బౌలర్లు శాసిస్తున్నారు. రెండో రోజు ఆటలో ఏకంగా 15 వికెట్లు పడితే ఈ 15 వికెట్లను ఇరు జట్ల పేస్ బౌలర్లే పడగొట్టడం విశేషం. ఇక ఈ టెస్టులో ఆస్ట్రేలియా పైచేయి సాధించింది. ఓవరాల్‌గా 181 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి 16/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 52.1 ఓవర్లలో 143 పరుగులకే ఆలౌటైంది. జాన్ క్యాంప్‌బెల్ (36; 4 ఫోర్లు), షై హోప్ (23; 3 ఫోర్లు) మినహా ఇంకెవరూ కూడా రెండు పదుల స్కోరైనా చేయలేకపోయారు. వెస్టిండీస్ రెండో సెషన్‌లో 70 పరుగుల వ్యవధిలో ఏకంగా 7 వికెట్లను కోల్పోయింది. దీంతో కనీసం 150 పరుగుల మార్క్‌ను అందుకోలేకపోయింది. బొలాండ్ 3, కమిన్స్, హాజల్‌వుడ్ చెరో 2 వికెట్లు తీశారు. కాగా... తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కు 82 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన కంగారూ జట్టు ఆట నిలిచే సమయానికి 29 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. కామెరూన్ గ్రీన్ (65 బంతుల్లో 42 బ్యాటింగ్; 6 ఫోర్లు) నిలకడగా ఆడుతున్నారు. అతనొక్కడే విండీస్ పేస్‌కు తలవంచలేదు. మిగతా బ్యాటర్లలో ఎవరూ కూడా 16 పరుగులను మించి చేయలేకపోయారు. ఉస్మాన్ ఖాజా (14) సహా స్మిత్ (5), హెడ్ (16), వెబ్‌స్టర్ (13) ఇలా ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్‌కు చేరారు. అల్జారి జోసెఫ్ 3, షమర్ జోసెఫ్ 2 పడగొట్టారు.





చిన్నారుల ఆకలి కేకలు ▶ గాజా నగరంలో ఏర్పాటైన ఆహార పంపిణీ కేంద్రాల వద్ద సోమవారం పాత్రలు పట్టుకుని ఆహారం కోసం దీనంగా ఎదురుచూస్తున్న చిన్నారులు వీరంతా. గాజా ప్రాంతాన్ని రెండు నెలలుగా దిగ్బంధానికి గురి చేస్తూ కనీసం తాగునీటిని కూడా అందకుండా చేస్తున్న ఇజ్రాయెల్ కాఠిన్యానికి, పాలస్తీనియన్ల ఆకలి బాధకు చిహ్నాలు వీరు..!

ఆర్కిటిక్‌పై నియంత్రణకు పోటీ

- గ్రీన్‌లాండ్‌పై పట్టుకు అమెరికా యత్నం
- సైనిక స్థావరాలను బలోపేతం చేస్తున్న రష్యా
- మైనింగ్ మాటున ఆర్కిటిక్‌లో చైనా గూఢచర్యం
- పర్యావరణానికి ముప్పుగా వాతావరణ మార్పులు

భూమి ఎగువ భాగమైన ఉత్తర ధ్రువంలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఆర్కిటిక్‌పై నియంత్రణ కోసం గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. మరోవైపు రష్యా ఆర్కిటిక్‌లోని తన సైనిక స్థావరాలను ఆధునీకరిస్తోంది. ఇంకోవైపు చైనా ఐస్ బ్రేకర్లు అక్కడ సరికొత్త మార్గాలు తెరుస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత శీతల ప్రాంతమైన ఆర్కిటిక్ కోసం పెద్ద దేశాల మధ్య ముదురుతున్న ఈపోటీ ప్రపంచ భద్రతకే పెను ముప్పుగా మారుతోంది.

ఆర్కిటిక్‌పై పట్టు కోసం అగ్రరాజ్యాల మధ్య ఈ పోటీ ఎందుకో అర్థం కావాలంటే ఆ ప్రాంతాన్ని భూగోళం పై నుంచి చూసి అర్థం చేసుకోవాలి. ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభంలో గ్రీన్‌ల్యాండ్‌కు ఉత్తరాన ఉన్న మారుమూల ప్రాంతంలో థూలే అనే ప్రదేశంలో అమెరికా ఒక ముఖ్యమైన స్థావరాన్ని ఏర్పాటు చేసింది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినా ఆ ప్రదేశ ప్రాముఖ్యత తగ్గలేదు. గ్రీన్‌లాండ్ ఇప్పటికీ డెన్మార్క్‌లో భాగంగా అధీనంలోనే ఉంది. దాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకోవాలని అమెరికా ఎప్పటినుంచో యోచిస్తోంది. ట్రంప్ రెండోసారి గద్దెనెక్కాక ఈ ప్రయత్నాలు మరింత వేగవంతం చేశారు. అమెరికా రక్షణకోసం గోల్డెన్ డోమ్ వ్యవస్థను ఇటీవలే అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించారు. ఇలాంటి వ్యవస్థకు ముందస్తు హెచ్చరిక సైట్లు చాలా ముఖ్యమైనవి. అలా రక్షణ, దాడి రెండింటికీ పనిచేసే స్థావరంగా గ్రీన్‌లాండ్‌ను అమెరికా చూస్తోంది. ఇది చాలా కాలంగా రష్యాకు ఆందోళన కలిగిస్తోంది. అమెరికా ఏదైనా ముందడుగు వేస్తే అత్యంత ప్రభావితమయ్యేది రష్యానే. రష్యా భూభాగంలో ఐదో వంతు ఆర్కిటిక్‌లో ఉంది. ఇక ఆ దేశ తీరప్రాంతంలో సగానికి పైగా ఆర్కిటిక్ వెంబడే ఉంది. అందుకే ఆర్కిటిక్‌లో రష్యా కొన్నేళ్లుగా ఇబ్బడిముబ్బడిగా పెట్టుబడులు పెడుతోంది. నాగూర్‌స్కోయ్ వంటి తన వైమానిక స్థావరాలను యుద్ధ ప్రాతిపదికన ఆధునీకరిస్తోంది. ప్రచ్ఛన్న యుద్ధకాలం నుంచే నిర్వహిస్తున్న ఆ స్థావరాలను భారీ విమానాలను కూడా ఆపరేట్ చేయగలిగేలా తీర్చిదిద్దుతోంది. రష్యా అణు జలాంతర్గామి దళంలో ఎక్కువ భాగం కోలా ద్వీపకల్పంలో ఉంది. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యర్థిపై దాడికి వీలుగా వాటిని ఆర్కిటిక్‌లో మంచు కింద నిలిపి ఉంచుతుంది. ఇటు అమెరికా, అటు రష్యా చేస్తున్న ఈ ప్రయత్నాలు నాటో కూటమిలోని యూరప్ దేశాలను భయపెడుతున్నాయి. దాంతో ఈ ఉద్రిక్తతలను తగ్గించడంపై నార్వే దృష్టి పెటింది. ఆర్కిటిక్‌లో మరో కీలక ప్రాంతం స్వాల్బార్డ్ దీవులు. వాటిని నార్వే నియంత్రిస్తుంది. అయినా రష్యాతో సహా అనేక దేశాలు అక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్ మధ్య ఖాళీ ప్రదేశం కూడా కీలకమే. అట్లాంటిక్‌ను చేరుకోవడానికి రష్యన్ ఉత్తరాది నౌకాదళం ఈ జలాలను దాటాల్సి ఉంటుంది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ యు–బోట్లను ఎదుర్కోవడానికి గ్రీన్‌లాండ్‌లో అమెరికా సైనిక స్థావరాన్ని స్థాపించడానికి ఈ జలసంధే కారణం.

రేసులోకి బ్రిటన్

ఇటీవలి కాలంలో బ్రిటన్ కూడా ఆర్కిటిక్‌పై దృష్టి పెట్టింది. విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ మే చివరలో ఆర్కిటిక్‌ను సందర్శించారు. అక్కడ శత్రు కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడానికి ఐస్‌లాండ్‌తో కలిసి ఉమ్మడి పథకాన్ని ప్రకటించారు. రష్యన్ జలాంతర్గాములు, పడవలను ఆచూకీ కనిపెట్టడమే లక్ష్యంగా దీన్ని రూపొందించారు. కానీ జలాంతర్గాములు, సముద్ర గస్తీ, వైమానిక ముందస్తు హెచ్చరిక విమానాలు బ్రిటన్ లేని నేపథ్యంలో ఈ యత్నాలేవీ ఫలించేలా లేవు. ఇక ఆర్కిటిక్‌కు చాలా దూరంలో ఉన్న చైనా, తనను తాను ఆ ప్రాంతానికి అతి సమీప దేశంగా చెప్పుకుంటోంది. ఇటీవలి కాలంలో అక్కడ దూకుడు పెంచింది. అక్కడ మంచు విపరీతంగా కరగడం వల్ల ఉత్తరాది అంతటా కొత్త వాణిజ్య మార్గం ఏర్పడుతుండటం చైనాకు బాగా కలిసొస్తోంది. సూయజ్ కాల్వతో పోలిస్తే ఈ మార్గం దానికి బాగా అనుకూలం. అక్కడ విద్యుత్తు ప్రాజెక్ట్ ఏర్పాటుకూ చైనా ప్రయత్నిస్తోంది. అక్కడ ఐస్‌బ్రేకర్ల సముదాయాన్ని వేగంగా విస్తరిస్తోంది. మైనింగ్ సంస్థలు, విద్యా పరిశోధనల మాటున ఆర్కిటిక్‌లో చైనా గూఢచారులు బిజీగా గడుపుతున్నారు. ఇవన్నీ అమెరికా, రష్యాల్లో ఆందోళన పెంచుతున్నాయి.

డేంజర్ బెల్స్

ఇలా ఆర్కిటిక్‌పై పట్టు కోసం ఏ దేశానికి ఆ దేశం చేస్తున్న ప్రయత్నాలు అక్కడ విపరీతమైన వాతావరణ మార్పులకు కారణమవుతున్నాయి. 2040 నాటికి వేసవిలో ఈ ప్రాంతంలో మంచు ఆనవాలే ఉండకపోవచ్చని ఒక అధ్యయనం ఇప్పటికే హెచ్చరించింది. ఇలా మంచు కరగడం వల్ల ఖనిజాలు, చేపలు, ఇతర సముద్ర సంపద కోసం పోటీ పెరుగుతుంది. మరోవైపు షిప్పింగ్‌కు దారులు పెరుగుతాయి. ఈ ఆర్థిక పోటీ పెద్ద దేశాల మధ్య మరిన్ని తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీయవచ్చు. రష్యా ఆర్థిక ఉత్పత్తిలో దాదాపు పదోవంతు ఆర్కిటిక్ సహజ వనరుల నుంచే వస్తుంది. అక్కడ మంచు విపరీతంగా కరుగుతుండటం రష్యా భద్రతను డోలాయమానంలో పడేస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

27న 'కలాం కో సలాం'

సాక్షి, న్యూఢిల్లీ: భారత రత్న మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 10వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 27వ తేదీన 'కలాం కో సలాం'కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. బీజేపీ మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో యువతను ఆకర్షించేలా ప్రత్యేక ఈ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మోర్చా అధ్యక్షుడు జమాల్ సిద్ధిఖీ తెలిపారు. ఇందులో భాగంగా ఆవిష్కరణలు, అసాధారణ నైపుణ్యాలు, సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి స్ఫూర్తిదాయకంగా నిలిచిన మైనార్టీ వర్గాల యువతను 'కలాం స్టార్టప్ యూత్ అవార్డు 2.0'తో సత్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి సన్నాహకంగా ఈ నెల 16న ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మైనార్టీ మోర్చా ఇంఛార్జి దుష్యంత్ గౌతమ్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం, 17న సోషల్ మీడియా వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. స్టార్టప్ అవార్డు కోసం ఈ నెల 16 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా అవార్డులను ప్రదానం చేస్తామని సిద్ధిఖీ తెలిపారు.

బిహార్‌లో శాంతిభద్రతలు దారుణం: రాహుల్

న్యూఢిల్లీ: బిహార్ సీఎం నితీశ్ కుమార్ పదవిని కాపాడుకునే పనిలో ఉండగా, ఆయన కేబినెట్‌లోని బీజేపీ మంత్రులు కమీషన్లు గుంజే పనిలో బిజీ అయిపోయారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలో శాంతి భద్రతలు దారుణంగా క్షీణించాయనీ, దేశానికే నేర రాజధానిగా మారిందని వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ప్రభుత్వాన్ని మార్చడానికే కాదు, రాష్ట్రాన్ని కాపాడేందుకు ఓటు వేయాలని ఆయన ప్రజలకు సోమవారం ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. కాంటాక్ట్ హత్యలు పరిశ్రమగా మారిన బిహార్‌లో 11రోజుల వ్యవధిలో 31మంది హత్యకు గురయ్యారంటూ సంబంధిత వార్తల క్లిప్పింగ్‌ల స్క్రీన్‌షాట్లను ఆయన షేర్ చేశారు. గూండా రాజ్యంలో నిరుద్యోగ యువత హంతకులుగా మారుతున్నారన్నారు. ఇటీవల ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖెమ్కా పట్నాలోని తన నివాసం వద్దే తుపాకీ కాల్పులకు బలయ్యారని రాహుల్ గాంధీ గుర్తు చేశారు.

రష్యాకు 10 లక్షల మంది భారత కార్మికులు

మాస్కో: ఉక్రెయిన్‌తో మూడేళ్లుగా సాగుతున్న యుద్ధం కారణంగా రష్యాలో మానవ వనరుల కొరత ఏర్పడింది. దేశంలో కార్మికుల కొరతను భర్తీ చేసేందుకు భారత్ వైపు దృష్టి సారించింది. ఈ ఏడాది చివరికల్లా 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన భారత కార్మికులను రిక్రూట్ చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా యాకటెరిన్‌బర్గ్‌లో కొత్తగా కాన్సులేట్ జనరల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తోందని ఉరల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చీఫ్ అంద్రీ బెసెడిన్ ప్రకటించారు. రష్యాలోని ఉరల్ పర్వతాలకు సమీపంలోని యాకటెరిన్ బర్గ్ ప్రాంతం భారీ పరిశ్రమలకు కేంద్రస్థానం. అక్కడ సైనిక పరిశ్రమలూ భారీగానే ఉన్నాయి. రష్యా ప్రభుత్వ అంచనాల ప్రకారం 2030 నాటికి దేశంలో కార్మిక శక్తి కొరత 31 లక్షలకు పెరగనుంది. అందుకే, ఉత్తర కొరియా, శ్రీలంకల నుంచీ కార్మికులను రప్పించాలని ప్రణాళికలు వేసింది.

ఈదుకుంటూ స్కూల్‌కు

15 ఏళ్ల జార్ఖండ్ బాలిక ఆదర్శం

ఖుంటి: ఆ గ్రామాన్ని కలిపే రహదారిపై వంతెన వర్షాలకు దెబ్బతింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కర్ర నిచ్చెనను ప్రమాదకరమంటూ అధికారులు తీసేశారు. అయినా ఆ బాలిక అధైర్యపడలేదు. చదువుకోవాలనే తపన ముందు అడ్డంకులన్నీ ఓడిపోయాయి. స్కూలు బ్యాగును నెత్తిపై పెట్టుకుని ఈదుకుంటూ నదిని దాటి తడిచి నీళ్లు కారుతున్న దుస్తులతోనే స్కూలుకు వెళుతోంది. ఆ గ్రామంలోని మిగతా పిల్లలందరిదీ ఇదే పరిస్థితి. జార్ఖండ్‌లోని ఖుంటి జిల్లాలో ఈ ఘటన వెలుగు చూసింది. రాంచీ–ఖుంటి–సిండెగా రహదారిలో పెలోల్ గ్రామాన్ని కలుపుతూ బనాయ్ నదిపై ప్రభుత్వం 2007లో రూ.1.30 కోట్లతో వంతెన నిర్మించింది. చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలకు ఆ వంతెనే ఆధారం. జూన్ 19వ తేదీన సంభవించిన వరద తీవ్రతకు వంతెన పిల్లర్ ఒకటి దెబ్బతింది. దీంతో, వెదురుకర్రలతో తాత్కాలికంగా వంతెనను ఏర్పాటు చేసుకుని గ్రామస్తులంతా పెలోల్ చేరుకుంటున్నారు. కానీ, ప్రమాదకరంగా ఉందంటూ అధికారులు ఆ నిచ్చెనను తొలగించారు. కానీ, పెలోల్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న అంగర్బరీ గ్రామానికి చెందిన సునీత హోరా(పేరు మార్చారు) మాత్రం ఏమాత్రం భయపడలేదు. నెత్తిపై స్కూల్ బ్యాగు పెట్టుకుని నదిలో ఈదుతూ ఆవలి ఒడ్డుకు చేరుకుంటోంది. తడిచిన దుస్తులకు బదులుగా బ్యాగులో అదనంగా సిద్ధంగా ఉంచుకున్న డ్రెస్‌ను వేసుకుని స్కూలుకు వెళ్లేంది. ఇంటికి తిరిగి వెళ్లేటప్పుడూ ఇదే పరిస్థితి. దీంతో, వారంలో ఒకటీ రెండు సార్లు మాత్రమే స్కూలుకు వెళ్తున్నామని తెలిపింది. సునీత వచ్చే ఏడాది బోర్డు పరీక్షలు రాయాల్సి ఉంది. 'స్కూలుకెళ్లాంటే నదిలో కొంత భాగాన్ని ఈదటమే తప్ప మరో మార్గంలేదు. ఈదేటప్పుడు స్కూలు బ్యాగు నెత్తిపై పెట్టుకుంటా. కానీ, నా డ్రెస్ పూర్తిగా తడిచిపోతుంది. అందుకే, వచ్చేటప్పుడే ఎక్స్ ట్రా తెచ్చుకుంటా'అని ఆమె తెలిపింది. బోర్డు పరీక్షలకు ప్రిపేరయ్యే తన స్నేహితులదీ ఇదే పరిస్థితని వివరించింది. సాధారణంగా ఐదంటే ఐదే నిమిషాలు పట్టే ప్రయాణానికి ఇప్పుడు 12 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోందని, 40 నిమిషాల సమయం తీసుకుంటోందని విద్యార్థులు అంటున్నారు. రాంచీ నుంచి సిండెగా మీదుగా ఒడిశా వెళ్లే భారీ వాహనాలు, బస్సులు సైతం వంతెన దెబ్బతినడంతో ప్రత్యామ్నాయం మార్గంలో వెళ్తున్నాయి. వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు నిర్మించే పనిలో ఉన్నామని ఖుంటి సబ్ డివిజనల్ అధికారి దీపేశ్ కుమారి తెలిపారు. అయితే, ఆగకుండా కురుస్తున్న వానలతో పనులకు అవరోధం కలుగుతోందని చెప్పారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌వంతెన దెబ్బతినడంపై దర్యాప్తునకు ఆదేశించారు.

సాధ్యమైనంత మేర ప్రయత్నించాం...

ఇంతకన్నా చేయలేం..!

- యెమెన్‌లో కేరళ నర్సుకు రేపే ఉరి శిక్ష
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: యెమెన్‌లో 16వ తేదీన ఉరి కంబం ఎక్కనున్న కేరళ నర్సు నిమిషా ప్రియ(38)ను కాపాడటానికి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని కేంద్రం తెలిపింది. అయితే, ఆ దేశ సున్నిత పరిస్థితుల దృష్ట్యా పెద్దగా ఇంతకంటే ఏమీ చేయలేమని సోమవారం సుప్రీంకోర్టుకు వివరించింది. యెమెన్‌లో ప్రస్తుతమున్న హౌతీ తిరుగుబాటుదార్ల ప్రభుత్వానికి దౌత్యపరమైన గుర్తింపు సైతం లేదని వెల్లడించింది. 'సేవ్ నిమిష ప్రియ–ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్'వేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్ సేథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిమిషా ప్రియ ప్రాణాలను కాపాడేందుకు ఎంత వరకు వెళ్లాలో అంతవరకూ ప్రభుత్వం వెళ్లిందన్నారు. ఉరి శిక్ష అమలును కొంతకాలం పాటు వాయిదా వేయాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం యెమెన్‌లోని సంబంధిత అధికారికి లేఖ సైతం రాసిందన్నారు. ఎంతో పలుకుబడి కలిగిన కొందరు షేక్‌లతో సైతం చర్చలు జరిపిందన్నారు. మృతుడి కుటుంబం 'బ్లడ్ మనీ'స్వీకరించేందుకు అంగీకరిస్తేనే శిక్ష ఆగిపోయే అవకాశాలున్నాయని తెలిపారు. అయితే, అక్కడి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేందుకు మార్గం లేదని, ఇది చాలా సంక్లిష్టమైన వ్యవహారమని పేర్కొన్నారు. ప్రస్తుతానికి శిక్ష అమలును ఆపి వేసినట్లు మాత్రం అనధికార వర్గాల నుంచి ప్రభుత్వానికి సమాచారం ఉందని, ఇది ఎంత వరకూ నిజమో తెలియదని వెంకటరమణి తెలిపారు. తదుపరి విచారణను ధర్మాసనం 18వ తేదీకి వాయిదా వేసింది.

రంగంలోకి కేరళ మతపెద్ద

ఉరి శిక్ష అమలు గడువు సమీపించడంతో నిమిషా ప్రియను కాపాడేందుకు పలుకుబడి కలిగిన కేరళకు చెందిన సున్నీ ముస్లిం మత పెద్ద షేక్ అబూబకర్ అహ్మద్‌గా అందరికీ పరిచయమున్న కొంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్(94) రంగంలోకి దిగారు. గ్రాండ్ ముఫ్తీ ఆఫ్ ఇండియాగా పిలుచుకునే ఈయన యెమెన్‌లోని మతాధికారుల తోపాటు బాధిత తలాల్ అబ్దో మహ్దీ కుటుంబ సభ్యులతోనూ మట్లాడారు. బ్లడ్‌మనీ అంశంపై ఆయన చర్చించినట్లు సమాచారం. ఈ సమాచారాన్ని ఆయన సంబంధిత వర్గాలకు అందజేశారని తెలిసింది. తదుపరి పరిణామాలు తెలియాల్సి ఉంది.

ఎందుకు ఉరిశిక్ష?

కేరళకు చెందిన నిమిషా ప్రియ అనే నర్సు 2008లో యెమెన్ వెళ్లింది. 2014లో తలాల్ అబ్దో మెహదీ అనే యెమెన్ పౌరుడిని భాగస్వామిగా చేసుకుని సొంతంగా క్లినిక్‌ను ఏర్పాటు చేసింది. అక్కడి చట్టాల ప్రకారం.. విదేశీయులు వ్యాపారం చేయాలంటే స్థానికుల భాగస్వామ్యం తప్పనిసరి. కొంత కాలం తర్వాత నిమిషా ప్రియ, మెహదీ మధ్య గొడవలు మొదలయ్యాయి. 2017లో మెహదీ నీళ్ల ట్యాంక్‌లో శవమై కనిపించాడు. విషం ఇంజెక్షన్లు ఇచ్చిన మెహదీని హత్య చేసినట్లు నిమిషా ప్రియపై అభియోగాలు నమోదయ్యాయి. అరెస్టు చేసి రాజధాని సనా జైలుకు తరలించారు. 2018లో కోర్టు ఆమెను దోషిగా తేల్చి ఉరిశిక్ష ఖరారు చేసింది. అత్యున్నత కౌన్సిల్ సైతం 2023లో ఈ తీర్పును సమర్థించింది. చివరి ప్రయత్నంగా ప్రియ కుటుంబం 'బ్లడ్ మనీ'కింద బాధిత కుటుంబానికి రూ.8.6 కోట్లు పరిహారంగా ఇవ్వజూపింది. అయినా స్పందన లేదు. దీంతో, ఈ నెల 16న ఉరి శిక్ష అమలు అనివార్యం కానుంది.

మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా 18 నుంచి యువ ఆధ్యాత్మిక సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా పలు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 18– 20వ తేదీల్లో వారణాసిలో యువ ఆధ్యాత్మిక శిఖరాగ్ర సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇందులో దేశవ్యాప్తంగా 100 ఆధ్యాత్మిక సంస్థల నుంచి ఎంపిక చేసిన 500 మంది యువ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పలువురు నిపుణులు ప్రసంగిస్తారని, ప్రతినిధులు చర్చల్లో పాల్గొంటారని వెల్లడించారు. డ్రగ్స్ వాడకాన్ని అరికట్టేందుకు, బానిసలైన వారిని కాపాడేందుకు కార్యాచరణ వ్యూహాలను రూపొందిస్తారని మాండవీయ వివరించారు.

'సిరియా'పై ఇజ్రాయెల్ దాడులు

బస్రా అల్–హరీర్: సిరియాలో ద్రుజ్ మిలిటెంట్లతో పోరాడుతున్న ప్రభుత్వ బలగాలు, బెడోయిన్ గిరిజనులపై సోమవారం ఇజ్రాయెల్ వైమానిక దాడులకు దిగింది. స్వెయిదా ప్రావిన్స్‌లో స్థానిక మిలీషియాతో జరుగుతున్న పోరులో 30 మందికి పైగా చనిపోగా 100 మంది వరకు గాయపడ్డారని సిరియా ప్రభుత్వం తెలిపింది. అయితే, హక్కుల సంఘాలు మాత్రం 14మంది సైనికులు సహా కనీసం 89 మంది మృతి చెందారని పేర్కొంది. సున్నీ వర్గం బెడోయిన్ సాయుధులు, ద్రుజ్ గ్రూపుల మధ్య పోరు మొదలవ్వగా బెడోయిన్లకు మద్దతుగా ప్రభుత్వ బలగాలు యుద్ధ ట్యాంకులతో భారీగా రంగంలోకి దిగాయి. ద్రుజ్ వర్గం వ్యక్తిని బెడోయిన్లు దోచుకోవడంతో మొదలైన వివాదం పరస్పరం కిడ్నాపులు, దోపిడీలతో తీవ్రరూపం దాల్చినట్లు సమాచారం. ఇజ్రాయెల్‌తో ద్రుజ్ మైనారిటీ వర్గం అనుకూలంగా ఉంటోంది. ఇజ్రాయెల్ ఆర్మీలోనూ వీరున్నారు. గత మేలో సైతం ద్రుజ్ వర్గంపై ప్రభుత్వ అనుకూల ముఠాలు దాడి చేయగా ఇజ్రాయెల్ ఏకంగా సిరియా అధ్యక్ష భవనం సమీపంలోనే బాంబులు వేయడం తెల్సిందే.

దర్యాప్తు నివేదికతో మరిన్ని అనుమానాలు

- ఇప్పుడే నిర్ణయానికి రావడం తొందరపాటే
- అహ్మదాబాద్ ఘటనపై ఎయిరిండియా సీఈవో వ్యాఖ్య

న్యూఢిల్లీ: గత నెలలో అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర విమాన ప్రమాద ఘటనపై దర్యాప్తు అనంతరం మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఎయిరిండియా సీఈవో కాంప్‌బెల్ విల్సన్ పేర్కొన్నారు. పైలట్ల సామర్థ్యాన్ని కొట్టిపారేయలేమన్న ఆయన.. విమానంలో మెకానికల్, మెయింటెనెన్స్‌కు సంబంధించిన లోపాలేవీ ఈ నివేదిక పేర్కొనలేదని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఘటనపై ఇప్పుడే నిర్ణయానికి రావడం తొందరపాటే అవుతుందని అభిప్రాయపడ్డారు. 'ప్రాథమిక నివేదిక విడుదలతోపాటు ఘటనకు దారి తీసిన పరిస్థితులు, కారణాలపై అదనంగా మరిన్ని వివరాలు వెల్లడవుతున్నాయి. ఇది మరింత స్పష్టతను, మరిన్ని ప్రశ్నలను లేవనెత్తడం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించడం లేదు'అంటూ ఆయన తమ సిబ్బందికి పంపిన అంతర్గత మెమోలో పేర్కొన్నారు. ఇంధన నాణ్యతలోగానీ, టేకాఫ్ ప్రక్రియలోగానీ తేడాల్లేవన్నారు. అదేవిధంగా, ఇద్దరు పైలట్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్ష కూడా జరిగిందన్నారు. 'ప్రాథమిక నివేదికలో ప్రమాదానికి ఎలాంటి కారణం గుర్తించలేదు. ఎటువంటి సిఫారసులు చేయలేదు. పైపెచ్చు ఈ విచారణ ఇంకా కొనసాగుతోంది. అందుకే ఊహాగానాలకు తెరలేపవద్దు'అని కోరారు. తుది నివేదిక వెలువడే వరకు మరిన్ని సెనేషనల్ వార్తలు, వదంతులు వస్తాయనడంలో సందేహం లేదని వ్యాఖ్యానించారు. ఎయిరిండియా బోయింగ్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాసిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ)శనివారం ప్రాథమిక నివేదిక విడుదల చేయడం తెల్సిందే. టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే విమానం రెండు ఇంజన్ల ఫ్యూయల్ సప్లయ్ స్విచ్‌లు నిలిచినట్లు పైలట్ల మధ్య సంభాషణల ద్వారా వెల్లడైందని తెలిపింది.

ఫ్యూయల్ స్విచ్‌లను తనిఖీ చేయించండి: డీజీసీఏ

ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడమే అహ్మదాబాద్ ఘటనకు దారి తీసినట్లు తేలడంతో దేశీయ విమానయాన సంస్థలకు డీజీసీఏ కీలక ఆదేశాలిచ్చింది. ఆయా సంస్థలు తమ బోయింగ్ 787, 737 రకం విమానాల్లో ఇంధన స్విచ్ లాకింగ్ వ్యవస్థలను తనిఖీ చేయాలని స్పష్టం చేసింది. కాగా ఎయిరిండియా ప్రమాద నివేదికలోని కీలక విషయాలను ప్రభుత్వం వెల్లడించకమునుపే వాల్‌స్ట్రీట్ జర్నల్ వంటి అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఎలా తెలిసిపోయాయని శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంకా చతుర్వేది ప్రశ్నించారు.



గేటు దూకుతున్న ఒమర్ అబ్దుల్లా

కబరస్తాన్ గేటు దూకి.. అమరులకు నివాళులర్పించి..!

- జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా సాహసం

శ్రీనగర్: శ్రీనగర్‌లోని నక్షబంద్ సాహిబ్ కబరస్తాన్ వద్ద సోమవారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 1931 జూలై 13న డోగ్రా ఆర్మీ జరిపిన కాల్పుల్లో చనిపోయిన 22 మంది సమాధులు ఇందులోనే ఉన్నాయి. ముఖ్యనేతలెవరూ ఇక్కడికి నివాళులర్పించడానికి రాకూడదని యంత్రాంగం సీఎం ఒమర్ సహా పలువురు నేతలను ఆదివారం గృహ నిర్బంధంలో ఉంచింది. అయితే, సోమవారం సీఎం ఒమర్ సహా పలువురు నేతలు అక్కడికి చేరుకున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా ఆటోలో, విద్యామంత్రి సకినా ఇట్టూ స్కూటీపై వచ్చారు. కబరస్తాన్‌కు దారి తీసే రెండు వైపులా దారుల్నీ అధికారులు మూసివేశారు. ఖన్యార్ ప్రాంతానికి చేరుకున్న సీఎం ఒమర్ తన వాహనం దిగి అరకిలో మీటర్ దూరంలో ఉన్న కబరస్తాన్‌కు కాలి నడకన చేరుకున్నారు. కబరస్తాన్‌కు తాళంవేసి ఉంచడంతో ఇనుప గేటు పైకెక్కి లోపలికి చేరుకున్నారు. కొందరు నేతలు కూడా ఆయన్ను అనుసరించారు. కొద్దిసేపటికి అధికారులు గేట్లు తెరిచారు. దీంతో, ఫరూక్ అబ్దుల్లా తదితరులు కూడా వచ్చి అమరుల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఒమర్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ లెఫ్టినెంట్ మనోజ్ సిన్హా చర్యను తీవ్రంగా తప్పుబట్టారు. ఆదివారం గృహ నిర్బంధంలో ఉంచిన అధికారులు సోమవారం తనను ఎందుకు ఆపారంటూ మండిపడ్డారు. వాళ్లు మమ్మల్ని బానిసలని అనుకుంటున్నారు. కానీ, మేం ప్రజలు మాత్రమే సేవకులం. యూనిఫాంలో ఉన్న పోలీసులు చట్టం మర్చిపోతున్నారు. పరుగెత్తుతున్న మమ్మల్ని వెంటాడారు. మా చేతిలోని జెండాను చింపేయాలని చూశారు'అని ఆరోపించారు.

అమెరికాలో అగ్ని ప్రమాదం..9 మంది మృతి

ఫాల్ రివర్: అమెరికాలో మసాచుసెట్స్‌లోని ఫాల్ రివర్ ప్రాంతంలోని అసిస్టెడ్ లివింగ్ ఫెసిలిటీలో చోటుచేసుకున్న ఘోర అగ్ని ప్రమాదంలో 9 మంది మృతి చెందారు. మరో 30 మంది గాయపడ్డారు. ఇతరుల సాయం లేకుండా రోజువారీ పనులు సైతం చేసుకోలేని దివ్యాంగులు, వృద్ధులు ఈ ఫెసిలిటీలో 70 మంది ఉంటున్నారు. ఆదివారం రాత్రి 9.50 గంటల ప్రాంతంలో భవనం ముందు భాగంలో మంటలు, పొగ కమ్ముకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే సుమారు 50 మంది ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తలుపులు పగులగొట్టి లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకు వచ్చేందుకు ప్రయత్నించారు. మంటలు, పొగలు కమ్ముకోవడంతో భయపడిన కొందరు కిటికీలను పట్టుకుని వేలాడుతూ కేకలు వేశారు. అప్పటికే దట్టంగా కమ్ముకున్న పొగలో ఊపిరాడక తొమ్మిది మంది చనిపోయారు. చాలా మందిని రక్షించి ఆస్పత్రులకు తరలించారు. ఈ క్రమంలో ఐదుగురు ఫైర్ సిబ్బంది సైతం స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాద కారణాలపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు తెలిపారు.

ప్రాచీన కాలంలో ప్రధాన ఓడరేవు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

ప్రాచీన భారతదేశ పట్టణీకరణ

రాఖీగర్హీ, మొహంజొదారో, కాళీభంగన్, దోలవీరాలను పరిశీలించాక పట్టణ ప్రణాళిక విషయంలో ఆనాటి పట్టణాల్లో ఏకరూపత ఉన్నట్లు తెలుస్తోంది. నగరాల్లో పశ్చిమ వాయవ్య ప్రాంతాలు ఎత్తుగా ఉండి, తూర్పు, ఆగ్నేయ ప్రాంతాలు పల్లంగా కనిపిస్తున్నాయి. ఎత్తుగా ఉండే ప్రాంతాన్ని కోట అని పిలిచారు. కోట్‌డిజి వంటి వాటి ద్వారా కోట చుట్టూ ఆగడ్త ఉండటమే కాకుండా, కోట పై భాగంలో బురుజులున్నాయి అని తెలుస్తోంది. 12-14 అడుగుల ఎత్తు వరకు ప్రాకారాలు సురక్షితంగా ఉన్నట్లు అవగతమవుతోంది.

మొహంజొదారోలో స్నానవాటిక, రెండు స్థూపాలు, స్తంభ మండపం, కళాశాల భవనం వంటి నిర్మాణాలను గుర్తించారు. హరప్పాలో దిగువ భాగాన ఒక గ్రామం, ఒక దిబ్బ ఉండి, దిబ్బకు తూర్పు వైపున పోలీస్‌స్టేషన్ వంటి నిర్మాణ విశేషాన్ని కనుగొన్నారు. ప్రధాన వీధులు 4 నుంచి 6 మీటర్ల వరకు వెడల్పుతో ఉండేవి. రోడ్లన్నీ ఉత్తరం నుంచి దక్షిణం వైపుకు ఒకదానికొకటి లంబ కోణంలో ఉన్నాయి. లోథాల్ (గుజరాత్) వంటి పట్టణాల్లో కుమ్మరులు, లోహ కర్మ, శిలాకర్మలు చేసే వారి కార్ఖానాలు ఏర్పడ్డాయి.

పట్టణాలన్నింటిలో రోడ్ల పక్కన మురుగునీటి కాల్వలను నిర్మించారు. ఈ కాల్వల తయారీకి కాల్చిన ఇటుకలను ఉపయోగించారు. ఈ మురుగు నీటి కాల్వలను బాగు చేయడానికి అనువుగా నియమిత అంతరాల్లో మనిషి దిగడానికి కావాల్సిన రంధ్రాలను ఏర్పర్చారు. అదేవిధంగా ఎక్కువగా పారిన నీరు ఇంకడానికి చిన్న చిన్న గోతులను తవ్వారు.

ప్రత్యేక నిర్మాణాలు

మొహంజొదారోలో గొప్ప స్నాన వాటిక, స్తంభ మండపం, హరప్పాలో ధాన్యాగారాలు, లోథాల్‌లో ఓడరేవును గుర్తించారు. మొహంజొదారోలోని స్నానవాటిక 30×23×8 అడుగుల కొలతలతో నిర్మితమైంది. దీని గోడలు నీరు ఇంకకుండా ఏర్పడ్డాయి. దీనికి ఒకవైపు మెట్లవరుస, గ్యాలరీలా కూర్చోవడానికి వీలుగా నిర్మాణాలు ఉన్నాయి. దీనికి పైభాగంలో కొన్ని వరండాలు, గదులు కూడా ఉన్నాయి.

హరప్పాలోని ధాన్యాగారాలను 50×20 అడుగుల కొలతతో ఆరు నిర్మాణాలను నదీ తీరాన నిర్మించారు. రెండు వరుసల్లో మొత్తం 12 ధాన్యాగారాలు ఉన్నాయి. లోథాల్ ప్రసిద్ధ ఓడరేవు. దీన్ని నదికి జతపరుస్తూ కృత్రిమ కాల్వలను తవ్వారు. ఈ నిర్మాణాలన్నింటికి ఒకే కొలతతో కూడిన కాల్చిన ఇటుకలను వాడారు. ఇటుకలు 11×5.5×2.75 అంగుళాల్లో, 4:2:1 నిష్పత్తిలో పొడవు, వెడల్పు, మందాన్ని కలిగి ఉండేవి.

నగర వ్యవస్థపై సామాజిక ప్రక్రియల ప్రభావం

నాగరికత కాలాల్లోని కట్టడాల్లో బానిసలను అధిక సంఖ్యలో వినియోగించినట్లు వాల్టేర్ రూబెన్ అభిప్రాయం. ఇళ్ల పరిమాణాల్లోని మార్పులు, వివిధ విలాసాల ఉనికిని బట్టి కొందరు చరిత్రకారులు సమాజంలోని అంతరాలను ఊహించారు. సామాజిక ప్రక్రియలో ప్రయోజనాత్మక గమనశీలత.. పట్టణ నిర్మాణ వ్యవస్థ, ప్రణాళికలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేయగా నగర, గ్రామ సంబంధాలు పట్టణ వ్యవస్థ అస్తిత్వానికి దోహదపడ్డాయి. కానీ వ్యవసాయక వృత్తుల ప్రాముఖ్యత కలిగిన గ్రామీణ నిర్మాణాల గురించి ఎలాంటి ఆధారాలు లభించడం లేదు.

రెండో పట్టణీకరణ

క్రీ.పూ. 600-300 మధ్యకాలంలో గంగానది లోయలో చోటు చేసుకున్న పట్టణీకరణను భారత ఉపఖండంలో రెండో పట్టణీకరణగా పేర్కొంటారు. రాజ్‌గాట్, చిరంద్ తవ్వకాల్లో లభ్యమైన ఆధారాలను బట్టి ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతంలో, బీహార్ పశ్చిమ ప్రాంతంలో ఇనుము వినియోగం విస్తృతంగా ఉండేదని తెలుస్తోంది. ఈ ఇనుము వాడకం విశాల సామ్రాజ్య స్థాపనకు దారి తీసింది. ఈ సామ్రాజ్యాలన్నీ సైనికపరంగా ఆయుధ సంపత్తితో కూడుకొన్నవి. వీటిలో యుద్ధవీరుల వర్గం ప్రధాన పాత్ర పోషించింది. కొత్త వ్యవసాయ పనిముట్లు రైతులు అధిక ఉత్పత్తి చేయడానికి దోహదం చేశాయి. ఈ ఉత్పత్తులు పాలక వర్గ అవసరాలను తీర్చడమే కాకుండా అసంఖ్యాకమైన ఇతర నగరాలను పోషించాయి. ఈ భౌతిక వస్తు వినియోగశక్తి కోసల, మగధ సామ్రాజ్యాల విస్తరణకు దోహదం చేసింది. వైదికేతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఈ సామ్రాజ్యాల్లో కలిసిపోయారు. తద్వారా కొత్త సామ్రాజ్యాలు పరిపాలనా సంబంధమైన కొత్త సమస్యలను, సామాజికంగా ఉద్రిక్త పరిస్థితులను ఎదుర్కొన్నాయి.

పాళీ, సంస్కృత గ్రంథాల్లో పేర్కొన్న అనేక నగరాలు కౌశాంబి, శ్రావస్తి, అయోధ్య, కపిలవస్తు,



వారణాసి, వైశాలి, రాజగిరి, పాటలీపుత్రం మొదలైనవి తవ్వకాల్లో బయటపడ్డాయి. ఆవాసాలు, మట్టి నిర్మాణాల చిహ్నాలు కన్పించాయి. వాస్తవానికి ఇవి భారతదేశంలో రెండో నగరీకరణ ప్రారంభాన్ని సూచిస్తున్నాయి. మొత్తం దేశాన్ని పరిగణనలోకి తీసుకుంటే శ్రావస్తిలాంటి పెద్ద నగరాలు దాదాపు 20 వరకు ఉంటాయి. తర్వాత కాలంలో నగరాలు గణనీయంగా అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం గ్రీకు నుంచి అలెగ్జాండర్ సైన్యం భారతదేశానికి తరలి రావడమేనని గుర్తుంచుకోవాలి. దీని వల్ల అనేక వ్యాపార రవాణా మార్గాలు ఏర్పడ్డాయి. వాయవ్య భారతదేశం, పశ్చిమ ఆసియాల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపడ్డాయి.

నగర ఆర్థిక వ్యవస్థ

నగరాల ఆవిర్భావానికి కారణాలు (రాజకీయ, ఆర్థిక, మతపరమైనవి) విభిన్నంగా ఉన్నప్పటికీ చివరికి ఈ నగరాలన్నీ మంచి వ్యాపార కేంద్రాలుగా ప్రసిద్ధి పొందాయి. వాటిలో రకరకాల వృత్తి నిపుణులు, వ్యాపారులు స్థిరపడ్డారు. వీరు కొన్ని సంఘాలుగా ఏర్పడ్డారు. జాతక కథల్లో అంటే బుద్ధుడి పుట్టుకకు సంబంధించిన కథల్లో ఇలాంటి సంఘాలను దాదాపు 18 వరకు పేర్కొన్నారు. అందులో నాలుగు పేర్లు (వడ్రంగులు, కుమ్మరులు, తోలుపని చేసేవారు, చిత్రకారులు) మాత్రం ప్రత్యేకంగా ఉన్నాయి. ప్రతి సంఘం నగరంలో ఒక ప్రత్యేక ప్రాంతంలో నివసించేది. అంటే ఇలాంటి నివాసాలు, పరిశ్రమలు వృత్తుల స్థానికీకరణకు తోడ్పడటమే కాకుండా వారసత్వంగా తండ్రుల నుంచి వారి సంతానానికి సంక్రమించడానికి ఈ కళలు దోహదపడ్డాయి. సాధారణంగా వ్యాపారులంతా నగరాల్లోనే జీవించేవారు. కానీ వ్యాపారులు జీవనోపాధి కోసం రాజు జారీ చేసిన మాన్యాలు (భోగ గ్రామాలు) చేసుకోవడానికి గ్రామాలతో సంబంధం పెట్టుకోక తప్పలేదు. ఆర్థిక వ్యవస్థకు వ్యాపారులు చేస్తున్న సేవలను బట్టి పరమ నిరంకుశులైన రాజులు కూడా వారిని తగిన రీతిలో గౌరవించేవారు. వీటన్నింటినీ గమనిస్తే వృత్తి నిపుణులు, వ్యాపారులు నగరాల్లో ప్రధానమైన సామాజిక వర్గాలుగా అభివృద్ధిలోకి వచ్చారన్న విషయం అవగతమవుతోంది.

వృత్తి నిపుణులు తయారుచేసిన వస్తువులను వ్యాపారులు సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించేవారు. జాతక కథల్లో 500 బండ్లకు సరిపాయే వస్తువులు, వస్త్రాలు, దంతపు వస్తువులు, కుండలు మొదలైనవి తీసుకెళ్లినట్లు ప్రస్తావించారు. ఆ కాలంలో అన్ని ప్రధాన నగరాలు నదీ తీరాలకు ఆనుకునే ఉండేవి. వాటిని కలుపుతూ వ్యాపార మార్గాలు చాలా ఏర్పడ్డాయి. ఉదా॥ శ్రావస్తి పట్టణాన్ని కౌశాంబి, వారణాసి, కపిలవస్తు, కుశినార మొదలైన నగరాలతో అనుసంధానం చేశారు. లోహాలతో తయారైన నాణేలు మొట్టమొదట ఈ కాలంలోనే కన్పిస్తాయి. వైదిక గ్రంథాల్లో కనిపించే నిష్క, శతమాన అనే పదాలను నాణేల పేర్లుగానే గుర్తించినప్పటికీ అప్పటికే దొరికిన నాణేలు క్రీ.పూ. 6వ శతాబ్ది నాటి కంటే పాతవి మాత్రం కావు. ఈ కాలంలో మొట్టమొదటి దశలో నాణేలు చాలావరకు వెండితో తయారుచేశారు. కొన్ని రాగి నాణేలు కూడ లభించాయి. లోహ నాణేలపైన కొన్ని గుర్తులు అంటే.. కొండలు, చెట్లు, చేప, వృషభం మొదలైన చిహ్నాలతో రంధ్రాలు చేయడం వల్ల వీటిని రంధ్రపు గుర్తులున్న నాణేలనేవారు. పాళీ గ్రంథాలు ధనాన్ని విస్తారంగా ఉపయోగించేవారని, జీతభత్యాలు ధన రూపంలోనే చెల్లించేవారనీ పేర్కొన్నాయి.

అశోకుడికి ముందు రెండు శతాబ్దాల కిందటే ప్రారంభమైన లిపి కూడా వ్యాపారాభివృద్ధికి చాలా దోహదం చేసింది. ఈ కాలంలో గ్రంథాలన్నీ కొలతలకు సంబంధించిన సునిశిత పరిజ్ఞానాన్ని వివరించాయి. బహుశా ఇవి ఇళ్లు, భూముల సరిహద్దుల గుర్తింపులకు, నిర్మాణాలకు ఉపయోగపడి ఉంటాయి. ఆ విధంగా లేఖనం అనేది చట్టాలు, మతాచారాల సంకలనానికి మాత్రమే కాకుండా వ్యాపార వివరాలు, పన్నుల చెల్లింపు, విస్తృతమైన సైనిక ఉద్యోగుల వివరాలు రాసి పెట్టుకోవడానికి అవకాశం కల్పించింది. కానీ ఈ కాలంలో లిపి ఉండేదనే విషయానికి సంబంధించి ఎలాంటి పురావస్తు ఆధారాలు లేవు. అయితే ఈ ప్రాచీన రికార్డులను శిలలు, లోహపు ఫలకాలపై రాయకపోవడం వల్ల అవి నాశనమై ఉండొచ్చని అందుకే అవి అలభ్యాలని చెప్పొచ్చు.

మౌర్యుల తర్వాత పట్టణీకరణ

వ్యాపారం అభివృద్ధి చెందడం, ద్రవ్య ఆర్థిక విధానం విస్తరించడం పట్టణీకరణకు కారణభూతమయ్యాయి. చైనా యాత్రికులు తమ రచనల్లో పాటలీపుత్రం, వైశాలి, వారణాసి, కౌశాంబి, హస్తినాపురం, మధుర, ఇంద్రప్రస్థం మొదలైన నగరాలను పేర్కొన్నారు. కుషాణుల కాలంలో చిరండ్, సోన్‌పూర్, బక్సార్ (బీహార్), తూర్పు ఉత్తరప్రదేశ్‌లో ఖేరత్, మాసన్, ఉత్తరప్రదేశ్‌లో సోహ్‌గౌరా, భీటా, కౌశాంబి, శృంగవేర్‌పూర్, అంత్రజిఖేరా, మీరట్, మజఫర్‌పూర్ ప్రాంతాలు సంపదలతో తులతూగేవి. అదేవిధంగా పంజాబ్‌లోని జలంధర్, లూధియానా, రూపార్‌ల్లో కూడా కుషాణుల కాలం నాటి నిర్మాణాలు బయటపడ్డాయి. మొత్తం మీద కుషాణుల కాలంలో నగరీకరణ అత్యున్నత స్థాయికి చేరుకుంది. పశ్చిమ భారతదేశంలో మాళ్వా ప్రాంతాన్ని పరిపాలించిన శకుల నగరాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. వారి ప్రధాన నగరం ఉజ్జయిని. కౌశాంబి నుంచి మధుర, మధుర నుంచి పశ్చిమ తీర ప్రాంతానికి వచ్చే రెండు ప్రధాన రహదారులు ఉజ్జయినిలో కలవడం వల్ల ఆ నగరానికి అధిక ప్రాధాన్యత లభించింది. దీనికితోడు ఉజ్జయిని అతి విలువ కలిగిన ఆగేట్, కార్నిలియన్ రాళ్ల వ్యాపారానికి కేంద్రంగా ఉండేది. క్రీ.పూ. 200 నుంచి ఇక్కడ కార్నిలియన్, జాస్పర్ రాళ్లతో పూసల్ని తయారు చేసేవారని తవ్వకాలు నిరూపిస్తున్నాయి. క్షిప్రా నదీ గర్భంలో పుష్కలంగా ముడిసరుకు లభించడం వల్ల ఈ పరిశ్రమ గొప్పగా వర్ధిల్లింది.

శకులు, కుషాణుల యుగంలో శాతవాహనుల కాలంలో టగర్, పైఠాన్, ధాన్యకటకం, అమరావతి, నాగార్జునకొండ, బరూచ్, సొపారా, అరికమేడు, కావేరిపట్నం ప్రసిద్ధి చెందాయి. తెలంగాణలో ఫణిగిరి, మునుల గుట్ట, పోతన్ ప్రసిద్ధి చెందిన బౌద్ధ పట్టణాలని 'ప్లిని' అనే చరిత్రకారుడు తన రచనల్లో పేర్కొన్నారు.

గుప్తుల యుగం నాటి పట్టణీకరణ క్షీణత - ప్రభావం

6వ శతాబ్దం నుంచి వ్యాపారం తీవ్రంగా తగ్గుముఖం పట్టింది. రోమన్ సామ్రాజ్యంతో, పశ్చిమ దేశాలతో వ్యాపారం ఆగిపోయింది. 6వ శతాబ్దంలో ఇరాన్, బైజాంటియన్‌లతో పట్టువస్త్రాల వ్యాపారం ఆగిపోయింది, భారతదేశం.. చైనా, ఆగ్నేయ ఆసియాతో వ్యాపారం కొనసాగించడంలో దళారీలైన అరబ్బుల పాత్ర ప్రధానం. లాభాలు కూడా పూర్తిగా వారే పొందారు. వ్యాపారం క్రమక్రమంగా తగ్గుముఖం పట్టడంతో దేశంలో బంగారం నాణేలు పూర్తిగా తగ్గిపోయాయి. క్రమంగా పట్టణాలు శిథిలం కావడంతో మధుర, శ్రావస్తి, చరండ్, వైశాలి, పాటలీపుత్రం మొదలైన నగరాలు కాలగర్భంలో కలిసినట్లు తవ్వకాలు నిరూపిస్తున్నాయి. భారతీయ ఎగుమతులకు అవకాశాలు తగ్గడం వల్ల చేతివృత్తులవారు, వ్యాపారులు గ్రామీణ ప్రాంతాలకు తరలివెళ్లి వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించారు. 5వ శతాబ్దం చివరలో పట్టు నేసేవాళ్లు పశ్చిమ తీరం నుంచి మాళ్వా ప్రాంతంలోని మాండ్‌సోర్‌కు వలస వెళ్లారు.

పట్టణాలు శిథిలం కావడం వల్ల, వ్యాపారం తగ్గుముఖం పట్టి గ్రామాలు తమకు కావలసిన నూనె,ఉప్పు, సుగంధద్రవ్యాలు, బట్టలు మొదలైన వస్తువుల్ని సమకూర్చు కోవాల్సివచ్చింది. అందువల్ల ఉత్పత్తి కేంద్రాలు చిన్నవిగా మారి, తమ అవసరాలకు మాత్రమే పరిమితంగా ఉండిపోయాయి. తర్వాత సామాజిక నిర్మాణంలో కూడా కొన్ని మార్పులు వచ్చాయి. ఉత్తర భారతదేశంలో వైశ్యులను స్వతంత్ర రైతులుగా పరిగణించేవారు.

భూదానాలు రాజుకు, రైతుకు మధ్య భూస్వాములను సృష్టించాయి. అందువల్ల వైశ్యులు శూద్రులతో సమానమైపోయారు. ఈ మార్పు ఉత్తర భారతదేశం నుంచి బెంగాల్‌కు, దక్షిణ భారతదేశానికి విస్తరించింది.

వర్ణ వ్యవస్థలో మార్పులు

ధర్మశాస్త్రాల ప్రకారం వ్యక్తుల సామాజిక స్థాయి వర్ణంపై ఆధారపడి ఉండేది. ఒక వ్యక్తికి ఉన్న ఆర్థిక హక్కులు కూడా అతని వర్ణంపై ఆధారపడి ఉండేవి. పరిస్థితులు మారిన తర్వాత కొత్త భూస్వామ్య వర్గానికి ఇవ్వాల్సిన స్థానాన్ని గురించి ధర్మశాస్త్ర గ్రంథాల్లో మార్పులు చేశారు.

స్వరంబు కంటే పరంబైన స్వరంబునకు..

సంధులు - వ్యాకరణ పరిభాషలు

డీఎస్సీ అభ్యర్థులు శ్రద్ధగా చదవాల్సిన వ్యాకరణాంశాలు సంధులు, వ్యాకరణ పరిభాషలు. వీటిపై ఎక్కువ ప్రశ్నలు రావచ్చు. స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజ్ పండిట్స్ అభ్యర్థులందరూ వీటిని తప్పకుండా అధ్యయనం చేయాలి.

సంధులు: I.సంస్కృత సంధులు, II.తెలుగు సంధులు.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి 2. గుణ సంధి
3. వృద్ధి సంధి 4. యణాదేశ సంధి
5. జశ్త్వ సంధి 6. శ్చుత్వ సంధి
7. అనునాసిక సంధి 8. విసర్గ సంధి
9. పరసవర్ణ సంధి 10. పరరూప సంధి

II. **తెలుగు సంధులు:**

1. ఉత్వ సంధి 2. ఇత్వ సంధి
3. అత్వ సంధి 4. యడాగమ సంధి
5. టుగాగమ సంధి 6. రుగాగమ సంధి
7. దుగాగమ సంధి 8. నుగాగమ సంధి
9. ద్విరుక్తటకార సంధి 10. సరళాదేశ సంధి
11. గ, స, డ, ద, వా దేశ సంధి
12. ఆమ్రేడిత సంధి 13. పుంప్వాదేశ సంధి
14. త్రిక సంధి 15. పడ్వాది సంధి
16. ప్రాంతాది సంధి 17. లు, ల, నల సంధి

సంధులకు సంబంధించి ఒక పదాన్నిచ్చి దాన్ని సరిగా విడదీయమని అడుగుతారు. లేదా విభజించిన రూపాన్నిచ్చి సరిగా కలుపమని అడుగుతారు. సంధి సూత్రాలు రాయాల్సిన అవసరం లేకపోయినా అవగాహన కోసం సూత్రాలు తెలుసుకోవడం మంచిది.

సంస్కృత సంధులు

1. సవర్ణదీర్ఘ సంధి

అ-ఇ-ఉ-ఋలకు అవే అచ్చులు పరమైనా వాటి దీర్ఘాలు ఏకాదేశమవడాన్ని సవర్ణ దీర్ఘ సంధి అంటారు.

ఉదా: రామ + ఆజ్ఞ = రామాజ్ఞ
మహి + ఈశుడు = మహీశుడు
గురు + ఉపదేశం = గురూపదేశం
పితృ + ఋణం = పితౄణం

2. గుణ సంధి: అకారానికి ఇ-ఉ-ఋలు పరమైతే క్రమంగా ఏ-ఓ-అర్‌లు ఏకాదేశ మవడాన్ని గుణసంధి అంటారు.

ఉదా: సూర్య + ఉదయం = సూర్యోదయం
మహా + ఈశ్వరుడు = మహేశ్వరుడు
ఇతర + ఇతర = ఇతరేతర
రాజ + ఋషి = రాజర్షి

3. వృద్ధి సంధి: అకారానికి ఏ, ఐలు పరమైతే ఐకారాన్ని; ఓ, ఔలు పరమైతే ఔకారాన్ని; ఋ, ౠలు పరమైతే ఆర్ ఏకాదేశమవడాన్ని వృద్ధి సంధి అంటారు. ఐ, ఔలను వృద్ధులు అంటారు.

ఉదా: భువన + ఏక = భువనైక
అఖండ + ఐశ్వర్యం = అఖండైశ్వర్యం
పాప + ఓఘం = పాపౌఘం
పరమ + ఔషధం = పరమౌషధం
ఋణ + ఋణం = ఋణార్ణం

4. యణాదేశ సంధి: ఇ-ఉ-ఋలకు అసవర్ణాచ్చులు పరమైతే క్రమంగా య-వ-రలు ఆదేశమవడాన్ని యణాదేశ సంధి అంటారు. ''ఇకోయణచిః'' : ఇక్కులకు (ఇ-ఉ-ఋ) యణ్ణులు (య-వ-ర) పరమవుతున్నందు వల్ల ఇది యణాదేశ సంధి.

ఉదా: జయంతి + ఉత్సవం = జయంత్యుత్సవం
హిందూ + ఆర్యులు = హింద్వార్యులు
పితృ + ఆర్జితం = పిత్రార్జితం

5. జశ్త్వ సంధి: క-చ-ట-త-పలకు అచ్చులు కానీ, హ-య-వ-ర-లు కానీ, వర్గ తృతీయ చతుర్థ పంచమాక్షరాలు కానీ, పరమైతే గ, జ, డ, ద, బలు ఆదేశమవడాన్ని జశ్త్వసంధి అంటారు.

ఉదా: తత్ + అరణ్య భూములు = తదరణ్య భూములు
అచ్ + అంతం = అజంతం
వాక్ + ఈశుడు = వాగీశుడు
కకుప్ + అంతం = కకుబంతం
సత్ + భావం = సద్భావం

6. శ్చుత్వ సంధి: సకారత వర్గాలకు శకారచ వర్గాలు పరమైనప్పుడు శకారచ వర్గాలే ఆదేశమవడాన్ని శ్చుత్వ సంధి అంటారు.
(సకార-త థ ద ధ న) (త వర్గం)
(శకార - చ ఛ జ ఝ ఞ) (చ వర్గం)
తపస్ + శమము = తపశ్శమము
(స్(స)+శ= శ్శ)
సత్+చరిత్ర=సచ్చరిత్ర(త్ (త) - చ= చ్చ)
సత్+జనుడు= సజ్జనుడు(త్ (త)+జ= జ్జ)
విద్యుత్+శక్తి=విద్యుచ్ఛక్తి(త్ (త)+ శ=చ్ఛ)

7. అనునాసిక సంధి: వర్గ ప్రథమాక్షరాలకు (క-చ-ట-త-ప)'న, మ' అనునాసికాలు పరమైనప్పుడు ఆయా వర్గానునాసికాలు వికల్పంగా రావడాన్ని అనునాసిక సంధి అంటారు. మయాది ప్రత్యయాలకు నిత్యముగా వస్తాయి.

ఉదా: వాక్ + మయం = వాఙ్మయం
(క-ఙ=నిత్యం)
జగత్ + నాటకం = జగన్నాటకం
= జగద్నాటకం (వికల్పం)
(అనునాసికం రానప్పుడు వర్గ తృతీయాక్షరం (త-ద-వికల్పం)
మృట్ + మయం = మృణ్మయం,
మృడ్మయం (టకు అనునాసికం రానప్పుడు డకారం వికల్పం)

8. విసర్గ సంధి: అకారం పూర్వముందున్న విసర్గకు వర్గ తృతీయ, చతుర్థ, పంచమాక్షరాలు అ-హ-య-వ-ర-లలు పరమైనప్పుడు విసర్గ - ఓకారంగా మారుతుంది. (వర్గ తృతీయాక్షరాలు- గ, జ, డ, బ, లు వర్గ చతుర్థాక్షరాలు (ఘ, ఝ, ఢ, ధ, భ, లు)

వర్గ పంచమాక్షరాలు: ఙ- ఞ- ణ- న-మ్ (అనునాసికాలు) హ-య-వ-ర-లలు పరమైనప్పుడు మాత్రమే విసర్గ ఓకారంగా మారుతుంది. కొన్నిసార్లు రేఫ వస్తుంది.

ఉదా: అయః + మయం = అయోమయం
(యః + మ = ఓ)
ఇతః + అధికం = ఇతోధికం (తః+అ = ఓ)
చతుః + ఆత్మ = చతురాత్మ
(తుః + ఆ = 'ర' కారం వచ్చింది)
తపః ఫలము = తపఃఫలం (ఫ కారం వర్గ ద్వితీయాక్షరమైనందు వల్ల విసర్గలో మార్పు లేదు).

9. పర సవర్ణ సంధి: పదాంతం ముందున్న 'త'కారానికి లకారం పరమైనప్పుడు 'ల'కారమే ఆదేశంగా రావడాన్ని పర సవర్ణ సంధి అంటారు. (త్ - తకారానికి లకారం వస్తే 'ల్ల' కారం వస్తుంది)

ఉదా: భగవత్ + లీల = భగవల్లీల
(త్ + ల = ల్ల)
ఉత్ + లేఖనం = ఉల్లేఖనం (త్+లే = ల్లే)
విద్యుత్ + లత = విద్యుల్లత (త్ + ల = ల్ల)
సుహృత్ + లాభం = సుహృల్లాభం
(త్ + లా = ల్లా)

10. పరరూప సంధి: హల్లుల్లోని అకారానికి అకారం పరమైతే రెండో పదంలోని మొదటి అచ్చు ఏకాదేశమవుతుంది. దీన్ని పరరూపసంధి అంటారు.

ఉదా: సార + అంగము = సారంగము
(ర్ + అ = రకారంలోని అకారానికి 'అ' కారం పరమై రకారానికి దీర్ఘం వచ్చింది)
సీమ + అంతము = సీమంతము
(మ్ + అకారానికి అకారం పరమై అకార దీర్ఘం వచ్చింది)



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

తెలుగు సంధులు

1. ఉత్వ సంధి: ఉత్తునకచ్చుపరమైనప్పుడు సంధి నిత్యముగా వస్తుంది (హ్రస్వమైన ఉకారానికి మాత్రమే ఇది వర్తిస్తుంది)

ఉదా: రాముడు + అతడు = రాముడతడు (డులోని ఉ కారానికి అకారం పరమై అకారం నిత్యంగా వచ్చింది)

- ప్రథమేతర విభక్తి శత్రర్థక చువర్ణంబులందున్న ఉకారానికి సంధి వైకల్పికం అవుతుంది.
- ప్రథమా విభక్తి కాకుండా ఇతర విభక్తుల్లో శత్రర్థకమైన 'చున్' ప్రత్యయంలోని ఉకారానికి సంధి వైకల్పికమని అర్థం.
- వైకల్పికమంటే ఒకసారి సంధి జరిగిన రూపం , మరోసారి సంధి జరగని రూపం సిద్ధిస్తుంది.

ఉదా: నన్నున్ + అడిగె = నన్నడిగె
(సంధి జరిగిన రూపం)
నన్నునడిగె (సంధి జరగని రూపం)

2. ఇత్వ సంధి: ఇత్తునకు సంధి వైకల్పికం. ఏమ్యాదుల్లో ఇత్తునకు సంధి వైకల్పికం (ఏమి, మరి, అది, అవి, ఇది, ఇవి, కాన్) మొదలైనవి ఏమ్యాదులు.

ఉదా: ఏమి + అంటివి:
ఏమంటివి, (సంధి జరిగిన) ఏమియంటివి (సంధి జరుగని)

- మధ్యమ పురుష క్రియలందిత్తునకు సంధి నిత్యం.

ఉదా: చూచితిరి + ఇపుడు = చూచితిరిప్పుడు

- క్త్వార్థంబైన ఇత్తునకు సంధి లేదు.
భూతకాలిక అసమాపక క్రియ క్త్వార్థంబు

ఉదా: వచ్చి + ఇచ్చి = వచ్చియిచ్చి (సంధి లేనందువల్ల యడాగమ రూపం)

3. అత్వ సంధి: అత్తునకు సంధి బహుళం.

- బహుళమంటే నిత్యం, నిషేధం, వైకల్పికం, అన్యవిధం అనే నాలుగు కార్యాలు ఉంటాయి.

నిత్యంగా జరిగేవి

ఉదా: రామ + అయ్య = రామయ్య (నిత్యం)

సంధి జరగని నిషేధ రూపం

ఉదా: దూత + ఇతడు = దూతయితడు
(యడాగమ రూపం)

వైకల్పికంగా జరగడం: సంధి జరిగిన రూపం, సంధి జరగని యడాగమ రూపం రెండూ వస్తాయి.

ఉదా: మేన + అల్లుడు = మేనల్లుడు
(సంధి జరిగిన రూపం)
మేనయల్లుడు (సంధి జరుగని యడాగమ రూపం)

అన్యవిధం: సూత్రంలో సూచించని విధంగా కొన్ని హల్లులు వచ్చి చేరతాయి.

ఉదా: తామర + ఆకు = తామరప్రాకు
పుగాగమం అన్య విధంగా వచ్చి చేరింది.

4. యడాగమ సంధి: సంధి లేని చోట స్వరంబు కంటే పరంబైన స్వరంబునకు యడాగమంబగు. సంధి జరిగే అవకాశం లేనప్పుడు పర స్వరానికి ముందు 'య్' కారం ఆగమంగా వచ్చి చేరుతుంది.

ఉదా: వెల + (య్) ఆలు = వెలయాలు
మా + (య్) అమ్మ = మాయమ్మ

5. టుగాగమ సంధి: కర్మధాయంలో ఉత్తునకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబగుతుంది.

వివరణ: నామవాచక, విశేషణాలకు సంబంధించిన సమాసం కర్మధారయ సమాసం. ఇందులో పరస్వరానికి ముందు 'ట్' కారం ఆగమంగా వస్తుంది.

ఉదా: కఱకు+ (ట్) అమ్ము = కఱకుటమ్ము

- కర్మధారయమున పేర్వాది శబ్దాలకు అచ్చు పరమైనప్పుడు టుగాగమంబువిభాషనగు.

పేర్వాదులు: పేరు, పొదరు, చిగురు, తలిరు.

ఉదా: పేరు + ఉరము = పేరుటురము
(టుగాగగం రానప్పుడు)

6. రుగాగమ సంధి: కర్మధారయంబున 'పేరాది' శబ్దాలకు 'ఆలు' శబ్దం పరమైనప్పుడు రుగాగమంబగు.

పేరాది శబ్దాలు: పేద, బీద, ముగ్ధ, కొమ, జవ, మనుమ, ఐదవ మొదలైనవి.

ఉదా: పేద (ర్) + ఆలు = పేదరాలు
పరస్వరానికి ముందు 'ర్' కారం చేరి పేదరాలు రూపం వచ్చింది.
మనుమ(ర్) + ఆలు = మనుమరాలు

- కర్మధారయంబున తత్సమ పదాలకు 'ఆలు' శబ్దం పరమైనప్పుడు అత్వంబునకు ఉత్వంబు రుగాగమవుతుంది.

(**తత్సమ శబ్దాలు:** ధీర, గుణవంత, ధనవంత, సంపన్న, గంభీర, ధైర్యవంత మొదలైనవి)

ఉదా: ధీర + ఆలు = ధీరు+ ర్ + ఆలు
= ధీరురాలు
గుణవంత + ఆలు =
గుణవంతు + ర్ +ఆలు= గుణవంతురాలు

7. దుగాగమ సంధి: నీ- నా- తన శబ్దాలకు ఉత్తర పదంబు పరమైనప్పుడు దుగాగమంబు విభాషనగు.

ఉదా: నా + (దు) విభుడు = నాదువిభుడు
(సంధి జరిగిన రూపం)
నా విభుడు (సంధి జరగని రూపం)
తన + (దు) కోపం = తనదు కోపం
(సంధి జరిగిన రూపం)
తన కోపం (సంధి జరగని రూపం)

8. నుగాగమ సంధి: ఉదంత తద్ధర్మార్థ విశేషణానికి అచ్చుపరమైనప్పుడు నుగాగమంబగు.

తద్ధర్మార్థకాలు: భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో జరిగే క్రియలు. హ్రస్వమైన ఉకారం చివర ఉన్న తద్ధర్మార్థక క్రియలకు అచ్చుపరమైతే నుగాగమం వస్తుందని సూత్రార్థం.

ఉదా: చేయు + (న్) ఎడ = చేయునెడ
వ్రాయు + (న్) అది = వ్రాయునది

- షష్ఠీ తత్పురుష సమాస మందలి ఉకార, ఋకారంబులకు అచ్చుపరమైనప్పుడు నుగాగమంబగు.

ఉదా: రాజు + (న్) ఆనతి = రాజునానతి
చెరువు + (న్) ఉదకం = చెరువునుదకం

9. ద్విరుక్తటకార సంధి: కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దముల 'ఱ, డ'లకు అచ్చు పరమైనప్పుడు ద్విరుక్తటకారం ఆదేశమవుతుంది.

ఉదా: కు (ఱు) (ట్ట్)+ ఉసురు = కుట్టుసురు
చిఱు + (ట్ట్) ఎలుక = చిట్టెలుక
కడు + (ట్ట్) ఎదురు = కట్టెదురు
నడు + (ట్ట్) ఇల్లు = నట్టిల్లు
నిడు + ఊర్పు = నిట్టూర్పు

వివరణ: ద్విరుక్తటకారమంటే ద్విత్వటకారమని అర్థం. ద్విత్వటకారం ఆదేశంగా వచ్చి ఈ రూపాలు వచ్చాయి.

10. సరళాదేశ సంధి: ద్రుత ప్రకృతికం మీది పరుషాలకు సరళములగు.

ఉదా: పూచెను + కలువలు, పూచెను గలువలు: పరుషమైన కకారం సరళంగా (గ) మారింది.

- ఆదేశ సరళాలకు ముందున్న ద్రుతానికి బిందు సంశ్లేషణలు విభాషనగు. పూచెను + గలువలు - పూచెంగలువలు; పూచెన్గలువలు: పూచెనుగలువలు, పూచెఁగలువలు అనే నాలుగు రూపాలు వస్తాయి. సమాసములందు స్వత్వ సంశ్లేషణ రూపాలుండవు. అర సున్నా రూపం మరో సూత్రంతో నిషేధానికి గురైంది. 'పూచెంగలువలు' అనే ఒక్క రూపం మాత్రమే మిగులుతుంది.

11. గ, స, డ, ద, వా దేశ సంధి:

1. ప్రథమం మీది పరుషాలకు గ, స, డ, ద, వలు బహుళముగానగు. ప్రథమావిభక్తిలో ఉన్న పదాలకు పరమైన పదాల్లో ఉన్న పరుషాలకు (కచటతపలకు క్రమంగా గ, స, డ, వలు) బహుళంగా వస్తాయి.

ఉదా: వాడు + కొట్టె = వాడు గొట్టె
అపుడు + చనియె = అపుడుసనియె

2. ద్వంద్వ సమాసాల్లో పదాలపై పరుషాలకు గ, స, డ, ద, వలు ప్రాయికంగా వస్తాయి.

ఉదా: తల్లి + తండ్రి = తల్లిదండ్రులు

3. తెనుగుల మీది సాంస్కృతిక పరుషాలకు గ, స, డ, ద, వలు రావు. తెలుగు పదాలకు పరంగా వచ్చిన తత్సమ పదాల్లోని పరుషాలకు గ, స, డ, ద, వలు రావు.

ఉదా: వాడు + కంసారి = వాడు కంసారి
వీడు + చక్రపాణి = వీడు చక్రపాణి
(ఈ ఉదాహరణలో క, చ అనే పరుషాలకు గ,స,లు రాలేదు)

12. ఆమ్రేడిత సంధి:

1. అచ్చునకు ఆమ్రేడితం పరమైనప్పుడు సంధి తరచుగానగు. ద్విరుక్తం పదరూపం ఆమ్రేడితం. ఒక పదాన్ని రెండుసార్లు ఉచ్చరించినప్పుడు రెండోసారి ఉచ్చరించినదాన్ని ఆమ్రేడితమంటారు.

ఉదా: ఔర + ఔర (ఆమ్రేడితం) ఔరౌర
ఆహా + ఆహా = ఆహాహా

2. ఆమ్రేడితం పరమైనప్పుడు కడాదుల తొలి అచ్చు మీది వర్ణంబులకెల్లా అదంతంబగు ద్విరుక్తటకారంబగు (**కడాదులు:** కడ, చివర, తుద, మొదలు, తెరువు, నడుమ మొదలైనవి)

ఉదా: క(డ)ట్ట + కడ = కట్టకడ
చివ(ట్ట)ర + చివర = చిట్టచివర
కడాదుల్లో తొలి అచ్చు తర్వాత వర్ణాలన్నింటికీ లోపం వచ్చి వాటి స్థానంలో అదంతమైన ద్విత్వట్టకారం వచ్చింది.

3. అందదుకు ప్రభృతులు యథా ప్రయోగంబుగా గ్రాహ్యములు.

ఉదా: అందుకు + అదుకు = అందదుకు
చెర + చెర = చెచ్చెర లాంటి రూపాలు యథావిధిగా గ్రహించవచ్చని చిన్నయ సూరి అభిప్రాయం.

13. పుంప్వాదేశ సంధి: కర్మధారయమందలి ము వర్ణానికి 'పుంపు'లగు ము వర్ణానికి 'పువర్ణం' బిందు పూర్వక పువర్ణం(ంపు) రెండు రూపాలు వస్తాయి.

ఉదా: సరసము + మాట = 1. సరసపు మాట
2. సరసంపు మాట
విరసము + వచనం = 1. విరసపు వచనం
2. విరసంపు వచనం

14. త్రిక సంధి:

1. ఆ, ఈ, ఏ అనే సర్వనామాలను త్రికములు అంటారు. **ఉదా:** ఆ + కన్య
2. త్రికంబు మీది అసంయుక్త హల్లునకు ద్విత్వం బహుళంగా వస్తుంది.
ఉదా: ఆ + క్కన్య
3. ద్విరుక్తంబగు హల్లు పరమైనప్పుడు ఆచ్చికంబగు దీర్ఘం హ్రస్వం అవుతుంది.

ఉదా: ఆ + క్కన్య = అక్కన్య మూడు సూత్రాలతో - అక్కన్య రూపం వస్తుంది.

మొట్టమొదటి భారతీయ అణు రియాక్టర్

భారతదేశం - శక్తి సంపద

శక్తి ఒక ముఖ్య వనరు మాత్రమే కాకుండా ఆధునిక కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రథమ కారకం. ఒక దేశం వ్యవసాయకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి శక్తి సంపద ఎంతో అవసరం. ప్రస్తుతం మానవ జీవితం శక్తి వనరులపై ఎంతో ఆధారపడింది. మానవ జీవితావసరానికి రూపొందించే ప్రతి వస్తు ఉత్పత్తి ఈ శక్తిపైనే ఆధారపడి ఉంటుంది. శక్తి వనరులను రెండు రకాలుగా విభజించొచ్చు. అవి


1. సంప్రదాయ శక్తి వనరులు/తరిగిపోయే శక్తి వనరులు
2. సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు

1. సంప్రదాయ/తరిగిపోయే శక్తి వనరులు:

- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తిని ఉత్పత్తి చేసే యురేనియం, థోరియం వంటి ఖనిజాలు మొదలైన వాటిని సంప్రదాయ శక్తి వనరులు అంటారు.
- వీటి నిల్వలు ప్రకృతిలో నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే ఉన్నందున వాడుతూ ఉంటే క్రమేణా తరిగిపోతాయి.
- ఇవి తరిగిపోతే మానవుడు పునరుద్ధరించ లేడు. కాబట్టి వచ్చే తరాలను దృష్టిలో పెట్టుకొని వీటిని క్రమబద్ధంగా వినియోగించుకోవాలి.

2. సంప్రదాయేతర/తరిగిపోని శక్తి వనరులు:

- నీరు, సౌరశక్తి, పవన శక్తి, వేలా తరంగాలు, భూతాప శక్తి మొదలైన వాటిని సంప్రదాయేతర శక్తి వనరులుగా పరిగణిస్తారు.
- ఇవి ప్రకృతిలో నిరంతరం లభ్యమవుతాయి. కాబట్టి తరిగిపోవడమనే సమస్యే లేదు.
- అయితే వీటిని శక్తి ఉత్పాదకతకు ఉపయోగించుకోవాలంటే సాంకేతికాభివృద్ధితో మాత్రమే సాధ్యపడుతుంది.
- మనదేశంలో నేలబొగ్గు, చమురు, కర్ర బొగ్గు, నీరు ప్రధాన శక్తి వనరులు. సూర్యరశ్మి, గాలి మొదలైన వనరుల వాడకం ఇప్పుడిప్పుడే అభివృద్ధి దశలో ఉంది. అలాగే అణుశక్తి కూడా మంచి అభివృద్ధి దశలో ఉందని చెప్పొచ్చు. వీటన్నింటిలోనూ బొగ్గు చాలా ముఖ్యమైన శక్తి ఉత్పాదక వనరు. ఆ తర్వాత స్థానం జలశక్తి ఆక్రమిస్తుంది.
- మనదేశంలో మొదటిసారి విద్యుచ్ఛక్తి తయారీ డార్జిలింగ్ (పశ్చిమ బంగా)లో 1897లో ప్రారంభమైంది. ఆ తర్వాత 1902లో కర్ణాటకలోని శివసముద్రం వద్ద జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- స్వాతంత్ర్యానంతరం 'విద్యుచ్ఛక్తి చట్టం 1948'లో ప్రవేశపెట్టి విద్యుచ్ఛక్తిని ప్రభుత్వ రంగ పరిధిలోకి తెచ్చారు.
- 1975లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, 'నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్'ల ఏర్పాటుతో దేశంలో విద్యుచ్ఛక్తి రంగంలో గణనీయమైన అభివృద్ధి జరిగింది.
- మనదేశంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి 1947లో 1400 మెగావాట్లు ఉంటే, 2005-06 నాటికి 1,19,607 మె.వాట్లకు చేరింది.



థర్మల్ విద్యుత్

- బొగ్గు, నీటి ఆవిరి ఆధారంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను థర్మల్ విద్యుత్ అంటారు. దేశంలో సుమారు 73 శాతం ఉత్పత్తితో థర్మల్ విద్యుత్ మొదటి స్థానంలో ఉంది.
- థర్మల్ విద్యుత్‌ను ఎక్కువగా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఉత్పత్తి చేస్తున్నాయి.
- వేయి మెగావాట్ల కంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పవర్ స్టేషన్‌ను సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటారు. ఇవి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ఆధ్వర్యంలో ఉంటాయి.

భారతదేశంలో సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లు

ఎస్టీపీఎస్	రాష్ట్రం
1. సింగ్రౌలి	ఉత్తరప్రదేశ్
2. దాద్రి	ఉత్తరప్రదేశ్
3. రీహాండ్	ఉత్తరప్రదేశ్
4. వూంచహార్	ఉత్తరప్రదేశ్
5. సింహాద్రి	ఆంధ్రప్రదేశ్
6. రామగుండం	తెలంగాణ
7. వింద్యాచల్ -1	మధ్యప్రదేశ్
8. వింద్యాచల్-2	మధ్యప్రదేశ్
9. కోర్బా	ఛత్తీస్‌గఢ్
10. కహల్‌గావ్	బీహార్
11. తాల్చేర్	ఒడిశా
12. కాయంకుళం	కేరళ
13. ఫరక్కా	పశ్చిమ బంగా

- 4000 మె.వాట్ల కంటే ఎక్కువ థర్మల్ విద్యుత్ సామర్థ్యం ఉంటే వాటిని 'అల్ట్రా మెగా పవర్ ప్లాంట్' (యూఎంపీపీ) అంటారు.

భారతదేశంలో అల్ట్రా మెగా పవర్ ప్లాంట్స్

యూఎంపీపీ	రాష్ట్రం
1. ముంద్రా	గుజరాత్
2. తాద్రి	కర్ణాటక
3. గిర్యా	మహారాష్ట్ర
4. ససన్	మధ్యప్రదేశ్
5. ఇబ్ నదీ లోయ	ఒడిశా
6. కృష్ణపట్నం (నెల్లూరు)	ఆంధ్రప్రదేశ్

అణు విద్యుత్

అణు విద్యుదుత్పత్తికి అవసరమైన యురేనియం, థోరియం, ఇల్మనైట్, మోనజైట్ ఖనిజాలు భారతదేశంలో తగినంతగా లభిస్తున్నాయి.

- జార్ఖండ్‌లోని రాణి మేఖలలో, రాజస్థాన్‌లోని 'ఆరావళి' పర్వత ప్రాంతంలో యురేనియం లభిస్తోంది.
- బీహార్‌లో గయ, రాజస్థాన్‌లో జైపూర్, ఉదయ్‌పూర్, ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు జిల్లాల్లో యురేనియం నిల్వలున్నాయి.
- జార్ఖండ్‌లోని 'జాదుగూడ'లో యురేనియాన్ని శుద్ధి చేసే ప్లాంట్ ఉంది.
- కేరళ తీరం వెంట ఉన్న మోనజైట్ ఇసుకల్లో థోరియం నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి.
- ప్రపంచంలోని థోరియం నిక్షేపాల్లో 50 శాతంపైగా భారతదేశంలోనే ఉన్నాయి.
- ప్రస్తుతం భారతదేశ అణు విద్యుత్ సామర్థ్యం 4780 మె.వా. ఇది దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఉత్పత్తిలో సుమారు 3 శాతం.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

- ప్రపంచంలో అణు విద్యుత్‌ను ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం ఫ్రాన్స్.

భారతదేశంలోని అణు విద్యుత్ కేంద్రాలు

1. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం (టీఏపీఎస్) (మహారాష్ట్ర):

- భారతదేశంలో ఏర్పాటు చేసిన మొదటి అణు విద్యుత్ కేంద్రం.
- 1969, అక్టోబర్ 28న దీన్ని స్థాపించారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు – అప్సర.
- ఈ కేంద్రం అణు విద్యుత్ సామర్థ్యం – 1400 మె.వాట్లు.

2. రావత్ భటా అణు విద్యుత్ కేంద్రం (ఆర్ఏపీఎస్) (రాజస్థాన్):

- ఈ కేంద్రాన్ని పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు.
- 1973, డిసెంబర్ 16న రాజస్థాన్‌లో నెలకొల్పారు.
- 'కోటా అణు విద్యుత్ కేంద్రం' అని కూడా అంటారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 1180 మె.వాట్లు.

3. కల్పకం అణు విద్యుత్ కేంద్రం (ఎంఏపీఎస్) (తమిళనాడు):

- 1984, జనవరి 24న తమిళనాడులోని కల్పకం వద్ద ఏర్పాటు చేశారు.
- మద్రాస్ అటామిక్ పవర్ స్టేషన్ (ఎంఏపీఎస్) అని, 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' అని కూడా అంటారు.
- ఇక్కడ ఉన్న అణు రియాక్టర్ పేరు – కామిని, ఈ రియాక్టర్ ద్వారా ప్లాటినాన్ని ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం – 440 మె.వా.

4. నరోరా అణు విద్యుత్ కేంద్రం (ఎన్ఏపీఎస్) (ఉత్తరప్రదేశ్):

- ఉత్తరప్రదేశ్‌లోని నరోరా వద్ద 1991, జనవరి 1న దీన్ని ఏర్పాటు చేశారు.
- దీని ద్వారా ప్రధానంగా ఢిల్లీకి విద్యుత్‌ను అందిస్తున్నారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

5. కాక్రపార అణు విద్యుత్ కేంద్రం (కెఏపీపీ) (గుజరాత్):

- గుజరాత్‌లోని కాక్రపార ప్రాంతంలో 1993, మే 6న నెలకొల్పారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 440 మె.వా.

6. కైగా అణు విద్యుత్ కేంద్రం (కెపీపీ) (కర్ణాటక):

- కర్ణాటక రాష్ట్రంలోని 'కైగా' ప్రాంతంలో 2000, నవంబర్ 16న స్థాపించారు.
- అణు విద్యుత్ సామర్థ్యం 850 మె.వా.
- తమిళనాడులోని 'కూడంకుళం' వద్ద రష్యా సహాయంతో వేయి మెగావాట్లతో రెండు అణు రియాక్టర్లను నిర్మిస్తున్నారు.
- అణు విద్యుత్ కర్మాగారంలో మితకారిగా 'భారజలం'ను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చు.
- భారతదేశంలో 1962లో మొట్టమొదటి 'భారజల కేంద్రాన్ని' 'నంగల్' (ఉత్తరప్రదేశ్)లో ఏర్పాటు చేశారు.

భారతదేశంలో భారజల కేంద్రాలు

భారజల కేంద్రం	రాష్ట్రం
1. కోటా	రాజస్థాన్
2. తాల్చేర్	ఒడిశా
3. థాల్	మహారాష్ట్ర
4. బరోడా	గుజరాత్
5. ట్యుటికోరిన్	తమిళనాడు
6. హజీరా	మధ్యప్రదేశ్
7. మణుగూరు	తెలంగాణ

మాదిరి ప్రశ్నలు

1. మొట్టమొదటి భారతీయ అణు రియాక్టర్ పేరు?
   1) ఊర్వశి
   2) కామిని
   3) రోహిణి
   4) అప్సర
2. యురేనియం శుద్ధి ప్లాంట్‌ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) ట్రాంబే
   2) తారాపూర్
   3) జాదుగూడ
   4) కల్పకం
3. కామిని అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
   1) కల్పక్కం అణు విద్యుత్ కేంద్రం
   2) తారాపూర్ అణు విద్యుత్ కేంద్రం
   3) కైగా అణు విద్యుత్ కేంద్రం
   4) నరోరా అణు విద్యుత్ కేంద్రం
4. సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్టీపీఎస్) అంటే?
   1) 4000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   2) 1000 మె.వా. కంటే ఎక్కువ గల ప్రాజెక్టు
   3) 1000 మె.వా. కంటే తక్కువ గల ప్రాజెక్టు
   4) ఏదీకాదు
5. 'ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్' ఎక్కడ ఉంది?
   1) మహారాష్ట్ర 2) ఉత్తరప్రదేశ్
   3) తమిళనాడు 4) గుజరాత్
6. వీటిలో ఏది సంప్రదాయ వనరు కాదు?
   1) బొగ్గు 2) ముడిచమురు
   3) సౌర శక్తి 4) అణు శక్తి
7. మనదేశంలో మొట్టమొదటిసారిగా (1897) విద్యుచ్ఛక్తి ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   1) శివ సముద్రం 2) డార్జిలింగ్
   3) తాల్చేర్ 4) నంగల్
8. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   1) 1948 2) 1962
   3) 1980 4) 1975
9. 'రీహాండ్' సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఉత్తరప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) కేరళ
10. దేశంలో నాలుగో అణు విద్యుత్ కేంద్రం 'నరోరా' ఎక్కడ ఉంది?
    1) గుజరాత్ 2) రాజస్థాన్
    3) తమిళనాడు 4) ఉత్తరప్రదేశ్
11. వీటిలో ఏ శక్తి వనరు సంప్రదాయేతర శక్తి వనరు కాదు?
    1) సూర్యరశ్మి
    2) అణుశక్తి
    3) పవన శక్తి
    4) వేలా తరంగాలు
12. వీటిలో థర్మల్ పవర్ స్టేషన్‌ల్లో సరి కానిది?
    1) ఉత్తరప్రదేశ్ – దాద్రి
    2) పశ్చిమ బెంగాల్ – ఫరక్కా
    3) ఛత్తీస్‌గఢ్ – వూంచహార్
    4) కేరళ – కాయంకుళం
13. ససన్ థర్మల్ ప్రాజెక్టు ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మహారాష్ట్ర 2) మధ్యప్రదేశ్
    3) కర్ణాటక 4) ఒడిశా
14. భారతదేశంలో మొట్టమొదటి భారజల కేంద్రాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1975 2) 1948
    3) 1962 4) 1972
15. 'కోటా' భారజల కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) రాజస్థాన్ 2) ఒడిశా
    3) మహారాష్ట్ర 4) గుజరాత్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 2; 5) 3; 6) 3; 7) 2; 8) 4; 9) 1; 10) 4; 11) 2; 12) 4; 13) 2; 14) 3; 15) 1.

The greatest capacity for data transmission..

1. UNIVAC stands for:
   a) Universal Automatic Computer
   b) Universal Array Computer
   c) Unique Automatic Computer
   d) Unvalued Automatic Computer
   e) None of the above
2. The basic operations performed by a computer are ___
   a) Arithmetic operation
   b) Logical operation
   c) Storage and relative
   d) All of the above
   e) None of the above
3. The two major types of computer chips are ___
   a) External memory chip
   b) Primary memory chip
   c) Microprocessor chip
   d) Both b and c
   e) None of the above
4. Microprocessors as switching devices are for which generation computers?
   a) First b) Second
   c) Third d) Fourth
   e) None of the above
5. What is the main difference between a mainframe and a super computer?
   a) Super computer is much larger than mainframe computers
   b) Super computers are much smaller than mainframe computers
   c) Supercomputers are focused to execute few programs as fast as possible while mainframe uses its power to execute as many programs concurrently
   d) Supercomputers are focused to execute as many programs as possible while mainframe uses its power to execute few programs as fast as possible
   e) None of the above
6. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
   a) Extended Binary Coded Decimal Interchange Code
   b) Extended Bit Code Decimal Interchange Code
   c) Extended Bit Case Decimal Interchange Code
   d) Extended Binary Case Decimal Interchange Code
   e) None of the above
7. The brain of any computer system is ___
   a) ALU b) Memory
   c) CPU d) Control unit
   e) None of the above
8. Storage capacity of magnetic disk depends on:
   a) Tracks per inch of surface
   b) Bits per inch of tracks
   c) Disk pack in disk surface
   d) All of the above
   e) None of the above
9. The two kinds of main memory are:
   a) Primary and secondary
   b) Random and sequential
   c) ROM and RAM
   d) All of the above
   e) None of the above
10. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is ____
    a) Memory
    b) Buffer
    c) Accumulator
    d) Address
    e) None of the above
11. Bluetooth is a type of radio wave information transmission system that is good for about:
    a) 30 feet b) 30 yards
    c) 30 miles d) 300 miles
    e) None of the above



BANK EXAMS

COMPUTER KNOWLEDGE

12. The telephone is an example of a(n) _____ signal.
    a) Analog b) Digital
    c) Modulated d) Demodulated
    e) None of the above
13. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the _____.
    a) Internal modem
    b) External modem
    c) PC Card modem
    d) Wireless modem
    e) None of the above
14. A modem that is contained within the system unit is called a(n) _____ modem.
    a) External b) Internal
    c) Wireless d) Wi-Fi
    e) None of the above
15. A modem that doesn't need to be connected to a telephone line is the _____ modem.
    a) External b) Internal
    c) Wireless d) DSL
    e) None of the above
16. A special high-speed line used by large corporations to support digital communications is known as ____
    a) satellite/air connection service lines
    b) cable modems
    c) digital subscriber lines
    d) T1, T2, T3 and T4 lines
    e) None of the above
17. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
    a) ISDN b) Microwave
    c) Cable modem d) DSL
    e) None of the above
18. The capacity of a communication channel is measured in ___
    a) Bandwidth b) Bit capacity
    c) Baud rate d) Data flow
    e) None of the above
19. Voice band _______
    a) allows the user to download messages
    b) is used for standard telephone communication
    c) is used in special leased lines to connect minicomputers and mainframes
    d) provides a high-speed communication channel
    e) None of the above
20. The greatest capacity for data transmission happens in ____ devices.
    a) Voice band b) medium band
    c) broadband d) mega-band
    e) None of the above
21. A page fault:
    a) Is an error in a specific page
    b) Occurs when a program accesses a page of memory
    c) Is an access to a page not currently in memory
    d) None of the above
    e) All of the above
22. The process of transferring data intended for a peripheral device into a disk (or intermediate store) so that it can be transferred to peripheral at a more convenient time or in bulk, is known as ____
    a) Multiprogramming
    b) Spooling c) Caching
    d) Virtual programming
    e) All of the above
23. An instruction in a programming language that is replaced by a sequence of instructions prior to assembly or compiling is known as ____
    a) Procedure name
    b) Macro c) Label
    d) Literal e) None

KEY:

1) a 2) d 3) d 4) d
5) c 6) a 7) c 8) d
9) c 10) b 11) a 12) a
13) c 14) b 15) c 16) d
17) d 18) a 19) b 20) c
21) c 22) b 23) b.

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్‌వీఎన్‌ఎల్‌లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్/హెచ్‌ఆర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ/పీజీడీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 31.07.2025 నాటికి 32ఏళ్లలోపు ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్ట్ క్రాంతి భవన్, భికాజీ కామా ప్లేస్, ఆర్‌కే పురం, న్యూఢిల్లీ–110066 లేదా ఆర్‌వీఎన్‌ఎల్ కార్పొరేట్ ఆఫీస్, డిస్పాచ్ సెక్షన్ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 31.07.2025.
- **వెబ్‌సైట్:** https://rvnl.org/

ఐఐటీ హైదరాబాద్‌లో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్‌లో రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
- **విభాగాలు:** మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్.
- **ఫెలోషిప్:** నెలకు రూ.58,000.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సాలిడ్ మెకానిక్స్/అప్లైడ్ మ్యాథ్‌మేటిక్స్, మెకానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగ అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 17.07.2025.
- **వెబ్‌సైట్:** https://iith.ac.in